# రోమా పత్రిక

shepherds
GLOBAL CLASSROOM

Shepherds Global Classroom క్రీస్తు శరీరాన్ని శక్తివంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న క్రైస్తవ నాయకుల కోసం పాఠ్యాంశాలను అందిస్తు వారిని సిద్ధ పరుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక శిక్షకులకు 20-కోర్సుల పాఠ్యాంశాల సాధనాన్ని అందించడం ద్వారా, స్వదేశీ శిక్షణా కార్యక్రమాల సంఖ్యను విస్తరించాలని మేము ఆశిస్తున్నాము.

ఈ కోర్సు ఉచితంగా అందుబాటులో ఉంది డౌన్‌లోడ్ చేసుకోవడానికి https://www.shepherdsglobal.org/courses

ప్రధాన రచయిత: Dr. Stephen K. Gibson

కాపీరైట్ ©2022 Shepherds Global Classroom

మూడవ ఇంగ్లీష్ ఎడిషన్ నుండి తెలుగులోకి అనువదించబడింది.

సర్వ హక్కులు ప్రత్యేకించబడినవి.

థర్డ్-పార్టీ వనరులు వాటి సంబంధిత యజమానుల కాపీరైట్ గా ఉన్నాయి మరియు మరియు వివిధ లైసెన్సుల ద్వార పంచుకొనబడ్డాయి.

ఈ పుస్తకంలో వాడబడిన వాక్య భాగాలు బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా వారి తెలుగు పరిశుద్ధ గ్రంథం నుండి తీసుకోవడం జరిగింది

**అనుమతుల గమనిక:**

ఈ కోర్సు క్రింది మార్గదర్శకాల ప్రకారం ప్రింట్ మరియు డిజిటల్ ఫార్మాట్‌లలో ఉచితంగా ముద్రించబడుతుంది మరియు పంపిణీ చేయబడుతుంది: (1) కోర్సు కంటెంట్ ఏ విధంగానూ మార్చబడకపోవచ్చు. (2) కాపీలను లాభం కోసం అమ్మకూడదు. (3) విద్యా సంస్థలు ఈ కోర్సును ఉచితంగా లేదా ట్యూషన్ ఫీజు తీస్కొని కాపీ గా ఉపయోగించు కోవచ్చు (4) Shepherds Global Classroom అనుమతి మరియు పర్యవేక్షణ లేకుండా కోర్సు అనువదించబడదు.

# విషయ సూచిక


కోర్సు అవలోకనం....5

రోమా పత్రిక సంక్షిప్త వివరణ (ఔట్లైన్)....9

(1) పత్రిక పరిచయం....11

(2) అన్యుల అపరాధం/దోషం....27

(3) ఇశ్రాయేలీయుల అపరాధం....43

(4) సార్వత్రిక పరిస్థితులు....55

(5) నీతిమంతులుగా తీర్చబడు విధానం మరియు భావం....67

(6) పాపం పై విజయం....81

(7) ఒప్పించబడిన పాపి....103

(8) ఆత్మయందు జీవితం....121

(9) దేవుని ఎన్నిక....133

(10) అత్యవసర సందేశం....143

(11) పరిచర్య మరియు సంబంధాలు....157

(12) సువార్తికరణ కొరకు దర్శనం....171

పునఃశ్చరణ మరియు అంతిమ పరీక్ష కొరకు ప్రశ్నలు....181

సిఫార్సు చేసిన పఠనం....187

అభ్యాసాల రికార్డు....189

# కోర్సు అవలోకనం

### కోర్సు వివరణ

పౌలు రోమా విశ్వాసులకు రాసిన పత్రిక, అతని మిషన్ ని, సందేశాన్ని వివరిస్తుంది. లోకంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సువార్త ఎందుకు అవసరమో వివరించడానికి గాను, సువార్త యొక్క దైవశాస్త్ర వేదాంతాన్ని ఆయన వివరించాడు. ఈ పత్రిక, చరిత్ర అంతటా సంఘంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. అనేక వివాదాస్పదమైన సిద్ధాంతాలు, అక్కడే వేళ్ళూనుకొని ఉన్నాయి. ఈ కోర్సు, రోమా గ్రంథ బోధనలను పరిశీలించి, వాటిని క్రైస్తవ జీవితానికి అన్వయిస్తాయి.

### కోర్సు లక్ష్యాలు

1. దేవుని రక్షణను, విశ్వాసపు అవసరతను చూడడం.
2. సువార్తను వినని ప్రజలకు సంబంధించిన సార్వత్రిక విషయాలను గురించి చర్చించడం
3. ఒక విశ్వాసికి సాధారణమైన మరియు సాధ్యమయ్యే పాపం పై విజయమును అర్థం చేసుకొనుట
4. దేవుని ప్రణాళికలో ఇశ్రాయేలుకు, సంఘానికి మధ్యనున్న సంబంధాన్ని అధ్యయనం చేయడం.
5. సంఘంలో సిద్ధాంతపరమైన వివాదాలకు కారణమైన వ్యాఖ్యల సందర్భాన్ని అర్థం చేసుకోవడం.
6. లోకాన్ని సార్వత్రీకరించాల్సిన, సంఘ మిషన్ పట్ల ఆశను, ఆకాంక్షను కలిగి ఉండడం.

### పాఠ్య రూపకల్పన

ఈ కోర్సులోని ఒక్కో పాఠాన్ని ఒక్కో సెషన్ లో చెప్పగలిగే విధంగా రూపొందించడం జరిగించండి, అయితే ప్రతి పాఠముకు రెండు లేదా **అంతకంటే ఎక్కువ** సెషన్లు **అవసరమవుతాయి**. చిన్న సెషన్లు అవసరమైతే, పాఠములను తక్కువ మెటీరియల్ కలిగినవిగా విభజించుకోవచ్చు.

పాఠములో తరగతి నాయకునికి అవసరమైన సూచనలు, *ఇటాలిక్* (Italics) లో ఉన్నాయి.

తరగతి, పాఠముకు 1కి ముందు కనిపించే "రోమా పత్రిక సంక్షిప్త వివరణ (ఔట్లైన్)" తరచుగా చూస్తూ ఉండాలి. తరగతి ప్రతి లేఖన భాగాన్ని అధ్యయనం చేస్తూ ఉండగా, పుస్తకంలోని ఆ భాగపు సందర్భంతోను, మొత్తం పుస్తకం యొక్క సందర్భంతోను ఈ లేఖన భాగం ఎలా సరిపోతుందో విద్యార్థులకు గుర్తు చేయాలి.

ప్రతి పాఠానికి పునఃశ్చరణ ప్రశ్నలు ఉన్నాయి. ప్రతి తరగతి ప్రారంభంలో, తరగతి నాయకుడు గత పాఠానికి సంబంధించిన పునఃశ్చరణ ప్రశ్నలను అడగాలి మరియు దానికంటే ముందున్న పాఠం నుండి మరికొన్ని ప్రశ్నలు

అడగాలి. విద్యార్థులందరూ సమాధానాలు చెప్పగలగడానికి సహాయపడాలి. ఎవరైనా చురుకుగా పాల్గొనకపోతే, వారి పేరు పిలిచి, వారినొక ప్రశ్నను అడగండి. ఒకవేళ మెటీరియల్ ని వాళ్ళు తప్పుగా అర్థం చేసుకుంటే, వాటిని సరిచేయడానికి ఇదే సరైన సమయం. పునఃశ్చరణ ప్రశ్నలనే, చివరి ప్రశ్నలుగా వాడుకోవచ్చు. అవసరాన్ని బట్టి సమాధానాలను పునఃశ్చరణ చేయాలి, సరిచేయాలి. తరగతిలో పాల్గొన్నవారికి సహాయం చేసే నాయకులు, అవసరమైతే సమాధానాల పత్రాన్ని, shepherdsglobal.org నుండి పొందవచ్చు.

**చర్చించే ప్రశ్నలు** మరియు **తరగతిలో చేసే కార్యచరణలు**, ► - ఈ గుర్తుతో సూచించబడతాయి. చర్చించే ప్రశ్నల కొరకు, తరగతి నాయకుడు, ప్రశ్నను అడిగి క్లుప్తంగా సమాధానాలు చెప్పడానికి కొంతమంది విద్యార్థులను అనుమతించాలి. కొన్నిసార్లు అడిగే ప్రశ్న, అప్పటివరకు అధ్యయనం చేసిన అంశాలను పునఃశ్చరణ చేసేదిగా ఉంటుంది. అలాంటి సమయాల్లో, విద్యార్థులు సరైన సమాధానాలు ఇవ్వగలిగేలా ఉండాలి. మరికొన్ని సమయాల్లో, ప్రశ్న క్రొత్త విషయాలను పరిచయం చేస్తుంది. అలాంటప్పుడు విద్యార్థులు ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వాల్సిన, ఒక తుదినిర్ణయానికి రావాల్సిన అవసరం ఉండదు. ఆ ప్రశ్న, క్రొత్త అంశాలను నేర్చుకోవడానికి మాత్రమే సిద్ధం చేస్తుంది.

బ్రాకెట్స్ లో ఉన్న ప్రతి లేఖన భాగాన్ని చూడాల్సిన అవసరం లేదు. లేఖనాలు, చెప్పిన విషయాలను బలపరచడానికి మాత్రమే ఇవ్వబడ్డాయి.

పాఠములో లేదా కోర్సులోని మరొక భాగంలో ఉన్న ఇతర విషయాలను ఎక్కడ కనుగొనాలో చూపించడానికి ఫుట్ నోట్ ఉపయోగపడుతుంది. తరగతిలో ఉన్న వారికి తక్షణమే మరింత వివరణ అవసరమైతే తప్పా ఆ విషయాల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదు.

పాఠములో అక్కడక్కడా కొంతమంది ప్రముఖులు చెప్పిన వ్యాఖ్యలను బాక్సులో పేర్కొనడం జరిగింది. వాటిని వివరించమని తరగతి నాయకుడు, విద్యార్థిని అడగవచ్చు.

చాలా పాఠములు, రోమా పట్టణాన్ని గూర్చిన ఒక చిత్రాన్ని మరియు చారిత్రక వివరణను కలిగి ఉంటాయి. ఆ వివరణ పాఠ్యాంశానికి సంబంధించినది కాదు. పాఠాన్ని చెప్తున్నప్పుడు చారిత్రక వివరణను ఉపయోగించాల్సిన అవసరం లేదు.

ప్రతి తరగతి ప్రారంభంలో, తరగతి నాయకుడు గత తరగతి ఆధారంగా రాసిన అసైన్మెంట్లను సేకరించి, వారు రాసిన విషయాలను గురించి క్లుప్తంగా చర్చించాలి.

**విద్యార్థుల కొరకు అసైన్మెంట్స్**

ఇది బైబిల్ తరగతి. విద్యార్థులు తమ బైబిళ్ళను తెరిచి, వాళ్ళు అధ్యయనం చేస్తున్న లేఖన భాగాలను చూడాలి.

**పూర్తి చేసిన అసైన్మెంట్ల రికార్డును** నిర్వహించడానికి ఒక పట్టిక ఉంది. ఆ పట్టిక కోర్సుకి వెనుక వైపు ముద్రితమైంది.

ఈ కోర్సు జరుగుతున్న వారాల్లో, విద్యార్థి మూడు ప్రసంగాలను సిద్ధపడి లేదా రోమా పత్రికలోని వాక్యభాగాలను ఆధారం చేసుకొని పాఠాలను సిద్ధపడి వాటిని తరగతికి కాకుండా ఇతర గ్రూపులకు బోధించాలి. బోధించిన తరువాత, తన బోధను ఎలా మెరుగుపరచుకోవాలో చెప్పమని తన బోధనను విన్నవారిలో కొద్దిమందిని అడగాలి. అతను బోధించిన నోట్స్ యొక్క కాపీని, తాను మాట్లాడిన దానిని గురించి **బృంద వివరణను**, సంఘటనను మరియు మెరుగుపరచుకోవడానికి తన ప్రణాళికలను తరగతి నాయకునికి ఇవ్వాలి.

విద్యార్థి తన సిద్ధాంతానికి భిన్నమైన సంఘాలకు చెందిన విశ్వాసులతో కనీసం రెండు సంభాషణలను/చర్చలను సిద్ధపరచాలి. వాళ్ళు ఎందుకు ఆ సిద్ధాంతాన్ని నమ్ముతున్నారో వివరించమని అడగాలి. రోమా పత్రిక నుండి ఆ అంశానికి సంబంధించిన లేఖన భాగాలను అతను వివరించాలి. అతను సంభాషణను గూర్చిన వివరణను రాసి, దానిని తరగతి నాయకునికి ఇవ్వాలి. 9వ పాఠాన్ని అధ్యయనం చేసిన తరువాత ఈ అసైన్మెంట్ ను ముగించడం ఉత్తమం.

12వ పాఠముకు తప్ప, మిగిలిన ప్రతి పాఠమునకు "**రాతపూర్వక అసైన్మెంట్**" ఉంటుంది. వీటిలో ప్రతిదానిని, తరువాతి తరగతి కంటే ముందే పూర్తి చేయాలి. వాటిని తరగతి ప్రారంభమవ్వడానికి ముందే తరగతి నాయకునికి ఇవ్వాలి. తరగతి నాయకుడు, విద్యార్థుల రచనపై క్లుప్తమైన చర్చను జరపాలి.

కోర్సు ముగింపులో **తుది పరీక్ష** ఉంటుంది. విద్యార్థులు, ఎలాంటి మెటీరియల్ ని చూడకుండా వ్యక్తిగతంగా పరీక్షను రాయాలి. **ఈ కోర్సు ముగింపులో** ప్రశ్నలు ఇవ్వడం జరుగుతుంది. చివరి పాఠమును బోధించిన తరువాత గాని, మరొక సమయంలో గాని అదే సెషన్ కొరకు పరీక్షను ఏర్పాటు చేయొచ్చు. పరీక్ష రాసే సమయాన్ని తగ్గించడానికి, టీచర్ 20 ప్రశ్నలను ఎంపిక చేయవచ్చు. 20 ప్రశ్నలకు సమాధానం రాయడానికి కొంతమంది విద్యార్థులకు గంట సమయం పట్టొచ్చు. మీరు ఏ ప్రశ్నను వారికి ఇస్తారో విద్యార్థులకు తెలియకూడదు మరియు వాళ్ళు పునఃశ్చరణ ప్రశ్నలన్నింటిని అధ్యయనం చేయాలి.

విద్యార్థులు, ప్రతి తరగతిలోనూ ఉండాలి. విద్యార్థి ఒక సెషన్ కు హాజరు కాకపోతే, అతను దానిని ఖచ్చితంగా నేర్చుకోవాలి, తరగతి నాయకునితో కలిసి పునఃసమీక్ష చేయాలి మరియు అసైన్మెంట్ రాయాలి.

# రోమా పత్రిక సంక్షిప్త వివరణ (ఔట్లైన్)

**1వ భాగం: శుభాలు మరియు ముఖ్యాంశాన్ని గూర్చిన పరిచయం (రోమా 1:1-17)**

**2వ భాగం: విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం యొక్క ఆవశ్యకత (రోమా 1:18-3:20)**

1వ లేఖన భాగం: అన్యుల అపరాధం : విగ్రహారాధన కొరకు దేవునిని తిరస్కరించడం (రోమా 1:18-32)

2వ లేఖన భాగం: ఇశ్రాయేలీయుల అపరాధం : విధేయత లేని జ్ఞానం (రోమా 2:1-29)

3వ లేఖన భాగం: సార్వత్రిక శిక్ష విధి యొక్క న్యాయం (రోమా 3:1-20)

**3వ భాగం : నీతిమంతులుగా తీర్చబడు విధానం మరియు భావం (రోమా 3:21-5:21)**

1వ లేఖన భాగం: దేవుని విధానంలో నీతిమంతులుగా తీర్చబడుట (రోమా 3:21-31)

2వ లేఖన భాగం: అబ్రాహాము మాదిరి (రోమా 4)

3వ లేఖన భాగం: క్రీస్తు ప్రాయశ్చిత్తం (రోమా 5)

**4వ భాగం : నీతిమంతులుగా తీర్చబడిన వారి పరిశుద్ధీకరణ (రోమా 6-8)**

1వ లేఖన భాగం: పాపంపై విజయం (రోమా 6)

2వ లేఖన భాగం: దోషిగా నిర్ధారించబడిన పాపి యొక్క స్థితి (రోమా 7)

3వ లేఖన భాగం: ఆత్మయందు జీవితం (రోమా 8)

**5వ భాగం : రక్షణ ప్రణాళికలో దేవుని సార్వభౌమాధికారం (రోమా 9-11)**

1వ లేఖన భాగం: రక్షణ మార్గాన్ని నిర్ణయించడంలో దేవుని హక్కు (రోమా 9)

2వ లేఖన భాగం: అంగీకారానికి షరతుగా విశ్వాసపు స్పందన (రోమా 10)

3వ లేఖన భాగం: అవిశ్వాసుల తిరస్కరణ; విశ్వాసుల అంగీకారం (రోమా 11)

**6వ భాగం : ఆచరణాత్మక సూచనలు (రోమా 12:1-15:7)**

1వ లేఖన భాగం: శరీరంలో వినయమైన, పరిశుద్ధమైన పరిచర్య (రోమా 12:1-8)

2వ లేఖన భాగం: ఇతరుల పట్ల ప్రవర్తన (రోమా 12:9-21)

3వ లేఖన భాగం: పౌర అధికారాలకు లోబడుట (రోమా 13:1-7)

4వ లేఖన భాగం: ప్రేమ యొక్క సంపూర్ణత (రోమా 13:8-10)

5వ లేఖన భాగం: వెలుగులో జీవించడం (రోమా 13:11-14)

6వ లేఖన భాగం: మతపరమైన ఆచారాలలో వైవిధ్యాలను అంగీకరించడం (రోమా 14:1–15:7)

**7వ భాగం : ముగింపు: సార్వత్రిక సేవ కొరకు (మిషన్స్) ఒక దర్శనం (రోమా 15:8-33)**

**8వ భాగం : శుభాలు (రోమా 16)**

# పాఠం 1

# పత్రిక పరిచయం

## చర్చనీయాంశాల పుస్తకం

శతాబ్దాలుగా సంఘంలో అనేకమైన వేదాంతపరమైన అంశాలు చర్చకు వచ్చాయి. వేదాంతపరమైన వివాదాస్పద అంశాల విషయంలో బైబిల్ లోని ఇతర పుస్తకాల గురించి చర్చించిన దానికంటే ఎక్కువగా రోమీయులకు రాసిన పత్రిక మాట్లాడుతుంది. ఈ పత్రికలో సమాధానమిచ్చిన ప్రశ్నలకు కొన్ని ఉదాహరణలు ఇక్కడ ఉన్నాయి.

### రోమా పత్రికలో సమాధానాలు చెప్పబడిన వేదాంతపరమైన ప్రశ్నలు

*తరగతి నాయకునికి గమనిక: ప్రతి ప్రశ్నను చదివి, సభ్యుల్లో కొంతమంది సమాధానం చెప్పునట్లు కొంతసేపు విరామమివ్వండి. బృందం, ఏ ప్రశ్నపైనా ఎక్కువ సమయం గడపకూడదు, తుది తీర్మానానికి వచ్చే ప్రయత్నం చేయకూడదు. ఈ ప్రశ్నలకు అనేకమైన అభిప్రాయాలు ఉన్నాయని చూపడమే ఈ జాబితా ఉద్దేశ్యం.*

1. ఒక వ్యక్తి విశ్వాసం ద్వారా రక్షణ పొందునట్లు దేనిని నమ్మాలి?
2. ఒక క్రైస్తవుడు, తన రక్షణ కొరకు తాను ఏమి చేయడు అంటే అర్థం ఏమిటి?
3. దేవుడు కొంతమందిని రక్షించాలని, మరికొంతమందిని రక్షించకూడదని నిర్ణయించాడా?
4. ఎవరు రక్షింపబడాలో, ఎవరు రక్షించబడకూడదో దేవుడు ఎలా ఎంపిక చేస్తాడు?
5. సువార్త ఎప్పుడూ వినని వారికి ఏమి జరుగుతుంది?
6. కొంతమంది పాపులను క్షమించి మరికొందరిని శిక్షిస్తే దేవుడు న్యాయవంతుడు ఎలా అవుతాడు?
7. ఒక వ్యక్తి విశ్వాసముంచిన తరువాత కూడా పాపిగానే ఉంటాడా?
8. నిజ జీవితంలో ఎలాంటి ఆధ్యాత్మిక విజయం సాధ్యమవుతుంది?
9. విశ్వాసి తన రక్షణను కోల్పోవడం సాధ్యమేనా?
10. ఇశ్రాయేలు పట్ల దేవుడు ఇంకా ప్రణాళిక కలిగి ఉన్నాడా?

## రోమీయులకు రాసిన పత్రిక ఉద్దేశ్యం

► ఒక విద్యార్థి, బృందం కొరకు రోమా 1:11-15 మరియు 15:24 వచనాలను చదివి వినిపించాలి. తాను రోమాకు వెళ్లాలని కోరుకోవడానికి పౌలు ఏ కారణాలు చెబుతున్నాడు?

పౌలు రోమాలో ఉన్న విశ్వాసులకు, తన పరిచయాన్ని, రక్షణ విషయంలో తన సిద్ధాంతపరమైన అవగాహనను తెలియజేయడమే ఈ పత్రిక ఉద్దేశ్యం కాబట్టి,

1. అతను రోమాలో ఉన్న విశ్వాసులను ప్రోత్సహించడానికి (1:11-12) మరియు అక్కడ సువార్త ప్రకటించడానికి (1:15) ఆ ప్రాంతాన్ని దర్శించాలి.

2. వారి సహకారంతో మరొక నూతన సువార్త పనిని ప్రారంభించగలడు (15:24).

క్రీ.శ. 47-57 కాలంలో ఏజీయన్ సముద్రం చుట్టుప్రక్కల ఉన్న ప్రాంతాలలో పౌలు సువార్త ప్రకటించాడు. ఆయన క్రీ.శ. 57లో రోమీయులకు పత్రికను రాశాడు.[1] మొదట యెరూషలేముకు, ఆ తరువాత రోమాకు ప్రయాణం చేయాలనేది పౌలు ప్రణాళిక. పశ్చిమాన ఉన్న పురాతన రోమా కాలనీలోనికి, ప్రపంచంలోని ఆ భాగంలో రోమా నాగరికతకు కేంద్రంగా ఉన్న స్పెయిన్ లోనికి తన సువార్త పరిచర్యను తీసుకెళ్లడానికి రోమాలో ఉన్న సంఘాన్ని ఆధారంగా చేసుకోవాలని పౌలు కోరుకున్నాడు (15:24).

పౌలు, రోమా పట్టణానికి ఎప్పుడు వెళ్లలేదు గనుక, ఈ పత్రిక వ్యక్తిగత పరిచయంగాను తన సందర్శనానికి సిద్ధపాటుగాను ఉంటుంది. రోమా 16లో విస్తారమైన శుభాలు చెప్పడానికి ఇదే కారణం కావచ్చు.

రోమాకు పౌలు ప్రయాణం, తాను ప్రణాళిక చేసుకున్నట్లుగా జరగలేదు. అతన్ని యెరూషలేములో ఖైదు చేసారు. అతనికి అక్కడ న్యాయం జరగదని అనిపించినప్పుడు, కైసరుకు మనవి చేసుకున్నాడు. తన ప్రయాణంలో ఒక ప్రమాదం జరిగి, ఓడ బ్రద్దలైన తరువాత, దాదాపు క్రీ.శ. 60లో ఖైదీగా రోమాకు చేరుకున్నాడు. అతను నిర్బంధంలో ఉన్నప్పటికీ, తనని చూడడానికి వచ్చేవారిని కలవడానికి, వారికి పరిచర్య చేయడానికి, వారి ద్వారా పరిచర్యను చేయించుకోవడానికి స్వేచ్చను కలిగి ఉండేవాడు (అపొస్తలుల కార్యములు 28:30-31). ఈ సంఘటనలు, సువార్త మరింతగా వ్యాపించడానికే జరిగాయని పౌలు చెప్పాడు (ఫిలిప్పీయులకు 1:12). కైసరు ఇంటి వారిలో కూడా కొంతమంది మారుమనసు పొందిన వ్యక్తులు ఉన్నారు.

పౌలు రెండు సంవత్సరాల తరువాత విడుదలయ్యాడని కొంతమంది చరిత్రకారులు నమ్ముతారు. అతను స్పెయిన్ కి ప్రయాణం చేశాడా లేదా అనేది తెలీదు. ఆ తరువాత అతన్ని రోమాలో చంపారని మనకు తెలుసు, కానీ బహుశా అది ఈ పట్టణానికి పౌలు చేసిన రెండవ యాత్రలో జరిగింది.

---

[1] ఈ తేదీలు, బైబిల్ పండితుల అభిప్రాయాలు మాత్రమే. అవి ఖచ్చితమైనవో కాదో మనకు తెలీదు.

తన సువార్త సేవకు రక్షణ వేదాంతాన్ని ఆధారంగా చూపడం ద్వారా, అన్ని కాలాల్లో, అన్ని సమయాల్లో సువార్త సేవకు ఆధారాన్ని పౌలు చూపించాడు.

తన మిషనరీ యాత్రను ప్రారంభించడంలో వారి సహాయం కొరకు పౌలు చేసిన మనవికి స్పందనగా అనేక ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమై ఉండవచ్చు. ఎవరో ఒకరు, "నువ్వే ఎందుకు వెళ్ళాలి?" అని అడగొచ్చు. కనుకనే పౌలు సౌవార్తీకరణ పని పట్ల తన సమర్పణను ప్రస్తావించడంతో ఈ పత్రికను ప్రారంభించాడు (1:1). అన్యులకు అపొస్తలునిగా తనకున్న ప్రత్యేకమైన పిలుపును, విజయాన్ని గురించి తరువాతి అధ్యాయాల్లో వివరించాడు (15:15-20).

మరొకరు, "ప్రతి ఒక్కరూ ఎందుకు సువార్తను వినాలి? బహుశా ఈ సందేశం ప్రతిచోటా అవసరం ఉండకపోవచ్చు" అని ప్రశ్నించవచ్చు. కానీ పౌలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవజాతి కొరకు సువార్త యొక్క సంభావ్యతను (1:14, 16, 10:12), మిషనరీ పరిచర్య ఆవశ్యకతను (10:14-15) వివరించాడు. ఈ సందేశం, ప్రపంచంలోని ప్రతి వ్యక్తికి వర్తిస్తుందని, కాబట్టి దీనిని వినాల్సిన అత్యవసరతను ప్రతి వ్యక్తి కలిగి ఉన్నాడని అతను చూపించాడు.

> "ఈ పత్రికలో క్రీస్తు సువార్తను నేర్చుకోవడం క్లుప్తంగా అర్థం చేసుకోవడం మరియు పాతనిబంధనకు పరిచయాన్ని సిద్ధం చేయడమే పౌలు మనసులో ఉన్న విషయం."
> - విలియం టిండేల్,
> " రోమా పత్రికకు భూమిక"

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 1వ భాగం

ఇప్పుడు మొదటి లేఖనభాగాన్ని చూద్దాం - పౌలు చెప్పిన శుభాలు మరియు పరిచయం.

► ఎవరైనా ఒక విద్యార్థి, బృందం కొరకు 1:1-17 వచనాలను చదివి వినిపించాలి.

### నిర్మాణం పై వివరణ

1:1-17 వచనాలు, సువార్తను వ్యాపింపజేయడానికి, పౌలు పిలుపుని, ప్రేరణను గురించి వివరిస్తాయి. దాని తరువాత, 1:18-3-20 వచనాలు, సువార్త ఎందుకు ప్రాముఖ్యమో వివరిస్తాయి, ఎందుకంటే పశ్చాత్తాపపడని పాపులు దేవుని ఉగ్రత క్రింద ఉన్నారు. అయినప్పటికీ, 1:15-19 వచన భాగం, ఈ రెండు భాగాలకు మధ్య పరివర్తనగా ఉంటుంది. సువార్తను క్లుప్తంగా వ్యక్తీకరించడం ద్వారా ఇది ఒక విషయాన్ని

> **రోమా పట్టణం**
>
> రోమ్ అనే పట్టణానికి ఆ పేరు, రోములస్ అనే పేరును బట్టి వచ్చింది. పురాణం ఏమిటంటే, మార్స్ దేవుని కవల కుమారులైన రోములస్ మరియు రెమస్, పేరు వపేరు లను చిన్నప్పుడే వదిలేస్తారు. వారిని ఒక తోడేలు పెంచుతుంది. వాళ్ళు పెద్దవాళ్ళైనప్పుడు వారు ఒక నగరాన్ని నిర్మించాలని నిర్ణయించుకుంటారు. వారి మధ్యలో వాగ్వాదం జరిగి, రోములస్ రెమస్‌ను చంపుతాడు.

తెలియజేస్తుంది: పాపులకు చాలా ఉన్నతంగా తెలుసు గనుకనే వారు అపరాధులుగా ఉంటారు, కాబట్టి వాళ్ళు దేవుని ఉగ్రత క్రింద ఉన్నారు; కాని విశ్వాసి రక్షణ పొందుతాడు.

**1:1-17 యొక్క ప్రధానాంశం**

సువార్త, నమ్మువానికి రక్షణను కలిగించే సందేశం గనుక ఆ సువార్తను ప్రకటించడానికి పౌలు పిలవబడ్డాడు, ప్రేరేపించబడ్డాడు.

**1:1-17 యొక్క సారాంశం**

1:1-14లో ఉన్నదంతా, 1:15లోనున్న ప్రకటన యొద్దకు నడిపిస్తుంది. 1:16-18 వచనభాగం, సువార్త అంటే ఏమిటి, ఇది అందరికీ ఎందుకు అవసరం అనే విషయాన్ని సంగ్రహంగా వివరిస్తుంది. సువార్త, దేవుడు క్షమాపణను అందిస్తున్నాడని, ప్రజలు విశ్వాసం ద్వారా దానిని పొందుకుంటారని చెప్పే సందేశం. ప్రజలందరూ దేవుని ఉగ్రత క్రింద ఉన్నారు గనుకనే ఆ సందేశం మనుష్యులందరికీ అవసరం.

**రోమీయులకు రాసిన పత్రికంతా, 1:16-18లోని వ్యాఖ్యలకు వివరణ**

**వచనాల వారీ వివరణ**

(బ్రాకెట్లో ఉన్న సంఖ్యలు, చర్చించిన అధ్యాయాలు మరియు వచనాలను సూచిస్తున్నాయి)

(1:1) పౌలు, తనని గురించి మూడు ప్రకటనలు చేశాడు.

- అతను యేసుక్రీస్తు దాసుడు.
- దేవుని పిలుపు అతన్ని అపొస్తలులలో ఒకనిగా చేసింది.
- అతను తనని పిలిచిన పని కొరకు ప్రత్యేకించబడ్డాడు.

పౌలు ఒకప్పుడు పరిసయ్యునిగా ఉన్నాడు, కానీ ఇప్పుడు సువార్త పరిచర్యకు సమర్పించుకున్నాడు. పౌలు, రోమా పౌరసత్వాన్ని కలిగి ఉన్నాడు, కానీ దానిని తన గుర్తింపులో భాగంగా ప్రస్తావించలేదు. రోమా విశ్వాసుల్లో అనేకులు తనతో సహవాసం చేయడానికి ఇది సహాయం చేయదు. రోమాలో నివసించే చాలామంది ప్రజలు వేరే దేశానికి చెందినవారు లేదా బానిసలు గనుక వారికి రోమా పౌరసత్వం లేదు. ఒకవేళ పౌలు తన పౌరసత్వాన్ని ప్రస్తావించినట్లయితే, దానివల్ల రోమాలో ఉండే ఉన్నతశ్రేణి వారితో సహవాసాన్ని కలిగి ఉండగలడు; అతని ఆధ్యాత్మిక పాత్రను ప్రస్తావించడం చాలా ప్రాముఖ్యం.

(1:2) సువార్త పూర్తిగా నూతనమైంది కాదు, కానీ పాతనిబంధన ప్రవక్తల సందేశంలో ఇది భాగంగా ఉంది. అబ్రాహాము మరియు దావీదు కూడా సువార్తను అర్థం చేసుకున్నారని రోమా 4 సూచిస్తుంది.

(1:3-4) శారీరకంగా ఈలోకంలో జీవించినప్పుడు, దేవుని కుమారుడు దావీదు వంశస్థుడై, మెస్సీయ గురించి ముందుగానే చెప్పిన రాజవంశంలో జన్మించాడు.

క్రీస్తు అనేది మెస్సీయ అనే హీబ్రూ పదానికి గ్రీకు పదం.

ప్రభువు అనే పదం దైవత్వాన్ని సూచిస్తుంది. క్రొత్తనిబంధన పత్రికల్లో ప్రభువు అనే పదం యొక్క ప్రాముఖ్యతను ఫిలిప్పీయులకు 2:10-11ను యెషయా 45:23తో పోల్చడం ద్వారా చూడొచ్చు. ఈ మాట మిగిలిన అధికారాలన్నింటికంటే పైన ఉన్న అత్యున్నతుడని సూచిస్తుంది (అపొస్తలుల కార్యములు 2:36 చూడండి).

క్రొత్త నిబంధన సువార్తలలో ప్రజలు యేసును దేవుడని నిజంగా గుర్తించకుండానే, ఆయనను గౌరవించడానికి "ప్రభువు" అని పిలిచేవారు, కాబట్టి ఆ సందర్భంలో ప్రభువు అనే పదానికి అదే అర్థం ఉండకపోవచ్చు.

క్రొత్త నిబంధన పత్రికల్లో, "యేసుక్రీస్తు మన ప్రభువు" అనే పేరు, గుర్తింపు విషయమై మూడు ప్రకటనలు చేస్తుంది. యేసు చారిత్రక పురుషుడని, యూదుల మెస్సీయాయని, ఆయన దేవుడని చెబుతుంది.

పునరుత్థానం, క్రీస్తు దైవత్వాన్ని ఋజువుచేస్తుంది. యోహాను 10:18లో, తన ప్రాణాన్ని తిరిగి తీసుకుంటానని ఆయన ప్రకటించాడు. ఆయన ఆ తరానికి పునరుత్థానాన్ని ఒక సూచనగా ఇచ్చాడు. పునరుత్థానానికి సాక్ష్యమివ్వడం, తరాలన్నిటికీ ఒక సూచనను స్థిరపరిచింది. దేవుడు కాని వ్యక్తి, తననుతాను మృతుల్లో నుండి తిరిగి లేపుకోలేడు; లేదా దేవుడను అని తప్పుగా ప్రకటించుకొను వ్యక్తిని, వ్యక్తిని, ప్రాముఖ్యంగా తన పునరుత్థానం తన గుర్తింపుని రుజువు చేస్తుందని ప్రకటించే వ్యక్తిని దేవుడు లేపడు.

► మరణం నుండి తిరిగి లేచినవారు కొందరు ఉన్నారు కానీ వాళ్ళు దేవుళ్ళు కాదు. పునరుత్థానం, యేసు గుర్తింపుని రుజువు చేస్తుందని మీరు ఎలా వివరిస్తారు?

(1:5) సమస్త దేశాల ప్రజలను, క్రీస్తుకు విధేయత చూపే వైపుకు నడిపించడానికి అపొస్తలత్వపు పిలుపు, ఆత్మీయ వరాలు ఇవ్వబడ్డాయి. ఆత్మీయ వరాలను దేవుని పని కొరకు వాడడమే సరైన విధానం. క్రీస్తు నామం మహిమపరచబడడమే పరిచర్య పట్ల కలిగి ఉండాల్సిన సరైన వైఖరి. వ్యక్తిగత లాభం లేదా వ్యక్తిగత ఘనత కలిగి ఉండాలనే వైఖరి, దేవుని సేవకునిని అనర్హునిగా చేస్తుంది.

## అపొస్తలత్వపు పిలుపు యొక్క ప్రత్యేకత

► నేటి దినాలలో అపొస్తలులు జీవించి ఉన్నారా?

బైబిల్‌లో అపొస్తలుడు అనే పదాన్ని “పంపబడినవాడు” అనే దాని సాధారణ భావంలో ఉపయోగించారు. అపొస్తలుల కార్యములు 14:14లో బర్నబా 12 అపొస్తలులలో ఒకడు కాకపోయినప్పటినికి, పౌలు బర్నబాలు అపొస్తలులుగా పరిగణించబడ్డారు. గలతీయులకు 1:19లో, ఒకసారి దర్శించినప్పుడు, కేఫాను (పేతురు) మరియు ప్రభువు సోదరుడైన యాకోబును తప్ప మరే అపొస్తలులను చూడలేదని పౌలు చెప్పాడు. ఆ సందర్భంలో, యాకోబు 12 మందిలో ఒకడు కాకపోయినా అతన్ని అపొస్తలునిగా పరిగణించాడు.

అయితే, సాధారణంగా 12 మంది అపొస్తలులను ప్రత్యేకమైనవారిగా పరిగణిస్తారు, వారికి ఎవరిని కలపకూడదు. మత్తయి 10:2 వచనం, “ఆ పండ్రెండుమంది అపొస్తలుల పేర్లు ఏవనగా....” (లూకా 6:13 కూడా చూడండి) అని చెబుతుంది. 12 మంది అపొస్తలులు సింహాసనంపై కూర్చుని, ఇశ్రాయేలు 12 గోత్రాలకు తీర్పు తీరుస్తారని యేసు వారికి చెప్పాడు (లూకా 22:30). ఈ వాగ్దానం కేవలం 12 మందికి మాత్రమే పరిమితమన్నట్లుగా కనబడుతుంది. 12 మంది అపొస్తలుల పేర్లు, దేవుని పట్టణపు 12 పునాదులపై ఉండడం, ఈ 12మంది వ్యక్తుల సమూహం ప్రత్యేకమైనదనే విషయాన్ని సూచిస్తుంది (ప్రకటన గ్రంథం 21:14).

యేసు సహోదరుడైన యూదా, తనని తాను అపొస్తలునిగా పిలుచుకోలేదు కానీ వారి అధికారాన్ని గురించి ప్రస్తావించాడు (యూదా 17ను 2 పేతురు 3:2తో పోల్చి చూడండి). అపొస్తలులు ఒక ప్రత్యేకమైన అధికారం కలిగి ఉండేవారు. వాళ్ళు సంఘాలకు ఏం రాసినా, దానిని ప్రత్యక్షతగా భావించేవాళ్ళు (2 పేతురు 3:15-16).

12 మంది అపొస్తలులు ఉండాలనే ఉద్దేశ్యంతో ఇస్కరియోతు యూదా స్థానంలో మత్తీయను సంఘం ఎంపిక చేసింది (అపొస్తలుల కార్యములు 1:26); కానీ అపొస్తలులు మరణించినప్పుడు వారి స్థానంలో వేరే వారిని సంఘం నియమించినట్లు సంఘ చరిత్రలో కనిపించదు.

అపొస్తలునిగా ఉండడానికి దేవుడు, పౌలుని పిలిచాడు (రోమా 1:1). తాను యేసుని చూడడం తన అపొస్తలత్వపు అర్హతల్లో ఒకటని పౌలు చెప్పాడు (1 కొరింథీయులకు 9:1). అది అపొస్తలత్వాన్ని సంఘపు మొదటి తరానికే పరిమితం చేస్తుంది.

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(1:6) "పిలవబడడం" అనేది ఆ తరువాతి వచనంలో చూసినట్లు రక్షణ పొందడానికి, పరిశుద్ధులుగా ఉండడానికి పిలవడాన్ని సూచిస్తుంది. (8:30 కూడా చూడండి). అపొస్తలులు దేశాలన్నింటి పట్ల పరిచర్య బాధ్యతను కలిగి ఉన్నారని పౌలు చెప్పాడు; రోమాలోని క్రైస్తవులు, అపొస్తలుల సువార్తను విశ్వసించినవారని ఇప్పుడు సూచిస్తున్నాడు. అందువల్ల వాళ్ళు తన అపొస్తలత్వపు అధికారాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన బాధ్యతను కలిగి ఉన్నారని చూపుతున్నాడు. వారి సంఘాన్ని స్థాపించింది అతను కాకపోయినప్పటికీ, అతని మాటలపై దృష్టిసారించి, ఆయనకు గౌరవమివ్వవలసిన కర్తవ్యాన్ని కలిగి ఉన్నారు.[2]

(1:7) రక్షణ పొందడానికి పిలవబడడం అంటే పరిశుద్ధులుగా ఉండడానికి పిలవబడడం. ఈ ప్రకటనను, 1వ వచనంలోనున్న ప్రకటనతో పోల్చాలి. ఆ వచనంలో తాను అపొస్తలునిగా ఉండుటకు పిలువబడినందున అపొస్తలునిగా ఉన్నానని పౌలు చెప్పాడు. అపొస్తలునిగా అవ్వాలని అతను ప్రయత్నించాడని లేదా ఆశించాడని భావం కాదు, కానీ తన పిలుపుని బట్టి అపొస్తలుడయ్యాడు. రోమా విశ్వాసులు పరిశుద్ధులుగా పిలవబడడం ద్వారా పరిశుద్ధులుగా చేయబడ్డారు. అపొస్తలునిగా దేవుడిచ్చిన పిలుపు, పరిచర్య కొరకు వరాలతోను, సామర్థ్యాలతోను వచ్చినట్లుగానే, పరిశుద్ధులుగా ఉండుటకు దేవుడిచ్చిన పిలుపు కూడా మనల్ని పరిశుద్ధులుగా చేసే శక్తితోను, శుద్ధీకరణతోను వస్తుంది. ఎల్లప్పుడూ దేవుని పిలుపు, దానిని నెరవేర్చడానికి అవసరమైన కృపను కలిగి ఉంటుంది.

మారుమనసు పొందినప్పుడు ప్రారంభమైన పరిశుద్ధత, ఏ విధంగాను సంపూర్ణమైనది కాదు. విశ్వాసి, దేవుని సత్యంపై ఆధారపడుతుండగా, అతని జీవితం ఆ సత్యానికి సరిపోలునట్లుగా క్రమక్రమంగా వృద్ధి చెందుతుంది. మారుమనసు పొందినప్పుడే పరిశుద్ధత సంపూర్ణమవ్వదు; కానీ మారుమనసు సమయంలో పాపి పశ్చాత్తాప పడి, దేవుని విధేయత చూపడానికి సమర్పించుకొన్నప్పుడు పరిశుద్ధత ప్రారంభమవుతుంది మరియు ఇది నూతన సృష్టిని చేస్తుంది (2 కొరింథీయులకు 5:17).

(1:8) *సర్వలోకం* అనే పదం సాధారణంగా భూమి మొత్తానికి కాకుండా నాగరికమైన, తెలిసిన ప్రపంచాన్ని సూచించడానికి ఉపయోగించబడింది. సువార్త ఇంకా భూమిపై ప్రతిచోటకు వెళ్ళలేదు.

---

[2] 1:14-15. వద్ద చెప్పబడిన నోట్స్ చూడండి.

(1:9) "క్రొత్తనిబంధనలోని లట్ర్యువో (latreuo – నేను సేవిస్తాను) అనే పదాన్ని , ఎప్పుడూ మతపరమైన సేవకే ఉపయోగించేవారు. ఈ సేవలో ఆరాధన ఉండొచ్చు లేదా మతపరంగా బాహ్యవిధులను నిర్వర్తించవచ్చు."[3] పౌలు దేవునిని కేవలం మతపరమైన ఆచారంగా మాత్రమే కాదుగాను, తన ఆత్మతోను సేవించాడు.

(1:10-12) ఇక్కడ తాను రోమాను దర్శించాలనే ప్రణాళిక కలిగి ఉన్నట్లుగా చెప్పాడు. వారిని ఆత్మీయంగా బలపరచాలని అతను కోరుకుంటున్నాడు మరియు వారు ఒకరి విశ్వాసం వలన మరొకరు పరస్పరం ప్రోత్సహించబడతారని అతనికి తెలుసు.

విశ్వాసులు ఒకరితో మరొకరు కలిగి ఉండే సహవాసాన్ని బట్టి ఆత్మీయంగా ప్రయోజనం పొందుతారని పౌలు ప్రకటన మనకు చెబుతోంది. పరిశుద్ధాత్మ విశ్వాసుల్లో తన పనిని ఎక్కువగా ఇతర విశ్వాసుల ద్వారా జరిగిస్తాడు. ఇతర విశ్వాసులతో తన సంబంధాన్ని నిర్లక్ష్యం చేసే వ్యక్తి, సహవాసం ద్వారా వచ్చే కృపను స్థాపించడం ద్వారా కలిగే ప్రయోజనాన్ని కోల్పోతాడు. (పౌలు, 1 కొరింథీయులకు 12వ అధ్యాయంలో ప్రతి సభ్యునికి ఇతర సభ్యుల అవసరతను గురించి చాలా ఎక్కువగా మాట్లాడాడు).

(1:13) వారిని దర్శించడానికి చేసిన గత ప్రణాళిక విషయంలో, సమస్యలను బట్టి కాదు కానీ సువార్త ప్రకటింపబడని చోట ప్రకటించాలనే తన ప్రాధాన్యతను బట్టి ఆటంకపరచబడ్డాడు (15:20-22 చూడండి). రోమాలో సువార్త అప్పటికే ప్రకటించబడినందున, పౌలు ఇతర ప్రాంతాలకు మొదటిగా వెళ్ళాడు. అయితే, ఈ ప్రయాణం సువార్త అందని మరొక ప్రాంతాన్ని చేరుకోవడానికి ఒక అడుగు ముందుకు వేసినట్లు గనుక ఇప్పుడు అక్కడకు వెళ్ళడం తన ప్రాధాన్యతకు భిన్నమైనది కాదు (15:23-24).

(1:14) *గ్రీకు ప్రజలు*, గ్రీకు ప్రభావంచేత సంస్కృతి, నాగరికత కలిగినవారు. "అనాగరికులు" అనే మాటకు "పరాయిదేశస్థులు" అని అర్థం. ఇది గ్రీకు సంస్కృతి చేత తక్కువగా ప్రభావితం చెంది, పురాతన సంస్కృతికి చెందిన వ్యక్తిని సూచిస్తుంది. గ్రీకులు, గ్రీకులు కానివారిని అనాగరికులుగాను, మూర్ఖులుగాను పరిగణించేవారు.

*జ్ఞానులు* అనే పదం చదువుకున్న వ్యక్తులను, ముఖ్యంగా గ్రీకు తత్వాన్ని నేర్చుకున్న వారిని సూచిస్తుంది; *మూఢులు* పెద్దగా చదువుకోనివారు. తన పరిచర్య కొన్ని రకాల ప్రజలకే పరిమితం కాదని పౌలు చూపిస్తున్నాడు. ఇది వారికి తాను చేయబోయే పరిచర్యకు సిద్ధం చేస్తుంది, అదేవిధంగా మిషనరీగా తన బాధ్యతను చూపిస్తుంది.

---

[3] Charles Hodge, *Commentary on Romans, Ephesians and First Corinthians,* https://www.studylight.org/commentaries/eng/hdg/romans-1.html#verse-9

సువార్త వినాల్సిన వారందరికీ తాను ఋణస్తుడనని పౌలు చెబుతున్నాడు. పాపులు సువార్తను వినడానికి అర్హులైనందున పౌలు ఋణపడి ఉండలేదు, కానీ ఆయన కృపను పొందాడు గనుక దానిని ఇతరులకు ఇవ్వాల్సిన బాధ్యతను కలిగి ఉన్నాడు.

వర్ణన: తోమాతో పంచుకొనుమని యోహానుకు ఎవరైనా ధనమిస్తే, తోమా ధనం సంపాదించడానికి ఏమీ చేయకపోయినప్పటికీ, యోహాను తోమాకు ఋణపడి ఉన్నాడు. ఇదే విధంగా, సువార్త వినని వారికి మనం కూడా ఋణస్థులమై ఉన్నాం, ఎందుకంటే వారితో దీనిని పంచుకునే బాధ్యతను దేవుడు మనకు ఇచ్చాడు.

► ప్రతి క్రైస్తవుడు సువార్తను పంచుకోవడానికి ఋణపడి ఉన్నాడా? ఎందుకు?

(1:15) పౌలు గ్రీకుదేశస్తులకును, గ్రీకు దేశస్థులు కానివారికి సువార్తను బోధించాడు, ఇప్పుడు రోమాలో ఉన్న ప్రజలకు కూడా సువార్త ప్రకటించడానికి ఆసక్తి కలిగి ఉన్నాడు.

అతను తన ప్రధానాంశమైన, "రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను" అని చెప్పడం ద్వారా ప్రారంభించి, తరువాత సువార్త అంటే ఏమిటో, లోకానికి ఇది ఎందుకు అవసరమో క్లుప్తంగా వివరించాడు. ఈ క్లుప్త వివరణ, మిగిలిన పత్రిక అంతటా విస్తరించి ఉంటుంది.

1:14-15 వచనాలు, పౌలు వారి యొద్దకు రావడానికి ఎందుకు అర్హత కలిగినవాడో చూపిస్తాయి. లోకంలో ఉన్న వారందరికీ అవసరమైన సందేశం తన యొద్ద ఉంది.[4]

(1:16) సువార్త యూదులకు మరియు గ్రీకులకు ఉద్దేశించబడింది. ఈ ప్రకటన యూదులను, అన్యులను మరియు దేవుని ఎదుట వారి స్థితిని పరిచయం చేస్తుంది. ఈ అంశం, రోమీయులకు రాసిన పత్రిక మూడవ అధ్యాయం చివరి వరకు కొనసాగుతుంది. సువార్త దేవుని శక్తి గనుక, సామ్రాజ్యపు అధికార కేంద్రంలో కూడా సువార్తను పంచుకోవడానికి పౌలు సిగ్గుపడడు.

సువార్త సందేశంలో దేవుని శక్తి పనిచేస్తూ, రక్షించుటకు దానిని ప్రభావవంతమైనదిగా చేస్తుంది. దేవుని ఆజ్ఞలు, వాటిని నెరవేర్చడానికి అవసరమైన శక్తిని కలిగి ఉంటాయి. దేవుని మాటలు ప్రకటింపబడినప్పుడు, ఆయన శక్తి పనిచేస్తూ

---

[4] 1:5-6 వద్ద చెప్పబడిన నోట్స్ చూడండి.

ఉంటుంది.[5] సువార్త సందేశకులు, సువార్త శక్తిపై ఆధారపడాలి, ఎందుకంటే వాళ్ళు సందేశాన్ని ప్రకటించినప్పుడు, విన్నవారు ఒప్పింపబడేలా, బలపరచబడేలా పరిశుద్ధాత్ముడు చేస్తాడు.

పౌలుకైతే, సువార్త కొరకు నిలబడడం అంటే దానిని విషయాత్మక సత్యంగా ప్రతివాదన చేయడం మాత్రం కాదు, కానీ రూపాంతర సత్యంగా దానిని బోధించడం అని అర్థం. తన సందేశాన్ని వినేవారిని ఇది మారుస్తుందనే నిశ్చయతతో ఆయన ప్రకటించాడు

> విశ్వాసం అనేది, దేవుని కృపపై సజీవమైన, ధైర్యం కలిగిన నమ్మకం. దీని కోసం ఒక మనిషి తన జీవితాన్ని వెయ్యి రెట్లు పణంగా పెట్టగలడు."
> - మార్టిన్ లూథర్

► మనం సువార్తను ప్రకటించినప్పుడు ఎందుకు దృఢవిశ్వాసాన్ని కలిగి ఉండాలి?

(1:17) **విశ్వాసం ద్వారా నీతిమంతునిగా చేయబడిన వ్యక్తి జీవిస్తాడు.**[6] ఇది రోమీయులకు రాసిన పత్రికలోనే కీలకమైన, అత్యంత ప్రాముఖ్యమైన సత్యం.

మనిషి నీతిమంతునిగా ఎలా తీర్చబడతాడనే అంశాన్ని గురించే రోమీయులకు రాసిన పత్రిక మాట్లాడుతుంది; అంటే నీతిమంతులుగా చేయబడడం (దేవుని నీతిని కలిగి ఉండడం). సమస్య యొక్క ఆవశ్యకతను తరువాతి వచనం చూపిస్తుంది, ఎందుకంటే అనీతిమంతులుగా ఉన్నవారిపై దేవుని ఉగ్రత నిలిచి ఉంది.

ఇక్కడ మాట్లాడిన దేవుని నీతి అంటే "ఆయన గుణలక్షణమైన నీతి కాదు కానీ ఆయన నుండి ప్రవహించే, ఆయనకు అంగీకారయోగ్యమైన నీతి,"[7] మనిషి జీవితంలో వారి విశ్వాసం ద్వారా పనిచేసే నీతి. ఇదే ఆలోచన ఫిలిప్పీయులకు 3:9లో కూడా ఉంది: "క్రీస్తునందలి విశ్వాసమువలననైన నీతి." ప్రజలు వారి క్షమాపణను బట్టి నీతిమంతులుగా పరిగణించబడడం మాత్రమే కాదు, దేవుడు వారిని మార్చినందున వాళ్ళు నిజంగా నీతిమంతులుగా ఉండడం ప్రారంభిస్తారు.

> "ఎవరైనా ఈ పత్రికను అర్థం చేసుకుంటే, మొత్తం లేఖనాన్ని అర్థం చేసుకోవడానికి అతనికి ఒక మార్గం తెరవబడుతుంది."
> - జాన్ కాల్విన్

ఈ పత్రికలోని తరువాతి వచనాల్లో (రోమా 3:21-22), విశ్వసించిన వారికందరికీ యేసు నందు విశ్వాసం ద్వారా దేవుని నీతి అనుగ్రహించబడుతుందని పౌలు

[5] ఈ వచనాలతో పోల్చి చూడండి 1 పేతురు 1:23 & 25, రోమా 1:16, హెబ్రీయులకు 4:12, 1 కొరింథీయులకు 1:18, యెహెజ్కేలు 37:7-10, మరియు యెషయా 55:11.

[6] పౌలు హబక్కూకు 2:4ను ఉదహరిస్తున్నాడు.

[7] Henry Alford, *The Greek Testament Critical Exegetical Commentary*, Romans 1:17 https://www.studylight.org/commentaries/eng/hac/romans-1.html

చెప్పాడు. రోమా 5:17-19 వచనాల్లో అనేకులను నీతిమంతులుగా చేసే నీతియుక్తమైన బహుమానం గురించి మనం చదువుతాం.

"దేవుని యొక్క శాశ్వతమైన, మార్చలేని ఉద్దేశ్యాన్ని లేదా శాసనాన్ని ప్రచురించడమే ఈ పత్రిక యొక్క సాధారణ ఉద్దేశం. విశ్వసించిన వ్యక్తి రక్షింపబడతాడు: విశ్వాసించని వ్యక్తి శిక్షను అనుభవిస్తాడు."
- జాన్ వెస్లీ,
"Predestination Calmly Considered"

"విశ్వాసమూలముగా అంత కంతకు విశ్వాసము కలుగునట్లు" అనే మాట నీతిమంతులమవ్వడానికి విశ్వాసమే ఏకైక మార్గమని నొక్కి చెబుతుంది. రక్షణకు విశ్వాసమొక్కటే అవసరమని చెప్పే ప్రొటెస్టెంట్ భావనకు అనుగుణంగా ఉంటుంది.

రోమీయులకు రాసిన పత్రికలో, *మరణం* అనే మాట, దేవుని తీర్పును సూచిస్తుంది. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా చేయబడిన వారు మాత్రమే జీవిస్తారు - అంటే తీర్పులో నుండి తప్పించబడతారు (1:18 చూడండి). విశ్వాసం ద్వారా తప్పించబడినవారు మినహాయిస్తే, మిగిలిన వారందరిపై దేవుని ఉగ్రత కుమ్మరించబడుతుంది.

► ఒక వ్యక్తి విశ్వాసం ద్వారా నీతిమంతునిగా చేయబడడం అంటే అర్థం ఏమిటి?


► ఈ లేఖన భాగంలో జీవించడం అంటే అర్థం ఏమిటి? మరణం అంటే ఏమిటి? విశ్వాసం ద్వారా జీవించడం అంటే అర్థం ఏమిటి?

## రోమీయులకు రాసిన పత్రిక ద్వారా మార్పుచెందిన ముగ్గురు దేవశాస్త్రులు

ఈ పత్రిక, మిషనరీ పనికి ఒక ఆధారాన్ని అందించడం అనే దాని అసలు ఉద్దేశ్యాన్ని ఇప్పటికీ అందిస్తోంది. ఇది మరింత ఎక్కువగా చేస్తుంది. ప్రతి ఒక్కరూ ఈ సందేశాన్ని ఎందుకు వినాలో పౌలు వివరిస్తూనే, ఆ సందేశమేంటో, ఈ మార్గం ద్వారా**నే** ప్రజలు ఎందుకు రక్షించబడతారో అనే విషయాలను గురించి మరింత లోతుగా వివరించాడు. ఆయన కొన్ని సాధారణ అభ్యంతరాలకు స్పందించాడు. తాను ప్రకటించిన సందేశాన్ని గూర్చిన ఈ వివరణ మరియు **ప్రతివాదన**, పత్రికలోని ఎక్కువ భాగాన్ని తీసుకొని, దాని నిర్మాణాన్ని నియంత్రిస్తాయి.

రోమీయులకు రాసిన పత్రిక, రక్షణ సిద్ధాంతానికి ఒక వివరణ. పౌలు యొక్క రక్షణ సిద్ధాంతం, యూదా క్రైస్తవ నాయకులకు తక్షణ వాదనను అందిస్తుంది,[8] మరియు రక్షణ సిద్ధాంతాన్ని గురించి ఆధునిక తప్పులను సరిచేసేదిగా ఉంటుంది.[9]

చరిత్రలో విశ్వాసులు రక్షణను గూర్చిన అత్యంత ప్రాముఖ్యమైన సత్యాలను మర్చిపోయినప్పుడు, వాటిని పునఃస్థాపించడానికి దేవుడు రోమీయులకు రాసిన పత్రికను వాడుకున్నాడు.


అగస్టీన్

యవ్వనస్తుడైన అగస్టీన్, సంతృప్తి కొరకు అనైతికమైన సంబంధాలవైపు, తాత్వికమైన, జ్ఞానసంబంధమైన అధ్యయనాలవైపు చూశాడు. అతను సత్యాన్ని వెదికి, చివరికి క్రైస్తవ్యంలో కనుగొన్నాడు. అయినప్పటికీ, పాపం అతన్ని చెరపట్టింది. రోమా 7లోనున్న వివరణలో తనని తాను చూసుకున్నాడు. తనకి సత్యం తెలుసు గాని, నీతిగా జీవించడం అతనికి సాధ్యం కాలేదు.

క్రీ. శ. 386లో, ఆగస్టీన్ తన ముప్పైల్లో ఉన్నప్పుడు రోమా 13:13-14 వచనాలు చదివిన తరువాత, తన పాప జీవితాన్ని విడిచిపెట్టాలని తీర్మానించుకున్నాడు. దేవుడు అతన్ని పాపబానిసత్వం నుండి విడిపించి, క్రీస్తుయేసు నందు దైవికమైన జీవితాన్ని జీవించడానికి తనని బలపరిచాడు.[10]

తన జీవితంలోని మిగిలిన సంవత్సరాలలో ఆగస్టీన్ ని, దేవుడు గొప్పగా వాడుకున్నాడు. తన రచనలు, తప్పుడు తత్వానికి వ్యతిరేకంగా సరైన సిద్ధాంతాలను సంరక్షించాయి. ఆ కాలంలో సరైనది చేయగలిగే సామర్థ్యం ప్రజలకు ఉందని, కాబట్టి పాపం చేయకుండా వాళ్ళు ఉండగలరని నమ్మకం ఉండేది. రోమా 5వ అధ్యాయం ఆధారం చేసుకొని, ప్రజలు పాప స్వభావంతో జన్మించారని, అది వారు దేవునికి అవిధేయత చూపాలని కోరుకునేలా చేస్తుందని అగస్టీన్ బోధించాడు. ఈ పాప స్వభావం, కృపకు వేరుగా దేవునిని సంపూర్ణంగా సంతోషపెట్టడాన్ని అసాధ్యం చేస్తుంది. ఆగస్టీన్, దేవునితో సరైన సంబంధంలోనికి ప్రజలను తీసుకొచ్చే దేవుని కృపను గురించి బోధించి, దానికి సాక్ష్యమిచ్చాడు.

---

[8] యూదీకరణవాదులు పెద్దలను గూర్చి కొంత సమాచారం తరువాత వివరించబడింది

[9] రోమా మరియు గలతీ పత్రికలను మనం కలిపి అధ్యయనం చేయాలి ఎందుకంటే గలతీ పత్రిక అదేవిధమైన సువార్త అంశాలను గురించి క్లుప్తంగా వివరిస్తుంది.

[10] చిత్రం: "Saint Augustin", Jusepe de Ribera, Goya Museum వారిది, Aristoi అప్లోడ్ చేశారు, https://commons.wikimedia.org/w/index.php?curid=72972944, పబ్లిక్ డొమైన్ నుండి తీసుకున్నారు..




మార్టిన్ లూథర్

1515లో, మార్టిన్ లూథర్ రక్షణ నిశ్చయత కొరకు అనేక సంవత్సరాల పాటు అన్వేషించిన తరువాత రోమా 1:17 వచనం యొక్క భావాన్ని గ్రహించాడు.[11] ఎంతో పట్టుదలతో క్రైస్తవ సన్యాసత్వం లాంటి ఆచారాలను పాటించడం ద్వారా ఆధ్యాత్మిక శాంతిని కనుగొనే ప్రయత్నం చేశాడు. ఆయన ఉపవాసముండి, క్యాథలిక్ సంఘ ఆచారాలన్నింటిని పాటించాడు, చివరికి తనని తాను గాయపరచుకున్నాడు. రోమ్ లోని సెయింట్ పీటర్ క్యాథెడ్రల్ మెట్లను రక్తసిక్తమైన మోకాళ్ళతో ఎక్కుతూ ఉన్నప్పుడు విశ్వాసం ద్వారా కృపను గురించి అవగాహనను దేవుని నుండి పొందుకున్నాడు.

> "రోమా పత్రిక క్రొత్త నిబంధనలో ముఖ్య భాగం మరియు స్వచ్ఛమైన సువార్త"
> - మార్టిన్ లూథర్

క్షమిస్తానన్న దేవుని వాగ్దానాన్ని విశ్వసించే వ్యక్తి మాత్రమే, దేవుని తీర్పు నుండి తప్పించుకుంటాడని అతను గ్రహించాడు. ఈ నిశ్చయతే, కేవలం విశ్వాసం ద్వారానే మనం రక్షింపబడతామనే తన సందేశానికి ఆధారమైంది.

1738లో ఎన్నో సంవత్సరాల తన అన్వేషణ తరువాత జాన్ వెస్లీ తన వ్యక్తిగత రక్షణ నిశ్చయతను కనుగొన్నాడు.[12] వెస్లీ, పట్టుదల కలిగిన బైబిల్ పండితుడు, ఎంతో జాగ్రత్తతోను, మతనిష్టతోను జీవించిన వ్యక్తి. అతను అమెరికాలో స్థానిక ఇండియన్స్ తెగల మధ్య మిషనరీగా రెండు సంవత్సరాల పాటు పనిచేసినప్పటికీ, వ్యక్తిగతంగా సువార్తను స్పష్టంగా అర్థం చేసుకోలేకపోయాడు. ఒక తుఫాను సమయంలో నౌకలో ఉండగా, మొరావియన్ జాతికి చెందిన కుటుంబాలు మరణాన్ని గూర్చిన భయం లేకుండా, ప్రశాంతంగా దేవుని యందు విశ్వాసముంచడం అతను చూశాడు. తనకు అలాంటి విశ్వాసం లేదని వెస్లీ గ్రహించాడు.



జాన్ వెస్లీ

మార్పు అకస్మాత్తుగా జరుగుతుందని వెస్లీ లేఖనంలో చూశాడు. తమకు వ్యక్తిగత రక్షణ నిశ్చయత ఉందని సాక్ష్యమిచ్చిన మొరావియన్ సహోదరులను అతను కలిశాడు. తాను ఒక నిర్దిష్టమైన మార్పుని అనుభవించాల్సిన అవసరం ఉందని గ్రహించడం ఆరంభించాడు. తన మార్పు, ఒక గృహంలో దేవుని వాక్య అధ్యయనానికి, ప్రార్థన కొరకు జరిగిన ఒక సమావేశంలో ఉండగా జరిగింది. సమావేశంలో ఒకరు రోమా పత్రికకు మార్టిన్ లూథర్ రాసిన ముందుమాటను చదువుతూ ఉండగా, వెస్లీ హృదయం "వేడెక్కినట్లు" భావించాడు.

---

[11] చిత్రం: "Martin Luther, 1529" by Lucas Cranach the Elder, https://commons.wikimedia.org/wiki/File:Martin_Luther,_1529.jpg, పబ్లిక్ డొమైన్ నుండి తీసుకున్నారు.

[12] చిత్రం: "Bildnis des John Wesley", John Greenwood వారిది, Leipzig University Library https://www.flickr.com/photos/ubleipzig/17059576182/,. పబ్లిక్ డొమైన్ నుండి తీసుకున్నారు.

"నా రక్షణ కొరకు క్రీస్తునందు, కేవలము క్రీస్తునందే విశ్వాసముంచినట్లు నేను అనుభూతి చెందాను: ఆయన నా పాపాలు, అవును నా సొంత పాపలను తీసివేసి, నన్ను పాపమరణముల నియమమునుండి రక్షించాడనే నిశ్చయత నాకు అనుగ్రహించబడింది" అని జాన్ వెస్లీ అన్నాడు.[13]

ఈ ముగ్గురు వ్యక్తులకు, సందేశమును అర్థం చేసుకొనుట రోషముగల సౌవార్తీకరణ ప్రేరేణకు కారణమైంది. రక్షణ శాస్త్రమును వివరించుట ద్వారా, గ్రంథము పరిచర్యలకు ఆధారమును అందిస్తూ దాని యొక్క ఉద్దేశ్యమును నెరవేర్చుతూనే ఉంది.

► మీ జీవితంపైన, మీ పరిచర్యపైన రోమా పత్రిక ఎలాంటి ప్రభావాన్ని కలిగి ఉంటుందని మీరు ఊహిస్తారు?

### పాఠం 1 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) పౌలు, రోమా విశ్వాసులకు పత్రికను ఎందుకు రాశాడు?

(2) రోమాకు వెళ్లాలని పౌలు ఎందుకు ప్రణాళిక చేసుకున్నాడు?

(3) క్రొత్త నిబంధన పత్రికల్లో *యేసుక్రీస్తు మన ప్రభువు* అనే మాటకు భావం ఏమిటి?

(4) పునరుత్థానం, యేసు దైవత్వాన్ని ఎలా నిరూపిస్తుంది?

(5) *గ్రీసుదేశస్థులు కాని వారు* అనే మాటను వివరించండి (రోమా 1:14).

(6) సువార్తికుడు, సువార్తను పంచుకోవాల్సిన రుణాన్ని ఎందుకు కలిగి ఉన్నాడు?

(7) రోమా పత్రికలో, కీలకమైన అత్యంత ప్రాముఖ్యమైన సత్యం ఏమిటి?

(8) రోమా పత్రికలో *మరణం* అంటే అర్థం ఏమిటి?

(9) రోమా పత్రిక ప్రకారం, దేవుని తీర్పు నుండి ఎవరు తప్పించబడతారు?

---

[13] John Wesley, *The Works of John Wesley, Vol. I* (Kansas City: Nazarene Publishing House), 103

## పాఠం 1 - అభ్యాసాలు

(1) ఈ పాఠం నుండి లేఖన భాగాన్ని ఉపయోగించి, ఒక పేజీలో సువార్త పరిచర్యను గురించి రాయండి. పరిచర్య పిలుపుని, దానిని వినవలసిన అవసరత ఉన్నవారి పట్ల సువార్తికుడు కలిగి ఉన్న రుణాన్ని, ఆ సందేశానికి దేవుడు ఇచ్చిన శక్తిని గురించి వివరించండి.

(2) ఈ పుస్తకాన్ని అధ్యయనం చేసే సమయంలో, రోమా పత్రికలోని లేఖనభాగాలను ఆధారం చేసుకొని మూడు ప్రసంగాలను లేదా పాఠములను సిద్ధపరచి, తరగతిలో వారికి కాకుండా ఇతర గ్రూపులకు వాటిని చెప్పండి. ప్రతి ప్రసంగాన్ని లేదా పాఠాన్ని చెప్పిన తరువాత, ఈ బోధను ఎలా మెరుగుపరచుకోవాలో విన్నవారిలో కొంతమందిని అడగండి. మీ ప్రసంగ నోట్స్ యొక్క ప్రతిని, మీ బృంద వివరణను, మీరు మాట్లాడినప్పటి సన్నివేశాన్ని, మీ ప్రసంగాన్ని మెరుగుపరచుకోవడానికి మీ ప్రణాళికలను మీ తరగతి నాయకునికి ఇవ్వాలి.

# పాఠం 2

# అన్యుల అపరాధం/దోషం

## రోమాలోనున్న సంఘం

### పట్టణం

పౌలు కాలంలో, రోము 10 లక్షలకు పైగా జనాభా కలిగి, ప్రపంచంలోనే అతిపెద్ద పట్టణం.[14] ఇక్కడ అన్ని రకాల జాతులు, భాషలు, మతాలకు చెందిన ప్రజలు నివసించేవారు. చాలామంది బానిసలు ఉండేవారు.

### రోముకు మొదటి మిషనరీలు

రోమా పట్టణానికి మొట్టమొదటిసారిగా సువార్తను ఎవరు తీసుకెళ్లారో మనకు తెలీదు. పెంతెకొస్తు పండుగ దినాన, రోమా నుండి వచ్చిన యూదులు కూడా ఉన్నారు (అపొస్తలుల కార్యములు 2:10). మారుమనసు పొందినవాళ్ళు ఖచ్చితంగా సువార్త సందేశాన్ని రోముకు తీసుకెళ్ళి ఉంటారు. మెస్సీయా వచ్చాడనే వారి ప్రకటన ఉత్సాహానికి, వివాదానికి కారణమయ్యేది. అప్పటికే యూదా మతాన్ని గౌరవించే అన్యుల మధ్యలో సువార్త శరవేగంతో వ్యాపించి ఉండేది.

### అన్యుల సంఘం

పత్రికలో అక్కడక్కడా యూదులను గురించి ప్రస్తావించినప్పటికీ, రోమా సంఘంలో చాలామట్టుకు అన్యులే ఉన్నారు. పౌలు వారిని అన్యులు (1:13-15) అని పిలిచాడు మరియు తాను గ్రీకు దేశస్థులకును, గ్రీకు దేశస్థులు కాని వారికిని రుణస్తుడు గనుక రోమీయులకు కూడా ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. అయితే మొదటి విశ్వాసులు యూదులైనందున, రోమా సంఘంలో యూదుల ప్రభావం బలంగా ఉండేది. యూదా మత నియమాల నుండి స్వేచ్ఛను కలిగించే విధంగా విశ్వాసులకు సువార్తను స్పష్టంగా వివరించలేదనేది సాధ్యమే.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం

సౌవార్తిక పనిని ప్రచారం చేయడమే పౌలు ఉద్దేశ్యం కాబట్టి, "ప్రతి ఒక్కరూ విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడాలా?" అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. అన్నింటికీ మించి, ప్రతి ఒక్కరికీ అవసరం లేని కొన్ని విషయాలు

---

[14] Bruce Wilkinson & Kenneth Boa, *Talk through the New Testament,* 375

ఉన్నాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో ఉన్నవారికి మంచుగడ్డను, ఎడారిలో ఉన్న వారికి ఇసుకను ఎవరు తీసుకెళ్ళాల్సిన అవసరం లేదు.

ప్రపంచంలో ఉన్న వారందరూ విశ్వాసం ద్వారానే నీతిమంతులుగా తీర్చబడవలసిన అవసరం లేదు; బహుశా కొంతమంది నీతియుక్తమైన జీవితాన్ని కలిగి, దేవునిచే అంగీకరించబడి ఉండవచ్చని కొంతమంది ఆలోచిస్తారు. ఈ పత్రికలోని రెండవభాగం (1:18-3:20), ప్రతి ఒక్కరూ విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడాల్సిన అవసరం ఉందని, కాబట్టి వారికి ఈ సందేశం అవసరమని చూపడానికి రాయబడింది.

**1:18-3:20 యొక్క ప్రధానాంశం**

లోకంలో ఉన్న వాళ్ళందరూ దేవుని నియమాలను (అడిగినవాటిని) ఉల్లంఘించి, శిక్షావిధి క్రిందకు వచ్చారు. ప్రతి వ్యక్తి దేవుని నియమాలను ఉల్లంఘించాడు గనుక ఏ వ్యక్తి కూడా దేవుని నియమాలను నెరవేర్చడం ద్వారా రక్షణ పొందలేడు.

**1:18-3:20 యొక్క సారాంశం**

మొదటిగా, పౌలు దేవుడు ప్రత్యక్ష పరచిన, వాక్యం లేని అన్యజనుల పరిస్థితిని వివరించాడు మరియు దేవుడు సృష్టిలో వెల్లడిపరిచిన జ్ఞానాన్ని వారు తిరస్కరించారని చూపించాడు. ఆ తరువాత, దేవుని రాతపూర్వక వాక్యాన్ని కలిగి, దానికి విధేయత చూపని ఇశ్రాయేలు ప్రజల స్థితిని వివరించాడు. తరువాత లోకం యొక్క సాధారణ పాపస్వభావాన్ని వివరించడంతో ముగించాడు. సర్వలోకం దేవుని ఎదుట అపరాధులనేది ముగింపు తీర్మానం. ఏ వ్యక్తి తన వ్యక్తిగత యోగ్యతలను బట్టి రక్షణ పొందలేడు కాబట్టి సువార్త అవసరం.

ఈ పాఠముల కొరకు కొరకు, 2వ భాగాన్ని (1:18-3:20) మూడు లేఖనాలుగా విభజించడం జరిగింది. ఈ పాఠములో మనం మొదటి లేఖనాన్ని అధ్యయనం చేస్తాం (1:18-32).

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 1వ లేఖన భాగం**

1:18వ వచనం, ముందు లేఖనానికి, ఈ లేఖనానికి మధ్య పరివర్తనీయ వచనం. ఒక వారధిలా ఉంటుంది.

**1:18-32 యొక్క ప్రధానాంశం**

అన్యులు, దేవుని గూర్చిన ప్రాథమిక జ్ఞానాన్ని కలిగి ఉన్నారు, కానీ దానిని తిరస్కరించి, విగ్రహాలు వైపుకు తిరిగి, పూర్తిగా భ్రష్టులైపోయారు.

► బృందం కొరకు ఒక విద్యార్థి 1:18-32 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(1:18) దేవుడు, తనని గురించి ప్రాథమిక/మౌలిక జ్ఞానాన్ని వారికి ఇచ్చాడు. వాళ్ళు సత్యాన్ని అడ్డగించారు (అణచివేశారు). ఆ తర్వాత వచనం వివరిస్తున్నట్లు, వాళ్ళు కొంత సత్యాన్ని కలిగి ఉన్నారని ఇది సూచిస్తుంది. వారి దగ్గరున్న సత్యాన్ని తిరస్కరించడమే వారు చేసిన తప్పిదం. *భక్తిహీనత* అనే మాట, మతపరమైన విషయాల్లో ఒక నేరాన్ని వివరిస్తుంది మరియు సృష్టికర్త కంటే ఎక్కువగా సృష్టిని పూజించే విగ్రహారాధనగా తనని తాను వ్యక్తపరచుకుంటుంది (1:19-23). *దుర్నీతి* అంటే నైతిక దుష్టత్వం అని అర్థం, ఇది అనైతికత మరియు దుర్మార్గత ద్వారా వ్యక్తపరచబడుతుంది (1:24-32).[15]

అడ్డగించిన సత్యాన్ని గురించి, 1:20లో ఉదహరించారు. దీనిలో వారిపై దేవుని అధికారాన్ని గూర్చిన జ్ఞానం కూడా ఉంటుంది. వారు దేవుని అధికారాన్ని ధిక్కరిస్తున్నారని వారి జీవనశైలి చూపిస్తుంది. దీనికి పూర్తి భిన్నంగా క్రైస్తవుని జీవిత శైలి, తాను చేసే పనిలోనూ, చేయని పనిలోనూ దేవుని అధికారానికి లోబడడం ద్వారా రుజువుపరచబడుతుంది.

## ప్రత్యక్షత రకాలు - ప్రత్యేక ప్రత్యక్షత మరియు సాధారణ ప్రత్యక్షత

► ప్రజలందరికీ దేవుని సత్యాన్ని ప్రత్యక్షపరిచే కొన్ని మార్గాలు ఏమిటి?

దేవుడు, సత్యాన్ని అనేక రీతులుగా వెల్లడిపరిచాడు గనుక, మనం రెండు రకాలను/వర్గాలను గురించి మాట్లాడుకుంటాం: సాధారణ ప్రత్యక్షత మరియు ప్రత్యేక ప్రత్యక్షత. పౌలు రోమీయులకు రాసిన పత్రికలో ఇవే పదాలు వాడకపోయినా, వీటిని గురించి ప్రస్తావించాడు.

సాధారణ ప్రత్యక్షత అంటే దేవుని సృష్టిని చూడడం ద్వారా ఆయనను గురించి మనం అర్థం చేసుకోగలగడం. విశ్వం యొక్క రూపకల్పనలో దేవుని యొక్క అద్భుతమైన జ్ఞానాన్ని, శక్తిని మనం చూడగలం.

మనిషి రూపించబడిన విధానంలో దేవునిని గూర్చిన ప్రాముఖ్యతను మనం చూస్తాం. మనం ఆలోచించడం, అందాన్ని అభినందించడం, మంచి చెడులకు మధ్య వ్యత్యాసాన్ని చెప్పడం **(నిశ్చయంగా కాకపోయినా)** లాంటి సామర్థ్యాలు, మన సృష్టికర్తకు కూడా అవే సామర్థ్యాలు మరింత ఉన్నత స్థాయిలో ఉన్నాయని మనకు తెలియజేస్తాయనేది వాస్తవం. మనం

---

[15] William Greathouse, “Romans”, in *Beacon Bible Commentary, Vol VIII*. (Kansas City: Beacon Hill Press, 1968) 50 నుండి తీసుకొనబడినది.

ఆ సామర్థ్యాలను కలిగి ఉన్నాం గనుక దేవుడు ఆలోచించగలడని, సంభాషించగలడని మనకి తెలుసు. (కీర్తనలు 19:1-4 మరియు 94:9 చూడండి).

దేవుడు మాట్లాడగలడని సాధారణ ప్రత్యక్షత మనకు చూపిస్తుంది కనుక, ప్రత్యేక ప్రత్యక్షత జరగవచ్చని మనం గ్రహించవచ్చు. దేవుడు వ్యక్తి.[16] కనుక ఆయన జ్ఞానవిచక్షణ కలిగిన తన జీవులతో/ మనుష్యులతో మాట్లాడగలడు. ఈ సత్యం దేవుని నుండి సందేశాలు వచ్చాయని, చివరికి దేవుని నుండి ఒక గ్రంథం కూడా వచ్చిందని గ్రహించడానికి మనకు సహాయపడుతుంది.

లేఖనం లేకపోయినా సాధారణ ప్రత్యక్షత ద్వారా ప్రజలు దేవుడు ఉన్నాడని, ఆయనకు లోబడాలని, ఇప్పటికే తాము దేవునికి అవిధేయులమయ్యామని తెలుసుకుంటారు (రోమా 1:20). కానీ మనం దేవునితో సరైన సంబంధంలోనికి ఎలా రావాలో సాధారణ ప్రత్యక్షత మనకు చెప్పదు. సాధారణ ప్రత్యక్షత, ప్రత్యేక ప్రత్యక్షత యొక్క అవసరాన్ని చూపిస్తుంది, ఎందుకంటే ఇది ప్రజలు పాపులని, తమ సృష్టికర్త ఎదుట నిరుత్తరులై ఉన్నారని చెబుతుంది.

సాధారణ ప్రత్యక్షత, మానవజాతి పడిపోయిందని, దోషిగా ఉందని మనకు చూపిస్తుంది. అయితే మానవ జాతి ఆ స్థితిలో ఎందుకు ఉందో ప్రత్యేక ప్రత్యక్షత వివరిస్తుంది. ప్రత్యేక ప్రత్యక్షత అంటే, బైబిల్ ప్రేరణలోనూ, క్రీస్తు శరీరధారణలోనూ ప్రత్యక్షపరచబడిన సత్యం. ప్రత్యేక ప్రత్యక్షత దేవుని స్వభావాన్ని వర్ణిస్తుంది, పతనాన్ని, పాపాన్ని వివరిస్తుంది మరియు మనం దేవునితో ఎలా సమాధానపడాలో చూపిస్తుంది.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 1వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

► సాధారణ ప్రత్యక్షత నుండి మనం నేర్చుకున్న విషయాలకు మించి ప్రత్యేక ప్రత్యక్షత మనకు ఏం చెబుతుంది?

(1:19) మనం సృష్టిని గమనించడం ద్వారా దేవుని గూర్చిన సత్యాన్ని గ్రహిస్తాం. ఏదో ఒక దైవీకమైన మనసు విశ్వాన్ని నియంత్రిస్తుందని గ్రీకు తత్వవేత్తలు కూడా ఒప్పుకున్నారు. మనిషి స్వభావం, సృష్టిలో అత్యంత ప్రాముఖ్యమైన భాగం. మనం మంచి చెడులను గురించి మనిషికున్న స్పృహను గమనించడం ద్వారా దేవుని ఉనికిని, స్వభావాన్ని గూర్చిన సత్యాన్ని గ్రహిస్తాం (1:32 చూడండి).

[16] దేవుడు మనిషి అని మనం చెప్పడం లేదు కానీ ఆయన వ్యక్తి - ఆలోచించగలడు, ఉద్దేశించగలడు మరియు మాట్లాడగలడు - ఆయన వ్యక్తిత్వం లేని ఒక శక్తి కాదు.

► మనం మనిషిని చూసినప్పుడు, దేవుని గురించి ఏం అర్థం చేసుకోగలము?

(1:20) సృష్టి ప్రారంభం నుండి తాము సృష్టించబడినవారమని, దేవుడు వారిపై నిత్యశక్తిని, అధికారాన్ని కలిగి ఉన్నాడని ప్రజలకు తెలుసు. దేవునిని తిరస్కరించడం క్షమించరాని దోషంగా చేయడానికి ఈ జ్ఞానం సరిపోతుంది. వారు తమ పాపాలను బట్టి న్యాయంగా తీర్పు పొందుతారు. తమ తిరుగుబాటును బట్టి తాము దోషులమని వారికి తెలుసు.[17] దేవునిని గూర్చిన మరియు తమని గూర్చిన ఈ విషయాల వలన, వారు సాకులు చెప్పలేరు / తప్పించుకోలేరు.

పాపాన్ని శిక్షించడానికి ముందే, దానిని ఉద్దేశపూర్వక చర్యగా చూపించాలని దేవుని న్యాయం కోరుతుంది. వాళ్ళు ఉత్తమమైన దానిని ఎంపిక చేసుకోవడానికి వారికున్న జ్ఞానం సరిపోతుందని గ్రహించడం కూడా అవససరం. వారు భిన్నమైన దానిని ఎంపిక చేసుకోవడం అసాధ్యమైనట్లయితే, అప్పుడు వారు సాకులు లేకుండా ఉండేవారు కాదు. ఇక్కడ దేవుడు తనను తాను వివరించుకుంటున్నాడు.[18]

దాదాపు ప్రపంచంలోని ప్రతి సంస్కృతి, లోకాన్ని సృష్టించిన ఒక అత్యున్నతుడైన దేవుడు ఉన్నాడనే భావనను కలిగి ఉంటుంది. తాము అత్యున్నతుడైన దేవుని నుండి వేరైపోయామని వారికి తెలుసు కాబట్టి సాధారణంగా వాళ్ళు దేవునిని ఆరాధించడానికి బదులు వేరొక అతీంద్రియ శక్తిని ఆరాధిస్తారు. పౌలు, దేవుని ఉనికిని నిరూపించే ప్రయత్నం చేయడం లేదు, కాని ప్రతి సంస్కృతికి దేవుని ఉనికి, అధికారం తెలుసని సూచిస్తున్నాడు. ఈ జ్ఞానం దోషనిర్ధారణకు నడిపిస్తుంది.

సాధారణ ప్రత్యక్షతకు పరిమితులు ఉన్నాయి. క్రీస్తును మరియు సువార్తను గూర్చిన జ్ఞానం, ప్రత్యేక ప్రత్యక్షత ద్వారా తప్ప మరే విధంగాను వెల్లడి పరచబడదు. అలాగే, సృష్టించబడిన లోకం కూడా దేవునిని ఖచ్చితంగా/సరిగ్గా వర్ణించలేదు, ఎందుకంటే అది పాపశాపానికి లోనైంది మరియు దాని అసలు నమూనాను/రూపాన్ని సంపూర్ణంగా వ్యక్తపరచడం లేదు. సృష్టి, బురద పాదముద్రలు కలిగిన అందమైన పెయింటింగ్ లాంటిది. అది పాడైంది, కానీ దాని అసలు అందం కొంతవరకు నిలిచే ఉండి, దాని చిత్రకారుని గురించి కొంతవరకు తెలియజేస్తుంది.

(1:21-22) మనిషి ఆయన్ని దేవునిగా ఘనపరచడానికి (ఆరాధన) మరియు కృతజ్ఞతలు చెల్లించడానికి (స్తుతి) ఆయన అర్హుడు. కానీ మనుష్యులు దేవుని నుండి పొందిన వాటినిబట్టి కృతజ్ఞత కలిగి ఉండడానికి బదులు ఆయన

---

[17] 1:32పై వివరణను చూడండి.

[18] ఈ అంశంపై మరింత సమాచారం కొరకు, 9వ పాఠములో “పరీక్షపై దేవుని న్యాయం” అనే భాగాన్ని చూడండి.

అధికారాన్ని అసహ్యించుకొన్నారు. వారు కలిగి ఉన్నవాటన్నింటికీ రావాల్సిన ఘనతను తామే తీసుకొని, తమకు తాము దేవుళ్లుగా ఉండాలని కోరుకున్నారు. అలాంటి స్వతంత్ర దైవత్వాన్ని ప్రకటించుకోవడం పిచ్చితనం/అవివేకం.

వారి హృదయాలు అంధకారమయమయ్యాయి. హృదయం, ఒక వ్యక్తి చిత్తాన్ని, విశ్వసనీయతను సూచిస్తుంది. వెలుగు, సత్యాన్ని సూచిస్తుంది. వాళ్ళు సత్యాన్ని తిరస్కరించినందున, దాన్ని చూడగలిగే సామర్థ్యాన్ని వాళ్ళు కోల్పోయారు. వాళ్ళు ఆధ్యాత్మిక, నిత్యత్వపు సంగతులను గూర్చిన అవగాహనను కోల్పోయారు, కనుకనే లౌకికమైన విషయాలను కూడా ఖచ్చితంగా అర్థం చేసుకోలేకపోతున్నారు.

> "మనిషి పాపం యొక్క మూలం, మతపరమైన దుష్టత్వమైతే, దాని ఫలం నైతిక భ్రష్టత్వం."
> \- విలియం గ్రేట్ హౌస్,
> రోమా *పత్రికపై వ్యాఖ్యానం*

(1:23, 25) తమపై, లౌకిక ప్రపంచంపై దృష్టిని కేంద్రీకరించడం మరియు సృష్టికర్తను తిరస్కరించడం, పతనమైన తమ స్వభావాలను మెచ్చుకోవడానికి/ప్రశంసించే దేవుళ్ళను తయారు చేసుకోవడానికి నడిపించాయి. వాళ్ళు దేవునికి చెందాల్సిన మహిమను సృజించబడిన వాటికి బదిలీ చేశారు. సృష్టికర్త పట్ల వారికున్న బాధ్యతను తప్పించుకోవడానికి, వాళ్ళు ఆయన ఉనికిని తిరస్కరించి, సృష్టిని ఘనపరిచారు. ఈ వైఖరే, ఆధునిక పరిణామానికి, మానవతావాదానికి పునాదిగా మారింది. ప్రజలు తమని తాము సృష్టించుకుంటే/ఉత్పత్తి చేసుకుంటే, అప్పుడు వాళ్ళు తమ వ్యక్తిగత ఉద్దేశ్యాలను, విలువలను, నైతికతను ఏర్పరచుకోవచ్చు.

దేవుడు సృజించిన దానికి సేవచేయడం, దానిని ఆరాధించడమే విగ్రహారాధన తత్వం/స్వభావం. ఏదైనా ఒక విషయాన్ని సేవించడం అంటే జీవితంలో దానికి ప్రథమ స్థానమిచ్చి, ఆ ప్రాధాన్యతకు అనుగుణంగా జీవితాన్ని క్రమబద్ధీకరించుకోవడం అని అర్థం. దేవునిని కాక, మరి దేనినైనా ఆరాధించడం అంటే దేవునికి మాత్రమే చెందవలసిన నమ్మకాన్ని, భక్తిని దానికివ్వడమని చెప్పడం. విగ్రహారాధన, కేవలం సృష్టికర్త మాత్రమే ఇవ్వగలిగిన సంతృప్తిని సృష్టించబడిన వాటి నుండి ఆశిస్తుంది. ఆధునిక భౌతికవాదం/వస్తుతత్వం విగ్రహారాధనే. ఒక వ్యక్తి దేవుని పట్ల తన ఆరాధనను తగ్గించకుండా, భౌతికమైన వస్తువులను ఘనపరచలేడు.

► అన్యులు, దేవుని జ్ఞానానికి ఎలా స్పందిస్తారు?

(1:24) ఈ వచనం, 1:26-27లో విస్తరించిన అంశాన్ని పరిచయం చేస్తుంది. సృజించబడిన వాటి పట్ల విగ్రహారాధన సంబంధమైన ప్రేమ సహజంగానే లైంగిక పాపంతో సహా అనైతికతకు నడిపిస్తుంది. లైంగిక పాపం, శరీర కోరికలకు ప్రాధాన్యతనిచ్చి, శరీరాన్ని అగౌరవపరుస్తుంది, ఎందుకంటే శరీరం పరిశుద్ధమైంది, దేవుని సేవకు సమర్పించబడింది.[19]

(1:26-27) అనైతికత అనేది స్వయాన్ని మహిమపరచుకోవడానికి మరియు స్వార్థపూరితమైన కోరికలు పరిపాలించడానికి అనుమతించడం ద్వారా కలిగే సహజ పరిణామం. కోరికలు పరిపాలించినప్పుడు, అవి వక్రీకరించబడతాయి. ఒక వ్యక్తి, దేవునిని అత్యున్నతంగా ప్రేమించేవరకూ మరియు ఆయనయందు ఆనందించేవరకూ ఎవరిని సరైన విధంగా ప్రేమించలేడు లేదా దేనిని సరైన రీతిలో అనుభవించలేడు. 1:24వ వచనం ఈ అంశాన్ని పరిచయం చేస్తుంది మరియు అనైతికతకు, దేవునిని తృణీకరించడానికి మధ్యనున్న సంబంధాన్ని చూపిస్తుంది.

దేవుడు సృష్టించిన మంచి విషయాలను వక్రీకరించడమే పాపం; లైంగిక వక్రత, కొన్ని పాపాలకంటే చాలా స్పష్టంగా ఉంటుంది. మనిషి దేవుని నుండి ఎంత ఎక్కువగా దూరమైతే, అంత ఎక్కువ క్రూరంగా, కఠినంగా మరియు వికృతంగా మారతాడు. నాగరికత ద్వారా చెడిపోని కొన్ని సాధారణ సంస్కృతులు ఉన్నాయని, అవి మెరుగైన జీవితాన్ని ఇస్తాయని కొంతమంది ప్రజలు భావిస్తారు. వాస్తవమేమిటంటే, అనాగరిక సంస్కృతులకు చెందిన చాలామంది



**రోమా మతం**

రోమా మతం, గొప్ప వైవిధ్యం కలిగింది. వాళ్ళు అనేకమంది దేవుళ్ళను నమ్ముతారు. వాళ్ళు గ్రీకు దేవుళ్ళ పురాణాలను చాలా వరకు ఉంచుకొని, కొన్ని పేర్లను మాత్రం మార్చారు. వాళ్ళు రాజ్యాలను జయించినప్పుడు, స్థానిక దేవుళ్ళను తరచుగా తమ మతంలోనికి అంగీకరించేవాళ్ళు. కొంతమంది దేవుళ్ళు కేవలం కొన్ని నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతాలకు ప్రాముఖ్యమైనవారని నమ్మేవాళ్ళు. వాళ్ళు యూదామతంలోనూ, క్రైస్తవ్యంలోనూ ఉన్న దేవుని వంటి సర్వశక్తిమంతుడైన సృష్టికర్తయందు విశ్వాసముంచలేదు. ప్రభుత్వంతో సహా జీవితంలోని ప్రతి భాగంలోనూ మతం ప్రమేయాన్ని కలిగి ఉంటుంది. క్రైస్తవులు, మతపరమైన బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వలన హింసించబడేవాళ్ళు.

---

[19] చిత్రం: “Athena Pallas austrian Parliament”, ఫిబ్రవరి 20, 2012న Jebulon తీసుకున్నాడు, https://commons.wikimedia.org/wiki/File:Athena_Pallas_austrian_Parliament.jpg, పబ్లిక్ డొమైన్ నుండి తీసుకున్నారు.

ప్రజలు, మరణం పట్ల, అతీంద్రియ శక్తుల పట్ల భయంతో జీవిస్తూ, క్రూరమైన ఆచారాలను పాటిస్తారు మరియు వక్రీకరించబడిన, పాపపు జీవితశైలి వలన కలిగే ఫలితాలను అనుభవిస్తారు.

మనిషి, దేవునితో సంబంధం కలిగిన వ్యక్తిగా పనిచేయడానికి సృష్టించబడ్డాడు. ఒకవేళ అతను దేవుని నుండి వేరైతే, మనిషిగా తాను ఉండాల్సిన విధంగా ఉండడు. తన ఆదర్శాల స్థాయికి తగ్గట్లుగా కూడా జీవించలేడు. దేవుడు లేని వ్యక్తి, పురుషతత్వానికి, స్త్రీతత్వానికి ఉన్న ఆదర్శాలను/శ్రేష్టతను కూడా చేరుకోలేనంత దూరంలో ఉంటాడు. లైంగిక వక్రత, అత్యంత స్పష్టమైన విపరీతత్వం, కానీ ప్రతి వ్యక్తి ఇతర మార్గాలలో కూడా నిజమైన మానవత్వాన్ని కోల్పోవడం ద్వారా ప్రభావితమయ్యాడు. దేవునిని దేవునిగా తృణీకరించడమంటే, మనిషిని మనిషిగా తృణీకరించడమని అర్థం. **దేవునిని ఆరాధించడాన్ని తిరస్కరించడమంటే, మీ మానవత్వాన్ని/మానవ స్వభావాన్ని తిరస్కరించడమే అవుతుంది.**

హాస్యాస్పదమైన విషయమేమిటంటే, సృష్టించబడిన వాటిని ఆరాధించేవారు, చివరకు సహజమైనవాటికి భిన్నంగా, సృష్టమును/ప్రాణిని కూడా వక్రీకరిస్తారు. ఒకవేళ ప్రజలు, తమ సహజ కోరికల చేత పాలించబడుటకు తమని తాము అప్పగించుకున్నట్లయితే, ఆ కోరికలు తీవ్రమై, అసాధారణమైన రూపాలుగా మారతాయి.

ఒకవేళ ఎవరైనా ఒక వ్యక్తి, శరీర కోరికలను దేవునికంటే ఎక్కువగా ఘనపరిస్తే, చివరికతను తన శరీరాన్ని అగౌరవపరుస్తాడనేది హాస్యాస్పదమైన విషయం. లైంగిక పాపంలో ప్రజలు ఆరాధించే శరీర భాగాలనే, అసభ్యకరమైన, అవమానకరమైన విషయాలను చెప్పాలని కోరుకున్నప్పుడు కూడా ప్రస్తావిస్తారు.

సాధారణంగా, పురుషులవలె స్త్రీలు తమని తాము లైంగిక అనైతికతకు, వక్రతను అప్పగించుకోరు. కుటుంబం యొక్క సంపూర్ణతను కాపాడాలని వారు సహజంగా కోరుకుంటారు. స్త్రీలు ఈ ఘోరమైన దుర్మార్గం చేయడం, వారి సమాజపు జారత్వం సంపూర్ణమైనట్లు చూపిస్తుంది.

► మీ సమాజంలో సర్వసాధారణమైన వక్రతకు కొన్ని రూపాలు ఏమిటి?

వారు ప్రవేశించిన పాపపు స్థితికి వారు న్యాయంగా అర్హులు. పాపపు స్థితి, పాపానికి తగిన శిక్ష. అది వృద్ధి చెందుతున్నప్పుడు శ్రమను, అవమానాన్ని, అసంతృప్తికరమైన కోరికలను కలిగించి, చివరికి జారత్వాన్ని ఫలితంగా ఇస్తుంది.

## స్వలింగ సంపర్క (హోమోసెక్సువల్) పాపానికి క్రైస్తవ స్పందన

"స్వలింగ సంపర్కుల (లేదా లెస్బియన్) సంబంధాలలో ప్రేమ, సమర్పణ ఉంటాయనడం" యొక్క ప్రామాణికతను బైబిలు అంగీకరిస్తుందనడానికి ఎటువంటి ఆధారం లేదు.[20] ఇదే వాస్తవమైతే, ప్రతి ఇతర మానవ సంబంధాలను (ఉదా: భార్యభర్తలు, తల్లిదండ్రులు పిల్లలు మరియు పౌరులు, ప్రభుత్వం) గూర్చిన బోధ లేఖనమంతటా కనుగొన్నట్లుగానే దీనిని గురించి కూడా కనుగొనాలి. దానికి బదులు, అలాంటి సంబంధం దేవుని దృష్టికి అంగీకారమని చెప్పే ఒక్క వచనం కూడా లేదు.

ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య శోధన, ప్రేమ భావన లేదా ఆకర్షణ, లేదా మన మనసులో పోరాటాన్ని లేఖనం నిషేధించదు. వాస్తవానికి, దేవుడు, బాధించబడేవారికి, గందరగోళంలో ఉన్నవారికి మరియు శోధించబడినవారికి తాను దగ్గరగా ఉంటానని చెప్పాడు. మోహపు ఆలోచనను ఆహ్వానించినప్పుడు (యాకోబు 1:15) లేదా దేవుని నమూనాకు భిన్నంగా ప్రవర్తిస్తున్నప్పుడు పాపం జరుగుతుంది.

స్వలింగ సంపర్కమనే అంశానికి, సంఘం తగిన విధంగా ప్రతిస్పందించడంలో దయతో కూడిన ప్రేమను, సున్నితమైన సత్యాన్ని మరియు ప్రామాణికమైన వినయం కలిగి ఉండాలి. ఇతరులను ప్రేమించడం అంటే, ప్రజలు పాపం నుండి తిరిగారా లేరా అనే దానితో సంబంధం లేకుండా ఇతరుల పట్ల శ్రద్ధను మరియు క్రీస్తు ప్రేమను చూపడం. ఇతరులను ప్రేమించడం అంటే మనం మన పాపంలో ఉన్నప్పుడు క్రీస్తు మనల్ని చూసినట్లు (మరియు ఇప్పటికీ చూస్తున్నట్లు), అదే దృష్టితో వారిని చూడడం. ఒక వ్యక్తితో మనకున్న సంబంధం, ప్రాథమికంగా ఆ వ్యక్తిని క్రీస్తునందు రక్షణార్థమైన సంబంధంలో ప్రవేశించడానికి నడిపిస్తుంది. ఆ తరువాత, ఇది పరిశుద్ధాత్మ దేవుని పని. ఆయన సాధారణంగా స్థానిక సంఘంలో పనిచేస్తూ, సంపూర్ణతను పునఃస్థాపిస్తాడు.

అయితే, ఒక వ్యక్తిని ప్రేమించడం అంటే విరోధులమవుతామని తెలిసినా లేదా అలక్ష్యం చేస్తారని తెలిసినా సత్యాన్ని మాట్లాడడం. ఒక వ్యక్తితో దేవుని వాక్యాన్ని పంచుకోవడం ద్వారా అతన్ని అల్పమైన నిర్ణయాలు తీసుకోవడం నుండి, అయోమయం, పాపం మరియు శ్రమ నుండి జీవిత కాలం స్త్రీని లేదా పురుషుడిని రక్షించవచ్చు. బైబిల్ సూత్రాలను/ఆజ్ఞలను అంగీకరించడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండరు. సత్యాన్ని గూర్చి మనం చేసే చర్చలను, ఓర్పు మరియు మృదుత్వం నడిపించాలి. మనం మనస్ఫూర్తిగా/హృదయపూర్వకంగా వినాలి మరియు ప్రేమతోనూ,

---

[20] ఈ భాగం "What Does the Bible Say about Homosexuality: Answering Revisionist Gay Theology" అనే వ్యాసంలో నుండి సవరించబడింది, ఇది Focus on the Family లోనిది. పూర్తి వ్యాసం http://media.focusonthefamily.com/fotf/pdf/channels/social-issues/what-does-the-bible-say_final3.pdf?refcd=209501 చూడండి.

విపేచనతోను లేఖనాన్ని వాడాలి. మనం వ్యక్తి పట్ల యథార్థమైన/నిజమైన శ్రద్ధను చూపించాలి, అప్పుడు మనం చెప్పే విషయాలకు విలువనిస్తారు.

క్రైస్తవ సందేశానికి, యథార్థమైన/నిజమైన తగ్గింపు అవసరం. తగ్గింపనేది దేవునితో సంభాషించడం, సమయం గడపడం, మన వ్యక్తిగత పాపాన్ని అంగీకరించడం, ఒప్పుకోవడం మరియు దాని నుండి పెనుతిరగడం, సిలువపై వెల్లడైన లోతైన దేవుని ప్రేమను హత్తుకోవడం నుండి వస్తుంది. భయం, కోపం మరియు ద్వేషానికి బదులు, ప్రేమ కనికరాలు, మనకు ప్రేరణగా ఉండాలి.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 1వ లేఖన భాగం

### వచనాల వారీ వివరణ కొనసాగింపు

(1:28) వాళ్ళు తమ ఆలోచనలలోనూ, తమ జీవిత విధానంలోనూ దేవునిని తిరస్కరించారు గనుక వారి ప్రవర్తన వక్రీకరించబడినట్లుగానే వారి ఆలోచన విధానం, తత్వాలు కూడా వక్రీకరించబడ్డాయి. ఇక్కడ గ్రీకులో పదాలను నేర్పుగాను, చాతుర్యంతోను వాడారు. వాళ్ళు దేవునిని తిరస్కరించారు గనుక ఆయన తాను తిరస్కరించిన మనసుకి వారిని విడిచిపెట్టాడు - అంటే ప్రభావితం చేయడం మానేశాడు. దేవుడు మనిషికి స్వచిత్తాన్ని ఇచ్చి, పనిచేయుటకు దాన్ని అనుమతించాడు. ఒక స్థాయి తరువాత, దేవుడు తనని పూర్తిగా తిరస్కరించిన వారిని, తన ప్రభావం నుండి స్వతంత్రులుగా చేశాడు. అప్పుడు వారి మనసులు, దేవుడు అడ్డుపడని భ్రష్టత్వాన్ని అనుసరిస్తాయి.

> "మానవ వ్యక్తిత్వానికి పాపం కలిగించిన పూర్తి నష్టాన్ని అంచనా వేయడం/గ్రహించడం కష్టం. లొంగిపోయిన బలహీనమైన చిత్తానికి మరియు ఉద్వేగభరితమైన భావోద్వేగాల ఘోషకు మించి మొద్దుగా మారిన, కోరికకు బానిసగా చేయబడిన మనసు ఉంది. కారణాలు చెప్పడానికి బదులు సాకులు చెప్పడం నేర్చుకుంది. ఇది మొదట నిర్ణయించుకొని, తరువాత ఆలోచిస్తుంది. ఇది తర్కించడానికి బదులుగా హేతుబద్ధం చేస్తుంది. ఇది కొన్నిసార్లు సత్యం చెబుతుంది కానీ స్థిరంగా కాదు. దానిపై ఆధారపడలేము... అది సత్యాన్ని అసత్యానికి, దేవుడిని విగ్రహారాధనకు, జ్ఞానాన్ని మూర్ఖత్వానికి అమ్మేసింది..."
>
> - విల్బర్ డేటన్

దేవుడు వారిని అప్పగించాడు అనే ప్రకటన (1:24, 26 & 28), ఈ ప్రజలు వాస్తవంగా/దాదాపు నిస్సహాయ స్థితిలో ఉన్నారని, తాము మార్చలేని నిర్ణయాలు తీసుకున్నారని సూచిస్తుంది (2 థెస్సలొనీకయులకు 2:10-12తో పోల్చండి).

భ్రష్టత్వం చేత ప్రజల మనసులు, ఆలోచన ప్రతికూలంగా ప్రభావితమయ్యాయి. ప్రజలు నైతిక నిర్ణయాలు తీసుకునేటప్పుడు, ఇది వారిని అడ్డుకుంటుంది. ఇది ప్రజలు తమ పాపపు కోరికలను, చర్యలను సమర్థించుకొనేలా చేస్తుంది.

► ప్రజలు తమ పాపాలకు నిర్హేతుకంగా చెప్పే సాకులకు కొన్ని ఉదాహరణలు ఏమిటి?

(1:29-31) ఈ వచనాల్లో మనం భయంకరమైన పాపాల చిట్టాను కనుగొంటాం. సంస్కృతి, ప్రభుత్వం ఈ ధోరణిని నిరోధించవచ్చు, కానీ అవి పాపియైన మనుష్యుని హృదయంలో నిలిచే ఉంటాయి. ఒకవేళ సాంస్కృతికమైన, ప్రభుత్వపరమైన నియంత్రణలను తొలగిస్తే, అనేకమంది ప్రజలు, చాలా త్వరగా క్రూరులుగాను, ఆటవీకులుగాను మారతారు.

ఇక్కడ పేర్కొన్న పాపాలు, పాపులను గూర్చిన వివరణలు ఒకదానికొకటి పూర్తిగా భిన్నమైనవి కాదు. ప్రతి ఒక్కటి సూచించే కొన్ని ప్రధాన ఆలోచనలు ఇక్కడ ఉన్నాయి

**దుర్నీతి** - సాధారణ పదం, కానీ మిగిలినవాటన్నింటినీ కలిగి ఉంటుంది.

**జారత్వం** – అన్ని రకాల లైంగిక అనైతికత.[21]

**దుష్టత్వం** – ఇది కూడా చెడు కార్యాలకు, చెడు స్వభావానికి సాధారణ పదం.

**లోభము** – గ్రీకు రచనల్లో తీవ్రమైన స్వార్థాన్ని సూచించడానికి వాడిన పదం. ఇది తన వ్యక్తిగత ప్రయోజనం కొరకు వెంటాడుతూ, ఇతరుల ప్రయోజనాలను అణగద్రొక్కే వ్యక్తిని వివరిస్తుంది. స్వప్రయోజనం కొరకు అధికారిక స్థానాన్ని తప్పుగా వాడుకోవడం కూడా దీనిలో భాగమే.

ఈర్ష్య – అంతరంగ దుష్టత్వం మరియు కీడు/చెడు చేసే ధోరణి.

**మత్సరం** – ఇష్టమైన వస్తువులను కలిగి ఉన్న వారి పట్ల ద్వేషం/అసహ్యంతో పాటు, ఇతరులు కలిగి ఉన్నవాటిని ఆశించే కోరిక.

**హత్య** – తీవ్రమైన ద్వేషం మరియు అసహ్యం వలన ఒక వ్యక్తిని చట్టవిరుద్ధంగాను, ఉద్దేశ్యపూర్వకంగాను చంపడం.

**కలహం** – బహుశా శతృత్వం/పోటీతత్వం నుండి కలిగిన జగడం/గొడవ.

---

[21] కొన్ని గ్రీకు ప్రతుల్లో ఈ పదం ఈ జాబితాలో లేదు.

**కపటం** – మోసం, చిక్కించుకోవడానికి ఎరవేయడాన్ని కూడా సూచిస్తుంది.

**వైరం** – ద్వేషం, అకారణంగా ఇతరులను బాధించడానికి సిద్ధంగా ఉండడం.

**కొండెములు చెప్పడం** – రహస్యంగా దూషించేవారు, అపనిందలు వేసేవారు.

**అపవాదకులు** – అపవాదకులు, ఇతరుల గురించి చెడు లేదా తప్పుడు మాటలు చెప్పడం ద్వారా వారికున్న ప్రతిష్టను నాశనం చేస్తారు.

**దేవద్వేషులు** – దేవుని నియమాలు వారిని ఖండిస్తున్నందున వారు ఆయన్ని శత్రువుగా చూస్తారు.

**హింసకులు** – ఈ వ్యక్తి గర్వంతోను, క్రూరత్వంతోను నిండి ఉంటాడు. ఈ లక్షణంతో ఉన్న బలహీనమైన వ్యక్తి, తాను గౌరవించవలసిన వారిని అవమానించాలని కోరుకుంటాడు. ఈ లక్షణం కలిగిన బలమైన వ్యక్తి, ఇతరుల పట్ల క్రూరంగా వ్యవహరిస్తాడు మరియు తాను ఆశించిన గౌరవాన్ని ఇవ్వని వారిపై తీవ్రంగా పగ తీర్చుకుంటాడు.

**అహంకారులు** – గర్వం అంటే తనని తాను గొప్పగా చూసుకోవడం. ఇది తన సృష్టికర్తను ధిక్కరిస్తూ, తన జీవితాన్ని తానే పరిపాలించుకోవడానికి వ్యక్తిని ప్రేరేపిస్తుంది కాబట్టి ఇది పాపాలన్నింటికీ మూలం.

**బింకములాడువారు** – తనని తాను గొప్ప చేసుకోవడం. వీళ్ళు స్వయం-కేంద్రితంగా ఉన్నవాళ్ళు. ఇక్కడ ఇతర లక్షణాలతో పాటు దీన్ని పరిగణలోనికి తీసుకొన్నట్లయితే, ఈ వ్యక్తులు ఇతరులకు నష్టం కలిగించి, మరియు వాళ్ళకు హాని కలిగించి, మోసపూరితంగా తమని తాము హెచ్చించుకుంటారు.

**చెడ్డవాటిని కల్పించువారు** – చెడును, హానికరమైన విషయాలను అభివృద్ధి చేయడంలో వారు సృజనాత్మకంగా ఉంటారు.

**తలిదండ్రులకవిధేయులును** – కుటుంబాలు నాశనమవ్వడమనేది పాప ఫలితం, ఇది సమాజాన్ని మరింతగా పాడుచేస్తుంది. తనకు తెలిసిన మొదటి అధికారానికి విరోధంగా తిరుగుబాటు చేసే పిల్లవాడిలో పాపపు ధోరణి ప్రారంభ వ్యక్తీకరణగా కనబడుతుంది.

**అవివేకులు** – నైతిక విలువలను గూర్చిన స్పృహ ఉండదు. నైతికతను ఆధారం చేసుకొని తర్కించడం ద్వారా ఈ వ్యక్తి అంగీకరించబడడు. ఇది జ్ఞానం/బుద్ధి లేకపోవడం వలన కాదు, కానీ దుష్ట హృదయం వలన నైతిక భావం దుర్బలమవ్వడం వలన జరుగుతుంది.

మాట తప్పువారు. నైతికతను, అధికారాన్ని విడిచిపెట్టి, తమ కోసం వక్రీకరించబడని సంపూర్ణ సత్యాన్ని ద్వేషించి, వారి స్వయాన్ని ప్రధానమైనదిగా చేసుకొని, వారి ప్రమాణాలను మీరే వారు.

**అనురాగ రహితులు** – సురక్షితమైన, ఆప్యాయత కలిగిన సహజ స్వభావాన్ని కలిగి ఉండడానికి వ్యతిరేకం. వాళ్ళు తమ కుటుంబాలను విడిచిపెట్టి, తమ వ్యక్తిగత కోరికలను అనుసరిస్తారు. ప్రేమ యొక్క అత్యంత మౌలికమైన స్వభావం వక్రీకరించబడుతుంది. తమ సంరక్షణపై ఆధారపడేవారిని దుర్వినియోగపరుస్తారు/వాడుకుంటారు.

**శాంతపడనివారు** – వీరిని సంతోషపరచడం కష్టం.[22]

**నిర్దయులు** – జాలి లేనివారు. వాళ్ళు కనికరం లేకుండా శ్రమను, కష్టాన్ని చూస్తూ ఉంటారు. వాళ్ళ ప్రవర్తన ఇతరులకు ఇబ్బందిని కలిగిస్తుంటే చూసి కూడా వాళ్ళు తమ చెడు మార్గం నుండి తొలగరు. తమ తప్పు వల్ల, పొరపాటు వలన కలిగిన శ్రమను చూసి కూడా పశ్చాత్తాపపడడానికి కదిలించబడరు.

(1:32) ఈ విషయాలన్నీ తప్పని వాళ్ళకు తెలుసు. అన్యజనులు, తమకు తెలిసిన సత్యాన్ని కూడా నమ్మకంగా వెంబడించరు. వాళ్ళు శిక్షావిధిక్రింద ఉన్నారని వారికి తెలుసు. అయినప్పటికిని వాళ్ళు పాపాన్ని అనుసరించడం మాత్రమే కాదు, కానీ ఇతరుల్లో ఉన్న పాపాన్ని కూడా ఆమోదిస్తారు. ఒక నూతన ప్రవర్తనా ప్రమాణం, అనైతికతను ఆమోదించేటంతగా సమాజంలో నైతికత దిగజారిపోయింది.

పాపాన్ని సంపూర్ణంగా అంగీకరించే వ్యక్తి, తనని తాను పాపిగా ఆమోదిస్తాడు మరియు ఇతరులను కూడా పాపులుగా ఆమోదిస్తాడు. అతను ఇతరుల పాపాన్ని బట్టి వినోదాన్ని పొందుతాడు. రోమా పట్టణ క్రీడా ప్రాంగణాల్లో మనుష్యులను చంపడాన్ని చూసి ప్రజలు అభినందించేవాళ్ళు. ఈ ఆధునిక కాలంలో జీవించే అనేకమంది ప్రజలు హింసను, అనైతికమైన లైంగిక చర్యలను చూస్తూ ఆనందిస్తున్నారు. తాము చేయగలిగిన, చేస్తున్న పాపంలో గొప్పగా రాణిస్తున్న ప్రజలను వాళ్ళు మెచ్చుకుంటారు.

### మారుమనసు పొందని ప్రతిపాపి ఇలానే ఉన్నాడా?

ఈ పాపాలన్నింటిని ప్రతి వ్యక్తి క్రియాశీలకంగా చేయడు. అయితే, పతనమైన మానవజాతి ఈ పాపాలన్నింటిని చేసే ధోరణిని కలిగి ఉంటుంది మరియు ప్రతి వ్యక్తి భిన్నమైన పరిస్థితిలో ఉన్నట్లయితే ఈ పాపాల్లో ఏదో ఒక దానిని చేసే అవకాశం ఉంది.

[22] చాలా గ్రీకు మూల ప్రతులలో, ఈ జాబితాలో ఈ పదం లేదు.

సెనేకా, పౌలు కాలంలో జీవించిన ఒక రోమా తత్వవేత్త మరియు ప్రభుత్వ అధికారి. అతను క్రైస్తవుడు కాడు, బైబిల్ తో పరిచయమున్న వ్యక్తి కూడా కాదు, కానీ పాపం చేసే సామర్థ్యం ప్రతి వ్యక్తిలో ఉందని గమనించాడు. ఆయన ఇలా చెప్పాడు, "ప్రతి మనిషిలో దుర్గుణాలన్నీ ప్రాముఖ్యంగా కనబడకపోయినా, మనుష్యులందరిలో ఈ దుర్గుణాలన్నీ ఉంటాయి."[23] మారుమనసు పొందని పాపిని గురించి పౌలు ఇచ్చిన వివరణ, ప్రతి కాలంలోను, ప్రతి సంస్కృతిలోనూ ఉన్నవారికి వర్తిస్తుందని మనం గమనించవచ్చు.

ప్రభుత్వాలు, సమాజపు ప్రమాణాలు, వ్యక్తుల్లో ఉండే దుష్టత్వపు ధోరణిని చాలావరకు నిరోధిస్తాయి. చాలా మంది ప్రజలు, ఇతరుల అంగీకారం పొందాలని కోరుకుంటారు గనుక వారి పాపపు కోరికలను బహిరంగంగా కనబరచరు గాని వారి హృదయాల్లోనూ, మనసుల్లోనూ వాటిని తీర్చుకుంటారు. ప్రజలు ఇక్కడ పేర్కొన్న పాపాల పట్ల రహస్య ధోరణిని కలిగి ఉండి, తమ హృదయాల్లోని పాపాలను బట్టి అపరాధులవుతారు.

### లేఖన భాగపు అన్వయం

ఈ లేఖన భాగం, సమాజాలలో సువార్త వినని వారిని గూర్చిన ప్రాథమిక వివరణ. ఈ సృష్టిలోనూ, వారి మనస్సాక్షిలోనూ ప్రత్యక్షపరచబడిన దేవుని జ్ఞానాన్ని వారు తిరస్కరించారు. ఆ తరువాత, తమ పాప స్వభావపు కోరికలను నెరవేర్చుకోవడానికి అనుమతించే మరొక దానిని ఆరాధించడం ప్రారంభించారు మరియు వారి కోరికలు వక్రీకరించబడ్డాయి. అలాంటి ప్రజలకు సువార్త ఎందుకు అవసరమో ఈ లేఖనం వివరిస్తుంది.

ఈ లేఖనభాగం ప్రతి ఒక్కరికీ ప్రాముఖ్యం, ఎందుకంటే ఇది అనేక రకాల పాపాల జాబితాను అందిస్తుంది మరియు పాపమంతటిని దేవుడు ద్వేషిస్తాడని చూపిస్తుంది. పాపం, ఒక పాపిని మరింత దుష్టత్వంలోనికి తీసుకెళ్ళే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని హెచ్చరిస్తుంది. సువార్తను విని, దానిని తిరస్కరించే ప్రజలు, మంచి చెడులను గురించి వారి అవగాహనను కోల్పోయే అదే ప్రక్రియ గుండా వెళ్ళే ప్రమాదం ఉంది.

సమాజాలలో సువార్త ప్రకటించినప్పటికీ, మనం మన సమాజాలలో చూసే పరిస్థితులను ఈ లేఖనభాగం వివరిస్తుంది. సంస్కృతి, దేవుని ప్రమాణాన్ని నిర్లక్ష్యం చేసి, కొన్ని పాపాలను అంగీకారయోగ్యంగా చేయడానికి ఒక మార్గాన్ని కనుగొంది.

---

[23] F.F. Bruce, *The Epistle to the Romans*, in *Tyndale Bible Commentaries* (Grand Rapids: William B. Eerdmans Pub. Co., 1963), 87 ద్వారా ఉల్లేఖించబడింది.

## సాక్ష్యం

ష్మాగి తూర్పు ఐరోపాలోని జార్జియా దేశంలో జన్మించారు. ష్మాగి తల్లిదండ్రులు నాస్తికులు, మరియు అతను తన బాల్యంలో చర్చికి వెళ్ళలేదు. అతని పేరుకు "త్వరగా కోపపడువాడని" అర్థం మరియు పేరు అతని స్వభావానికి తగ్గట్లుగా ఉంటుంది. అతను యవ్వనస్తుడిగా తరచుగా ఇబ్బందుల్లో పడేవాడు. అనేక నేరాలకు పాల్పడిన తరువాత, అతన్ని రెండేళ్లపాటు రష్యాలో ఉన్న జైలుకు పంపారు. రష్యాకు వ్యతిరేకంగా జార్జియా తిరుగుబాటు సమయంలో అతను విడుదలై జార్జియాకు తిరిగి వచ్చాడు.

మద్యం వల్ల ష్మాగి కాలేయం బాగా దెబ్బతింది. అతను ఎక్కువ కాలం జీవించడని ఒక వైద్యుడు అతనికి చెప్పాడు. ష్మాగి తన జీవితం పట్ల అసంతృప్తి కలిగినవాడై దేవునిని తెలుసుకోవాలనే కోరికను అనుభవించడం ప్రారంభించాడు. తనను చర్చికి తీసుకెళ్లమని కొంతమంది క్రైస్తవ స్నేహితులను కోరాడు. మొదట, వారు చర్చి ఉన్నది అతని కోసం కాదని చెప్పారు. అతను వాదించనని ప్రమాణం చేస్తే చర్చికి రావచ్చని వారు అతనితో చెప్పారు. అతను చర్చికి వెళ్లి 22 సంవత్సరాల వయస్సులో రక్షణ పొందాడు. అతని జీవితం పూర్తిగా మారిపోయింది.

ష్మాగికి కాలేయ వ్యాధి నయమైంది. తనకున్న వ్యాధిని బట్టి అతను పెళ్లి చేసుకోవాలి ఆశించలేదు, కానీ దేవుడు అతనికి నూతన భవిష్యత్తును ఇచ్చాడు. ఇప్పుడు అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ష్మాగి పాస్టర్ గాను, పరిచర్య కొరకు అనేకులకు శిక్షణనిచ్చే వ్యక్తిగా ఉన్నారు.

## పాఠం 2 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) ఏ మార్గాల ద్వారా ప్రజలు, సాధారణ ప్రత్యక్షతను పొందుతారు?

(2) లేఖనం లేకుండా ప్రజలు దేవుని గురించి ఏం తెలుసుకుంటారు?

(3) ప్రత్యేక ప్రత్యక్షత అంటే ఏమిటి?

(4) విగ్రహారాధన అంటే ఏమిటి?

(5) భ్రష్టత్వం, ప్రజల ఆలోచన విధానాన్ని ప్రభావితం చేసిన రెండు మార్గాలను పేర్కొనండి.

## పాఠం 2 - అభ్యాసాలు

సువార్తను వినకుండా, దేవునిని తిరస్కరించిన సమాజం యొక్క పరిస్థితిని గురించి ఒక పేజీలో రాయండి. దేవుని గురించి ఎలాంటి జ్ఞానాన్ని వాళ్ళు కలిగి ఉన్నారు? వారి ఆలోచనకు ఏమైంది? వారి దుష్టత్వాన్ని వివరించండి. ప్రతి ఒక్కరూ ఒకేవిధమైన దుష్టత్వాన్ని ఎందుకు కనబరచడం లేదో వివరించండి.

# పాఠం 3

# ఇశ్రాయేలీయుల అపరాధం

## అంత్యకాల సంభావాలను గూర్చిన లేఖనాలకు పరిచయం

లోకంలో దుష్టత్వం, అన్యాయం ఉన్నప్పటికీ, విశ్వాసాన్ని కొనసాగించడం యొక్క సమస్యతో అంత్యకాల సంభావాలను గూర్చిన లేఖనాలు వ్యవహరిస్తున్నాయి. ఇది దేవుడు అకస్మాత్తుగా లోకంలో జోక్యం చేసుకొని, దుష్టత్వాన్ని శిక్షించి, తన ప్రజలకు సహాయం చేసే సమయాన్ని గురించి వివరిస్తుంది.[24]

దేవుడు చివరిగా జోక్యం చేసుకొనే సమయాన్ని సూచించడానికి తరచుగా "యెహోవా దినము" అనే మాటను ఉపయోగించారు. కొన్ని పాతనిబంధన లేఖనభాగాలు, ప్రభువు దినాన్ని, అన్యదేశాలు ఇశ్రాయేలుతో వ్యవహరించిన తీరును బట్టి శిక్షించే సమయాన్ని గురించి వివరించాయి.[25] యూదులుగా తాము దేవుని తీర్పును బట్టి భయపడాల్సిన అవసరం లేదని చాలామంది యూదులు భావించడం మొదలుపెట్టారు. వాళ్ళు పాపులుగా జీవిస్తే (జెఫన్యా 1:12, ఆమోసు 5:18-27), దేవుడు వాళ్ళకు కూడా తీర్పు తీరుస్తాడని మరియు వాళ్ళు యూదులైనంత మాత్రాన విడిచిపెట్టడని చూపించడానికి ప్రవక్తలు ప్రయత్నం చేశారు; కానీ వారిలో ఆ భావన అలానే ఉండిపోయింది.

వాళ్ళు కూడా రక్షణపొందాల్సిన అవసరత ఉందనే వాస్తవాన్ని అంగీకరించడం యూదులకు కష్టంగా ఉండేది. ఉదాహరణకు, బాప్తిస్మం అనేది అన్యులను యూదామతంలోనికి తీసుకొచ్చే ఒక సంస్కారంగా వాళ్ళు వాడుకున్నారు. వాళ్ళు యూదులకు బాప్తిస్మమిచ్చేవాళ్ళు కాదు. బాప్తిస్మమిచ్చు యోహాను యూదులకు బాప్తిస్మమిచ్చాడు, అయితే తమకు బాప్తిస్మం లేదా పశ్చాత్తాపం అవసరం లేదని భావించే కొంతమంది యూదులు అతని పద్ధతిని వ్యతిరేకించారు. వాళ్ళు అబ్రహాము సంతానం గనుక (మత్తయి 3:9) వాళ్ళు దేవుని కృపను పొందుతారని భావించేవాళ్ళు.

రోమీయులకు రాసిన పత్రికలో, పౌలు ఉగ్రత దినాన్ని గురించి (2:5) మరియు దేవుడు తీర్పు తీర్చే దినాన్ని గురించి ప్రస్తావించాడు (2:16). ఈ రిఫరెన్స్‌లు, 1:16-18లో దేవుని ఉగ్రత నుండి తప్పించబడడమే రక్షణ అని చెప్పే సువార్తను

---

[24] పాత నిబంధనలో అంత్యకాల సంభవాలను గురించి లేఖనాలను దానియేలు, జెకర్యా, యోవేలు, యెహెజ్కేలు 37-39 మరియు యెషయా 24-27లో చూస్తాం. క్రొత్త నిబంధనలో, మనం మత్తయి 24, లూకా 21, మార్కు 13, 2 థెస్సలొనీకయులకు 2 మరియు ప్రకటనలో చూస్తాం.

[25] జెకర్యా 12 మరియు యోవేలు 3 కొన్ని ఉదాహరణలు.

అనుసరిస్తాయి. 2:2-3లో స్వనీతితో జీవించే యూదులు కూడా ప్రభువు దినాన్ని బట్టి భయపడడానికి ఒక కారణం ఉందనే వాస్తవాన్ని చెప్పడం ద్వారా వారిని దిగ్భ్రాంతికి గురి చేశాడు. యూదులకు కూడా రక్షణ కావాలి.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 2వ లేఖన భాగం**

ఈ పాఠంలో, రోమీయులకు రాసిన పత్రిక యొక్క 2వ భాగాన్ని అధ్యయనం చేయడం కొనసాగిస్తాం. గత పాఠంలో, అన్యుల అపరాధాన్ని వివరించిన లేఖనాన్ని మనం అధ్యయనం చేశాం. ఈ లేఖనం (2:1-29) ఇశ్రాయేలీయుల అపరాధాన్ని వివరిస్తుంది.

2వ భాగం, 1:18-3:20 వరకు ఉంటుంది. లోకంలో ఉన్న వాళ్ళందరూ దేవుడు కోరిన వాటిని ఉల్లంఘించి/అతిక్రమించి శిక్షావిధి క్రింద ఉన్నారనేది 2వ భాగం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దేవుడు ఆశించిన వాటిని చేయడం ద్వారా ఏ వ్యక్తి రక్షణ పొందడు, ఎందుకంటే ప్రతి వ్యక్తి ఇప్పటికే వాటిని అతిక్రమించాడు.

మొదటిగా, అన్యులు దేవుని జ్ఞానాన్ని తృణీకరించి, విగ్రహాలవైపుకు, పాప కోరికలవైపుకు తిరిగారని పౌలు వివరించాడు. ఆ తరువాత, దేవుని ధర్మశాస్త్రం కలిగి, దానికి విధేయత చూపని ఇశ్రాయేలీయుల పరిస్థితిని గురించి వివరించాడు. ఇప్పుడు మనం ఇశ్రాయేలీయులను గూర్చిన లేఖన భాగాన్ని అధ్యయనం చేస్తాం.

ఇక్కడ పౌలు ప్రథమ పురుషం (వాళ్ళు) నుండి మధ్యమ పురుషానికి (మీరు) మారాడు. తాము ఇప్పటికే నీతి యొక్క ప్రామాణికతను చేరుకున్నామని, సువార్త తమకు వర్తించదని భావించే ప్రజలతో అతను మాట్లాడుతున్నాడు. చాలామంది యూదులు ఆ కోవకు చెందినవారే మరియు ఈ భాగం ప్రత్యేకంగా వారిని గురించి మాట్లాడుతుంది (2:17); కానీ ఉన్నతస్థాయి నైతికత కలిగిన అన్యులు కూడా అదే అపరాధంలో ఉన్నారు. కృప లేకుండా తాము నీతిమంతులమని ఆలోచించే వ్యక్తులు, వేషధారులని, అపరాధులని ఆయన చూపిస్తున్నాడు.

**2వ అధ్యాయం యొక్క ప్రధానాంశం**

అన్యులు చేసిన అవే పాపాల విషయంలో యూదులు కూడా దోషులే, మరియు వాళ్ళను కూడా దేవుడు అదేవిధంగా తీర్పుతీరుస్తాడు.

**2వ అధ్యాయం యొక్క సారాంశం**

2:1, 11 వచనాలు, ప్రధానాంశాన్ని నిర్మిస్తాయి. యూదులు కూడా సమానంగా అపరాధులని 2:1 చెబుతుంది; 2:11, దేవుడు నిష్పక్షపాతి అని చెబుతుంది. మిగిలిన అధ్యాయమంతా ఈ వచనాలలోని ప్రకటనలకై సందర్భాన్ని నిర్మిస్తాయి. అన్యులు నిరుత్తరులై ఉన్నట్లుగానే (1:20), వాళ్ళు కూడా క్షమించరాని వారిగా ఉన్నారు.

2:13,17 వచనాలు, యూదులు ఎందుకు కృపపొందడానికి ఆశిస్తున్నారో చూపిస్తాయి - ఎందుకంటే వాళ్ళు దేవుని ప్రత్యక్షతను పొందారు, దానిపైనే వారి మతం ఆధారపడి ఉంది. రోమా 1లో, అన్యులు తీర్పుకు అర్హులనే వాస్తవాన్ని స్థాపించాడు. ప్రతి యూదుడు దీనితో ఏకీభవిస్తాడు. కానీ 2:1లో, పౌలు యూదుల అపరాధాన్ని బహిర్గతం చేయడం ద్వారా వారిని భయపెట్టాడు. వాళ్ళు కూడా ధర్మశాస్త్రాన్ని అతిక్రమించి, అన్యులు పొందినట్లే అదే తీర్పును పొందనర్హులయ్యారు! ఎందుకంటే వాళ్ళు దేవుని ధర్మశాస్త్రాన్ని అంగీకరించిన, నిజమైన మతాన్ని కలిగిన యూదులు కనుక వారు తప్పించబడతారని, క్షమాపణ పొందుతారని భావించారు.

నేటి దినాన లక్షలమంది ప్రజలు ఇదే కోవకు చెందిన వారు. దేవుని యందు విశ్వాసముంచి, మతపరమైన విధానాలను అనుసరించడం వలన దేవుడు వారిని అంగీకరించడని భావిస్తూనే, పాపంలో కొనసాగుతూ ఉంటారు.

► మీ సమాజంలో కూడా తాము క్రైస్తవులమని పొరపాటుపడే వ్యక్తులు అనేకమంది ఉన్నారా? వాళ్ళు ఎందుకలా అనుకుంటున్నారు?

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 2:1-29 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**


(2:1) యూదులు నిరుత్తరులై ఉండడం అనేది, నిరుత్తరులై ఉన్న అన్యుల పరిస్థితికి అనుగుణంగా ఉంది (1:20). ఆ ఆలోచన, తాను మంచివాడనని ఆలోచించే ఆధునిక మనుష్యునికి దిగ్భ్రాంతిని కలిగించినట్లే స్వనీతి కలిగిన యూదునికి కూడా కలిగిస్తుంది.

ఇతరులకు తీర్పు తీర్చడం ద్వారా, తమకు తామే తీర్పు తీర్చుకుంటున్నారు, ఎందుకంటే వాళ్ళు కూడా అవే పాపాల విషయమై అపరాధులుగా ఉన్నారు. సత్యాన్ని గూర్చిన వారి జ్ఞానం, వారి బాధ్యతను పెంచింది. ఇశ్రాయేలులో ఉన్న కొన్ని పట్టణాలు, సొదొమ గొమొర్రా పట్టణాలకు మించిన తీర్పును పొందుతాయని యేసు చెప్పాడు (మత్తయి 11:21-24).

ఈ వచనం, తాను ఇతరులకు తీర్పు తీర్చగలనని అనుకుంటూ, తనని తాని నిర్దోషిగా తీర్చుకుంటానని భావించే వ్యక్తిని సూచిస్తోంది. మిగిలిన అధ్యాయమంతా దేవునిని న్యాయాధిపతి పాత్రలో ఉంచి, తమకు మేలు చేసే విధంగా తీర్పు తీర్చే వారి నుండి తన తీర్పు ఎలా భిన్నంగా ఉందో చూపిస్తుంది.

(2:2-3) దేవుని తీర్పు సంపూర్ణ ప్రమాణానికి అనుగుణంగా ఉంటుంది. మనుషులు మారిపోయే, సరిగాలేని ప్రమాణాలను బట్టి దేవుడు తీర్పు తీర్చడు.[26]

(2:4) దేవుడు యూదుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచాడు, కాబట్టి ఆయన వారికి అనుకూలంగా న్యాయాన్ని మారుస్తాడని ఆలోచించారు. వాస్తవానికి, వారి పట్ల న్యాయాన్ని రద్దు చేయడానికి కాదు కానీ, వారిని పశ్చాత్తాపంలోనికి నడిపించడానికి ఆయన మంచితనాన్ని/దయను వారిపట్ల కనబరిచాడు. చాలా మంది దేవుని మంచితనాన్ని కేవలం ఔదార్యంగా, సహనంగా పరిగణించి తృణీకరించారు. లోకానుసారమైన వ్యక్తి, దేవుని నుండి పాపాన్ని సహించడంతో పాటు భౌతికమైన/లౌకికమైన ప్రయోజనాన్ని కూడా ఆశిస్తాడు. దేవుని మంచితనాన్ని ఈ విధంగా చూడడం అంటే దానిని తృణీకరించడమే. దేవుని గురించి తెలిసిన వారు మరింతగా అపరాధులు అవుతారు, ఎందుకంటే ఆయన మంచితనం వారికి పశ్చాత్తాపపడే అవకాశాన్ని ఇస్తుంది.



**నీరో**

నీరో క్రీ.శ. 54-68లో చక్రవర్తిగా ఉన్నాడు. పౌలు రోమాకు వెళ్ళినప్పుడు, ఇతను అధికారంలో ఉన్నాడు. ఇతను అత్యంత కిరాతకుడు/క్రూరమైన వ్యక్తి మరియు యూదులను, క్రైస్తవులను ద్వేషించాడు. నీరో, తన ఉద్యానవనంలో వెలుగు కోసం కొన్నిసార్లు క్రైస్తవులను కాల్చాడని ఆదిమ చరిత్ర కారులు రాశారు.

(2:5) వాళ్ళు పశ్చాత్తాపపడకుండా, పాపంలో కొనసాగుతూ ఆలస్యం చేసే సమయం, ఉగ్రతను నిల్వచేస్తుంది. వాళ్ళకు సత్యం తెలుసు కనుక, వాళ్ళు మరింతగా జవాబుదారీతనం కలిగి ఉన్నారు, తద్వారా వారి అవిధేయతకు వ్యతిరేకంగా దేవుని ఉగ్రత పెరుగుతుంది.

(ఈ అధ్యాయంలో మిగిలిన భాగాన్ని అర్థం చేసుకోవడానికి క్రింది విభాగం ప్రాముఖ్యం.)

## క్రియల/చర్యల తీర్పు

► మనం తీర్పునొద్దకు వచ్చినప్పుడు, భూమిపై మనం చేసిన పనులు ప్రాముఖ్యమా?

[26] చిత్రం: "Nero", డిసెంబర్ 24, 2011న David Jones అప్లోడ్ చేశాడు, https://flickr.com/photos/cloudsoup/6564103675/, నుండి తీసుకున్నారు, CC BY 2.0, లైసెన్స్ క్రింద, అసలు దాని నుండి కత్తిరించారు.

అంతిమ తీర్పనేది, క్రియల మూల్యాంకనం. ప్రజలు చేసిన క్రియలకు అనుగుణంగా దేవుడు వారిని శిక్షిస్తాడు మరియు బహుమానం/ప్రతిఫలమిస్తాడు. భిన్నమైన వ్యక్తులకు భిన్నమైన స్థాయిలో శిక్ష మరియు బహుమానం ఉంటాయి (హెబ్రీయులకు 2:2; హెబ్రీయులకు 10:28-29; మత్తయి 10:42; లూకా 12:47-48, 2 కొరింథీయులకు 5:10).

పాపులు కేవలం తమ అవిశ్వాసాన్ని బట్టే శిక్షించబడతారనే ఆలోచన లేఖనానుసారమైనది కాదు. ప్రకటన గ్రంథం 20:12లో, ప్రజలు వారు చేసిన పనులను బట్టి తీర్పుపొందుతారు. 2 కొరింథీయులకు 5:10వ వచనం, విశ్వాసులతో పాటు మనమందరం మన క్రియలను బట్టి తీర్పుపొందుతామని చెబుతుంది. 1 కొరింథీయులకు 3:12-15 వచనాలు, క్రైస్తవులు వారి వైఖరులను బట్టి, ప్రయత్నాలను బట్టి, శ్రద్ధను బట్టి, వారి పని యొక్క నాణ్యతను బట్టి (బంగారం, వెండి, వెలగల రాళ్ళు; కర్ర, కొయ్యకాలు, గడ్డి) బహుమానాలు పొందుతారని చూపిస్తోంది. క్రైస్తవులందరూ బహుమానాలు పొందుతారు, ఎందుకంటే నిజమైన క్రైస్తవులందరూ సత్క్రియలు చేస్తారు, కానీ వారు చేసిన పనులన్నీ సమానమైన విలువను పొందవు. నాణ్యతా పరీక్షను నెగ్గని/ పరీక్షకు నిలవని విశ్వాసుల క్రియలు అగ్ని చేత కాల్చివేయబడతాయి.

రోమా 2వ అధ్యాయం, క్రొత్త నిబంధన సువార్తను వినని వారు, తమ క్రియలను బట్టి శిక్షించబడరని సూచిస్తోంది (2:7, 10, 13, 26-27 చూడండి). అసలు పాపం చేయని కొంతమంది వ్యక్తులు ఉన్నారని, వాళ్ళు కృప లేకుండా కేవలం క్రియల చేతనే అంగీకరించబడతారనేది దీనర్థం కాదు; ఎందుకంటే 3:19-20 వచనాలు, అందరూ పాపం చేశారని చెబుతోంది. తమ క్రియలను బట్టి అంగీకరించబడిన ప్రజలు, హృదయపు సున్నతి అని పిలవబడే కృపను అనుభవించిన ప్రజలు. వారి క్రియలను దేవుడు ఆమోదించాడు (2:29).

హృదయంలో జరిగే ఈ కృపాకార్యం, పాతనిబంధన కాలంలోనే వాగ్దానం చేయబడింది:

> నీవు బ్రదుకుటకై నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను, నీ దేవుడైన యెహోవాను ప్రేమించునట్లు నీ దేవుడైన యెహోవా తనకు లోబడుటకు నీ హృదయమునకును నీ సంతతివారి హృదయమునకును సున్నతి చేయును. (ద్వితీయోపదేశకాండము 30:6).

కాబట్టి, ప్రాచీన కాలంలోనున్న యూదులు, క్రియలను బట్టి కాక, కృపను బట్టి రక్షణ పొందారని మనకు తెలుసు.

అన్యులు, ప్రత్యేక ప్రత్యక్షతను పొందినా, పొందకపోయినా, వారికి కృప అందుబాటులో ఉంది.

> అందుకు పేతురు నోరు తెరచి ఇట్లనెను: “దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును” (అపొస్తలుల కార్యములు 10:33-35).

నీతి క్రియలు, హృదయంలో కలిగిన మార్పుని, దేవుని పట్ల విధేయతను నిరూపిస్తాయి. ఈ ఋజువు రోమా 2:13, 16లో మాట్లాడిన అంతిమ తీర్పునొద్ద జరిగే అంతిమ నీతిమంతులుగా తీర్చబడుటకు ఆధారం.

ఈ లేఖన భాగం, ఒక వ్యక్తి క్రియల ద్వారా రక్షించబడతాడని బోధించడం లేదు, కానీ ధర్మశాస్త్రం కలిగి ఉండడం మాత్రమే సరిపోదు కానీ, నిజమైన విధేయత ప్రాముఖ్యమైంది. ఇది ఈ లేఖన భాగం చెప్పే "యూదులు కూడా అవిధేయత చూపారు కాబట్టి వారికి కూడా రక్షణ అవసరం" అనే అంశాన్ని బలపరుస్తుంది.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 2వ లేఖన భాగం

### వచనాల వారీ వివరణ కొనసాగింపు

(2:7) దేవునిని సంతోషపెట్టే క్రియలు చేయడంలో కొనసాగడం ద్వారా, దేవుని నుండి వచ్చే ఘనతను వెదికే వారికి దేవుడు నిత్యజీవమిస్తాడు.

(2:9) ఇక్కడ మనం, యూదులకు ఉన్న విశేషాధికారాలు, వారికి మరింతగా జవాబుదారీతనాన్ని కలిగిస్తాయని చూశాం. సువార్త మొదటిగా యూదుల దగ్గరకే వచ్చింది కనుక, వారే మొదటి తీర్పుకు అర్హులు.

(2:11) ఇది ఈ అధ్యాయంలోనే కీలక వచనం. దేవునికి విరోధంగా తిరుగుబాటు చేస్తూ, ధార్మికంగాజీవించేవాళ్ళు తీర్పుతీర్చబడతారు. వారు ధార్మికంగా ఉన్నంత మాత్రమున అనుగ్రహాన్ని సంపాదించుకోలేరు.

## యాకోబు నుండి ఒక దృక్కోణం

ఒక వ్యక్తి విశ్వాసం ద్వారా మాత్రమే కాదు గాని, క్రియల ద్వారా కూడా నీతిమంతునిగా తీర్చబడతాడని (యాకోబు 2:24) చెప్పాడు. కానీ ఎఫెసీ 2:8లో పౌలు మనం క్రియల ద్వారా కాదు కానీ కృప చేతనే రక్షించబడ్డామని చెప్పాడు. రోమా 3:28లో, ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున కాక, విశ్వాసం ద్వారానే రక్షించబడ్డారని చెప్పాడు.

కాబట్టి, మనం విశ్వాసం మరియు క్రియల ద్వారా నీతిమంతులుగా తీర్చబడ్డామా లేదా కేవలం విశ్వాసం ద్వారానే నీతిమంతులుగా తీర్చబడ్డామా? యాకోబు, పౌలు ఒకరినొకరు వ్యతిరేకించుకొంటున్నారా? లేదు, ఎందుకంటే వాళ్ళిద్దరూ ఒకే విషయాన్ని గురించి మాట్లాడడం లేదు.

ఒక వ్యక్తి దేవుని ఎదుట ఎలా నీతిమంతునిగా తీర్చబడతాడనే విషయాన్ని గురించి పౌలు మాట్లాడుతున్నాడు. ఒక వ్యక్తి విశ్వాసం ద్వారా కృప చేతనే నీతిమంతునిగా తీర్చబడతాడు.

ఒక వ్యక్తి ఇతర ప్రజల ఎదుట ఎలా నీతిమంతునిగా తీర్చబడతాడనే విషయాన్ని గురించి యాకోబు మాట్లాడుతున్నాడు. **ఒక నమ్మకమైన జీవితాన్ని జీవించడం ద్వారా తాను రక్షణార్థమైన విశ్వాసాన్ని కలిగి ఉన్నానని చూపిస్తున్నాడు.**

నిజమైన విశ్వాసం, అనుదిన జీవితానికి వర్తిస్తుందని నిరూపించడమే యాకోబు పత్రిక యొక్క ప్రధానాంశం. అబ్రాహాము క్రియల ద్వారా నీతిమంతునిగా తీర్చబడ్డాడని అతను చెప్పాడు. ఒక వ్యక్తి విశ్వాసం మరియు క్రియల ద్వారా నీతిమంతుడని చూపబడతాడు. ఒక వ్యక్తి తాను క్రైస్తవుడనని చెబుతూ, క్రైస్తవునికి తగినట్లుగా జీవిస్తుంటేనే క్రైస్తవుడవుతాడని మనకు తెలుసు.

సత్క్రియలు, విశ్వాసాన్ని అనుసరిస్తాయని కూడా పౌలు రూఢిగా చెబుతున్నాడు. ఎఫెసీ 2:10లో, మనం విశ్వాసం ద్వారా రక్షించబడ్డామని చెప్పిన వెంటనే, మనం సత్క్రియలు చేయడం కొరకే క్రీస్తునందు సృష్టించబడ్డామని పౌలు చెప్పాడు.

యాకోబు, పౌలు ఒకరినొకరు వ్యతిరేకించుకోవడం లేదు. వాళ్ళిద్దరూ, రక్షణార్థమైన విశ్వాసం, ఒక వ్యక్తిని దేవునికి అంగీకారయోగ్యంగా చేస్తుందని, మారుమనసు పొందిన తరువాత చేసే క్రియలు ఆ వ్యక్తి రక్షించబడ్డాడనే విషయాన్ని వెల్లడి చేస్తాయని అంగీకరిస్తున్నారు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 2వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(2:12) ధర్మశాస్త్రాన్ని ఎప్పుడూ వినని వారిని తీర్పు తీర్చడానికి అది ప్రామాణికంగా ఉండదు. దేవుడు ఇతర మార్గాలలో ప్రత్యక్షపరచిన ధర్మశాస్త్రం ద్వారా వాళ్ళు శిక్షపొందుతారు. (1:20, 2:15 చూడండి).

(2:13) వాళ్ళు నీతిమంతులుగా తీర్చబడతారనేది అంతిమ తీర్పును సూచిస్తుంది. కొంతమంది ప్రజలు, తాము ధర్మశాస్త్రాన్ని కలిగి ఉన్నందున నీతిమంతులుగా తీర్చబడతామని ఆశిస్తారు. కానీ విధేయత లేకుండా ధర్మశాస్త్రాన్ని గూర్చిన జ్ఞానాన్ని కలిగి ఉండడం నీతిమంతులుగా తీర్చదు.

(2:14) స్వభావాన్ని బట్టి వాళ్ళు సరైంది చేయొచ్చు, కానీ దేవుడు లేకుండా స్వభావసిద్ధంగా మంచివారు కాదనేది వాస్తవం. దేవుడు వారి హృదయాలలోనూ, మనస్సాక్షిలోనూ రాసిన ధర్మశాస్త్రాన్ని బట్టి వాళ్ళు సరైనది చేయగలరని 2:15వ వచనం చూపిస్తోంది. "స్వాభావికంగా" అంటే దేవుడు లిఖితపూర్వక లేఖనం లేకుండా వారి స్వభావంలో ప్రత్యక్షపరచిన దాని ద్వారా చేస్తున్నారని అర్థం.

(2:15) లిఖితపూర్వక ధర్మశాస్త్రం లేని వాళ్ళు, వాళ్ళ నైతిక స్వభావంలో ధర్మశాస్త్రాన్ని కలిగి ఉన్నారు మరియు నిర్దిష్టమైన ఎంపికలు చేసుకోగలరు. దీనర్థం మనస్సాక్షి పూర్తిగా నమ్మదగినది/ఆధారపడదగినదని కాదు. తమ చుట్టూ ఉన్న పరిస్థితులను బట్టి, చదువును బట్టి ప్రభావితమైన మనస్సాక్షి, ప్రతి విషయంలో ఖచ్చితమైంది కాదు; కానీ సాధారణంగా సరైన దానివైపుకు నడిపిస్తుంది. అయితే, చివరికి ఆ ప్రమాణాన్ని బట్టి, ప్రజలందరూ పాపులు, ఏది సరైందో వారికి తెలిసినా, ఎప్పుడూ దానిని చేయలేదు.

2:15, 16 వచనాలు, బాహ్యాపరమైన క్రియలు మాత్రమే కాదు గాని, వైఖరులు కూడా తీర్పునొందుతాయని తెలియజేస్తున్నాయి. (ఈ వచనాలు, హృదయం, ఆలోచనలు, మనస్సాక్షి మరియు రహస్యాలను గురించి మాట్లాడుతున్నాయి).

(2:16) ఈ లేఖనభాగంలో చర్చించిన నీతిమంతులుగా తీర్చబడుట (2:13లో ప్రస్తావించబడింది) విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడానికి ప్రత్యామ్నాయం కాదు. ఇది, అంతిమ తీర్పులో నీతిమంతులుగా ధృవీకరించబడే అంతిమ నీతిమంతులుగా తీర్చబడుటగా ఉంది.

**తీర్పును గూర్చిన ఈ సూత్రాలు/నియమాలు పౌలు ప్రకటించిన సువార్తకు ప్రాముఖ్యం. క్షమాపణ పొందని వారిపైకి వచ్చే దేవుని తీర్పును గూర్చిన అవగాహన లేకుండా, క్షమాపణను గూర్చిన సువార్త ప్రాముఖ్యమైంది కాదు. దేవుని న్యాయాన్ని గూర్చిన సరైన దృక్పథాన్ని బలహీనపరిచే ఏ దోషమైనా, సువార్తను కూడా బలహీనపరుస్తుంది.**

### సువార్త అందని అన్యులకు నిరీక్షణ (Hope for the Unreached Heathen)

► సువార్త వినని అన్యులకు ఏం జరుగుతుంది? ఉత్తమమైన దానిని గురించి వారికి తెలియకపోతే, పాపం విషయమై తీర్పుకు ఎలా అర్హులవుతారు?

కొంతమంది సరైంది చేయాలని నిర్ణయించుకున్నారని, తద్వారా శిక్షను పొందలేదని రోమా 2:14-15 సూచిస్తుంది. అయితే, ఏ వ్యక్తి క్రియల మూలమున రక్షణ పొందడు. ప్రతి ఒక్కరూ ధర్మశాస్త్రాన్ని మీరి/అతిక్రమించి, తీర్పుకు లోనయ్యారు/అర్హులయ్యారు (3:9-10, 19-20). ఏ వ్యక్తి తన క్రియల యోగ్యతను బట్టి రక్షణ పొందడు. కాబట్టి సువార్తీకరించబడని వ్యక్తి రక్షించబడినట్లయితే, అతను సువార్త వినకపోయినప్పటికిని ప్రాయశ్చిత్తం ద్వారా, కృప చేతనే రక్షణ పొందుతాడు.

ఒక వ్యక్తి దేవునికి భయపడినట్లయితే, తనతో సంబంధంలోనికి రావడానికి దేవుడు ఒక మార్గాన్ని చూపుతాడు. కీర్తనలు 25:14 వచనం, "యెహోవా మర్మము ఆయనయందు భయభక్తులు గల వారికి తెలిసియున్నది ఆయన తన

నిబంధనను వారికి తెలియజేయును" అని చెబుతుంది. దేవుని నిబంధన, ఆయనతో సంబంధానికి ఏం కావాలో చూపిస్తుంది/చెబుతుంది. ప్రజలందరూ పాపం చేశారు కనుక దేవునితో సంబంధానికి కృప కావాలి.

లేఖనం లేకున్నా, దేవునిని ఎరిగిన యోబు, బాలాము, నోవహు వంటివారు ఉన్నారు. తరువాతి కాలంలో ఇశ్రాయేలు ద్వారా దేవుడు చేసిన దానితో తనకు ఎలాంటి సంబంధం లేకపోయినప్పటిని మెల్కీసెదెకు దేవునికి యాజకుడిగా ఉన్నాడు. దేవుడు, ఏ సంస్కృతిలోనైనా, ఏ సమయంలోనైనా తనని తాను బయలుపరచుకోగలడు (కీర్తనలు 19:1-4, రోమా 10:18 కూడా చూడండి). రోమా 1లో ఉన్న విగ్రహారాధకులు, దేవుని గురించి తెలియకపోవడాన్ని బట్టి కాదు కానీ వారికి తెలిసిన సత్యాన్ని తృణీకరించినందువలన భ్రష్టత్వపు స్థితిలో ఉన్నారు.

ఒక అన్యుడు సువార్తను వినకుండా రక్షణ పొందుతాడా? ఒక వ్యక్తి, తాను కలిగి ఉన్న సత్యాన్ని అనుసరిస్తే, క్షమాపణను వెదకడానికి, దానిని కనుగొనడానికి తగినంత అవగాహనకు దేవుడు అతనిని నడిపిస్తాడు. అది కృప ద్వారా రక్షణ పొందడమే గాని, క్రియల ద్వారా రక్షణ పొందడం కాదు. ఇది అనేక ఇతర మతాలు చెప్పే క్రియల ద్వారా రక్షణ అనే ఆలోచనకు భిన్నమైంది.

కాబట్టి, ఒక వ్యక్తి సువార్త వినకుండా కూడా రక్షణపొందగలిగితే, మనం అత్యవసరంగా/అగత్యంగా సువార్త ప్రకటించవలసిన అవసరం ఏముంది? రాబోవు వచనాల్లో ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది.

### లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 2వ లేఖన భాగం

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(2:17-20) యూదులు, వేషధారులు, ఎందుకంటే వాళ్ళు ధర్మశాస్త్రాన్ని అతిక్రమిస్తూ, దానిని బోధిస్తారు. వాళ్ళు ధర్మశాస్త్రాన్ని కలిగిన వారిగా, సరైన దానిని వివేచించేవారిగా, అజ్ఞానులకు బోధించేవారిగా తమ పాత్రను **అనుభవించారు**. వాళ్ళు గొప్పగా చెప్పుకొనే ప్రకటనల జాబితాను పౌలు వ్యంగ్యంగా ప్రస్తావిస్తున్నాడు.

ఎంతో భక్తిహీనంగా మారుతున్న సమాజంలో బైబిల్ ఎంతో ఎక్కువగా అమ్ముడుపోతున్న పుస్తకం. ప్రజలు, దేవుని ధర్మశాస్త్రానికి విధేయత చూపకపోయినా, దానిని కలిగి ఉండడంలో విలువను చూస్తున్నారని ఇది తెలియజేస్తుంది.

**ప్రజలు, దేవునితో సంబంధం యొక్క ఆధ్యాత్మిక వాస్తవికతను కోల్పోయిన తర్వాత, వారి పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఏదో ఒక రకమైన మతాన్ని కలిగి ఉంటారు.**

(2:21-24) ధర్మశాస్త్రంతో అన్యులను నిందించడంలో యూదులు ఆనందిస్తారు, కానీ వాళ్ళు మాత్రం సంపూర్ణంగా దానికి లోబడరు. వాళ్ళు గొప్ప ఆధ్యాత్మిక స్థాయిని ప్రకటించుకుంటూ, పాపంలో జీవించడం ద్వారా దేవునిని

అగౌరవపరుస్తారు. అదేవిధంగా, క్రైస్తవులు తాము నమ్ముతున్నామని చెప్పుకునే వాటి విషయంలో మంచి మాదిరిని చూపించలేరనేది, క్రైస్తవ మతానికున్న అత్యంత సాధారణ అభ్యంతరం.

(2:25) వాళ్ళు ధర్మశాస్త్రమంతటికి లోబడకుండా, సున్నతిని ఆధారం చేసుకొని దేవుని ఎదుట నీతిమంతులమని ప్రకటించుకోలేరు. వాళ్ళు ధర్మశాస్త్రాన్ని అతిక్రమించినట్లయితే, వాళ్ళు సున్నతిలేని వంటివారే.

### సున్నతి అను పదం

► సున్నతి దేన్ని సూచిస్తుంది?

యూదులు, లోకంలో రెండు తరగతుల ప్రజలను చూశారు: దేవుని నిబంధనలో భాగంగా ఉండడానికి అర్హతపొందిన వాళ్ళు మరియు అర్హత పొందని వాళ్ళు. సున్నతి అనేది ఇశ్రాయేలీయులకు, దేవునికి మధ్య నిబంధనకు గుర్తుగా ఇవ్వబడింది, కానీ కాలక్రమేణా నిబంధనకు అవసరమైన వాటన్నింటిని సూచిస్తుంది. కాబట్టి, యూదులు లోకంలో ఉన్న రెండు తరగతుల ప్రజలను *సున్నతి పొందినవాళ్ళు, సున్నతి పొందని వాళ్ళు* అని పిలుస్తారు. పౌలు ఉద్దేశ్యంలో సున్నతి పొందడం అంటే నిబంధనలో భాగంగా యూదా మతం యొక్క వ్యవస్థనంతటిని అనుసరించడమని అర్థం. (ఈ పదాన్ని ఉపయోగించిన ఉదాహరణ కొరకు గలతీయులు 5:2-3 చూడండి.) ఆ భావనలో సున్నతి పొందడం అంటే కృప ద్వారా కాక, క్రియల ద్వారా రక్షణ పొందే ప్రయత్నం చేయడం.

### లేఖన అధ్యయనం - రోమా పత్రిక 2వ భాగం, 2వ లేఖన భాగం

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(2:26) సున్నతి పొందని ఒక వ్యక్తి, ధర్మశాస్త్రం యొక్క ఉద్దేశ్యాలను నెరవేరిస్తే, అతనికి సున్నతి లేనందువలన దేవుడు అతనిని శిక్షించడు/ఖండించడు.

(2:27) నీతిమంతుడైన అన్యజనునికి, పాపియైన యూదునికి మధ్య వ్యత్యాసాన్ని బట్టి, అతను యూదా మతం యొక్క రూపాలను కలిగి ఉన్నప్పటికీ, యూదుడు దోషి అని చూపిస్తుంది. అదే కోణంలో, నోవహు తన నీతి ద్వారా ప్రపంచాన్ని ఖండించాడు ఎందుకంటే అతను నిజమైన విధేయత ఏమిటో చూపించాడు (హెబ్రీయులు 11:7).

(2:28-29) సున్నతి అనేది యూదుడికి గుర్తింపు చిహ్నంగాను, అతను దేవుని ప్రజలలో ఒకడనుటకు రుజువుగాను ఉంది. ద్వితీయో. ద్వితీయోపదేశకాండము 30:6లోను, కొత్త నిబంధనలో అనేక చోట్ల సున్నతి, ఒక పాపి హృదయమును మార్చి, దేవుని ప్రేమించి, ఆయన యెడల విధేయత చూపునట్లుగా చేయు పరిశుద్ధాత్ముని కార్యమును సూచిస్తుంది. ఒక క్రైస్తవునికి సున్నతి యొక్క ప్రాముఖ్యత ఇదే.

► బృందం కొరకు ఒక విద్యార్థి ద్వితీయోపదేశకాండము 30:6 వచనం చదవాలి.

దేవుడు, ప్రాచీన కాలంలోనున్న ఇశ్రాయేలీయులకు, వారి హృదయాలలో కృపా కార్యాన్ని చేస్తానని వాగ్దానం చేశాడు. ఇది కేవలం వారి సంతానానికి మాత్రమే కాదు, కానీ ఆ సమయంలో సందేశాన్ని వినే ప్రజలందరికీ వర్తిస్తుంది.

ఈ అధ్యాయంలో వర్ణించబడిన వ్యక్తి లేఖనం తెలియపోయినా, నీతి కార్యాలు చేస్తాడు. ఈ వ్యక్తి తన యొద్దనున్న సత్యాన్ని అంగీకరించడం ద్వారా, విశ్వాసం ద్వారా కృపను పొందుతాడు.

## యెషయా నుండి ఒక దృక్కోణం

దేవుడు ఎల్లప్పుడూ సాంప్రదాయికమైన, ఆచారసంబంధమైన జీవితం కంటే హృదయపూర్వకమైన విధేయతను కోరుకుంటాడు మరియు ప్రతి దేశానికి చెందిన ప్రజలకు కృపను చూపుతాడు. యెషయా 56:6-7 లో ఉన్న వచనాలను గుర్తించండి.

> విశ్రాంతిదినమును అపవిత్రపరచకుండ ఆచరించుచు నా నిబంధనను ఆధారము చేసికొనుచు యెహోవాకు దాసులై యెహోవా నామమును ప్రేమించుచు ఆయనకు పరిచర్య చేయవలెనని ఆయన పక్షమున చేరు అన్యులను నా పరిశుద్ధ పర్వతమునకు తోడుకొని వచ్చెదను. నా ప్రార్థన మందిరములో వారిని ఆనందింపజేసెదను నా బలిపీఠముమీద వారర్పించు దహనబలులును బలులును నాకు అంగీకారములగును నా మందిరము సమస్తజనులకు ప్రార్థనమందిరమనబడును.

## పాఠం 3 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) అంత్యకాల సంభవాలను గూర్చిన లేఖనం దేనిని వివరిస్తుంది?

(2) తాము దేవుని కృపను పొందుతామని యూదులు ఎందుకు ఆశించేవాళ్ళు?

(3) ఒక వ్యక్తి నీతిమంతునిగా ఎలా చేయబడతాడు?

(4) ఒక వ్యక్తి తనకు రక్షణార్థమైన విశ్వాసం ఉందని ఎలా చూపిస్తాడు?

(5) సున్నతి, ఒక యూదునికి ఏం సూచిస్తుంది మరియు ఒక క్రైస్తవునికి ఇది దేనికి సాదృశ్యరూపకంగా ఉంటుంది?

## పాఠం 3 - అభ్యాసాలు

తాము దేవునిచేత అంగీకరించబడతామని తప్పుగా భావించే యూదుల యొక్క తప్పుడు ఆలోచనను గురించి ఒక్క పేజీలో వివరించండి. ఈరోజుల్లో కూడా అదే విధమైన తప్పుడు ఆలోచనతో ఉన్న వ్యక్తులను వివరించండి.

# పాఠం 4

# సార్వత్రిక పరిస్థితులు

### రక్షణకు నడిపించే కృప (The Grace That Leads to Salvation)

బలిని అర్పించినప్పటికీ, తన హృదయంలో దేవుని కృప పనిచేయకపోతే పాపి నిరాశలోనే ఉంటాడు. పాపియైన వ్యక్తి, సాతాను అధికారం క్రింద జీవిస్తూనే, చెడు కోరికలతో నియంత్రించబడుతూ, పాపంలో ఆత్మీయంగా చనిపోయిన స్థితిలో ఉంటాడు (ఎఫెసీయులకు 2:1-3). అతను తన ప్రవర్తనను మార్చుకోవడానికి శక్తి లేనివాడు (రోమా 7:18-19). అలాంటి వ్యక్తి పశ్చాత్తాపంతోను, విశ్వాసంతోను సువార్తకు ఎలా ప్రతిస్పందిస్తాడు?

దైవజ్ఞాన పండితులు, మనిషి స్థితికి, దేవుని కృప ఎలా స్పందించిందో వివరించే ప్రయత్నం చేశారు.



జాన్ కాల్విన్

మనిషి సంపూర్ణ భ్రష్టత్వానికి లోనయ్యాడు గనుక దేవునికి స్పందించాలనే ఎంపికను చేసుకోలేడని/నిర్ణయం తీసుకోలేడని జాన్ కాల్విన్ నమ్మాడు.[27] కాబట్టి, ఎవరు రక్షణ పొందుతారో, ఎవరు రక్షణ పొందరో దేవుడే ఎంపిక చేస్తాడు/నిర్ణయిస్తాడు. దేవుడు రక్షణ పొందడానికి కొంతమందిని మాత్రమే ఎంపిక చేసుకొన్నాడు గనుక ప్రాయశ్చిత్తం వారికొరకే అందించబడింది కానీ ప్రజలందరికీ కాదు. ఈ వ్యక్తులు ఎంపిక చేసుకోలేరు. ఎదురాడలేని/నిరోధించలేని కృపతో, వాళ్ళు పశ్చాత్తాపపడి, విశ్వాసముంచేలా దేవుడు చేస్తాడు. వారి చిత్తం దేవుని నియంత్రణ క్రింద ఉంది కనుక వాళ్ళు రక్షణ నుండి ఎప్పటికీ తొలగిపోరు. ఇది దేవుని సార్వభౌమాధికారం గురించి కాల్విన్ భావన.

రక్షణార్థమైన కృప ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉందని కాల్విన్ నమ్మలేదు. ప్రత్యేకమైన కృప లేకుండా ఏ వ్యక్తి పశ్చాత్తాపపడలేడు, నమ్మకముంచలేడు అని అతను నమ్మాడు మరియు ఈ కృప అనేకమందికి ఇవ్వబడలేదని నమ్మాడు.

ఒక వ్యక్తి దేవుని నుండి సహాయం పొందకుండా ప్రమాణాన్ని/వాగ్దానాన్ని నెరవేర్చడం లేదా తన కుటుంబాన్ని ప్రేమించడం లాంటి మంచి పనులు చేయలేడని కెల్విన్ నమ్మాడు. సత్క్రియలు చేయు సామర్థ్యం ఇచ్చే కృపను దేవుడు

---

[27] చిత్రం: "Portretten van Johannes Calvijn...", Rijksmuseumలోనిది, https://commons.wikimedia.org/w/index.php?curid=85920383, పబ్లిక్ డొమైన్ నుండి తీసుకున్నారు.

ప్రజలందరికీ ఇచ్చాడు అని అతడు నమ్మాడు. అతను దీనిని “సాధారణమైన కృప” అని పిలిచాడు. సాధారణ కృప ఒక వ్యక్తిని రక్షణలోనికి తీసుకురాగలదని అతను నమ్మలేదు.

జాన్ వెస్లీ దేవుని కృపను గురించి ఒక భిన్నమైన దృక్కోణాన్ని కలిగి ఉన్నాడు. బైబిల్, దేవునికి స్పందించడానికి ప్రజలను నిరంతరం పిలవడం అతను చూశాడు. దీన్ని బట్టి, మనిషి ఎంపిక/నిర్ణయం వాస్తవమైనదని నమ్మాడు. కాల్విన్ వలె, మనిషి భ్రష్టుడైపోయాడని, దేవుని నుండి సహాయం లేకుండా సువార్తకు స్పందించలేడని, కానీ దేవుడు ఆ సహాయాన్ని ప్రతి ఒక్కరికీ ఇస్తాడని నమ్మాడు. దేవుడు స్పందించాలనే కోరికను, స్పందించడానికి సామర్థ్యాన్ని ఇస్తాడు, కానీ అనివార్యంగా వారిని రక్షించడు. దేవుడు మనిషి ఎంపికను సాధ్యం చేశాడు. ఇది ప్రతి వ్యక్తి యొద్దకు వచ్చిన మొదటి కృప. దైవజ్ఞాన పండితులు దీనిని, “ముందస్తు కృప/పూర్వకృప” అని పిలుస్తారు, “ముందుగా వచ్చే కృప” అని దీనర్థం.

దేవుని కృప, పాపి హృదయంలోనికి చేరి, తన పాపాలను ఒప్పింపజేసి, దేవునినుండి దూరమవ్వడానికి తనకు తానే కారణమని చూపిస్తుంది. దేవుని కృప, ఆ వ్యక్తి క్షమాపణను కోరుకునేలా చేస్తుంది మరియు దేవునికి స్పందించగలిగే సామర్థ్యాన్ని ఇస్తుంది.

కృప లేకుండా ఏ వ్యక్తి కూడా కనీసం దేవుని యొద్దకు రాలేడు. కృప పొందుటకు అర్హత సంపాదించడానికి అతను ఏం చేయకపోయినప్పటికిని, దేవునిని వెదకడం ప్రారంభించడానికి ముందే కృప ప్రతి వ్యక్తి దగ్గరకు వస్తుంది.

ఎఫెసీయులకు 2:1-3 వచనాలు, ఎంతటి నిస్సహాయమైనస్థితిని గురించిన వివరణనిస్తాయో జ్ఞాపకం చేసుకోండి? కానీ ఆ వివరణ తరువాత వచ్చే రెండు వచనాలను చూడండి.

> “అయినను దేవుడు కరుణాసంపన్నుడై యుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతోకూడ బ్రదికించెను. కృప చేత మీరు రక్షింపబడియున్నారు.” (ఎఫెసీయులకు 2:4-5).

ఒక వ్యక్తి రక్షణ పొందకపోతే, అతనికి కృప అందుబాటులో లేనందువల్ల కాదు, కానీ అతనికి అందుబాటులో ఉన్న కృపకు స్పందించకపోవడం ముఖ్య కారణం.

► మనిషి దేవుని కొరకు వెదకడం లేదా మనిషి అంతరంగంలో దేవుడు పనిచేయడం - వీటిలో ఏది మొదటిగా వస్తుంది? దీన్ని మీరు ఎలా వివరిస్తారు?

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక, 2వ భాగం, 3వ లేఖన భాగం**

ఈ పాఠంలో, రోమా పత్రిక యొక్క 2వ భాగాన్ని ముగిస్తాం. అన్యులు, దేవుని జ్ఞానాన్ని తిరస్కరించి, విగ్రహాల తట్టు ఎలా తిరిగారో మనం చూశాం. యూదులు దేవుని ధర్మశాస్త్రాన్ని కలిగి ఉన్నారు, కానీ దానికి విధేయత చూపలేదు. ఇప్పుడు, లోకంలో ఉన్న ప్రజల పరిస్థితిని అపొస్తలుడు క్లుప్తీకరిస్తున్నాడు/క్లుప్తంగా వివరిస్తున్నాడు.

**3:1-20 యొక్క ప్రధానాంశం**

లోకంలో ఉన్న ప్రతి వ్యక్తి పాపియై, దేవుని న్యాయస్థానంలో దోషిగా నిలబడ్డాడు.

**3:1-20 యొక్క సారాంశం**

ఈ లేఖనభాగం, 1:18-3:20 వరకు ఉన్న పెద్ద లేఖనభాగాన్ని క్లుప్తీకరిస్తుంది. 3:19-20 వచనాలు, చిన్న లేఖనభాగాన్ని, అదేవిధంగా పెద్ద లేఖన భాగాన్ని కూడా క్లుప్తీకరిస్తాయి. లోకమంతా దోషులేనని ధర్మశాస్త్రం చూపిస్తుంది; కాబట్టి, ఏ వ్యక్తి కూడా తన క్రియల ఆధారంగా నీతిమంతునిగా తీర్పుతీర్చబడడు.

ప్రతి నోరు మూయబడడమే ఈ విషయాన్ని చెప్పడానికి కారణం (3:19), అంటే ఏ వ్యక్తి తనకు తానుగా నీతిమంతునిగా తీర్చుకోవడానికి కారణం గాని, ఆధారం గాని లేదని అర్థం. 3:9 వచనం, పౌలు తర్కించే విధానాన్ని చూపిస్తుంది: ఆయన యూదులు, అన్యులు పాపం క్రింద ఉన్నారని తెలియజేసాడు. ఎవరికి కారణం లేదు/సాకు లేదు కనుక, మనుష్యులందరిని పాపులుగా పరిగణించి, వారితో వ్యవహరించడంలో దేవుడు న్యాయవంతుడు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 3:1-20 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(3:1-2) యూదులు, కేవలం యూదులైనంత మాత్రాన రక్షణ పొందరని పౌలు చెబుతున్నాడు; తమ క్రియలను బట్టి అన్యులు తీర్పు పొందినట్లే, యూదులు కూడా తీర్పుపొందుతారు. సర్వసాధారణంగా వచ్చే ప్రశ్న ఏమిటంటే "యూదులకు నిజంగా ఏదైనా ప్రయోజనం ఉందా?" వాళ్ళు లేఖనాన్ని పొందడమే గొప్ప ప్రయోజనం. దాదాపు బైబిల్ మొత్తం, దేవుడు ప్రేరేపించిన యూదులే రాశారు (ఇతర ప్రయోజనాలను 9:4-5లో ప్రస్తావించారు).

**రోమా శాంతి (Pax Romana)**

పాక్స్ రోమానా అనేది దాదాపు క్రీ. పూ. 27 నుండి క్రీ.శ. 180 వరకు ఉంది. ఈ పదాలను "రోమా శాంతి" అని అర్థం. అనేక చిన్న దేశాలను రోమీయులు స్వాధీనం చేసుకున్నందున, ఈ దేశాల మధ్య యుద్ధాలు ఆగిపోయాయి. ఇది వ్యాపారాలు వృద్ధి చెందడాన్ని, ప్రజలు దేశ సరిహద్దులను దాటి సులభంగా ప్రయాణాలు చేయడాన్ని సులభతరం చేసింది.

బాప్తిస్మం, సంఘం, సభ్యత్వం, ప్రభురాత్రి భోజన సంస్కారం లేదా ఇతర మతపరమైన ఆచారాల వంటి ఏ మతపరమైన పద్ధతి గురించి లేదా కృపా సాధనం గురించి ఇదే ప్రశ్నను అడగవచ్చు. అవి రక్షణ నిశ్చయతను ఇవ్వవు, కనుక ఒక వ్యక్తి, "అవి ఏవిధంగా మంచివి/ప్రయోజనకరమైనవి?" అని అడగవచ్చు. ఆరాధన పద్ధతులు, మన విశ్వాసానికి దోహదపడడానికి/ సహాయపడడానికి ఇవ్వబడ్డాయనేది సమాధానం. మనం విశ్వాసంతో వాటిని ఆచరించినప్పుడు, కృపను పొందుతాము. కానీ, విశ్వాసం లేకుండా వాటిని ఆచరించినా విధేయతకు ప్రత్యామ్నాయంగా వాటిని చేసినా అవి నిరర్థకమైనవి.[28]

(3:3) మరి కొంతమంది అవిశ్వాసులైతే ఏంటి పరిస్థితి? వాళ్ళు అవిశ్వాసులైనంత మాత్రాన దేవుడు నమ్మదగిన వాడు కాకపోతాడా? ప్రశ్నించే వ్యక్తి, అవిధేయులైన యూదులను దేవుడు రక్షించనట్లయితే, దేవుని వాగ్దానము నెరవేరలేదని అంటాడు.

దేవుని కృప, యూదుల పట్ల షరతులు లేనిదిగా ఉంటుందని వారి ఆలోచన. వాళ్ళు అవశ్యకంగా చేయాల్సిన వాటి విషయంలో విఫలమైనప్పటికిని, దేవుడు అపనమ్మకస్తుడని నిందించవచ్చని అనుకునేవాళ్ళు.

(3:4) ఈ దృశ్యం, ఒక న్యాయస్థానంలో దేవుడు, మనిషి ప్రత్యర్థులుగా/ఎదురెదురుగా/ఒకరికొకరు విరోధంగా ఉన్నారనే భావనను కలిగిస్తుంది. మనిషి అపనమ్మకత్వానికి భిన్నంగా దేవుని నమ్మకత్వం నిరూపించబడుతుంది. దేవుని న్యాయాన్ని మనం పరీక్షించకూడదని అపొస్తలుడు చెప్పడం లేదు. మనం దేవుని చర్యలను/కార్యాలను పరీక్షించినప్పుడు, ఆయన తాను చేసే వాటన్నింటిలో న్యాయవంతుడు, నీతిమంతుడు అనే విషయాన్ని చూడాలని చెబుతున్నాడు.[29]

పత్రికలో తరువాత, రక్షణ షరతులతో కూడినది గనుక దేవుడు రక్షించినప్పుడు, శిక్షించినప్పుడు కూడా ఆయన న్యాయం ప్రదర్శించబడుతుందని చూస్తాం.

---

[28] చదవదగినది: జాన్ వెస్లీ బోధించిన "కృపా సాధనాలు" అనే ప్రసంగం. ఇది ఈ క్రింది లింక్ నందు అందుబాటులో ఉంది.
https://holyjoys.org/the-means-of-grace/

[29] 9వ పాఠంలో "పరీక్షపై దేవుని న్యాయం" అనే దానిని చూడండి.

(3:5) ఎవరో ఒకరు అడిగే ప్రశ్నను, అపొస్తలుడు అడుగుతున్నాడు: “మన పాపం, దేవుడు న్యాయవంతుడనే విషయాన్ని చూపిస్తే, అప్పుడు అది ఏదో ఒక మంచిని నెరవేరుస్తుంది. అలాంటప్పుడు, దీనిని బట్టి మనల్ని శిక్షించడం దేవునికి తప్పేలా అవుతుంది?”

► 3:5లో ఉన్న ప్రశ్నకు మీరు ఎలా సమాధానం చెబుతారు?

(3:6) లేదు, ఎందుకంటే, మనిషి పాపం, దేవుని నీతిని కనబరుస్తుంది కనుక అది క్షమాపణను పొందినట్లయితే, ఏ పాపం తీర్పుపొందకూడదు. ఇది న్యాయవంతుడైన దేవునిలో విశ్వాసముంచే వ్యక్తికి ప్రాముఖ్యమైన సిద్ధాంతపరమైన అంతిమ తీర్పును తిరస్కరిస్తుంది. అన్నింటికీమించి, దేవుడు పాపాన్ని శిక్షించినప్పుడు, స్పష్టమైన వెలుగులో ఆయన న్యాయం ప్రదర్శించబడుతుంది, కానీ పాపం తన న్యాయాన్ని చూపుతుందనే దానిపై ఆధారపడి ఆయన పాపాన్ని సమర్థించినట్లయితే, అప్పుడు ఆయన పాపాన్ని శిక్షించలేడు. అభ్యంతరం దానినదే ఖండిస్తుంది.

(3:7) మన పాపం, దేవునిని మహిమ పరచడానికి వాడినట్లయితే, అప్పుడు పాపికి తీర్పు తీర్చకూడదనే ఆలోచన మరోసారి ప్రతిపాదించబడింది. ఇది వాటి అంతిమ పర్యవసానాల ప్రకారం చర్యలను అంచనా వేయడానికి చేసిన ప్రయత్నం. అయితే, తీర్పనేది వైఖరులను బట్టి ఉంటుందనే వాస్తవానికి ఇది భిన్నంగా ఉంటుంది (2:15-16). అదేవిధంగా, చెడు కార్యాల నుండి మంచి ఫలితాలను తీసుకురావడమనేది పూర్తిగా దేవునికి చెందింది. ఒక పాపి, తన పాపం ద్వారా మంచిని సాధించలేడు. దేవుడు కలుగుజేసుకున్న సందర్భాలలో మినహాయిస్తే, మిగిలిన అన్ని సందర్భాలలో పాపం, చెడు ఫలితాలనే ఇస్తుంది.

(3:8) పాపులు మరియు పాపాన్ని క్షమించే వారు శిక్షకు అర్హులని పౌలు చెప్పాడు. దేవుని కృప ద్వారా మన పాపం మంచిని సాధించవచ్చు కాబట్టి, మనం దానిని అంగీకరించి పాపులుగా మిగిలిపోవాలని క్రైస్తవులు బోధిస్తారనే తప్పుడు ఆరోపణను కూడా అతను ఖండించాడు. మీరు మీ పాపాన్ని అంగీకరించడం మాత్రమే సరిపోదు. ఒక వ్యక్తి పశ్చాత్తాపపడాలి; కానీ నిజంగా పశ్చాత్తాపపడాలంటే, అతను తన పాపాన్ని నిజంగా చెడ్డదానిగా చూడాలి.

(3:9) “మనం” అనే మాట యూదులను సూచిస్తుంది. వారు యాంత్రికంగా ఆత్మీయ స్థాయిని కలిగి ఉండలేరు. అందరూ పాపం క్రిందనే ఉన్నారు; వాళ్ళు పాపం చేశారు, దాని శిక్ష క్రింద ఉన్నారు.

(3:10-18) ఈ వచనాలను కీర్తనలు మరియు పాత నిబంధన ప్రవక్తల గ్రంథాల నుండి తీసుకొన్నాడు.[30] కొంతమంది, 3:10వ వచనాన్ని ఉటంకించి/ఉదహరించి, క్రైస్తవునితో సహా ఎవరు నీతిమంతులు కాదని దీని భావమని చెబుతారు.

[30] కీర్తనలు 14:1-3, కీర్తనలు 53:1-3, కీర్తనలు 5:9, కీర్తనలు 140:3, కీర్తనలు 10:7, యెషయా 59:7-8, సామెతలు 1;16, కీర్తన 36:1.

అయితే, 3:10-18 వచనాలు, క్రైస్తవునిని గురించి వివరించడం లేదు. ఇది క్రైస్తవుని గురించి వివరిస్తుందని ఎవరైనా అనుకున్నట్లయితే, మీకు తెలిసిన ఒక క్రైస్తవుని పేరు ఈ వాక్యాలలో పెట్టి ప్రయత్నం చేయండి. ఉదాహరణకు, "పాస్టర్ అహరోను నోరు శాపంతో నిండి ఉంది, అతని పాదాలు హత్య చేయుటకు పరుగెత్తుతున్నాయి, మరియు అతనికి దేవుని భయం లేదు."

ఈ వచనాలు, మారుమనసు పొందని వ్యక్తుల సాధారణ స్థితిని వివరిస్తున్నాయి. 1:29-31లో కూడా ఇదే విధమైన వివరణ ఉంది. ఏ వ్యక్తి తన క్రియలను బట్టి రక్షణ పొందలేడని చూపించడమే పౌలు ఉద్దేశ్యం. ఏ వ్యక్తి దేవుని నీతిని పొందకుండా నీతిమంతుడు కాలేడని రోమా 3:10-18 చూపిస్తుంది.

► ఈ వ్యాఖ్యకు/ప్రకటనకు మీరు ఎలా స్పందిస్తారు: "ఎవరూ నీతిమంతులు కాదని బైబిల్ చెబుతుంది కనుక తాను శోధనపై జయాన్ని కలిగి జీవిస్తున్నానని ఏ వ్యక్తి ప్రకటించలేడు?"

3:19-20 వచనాలు 3:1-20 వచనాలను క్లుప్తీకరించడం మాత్రమే కాదు, కానీ 1:18-3:20 వచనాలను కూడా క్లుప్తీకరిస్తాయి.

(3:19-20) ధర్మశాస్త్రాన్ని, మనుషులు ఎలా నీతిమంతులుగా తీర్చబడాలో చూపించడానికి ఇవ్వలేదు, కానీ ప్రతి ఒక్కరూ ఇప్పటికే ఎలా దోషులుగా ఉన్నారో చూపించడానికి ఇవ్వబడింది. ధర్మశాస్త్రం, నీతిమంతులుగా తీర్చబడుటకు మార్గం కాదు కానీ శిక్షావిధికి సాధనం/మాధ్యమం. "ప్రతి నోరు మూయబడునట్లు" అంటే ఏ వ్యక్తి తనను తాను నీతిమంతునిగా కనబరచుకోవడానికి సాకు లేదు లేదా ఆధారం లేదు. అతను దేవుని న్యాయస్థానంలో తనను తాను సమర్థించుకోలేడు.

దేవునిచే అంగీకరించబడడానికి ధర్మశాస్త్రాన్ని ఖచ్చితంగా పాటించాలని భావించే వ్యక్తి, ధర్మశాస్త్రం క్రింద ఉన్నాడు. ధర్మశాస్త్రం క్రింద ఉండడం అనేది, పాతనిబంధన యొక్క చారిత్రక సమయాన్ని సూచించడం లేదు. ఏ వ్యక్తి అయినా రక్షణార్థమైన కృపను పొందకపోతే, అతను ధర్మశాస్త్ర ఆధీనంలో ఉంటాడు; అతడు దేవుని తీర్పులోని వెళ్ళవలసి ఉంటే, ధర్మశాస్త్ర ఉల్లంఘనను బట్టి తీర్పుతీర్చబడతాడు. రక్షణ పొందిన వ్యక్తి ధర్మశాస్త్రం క్రింద ఉండడు, ఎందుకంటే తన కృప ఆధారంగా దేవుడు అతనిని అంగీకరించాడు.

► ధర్మశాస్త్రం క్రింద ఉండడం అంటే అర్థం ఏమిటి?

**విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట (Justification by Faith)**

ఒక పాపి దేవుని ఎదుట ఎలా నీతిమంతునిగా తీర్చబడుతున్నాడో అర్థం చేసుకోవడం ప్రతి ఒక్కరికీ ఆవశ్యకం. ఒక సమయంలో గాని లేదా నిత్యత్వంలో గాని మనం దేవునికి శత్రువులుగా ఉన్నప్పుడు నిజమైన సమాధానాన్ని లేదా ఖచ్చితమైన సంతోషాన్ని కలిగి ఉండలేము.[31]

ప్రజలు, దేవుని స్వరూపమందు సృష్టించబడ్డారు మరియు తమ సృష్టికర్తయైన దేవుడు పరిశుద్ధుడైనట్లు వాళ్ళు కూడా పరిశుద్ధులుగా ఉన్నారు. దేవుడు ప్రేమామయుడైనట్లు, స్త్రీ పురుషులు కూడా ప్రేమలోను, దేవునిలోను జీవిస్తున్నారు మరియు దేవుడు వారిలో ఉన్నాడు. దేవుడు ఏవిధమైన పాపపు డాగులు లేకుండా శుద్ధుడైనట్లు, వాళ్ళు కూడా శుద్ధులుగా ఉన్నారు. వాళ్ళకు ఏ కీడు తెలీదు కానీ, అంతరంగంలోను, బాహ్యంగాను పాపం లేనివారిగా ఉన్నారు. వాళ్ళు తమ దేవునిని తమ పూర్ణహృదయాలతోను, మనసులతోనూ, ఆత్మలతోను, బలంతోను ప్రేమించారు.

దేవుడు, నీతిమంతుడు, పరిపూర్ణ మానవుడైన ఆదాముకు, పరిపూర్ణమైన ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. సంపూర్ణంగా సాధ్యమైన పరిపూర్ణ విధేయత దేవునిడు ఆశించాడు. అయినప్పటికిని, ఆదాము, హవ్వలు దేవునికి అవిధేయత చూపారు (ఆదికాండము 3:6).

వెంటనే ఆదామును దేవుని నీతియుక్తమైన తీర్పుతో ఖండించాడు. అవిధేయతకు మరణమే శిక్ష అని దేవుడు ఆదామును హెచ్చరించాడు (ఆదికాండము 2:17). ఆదాము, నిషేధించబడిన ఫలాన్ని రుచి చూసిన క్షణమే, అతను మరణించాడు. అతను దేవుని నుండి వేరైనందున అతని ఆత్మ మరణించింది. (దేవుడు లేకుండా ఆత్మకు జీవం లేదు.) అదేవిధంగా, అతని శరీరం మర్త్యమైనదిగా మారింది. అతను ఆత్మలో చనిపోయాడు, దేవుని విషయంలో మరణించాడు మరియు పాపంలో మరణించినందున, అతను శాశ్వతమైన మరణం వైపు పరుగెత్తాడు; ఎన్నటికీ చల్లారని నరకాగ్నిలో తమ ఆత్మదేహాలకు శిక్ష అనుభవించడానికి వెళ్లాడు.

“ఇట్లుండగా ఒక మనుష్యునిద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను” (రోమా 5:12). పాపం, మనందరికీ పితరుడు/తండ్రి మరియు ప్రతినిధియైన ఆదాము ద్వారా వచ్చింది. దీనిని బట్టి ప్రజలందరూ మరణించారు - దేవుని విషయంలో మరణించారు, పాపంలో మరణించారు, త్వరగా శిథిలమైపోయే మర్త్యమైన శరీరాలలో, నిత్యమరణ

[31] ఈ భాగాన్ని “విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట” అనే శీర్షికతో జాన్ వెస్లీ ప్రసంగం నుండి తీసుకున్నాం. ఇది ఈ క్రింది లింక్ నందు అందుబాటులో ఉంది. https://holyjoys.org/justification-by-faith/

శిక్ష క్రింద జీవిస్తున్నారు. ఒక మనుష్యుని అవిధేయత వలన అందరూ పాపులుగా చేయబడుతున్నారు (రోమా 5:19) మరియు "....కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై..." (రోమా 5:18).

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. మనం నశించక నిత్యజీవం పొందాలని తన కుమారుడిని అనుగ్రహించినప్పుడు (యోహాను 3:16) ప్రజలందరూ పాపస్వభావం మరియు శిక్షా విధి కలిగిన స్థితిలో ఉన్నారు. దేవుని కుమారుడు మానవునిగా, మానవ కుటుంబానికి రెండవ యాజమానిగా, మానవజాతి మొత్తానికి రెండవ ప్రతినిధిగా మారాడు. ఆయన మన రోగాలను భరించాడు (యెషయా 53:4), మరియు ప్రభువు మనందరి దోషాన్ని అతనిపై మోపాడు (యెషయా 53:6). మన అతిక్రమాలను బట్టి ఆయన గాయపరచబడ్డాడు మరియు మన దోషాలను బట్టి నలగగొట్టబడ్డాడు (యెషయా 53:5). ఆయన తన్నుతానే అపరాధ పరిహారార్థబలిగా అర్పించుకున్నాడు (యెషయా 53:10). పాపుల కోసం ఆయన తన రక్తాన్ని ధారపోశాడు. సర్వలోకపు పాపాల కొరకు సంపూర్ణమైన, సంతృప్తికరమైన బలిని అర్పించాడు.

దేవుని కుమారుడు అందరి కొరకు మరణాన్ని రుచి చూశాడు గనుక (హెబ్రీయులకు 2:9), ఇప్పుడు దేవుడు వారికి విరోధంగా వారి దోషాలను లెక్కించక, లోకాన్ని తనతో సమాధానపరచుకున్నాడు (2 కొరింథీయులకు 5:19). "కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై, మనుష్యుల కందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో, ఆలాగే ఒక్క పుణ్య కార్యము వలన కృపాదానము మనుష్యులకందరికిని జీవప్రదమైన నీతి విధింపబడుటకు కారణమాయెను" (రోమా 5:18). తన కుమారుడు మన కొరకు శ్రమపడుట వలన, మన పాపాలకు రావలసిన శిక్షను రద్దు చేస్తానని, మనల్ని మరలా తన కృపకు పాత్రులనుగా చేస్తానని, మృతమైన మన ఆత్మలను ఆత్మీయ జీవితానికి పునఃస్థాపిస్తానని భరోసానిచ్చాడు మరియు మనకు నిత్యజీవాన్ని గూర్చిన నిశ్చయతను ఇస్తున్నాడు. ఈ వాగ్దానానికి ఒక్కటే షరతు ఉంది, ఆ షరతును నెరవేర్చడానికి ఆయన మనకు సహాయం చేస్తాడు.

► చివరి పారాలో ప్రస్తావించిన ఒక షరతు ఏమిటి?

## పాత నిబంధనలో కృప (Grace in the Old Testament)

► పాత నిబంధన కాలంలో జీవించిన ప్రజలకు ఏవిధమైన కృప, ఆత్మీయ అనుభవం అందుబాటులో ఉంది? ఈ ప్రశ్న ఎందుకు ప్రాముఖ్యం?

పాత నిబంధనలో ఉన్న ప్రజలు మార్పు చెందరని, పరిశుద్ధాత్మని పనిని అనుభవించలేరని కొంతమంది నమ్ముతారు. కాబట్టి, ఈరోజుల్లోని విశ్వాసులకు పాతనిబంధన ప్రాముఖ్యమైనదిగా వాళ్ళు చూడరు. విశ్వాసం ద్వారా కృపచేతనే రక్షణ

అనే అంశం క్రొత్త నిబంధనతోనే ప్రారంభమైందని వాళ్ళు భావిస్తారు. పాతనిబంధన ప్రజలు, ధర్మశాస్త్రం మరియు బలుల ద్వారా రక్షణ పొందుతారని వాళ్ళు అనుకుంటారు.

ఏ వ్యక్తి కూడా ధర్మశాస్త్రాన్ని పాటించడం లేదా బలులను అర్పించడం ద్వారా రక్షణ పొందరనేది వాస్తవం (హెబ్రీయులకు 10:4). అయితే వాళ్ళు ఎలా రక్షణ పొందారు? విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షించబడ్డారు.

**(1) పాతనిబంధనలో సువార్త ఉందని క్రొత్త నిబంధన చెబుతుంది.**

- యేసుక్రీస్తు నందు విశ్వాసం ద్వారా రక్షణ పొందుతామని పాతనిబంధన బోధిస్తుంది (2 తిమోతికి 3:15).
- అబ్రాహాముకు సువార్త ఉంది, అతను కూడా విశ్వాసం ద్వారానే నీతిమంతునిగా తీర్చబడ్డాడు (రోమా 4:1-3; గలతీయులకు 3:6, 8).
- విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం గురించి దావీదు వివరించాడు (రోమా 4:6-8).
- సువార్త మొదట వచ్చింది; ధర్మశాస్త్రం తరువాత వచ్చింది (గలతీయులకు 3:17).
- మనకు ప్రకటించినట్లుగానే, పాతనిబంధన ప్రజలకు కూడా సువార్త ప్రకటించబడింది (హెబ్రీయులకు 4:2).
- నీకొదేము తన పాత నిబంధన అధ్యయనం నుండి నూతనంగా జన్మించడాన్ని గురించి ఇప్పటికే తెలుసుకొని ఉండాలని యేసు సూచించాడు (యోహాను 3:10).
- విశ్వాసం ద్వారానే నీతి ఆపాదించబడుతుందని (రోమా 1:17) ధర్మశాస్త్రం మరియు ప్రవక్తలు సాక్ష్యమిస్తున్నారు (రోమా 3:21).

**(2) విశ్వాసం ద్వారా కృపను పొందడానికి ఎక్కువ జ్ఞానం అవసరం లేదు**

యేసు, క్షమాపణ కొరకు పశ్చాత్తాపం గురించి బోధించాడు, కానీ ప్రాయశ్చిత్తం గురించి వివరించలేదు. ప్రజలు ఆయన సందేశాన్ని నమ్మడం ద్వారా రక్షణ పొందారు (ఉదాహరణకు బావి యొద్ద సమరయ స్త్రీ, యోహాను 4:39-42).

పాత నిబంధన విశ్వాసులకు, ప్రాయశ్చిత్తం అర్థం కాలేదు, కానీ దేవుడు క్షమాపణ కొరకు ఒక ఆధారాన్ని అందిస్తాడని వాళ్ళు నమ్మాల్సిన అవసరం ఉంది. అప్పుడు వాళ్ళు విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షించబడతారే గాని బలుల ద్వారా, వారి క్రియల ద్వారా కాదు. మన విషయంలో మాదిరిగానే, వారి బలులు, వారి విధేయత అనేవి వారి విశ్వాసానికి వ్యక్తీకరణలు.

ఒక వ్యక్తి దేవునికి భయపడితే, ఆ వ్యక్తి తనతో సంబంధంలోనికి రావడానికి దేవుడు మార్గాన్ని చూపిస్తాడు. కీర్తనలు 25:14, “యెహోవా మర్మము ఆయనయందు భయభక్తులు గల వారికి తెలిసియున్నది ఆయన తన నిబంధనను వారికి తెలియజేయును” అని చెబుతుంది.

**(3) దేవుని ఆజ్ఞలు, కృపను ఆవశ్యకం చేస్తాయి.**

యేసు, మత్తయి 22:37-40 వచనాల్లో, నీ సమస్తంతో నీ దేవునిని ప్రేమించడం (ద్వితీయోపదేశకాండము 6:5) మరియు నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించడం (లేవీ 19:18) అత్యంత ప్రాముఖ్యమైన ఆజ్ఞలని చెప్పాడు. కృప లేకుండా ఈ ఆజ్ఞలకు విధేయత చూపలేం. దేవుడు పాతనిబంధన ప్రజలకు అసాధ్యమైన ఆజ్ఞలను ఇచ్చాడా లేదా కృప ద్వారా విధేయతను సాధ్యం చేశాడా?

తిరిగి కీడును చేయవద్దు (సామెతలు 24:28-29). మీకు కీడు చేసే వారికి మేలు చేయండి (సామెతలు 25:21-22). శత్రువు ఎద్దు తప్పిపోయి తిరుగుతున్నప్పుడు మీరు చూస్తే, దానిని తిరిగి ఇవ్వండి (నిర్గమకాండము 23:4-5). నీ శత్రువు పడిపోయినప్పుడు సంతోషించవద్దు (సామెతలు 24:17).

**(4) పాత నిబంధన ప్రజలు విధేయతతో జీవించాలని దేవుడు ఆశించాడు.**

ద్వితీయోపదేశకాండము 27 మరియు 28 అధ్యాయాలు, విధేయత వలన కలిగే దీవెనలను, అవిధేయత వలన కలిగే శాపాలను గురించి తెలియజేస్తాయి. ఈ శాపాలలో మనం ఊహించగలిగిన విషయాలన్నీ ఉంటాయి. విధేయతను సాధ్యం చేయడానికి కృప లేకపోతే, ఈ ప్రజలందరూ ఆ శాపాలన్నింటిని పొందడానికి యోగ్యులు మరియు వారి దీవెనలన్నింటినీ కోల్పోతారు.

**(5) వారి హృదయాలను మార్చడానికి దేవుడు కృపా కార్యాన్ని అందించాడు.**

ద్వితీయోపదేశకాండము 30:6 వచనం, వారు మరియు వారి సంతానం విధేయత చూపి, జీవించునట్లు హృదయంలో సున్నతి పొందారని చెబుతుంది. ద్వితీయోపదేశకాండము 30:11-20 లో ఈ క్రింది విషయాలను మనం చూస్తాం. దీనిని పొందడం అసాధ్యం అని వాళ్ళు చెప్పలేరు, ఎందుకంటే ఇది వారి నోళ్లలోనూ, హృదయాలలోనూ ఉంది - పౌలు, రోమా 10:6-8 వచనాల్లో, విశ్వాసం ద్వారా కృపను పొందడాన్ని గురించి సూచించడానికి ఈ వ్యాఖ్యను ఉపయోగించాడు. విషయం, వారి హృదయాలలో నిర్ణయించబడుతుంది (ద్వితీయోపదేశకాండము 30:17). దేవుని పట్ల ప్రేమ, వారిని విధేయతలోనికి నడిపిస్తుంది (ద్వితీయోపదేశకాండము 30:20).

(ద్వితీయోపదేశకాండము 10:12, 16 కూడా చూడండి). సంపూర్ణమైన ప్రేమను, హృదయాన్ని సంపూర్ణంగా సమర్పించుకోవడాన్ని దేవుడు కోరుకుంటాడు. హృదయపు సున్నతి, దీనిని సాధ్యం చేస్తుంది.

**(6) ఏ సమయంలోనైనా నిజమైన ప్రజలు, ఆయనను ప్రేమించి, ఆయనకు సేవ చేస్తారు.**

రోమా 2:28-29, కొలొస్సయులకు 2:11-12 మరియు ఫిలిప్పీయులకు 3:3 వచనాలు, నిజమైన యూదుడు ఆత్మ సంబంధమైన వాడని చెబుతున్నాయి. ప్రవక్తలు కూడా ఇదే చెప్పారు. రక్షణ, హృదయపు విధేయతపై ఆధారపడి ఉంటుంది మరియు బలులు, దుష్టత్వం కలిగిన హృదయాన్ని నీతిమంతునిగా తీర్చలేవు. తన కాలంలోని యూదులు వారి పాత నిబంధన పూర్వీకుల వలె హృదయంలోనూ, చెవులలోనూ సున్నతి పొందని వారిగా ఉన్నారని స్తెఫను నిందించాడు (అపొస్తలుల కార్యములు 7:51). ఆరాధనా రూపాలనే దేవుడు కోరుకున్న సమయమంటూ ఎప్పుడూ లేదు.

దావీదు, “నా నోటి మాటలును నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగును గాక” (కీర్తనలు 19:14) అని ప్రార్థన చేశాడు.

**(7) కృపకు అనేక పాత నిబంధన ఉదాహరణలు ఉన్నాయి.**

- యోబు, దేవునికి భయపడి, చెడుతనాన్ని విసర్జించాడు (యోబు 1:1).
- నోవహు, తన తరంలో నీతిమంతునిగాను, నిందారహితుడు గాను ఉన్నాడు (ఆదికాండము 6:9).
- యెషయా, హృదయ శుద్ధీకరణను అనుభవించాడు (యెషయా 6).
- తన పాప స్వభావం యొక్క సంపూర్ణ శుద్ధీకరణ కొరకు దావీదు ప్రార్థించాడు (కీర్తనలు 51).

విశ్వాసం ద్వారా రక్షణ, శుద్ధమైన హృదయం, పాత నిబంధనలో అందుబాటులో ఉందని ఈ ఋజువులు చూపిస్తున్నాయి. పాతనిబంధన మనకు ప్రాముఖ్యమని దీనర్థం. పాత నిబంధనలో నీతియుక్తమైన జీవితం కొరకు దేవుని సూచనలు, పరిశుద్ధుడైన దేవుని నుండి కృపలో జీవించవలసిన ప్రజలకు ఇవ్వబడిన సూచనలు. వాస్తవానికి చాలా ఆజ్ఞలు ఆ సమయానికి, ఆ పరిస్థితికి తగినవే గాని అదేవిధంగా మన కాలంలో వర్తించవు. 7వ పాఠములో, పాత నిబంధన లేఖనాలను మన జీవితాలకు ఎలా అన్వయించుకోవాలో వివరించే ఒక భాగం ఉంది.

### పాఠం 4 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) కాల్విన్ యొక్క “సాధారణమైన కృప” అనే అంశాన్ని వివరించండి.

(2) వెస్లీ చెప్పిన “ముందుగా వచ్చే కృప” అనే అంశాన్ని వివరించండి.

(3) రోమా 3:19లో, “ప్రతి నోరు మూయబడునట్లును,” అనే మాటకు అర్థం ఏమిటి?

(4) రోమా 3లో ప్రస్తావించిన యూదులకున్న గొప్ప ప్రయోజనం ఏమిటి?

(5) ఆరాధన పద్ధతులు/విధానాలు మనకు ఎలా ప్రయోజనం చేకూరుస్తాయి?

(6) రోమా 3:10-18 ఏం చూపిస్తుంది?

(7) ధర్మశాస్త్రం క్రింద ఉన్నది ఎవరు? (రోమా 3:19-20)

### పాఠం 4 - అభ్యాసాలు

(1) ఈ క్రింది అంశాలలో ఒక దానిని గురించి ఒక పేజీలో రాయండి:

- ముందస్తు కృప/ముందుగా వచ్చే కృప
- పాత నిబంధనలో కృప (Grace in the Old Testament)
- పాపులు విశ్వాసం ద్వారానే నీతిమంతులుగా చేయబడడం వెనుకున్న కారణం

అవసరమైతే రోమీయులకు రాసిన పత్రికతో పాటు ఇంకా అనేక రకాల లేఖనాలను కూడా మీరు వాడుకోవచ్చు.

(2) మీరు మూడు ప్రసంగాలను బోధించాలి లేదా ఈ కోర్సు జరుగుతున్న కాలంలో ఇతర గ్రూపులకు మూడు సెషన్లు బోధించాలని జ్ఞాపకం చేసుకోండి.

# పాఠం 5

# నీతిమంతులుగా తీర్చబడు విధానం మరియు భావం

## రక్షణార్థమైన విశ్వాసాన్ని నిర్వచించుట (Defining Saving Faith)

► రక్షణార్థమైన విశ్వాసం అంటే ఏమిటి? ఒక వ్యక్తికి రక్షణార్థమైన విశ్వాసం ఉన్నట్లయితే, అతను నమ్ముతున్నాడంటే అర్థం ఏమిటి?

విశ్వాసి ఏం నమ్ముతాడు?

**(1) అతను, తనను నీతిమంతునిగా తీర్చడంలో తానేమీ చేయలేనని నమ్ముతాడు.**

"మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు" (ఎఫెసీయులకు 2:8-9).

తాను చేసేది ఏదీ కూడా (క్రియలు) తనని పాక్షికంగా కూడా రక్షణ పొందడానికి యోగ్యునిగా చేయవని అతను గ్రహిస్తాడు.

**(2) తన క్షమాపణ కొరకు క్రీస్తు బలియాగం సరిపోతుందని నమ్ముతాడు.**

"ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు. సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" (1 యోహాను 2:2).

*శాంతికరమై* ఉండడం అంటే మన క్షమాపణను సాధ్యం చేసే బలి/అర్పణ

**(3) విశ్వాసమనే షరతు ద్వారా మాత్రమే దేవుడు అతన్ని క్షమిస్తాడని నమ్ముతాడు.**

"మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9).

ఇతర షరతులు ఉన్నాయని అతను అనుకుంటే, కృప ద్వారా సంపూర్ణంగా రక్షణ పొందడానికంటే క్రియల ద్వారా పాక్షికంగా రక్షణ పొందాలని ఆశిస్తాడు.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 3వ భాగం

3వ భాగంలో మూడు లేఖన భాగాలున్నాయి. మొదటిది (3:21-31) మనిషి తాను చేసిన క్రియల ఆధారంగా నీతిమంతునిగా తీర్చబడలేడు గనుక దేవుడు ఉద్దేశించిన విధానంలోనే నీతిమంతునిగా తీర్చబడాలని చూపిస్తుంది. రెండవ లేఖన భాగం (రోమా 4) నీతిమంతులుగా తీర్చే విశ్వాసానికి ఉదాహరణలుగా అబ్రాహామును, దావీదును ఉపయోగిస్తూ, ఈ సిద్ధాంతం క్రొత్తది కాదని చూపిస్తుంది. మూడవ లేఖనభాగం (రోమా 5 ) క్రీస్తు బలియాగం ఈ విధంగా నీతిమంతులుగా తీర్చడాన్ని ఎలా సాధ్యం చేసిందో వివరిస్తుంది. ఈ పాఠంలో, ఈ మూడు లేఖన భాగాలను మనం అధ్యయనం చేస్తాం.

### 3:21-5:21 యొక్క ప్రధానాంశం

క్రీస్తు బలియాగం, మానవ రక్షణకు దేవుని ఏర్పాటు, ఇది విశ్వాసం ద్వారా కృప చేతనే నీతిమంతులుగా తీర్చుతుంది.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 3వ భాగం, 1వ లేఖన భాగం

### 3:21-31 యొక్క ప్రధానాంశం

విశ్వాసం ద్వారా కృప చేతనే నీతిమంతులుగా తీర్చబడడం అనేది దేవుని విధానం, ఇది క్రియల ద్వారా సాధ్యం కాదు.

### 3:21-31 యొక్క సారాంశం

ధర్మశాస్త్రమంతటిని ఎల్లప్పుడూ పాటించడం వలన ఎవరు నీతిమంతులుగా తీర్చబడరు గనుక, నీతిమంతులుగా తీర్చబడుట కొరకు మరొక మార్గాన్ని కనుగొనాలి. **దేవుడు పాపిని నీతిమంతునిగా తీరుస్తూనే, ఆయన నీతిమంతుడైన న్యాయాధిపతిగా ఉండడం అనేది ఒక సందిగ్ధత (3:26లో ప్రదర్శించబడింది).** ఈ సందిగ్ధతను ప్రాయశ్చిత్తం పరిష్కరించింది; దేవుడు క్షమాపణకు ఆధారంగా బలిని అర్పించాడు. విశ్వాసముంచే వ్యక్తిని ఆయన క్షమించగలడు, కానీ ఆ బలి, దేవుడు పాపాన్ని తీవ్రంగా పరిగణిస్తాడని తెలియజేస్తుంది.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 3:21-31 వచనాలు చదవాలి.

### వచనాల వారీ వివరణ

(3:21) దేవునికి అంగీకారయోగ్యమైన నీతి, ధర్మశాస్త్రానికి వేరుగా నెరవేర్చబడింది. ఈ ఆలోచన నూతనమైనది కాదు కానీ ధర్మశాస్త్రం, ప్రవక్తలు కూడా దీనిని గురించి బోధించారని పౌలు చెబుతున్నాడు. "ఇట్లుండగా" అనే మాట తరువాత

వచనం చెప్పినట్లు, క్రీస్తునందు సువార్త యొక్క సంపూర్ణ ప్రత్యక్షత సమయాన్ని సూచిస్తుంది (3:25వ వచనాన్ని చూడండి).

(3:22-23) యూదులు, అన్యులు ఒకే విధంగా తీర్పు పొందుతారు కనుక, రక్షణ విషయంలో వారిద్దరికీ మధ్య వ్యత్యాసంలేదు. ప్రాచీన ఇశ్రాయేలు దేశంలో కూడా, దేవుడు వారికి ఇచ్చిన ఆచారాలను పాటించినప్పుడు, వారి బలులను బట్టి, ఆచారాలను బట్టి ఎవరు రక్షణ పొందలేదు. ఎవరు రక్షించబడినా కూడా, విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షణ పొందారు (3:30 చూడండి).

ఎవరికైనా రక్షణ అనేది విశ్వాసం ద్వారానే కలుగుతుంది. "అందరూ" అనే మాట ఇక్కడ అనేక సార్లు ఉపయోగించబడింది. అందరూ పాపం చేసినట్లే, విశ్వాసముంచిన వారందరూ రక్షణ పొందుతారు. "విశ్వాసమూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు" అనే మాట విశ్వాసపు స్థితిని నొక్కి చెప్పినట్లుగానే (1:17), "నమ్ము వారందరికి" అనే మాట దేవుని అవకాశం యొక్క నిష్కాపట్యతను నొక్కి చెబుతుంది.

(3:24) యేసు, విమోచన వెలను చెల్లించాడు గనుక కృప మనందరికీ ఉచితం.

(3:25) గతంలో చేసిన పాపాలు అంటే క్రీస్తు రాకడకు ముందు చేసిన పాపాలు. వాటికి ఆచారాలు చేయడం ద్వారా ప్రాయశ్చిత్తం చేయలేము గాని వారు పాపాలు చేసినప్పుడు యేసు మరణించకపోయినప్పటికిని, వారి పాపాలకు కూడా ఆయన మరణం ప్రాయశ్చిత్తం చేస్తుంది. క్రీస్తు ప్రాయశ్చిత్తం జరగకముందే దానిని ఆధారం చేసుకొని దేవుడు వారిని క్షమించాడు, ఎందుకంటే ఇది ఆది నుండి ప్రణాళిక చేయబడింది. (3:21 చూడండి).

తన న్యాయం తక్షణమైనది కానప్పటికీ ప్రాయశ్చిత్తం, దేవుడు నీతిమంతుడని చూపించింది. దేవుడు పాపాన్ని తీవ్రంగా పరిగణిస్తాడని అది చూపించింది.

(3:26) ఈ వచనం, "దేవుడు న్యాయవంతునిగా ఉంటూనే, పాపిని ఎలా నీతిమంతునిగా తీరుస్తాడు?" అనే గొప్ప సందిగ్ధతకు పరిష్కారాన్ని చూపిస్తుంది. ప్రాయశ్చిత్తం, మార్గాన్ని చూపించింది. దేవుడు క్షమాపణకు ఆధారంగా బలిని అర్పించాడు. విశ్వాసముంచే వ్యక్తిని ఆయన క్షమించగలడు, కానీ ఆ బలి, దేవుడు పాపాన్ని తీవ్రంగా పరిగణిస్తాడని తెలియజేస్తుంది.

► దేవుడు, ప్రాయశ్చిత్తం లేకుండా ప్రజలను క్షమించినట్లయితే ఏ సమస్య తలెత్తుతుంది?

దేవుడు, విశ్వమంతటికీ నీతిమంతుడైన న్యాయాధిపతి. పాపం, నిత్యశిక్షను కలిగి ఉండేటంత తీవ్రమైందని ఆయన ప్రకటిస్తున్నాడు. పాపం వలన ప్రజలు దేవుని నుండి వేరైపోయారు. మంచి చేసిన వారికి బహుమానాన్ని, చెడు చేసిన వారికి శిక్షను విధించే విశ్వంలోని అంతిమ న్యాయానికి దేవుడు బాధ్యుడు.

ఒక ఆధారం లేని క్షమాపణ, దేవుని గుర్తింపుతో విభేధిస్తుంది. పాపం పట్ల తన స్పందన విషయంలో అస్థిరమైనవాడిగా కనబడడం ద్వారా ఆయన్ని అగౌరవపరుస్తుంది. ఆయన కొంతమందిని క్షమించి, మరికొంతమందిని శిక్షిస్తే ఆయన అన్యాయస్థుడవుతాడు. ఇది చిన్న సమస్య కాదు, ఎందుకంటే సమస్త సృష్టి దేవుని మహిమపరచడానికి ఉంది. దేవుడు న్యాయవంతుడని ప్రజలు ఆలోచించకుండా, దేవునిని యదార్థంగా ఎలా మహిమపరుస్తారు?

పరిష్కారమనేది, పాపం ఎంత తీవ్రమైందో చూపాలి, క్షమాపణకు ఒక కారణాన్ని అందించాలి మరియు దేవుని స్వభావాన్ని వర్ణించాలి; తద్వారా ప్రజలు దేవునిని పరిశుద్ధుడిగాను, న్యాయవంతునిగాను గౌరవించడం కొనసాగించగలుగుతారు.

ప్రాయశ్చిత్తం ఆ అవసరానికి సరిపోతుంది. యేసు సిలువ బలి, పాపం తీవ్రమైనదని చూపించింది. పశ్చాత్తాపం యొక్క ఆవశ్యకత, పాపిని తన పాపపు దుష్టత్వాన్ని గుర్తించేలా చేస్తుంది. అందరికీ ఉచితమైన రక్షణ ఎంపికను వ్యక్తిగతంగా చేస్తుంది, కాబట్టి దానిని అంగీకరించేవారిని క్షమించడం మరియు తిరస్కరించిన వారిని క్షమించకపోవడం దేవునికి న్యాయమైనది.

పశ్చాత్తాపపడని వారిని ఆయన ఎందుకు క్షమించడు? పశ్చాత్తాపం లేకుండా పాపంలో కొనసాగే వ్యక్తిని క్షమించడం ప్రాయశ్చిత్తం యొక్క ఉద్దేశ్యాన్ని పాడుచేస్తుంది: దేవుని న్యాయాన్ని చూపుతూనే, క్షమాపణ అందించడం.

(3:27) రక్షణ పొందడాన్ని బట్టి అతిశయ పడడానికి ఆధారమే లేదు. ఒక వ్యక్తి తాను రక్షించబడ్డానని తెలుసుకున్నట్లయితే, అతను గర్వపడతాడని నమ్మే కొంతమంది ప్రజలు ఉన్నారు. కానీ కృపను బట్టి తాను క్షమించబడ్డానని ఎరిగిన వ్యక్తి, గర్వం కలిగిన వ్యక్తిగా కాక, తగ్గింపు కలిగిన వ్యక్తిగా ఉండడానికి కారణం ఉంది.

(3:28) నీతిమంతులుగా తీర్చబడడం అనేది మునుపటి నీతిపై ఆధారపడి ఉండదు. నీతిమంతులుగా తీర్చబడడం అంటే పశ్చాత్తాపపడి, విశ్వాసముంచిన వ్యక్తిని, అతను ఎన్నడూ పాపం చేయని నీతిమంతునిగా పరిగణించడం. దేవునికి విధేయత చూపే జీవితం, నీతిమంతునిగా తీర్చబడడం యొద్ద ప్రారంభమవుతుందే గాని, దానికంటే ముందు కాదు. ఒక వ్యక్తి, దేవునికి తనను తాను అంగీకారయోగ్యంగా మార్చుకోవాలనే ఉద్దేశ్యంతో తన జీవితాన్ని మార్చుకోలేడు. క్రీస్తు ప్రాయశ్చిత్తం ద్వారా అతను ఇప్పటికే దేవునికి అంగీకారయోగ్యమయ్యాడు, మరొక విధంగా కాదు.

(3:29-30) ఈ వచనాలు, ఈ లేఖన భాగాన్ని, పత్రిక యొక్క ముఖ్య ఉద్దేశ్యంతో అనుసంధానిస్తాయి. ఈ సందేశం, సర్వలోకం కొరకు ఇవ్వబడింది. సువార్త యొక్క ఈ సార్వత్రిక అన్వయం, ఏకదైవత్వంపై ఆధారపడి ఉంది. దేవుడు ఒక్కడే గనుక, ఆయన ఉద్దేశ్యాలు సర్వమానవాళికి వర్తిస్తాయి. ఇది ఒక దేశంలో లేదా ఒక జాతి ప్రజల పట్ల ఆసక్తి కలిగిన స్థానిక దేవునికి భిన్నంగా ఉంటుంది. ఇశ్రాయేలీయులు దేవుని జ్ఞానాన్ని, అన్యులతో పంచుకోవాలనేది ఎల్లప్పుడూ దేవునికున్న ఉద్దేశ్యం (యెషయా 42:6; యెషయా 43:21; యెషయా 49:6).

► విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం అనేది ధర్మశాస్త్రాన్ని నిరర్థకం చేయదు గాని, దానిని స్థిరపరుస్తుందని అపొస్తలుడు చెప్పాడు. అది ఎలా సాధ్యం?

> "పశ్చాత్తాపపడి పాపం నుండి వైదొలిగి రక్షణ కోసం యేసును విశ్వసించే వారికంటే ఎక్కువగా ఎవరూ ధర్మశాస్త్రాన్ని పూర్తిగా స్థాపించలేదు."
> - George McLaughlin,
> Commentary on Romans

(3:31) ఒక వ్యక్తి తన పాపాన్ని బట్టి పశ్చాత్తాపపడి, విధేయతతో జీవించడం ప్రారంభించినప్పుడు, అతను ధర్మశాస్త్రాన్ని నీతికి ప్రమాణంగా స్థిరపరుస్తున్నాడు. క్రైస్తవులకు ధర్మశాస్త్రాన్ని అసంబద్ధమైనదిగా చేసే ప్రాయశ్చిత్తం మరియు నీతిమంతునిగా తీర్చబడడాన్ని గూర్చిన సిద్ధాంతాలు, ఈ వచనానికి అనుగుణంగా ఉండవు.[32] ఒక వ్యక్తి క్షమాపణ కొరకు అడిగి, దేవునికి విధేయత చూపాలనే ఉద్దేశ్యం లేకపోయినట్లయితే, అతను పాపం యొక్క దుష్టత్వాన్ని, తన క్షమాపణ అవసరమైన నిజమైన కారణాన్ని అర్థం చేసుకోలేదని ఇది చూపిస్తుంది. అతడు ఊరికే ధర్మశాస్త్రాన్ని గౌరవిస్తున్నట్లు నటించడం ద్వారా రక్షణ ప్రయోజనాలను పొందే ప్రయత్నం చేస్తున్నాడు.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 3వ భాగం, 2వ లేఖన భాగం

### 4వ అధ్యాయం యొక్క ప్రధానాంశం

దేవుడు, తన ప్రజలకు తండ్రిగా ఎంపిక చేసిన అబ్రాహాము, విశ్వాసం ద్వారా నీతిమంతుడయ్యాడు.

### 4వ అధ్యాయం యొక్క సారాంశం

విశ్వాసం ద్వారా కృపచేతనే నీతిమంతులుగా తీర్చబడడమనే సిద్ధాంతం, పాత నిబంధనలో స్థాపించబడింది. దేవుడు, తన ప్రజలకు తండ్రిగా ఎంపిక చేసిన అబ్రాహాము విశ్వాసం ద్వారా నీతిమంతునిగా తీర్చబడ్డాడు. దావీదు రాజు కూడా,

---

[32] "విశ్వాసం ద్వారా ధర్మశాస్త్రం స్థిరపరచబడుతుంది" అనే శీర్షికతో జాన్ వెస్లీ చేసిన రెండు ప్రసంగాలు ఈ అంశాలను చక్కగా వివరిస్తాయి. (ఈ కోర్సు చివర్లో చదవడానికి సిఫారసు చేసిన భాగాన్ని చూడండి).

కృప ద్వారా నీతిమంతులుగా తీర్చబడడాన్ని అర్థం చేసుకున్నాడు. సున్నతి అనేది రక్షణకు మార్గం కాదు, కానీ అప్పటికే అబ్రాహాము కలిగి ఉన్న విశ్వాసానికి గుర్తుగా అది తరువాత ఇవ్వబడింది. తరువాతి కాలంలో విశ్వాసం ద్వారా రక్షణ పొందేవారందరికీ తండ్రిగాను, మాదిరిగాను అబ్రాహాము మారాడు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 4వ అధ్యాయాన్ని చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(4:1) అబ్రాహాము, యూదులకు శరీరవిషయమై మూలపురుషుడు. "అబ్రాహామునకు ఖచ్చితంగా ఏం దొరికెను?" అనేది ప్రశ్న. "ఎవరు దానిని స్వతంత్రించుకుంటారు?" మరియు "మనం దానిని ఎలా స్వతంత్రించుకుంటాం?" అనే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికిగాను ఈ ప్రశ్నకు సమాధానం చెబుతాం.

(4:2) క్రియల ద్వారా రక్షణ అని చెప్పే సిద్ధాంతం, సహజంగానే గర్వానికి నడిపిస్తుంది.

► రక్షణార్థమైన విశ్వాసంగా పరిగణించే ఎలాంటి విశ్వాసాన్ని అబ్రాహాము కలిగి ఉన్నాడు?

(4:3) సంపూర్ణ రక్షణ ప్రణాళికను గురించి అబ్రాహాముకు తెలీదు, కాబట్టి, అతను క్రీస్తు ప్రాయశ్చిత్తం నందు విశ్వాసముంచలేదు. అయితే తనకు వెల్లడిపరచినంతవరకు దేవుని వాగ్దానాలను నమ్మాడు. ఈ అధ్యాయంలో అబ్రాహాము అనేక జనములకు తండ్రి అవుతాడనేది (4:17-18) వాగ్దానంలో భాగం, అయితే అతని సంతతి ద్వారా భూమిలోని ప్రజలందరూ ఆశీర్వదించబడతారనేది (ఆదికాండము 12: 2-3, ఆదికాండము 22:17-18) మిగిలిన వాగ్దానం. ఇదే వాగ్దానాన్ని యాకోబుకు కూడా చేశాడు (ఆదికాండము 28:14). అబ్రాహాము సంతానం ద్వారా భూమిపై ఉన్న ప్రజలందరికీ దేవుని అనుగ్రహం అందించబడుతుంది. ఇది అబ్రాహాముకు దేవుడు చేసిన కృపా వాగ్దానం. ఇది అందరికీ అందుబాటులో ఉన్న కృపా వాగ్దానం.

అబ్రాహాము దేవుని కృపా వాగ్దానాన్ని నమ్మినందు వలన నీతిమంతునిగా తీర్చబడ్డాడు. మన విశ్వాసానికి ఎంతో విషయం ఉన్నప్పటికిని, అతను కూడా మనలాగానే నీతిమంతునిగా తీర్చబడ్డాడు.

(4:4) ఒక వ్యక్తి తన రక్షణ కొరకు పని చేస్తుంటే, అప్పుడు రక్షణ బహుమానమవ్వదు. దానికి బదులుగా, అతను చెల్లించడానికి ప్రయత్నిస్తున్న ఖాతాకు రుణపడి ఉంటాడు (రోమా 11:6 చూడండి)

(4:5) పని చేయనివాడు దేవునికి విధేయత చూపడం గురించి పట్టించుకోని వ్యక్తి కాదు, కానీ రక్షణను సాధించడానికి పని చేయని వ్యక్తి. పరలోకంలో ప్రవేశించడానికి తన క్రియలపై ఆధారపడే బదులు, తనను రక్షిస్తానని దేవుడు చేసిన వాగ్దానాన్ని అతను నమ్ముతాడు.

(4:6-8) పాపక్షమాపణపై ఆధారపడిన దేవుని అంగీకారముగా వివరించినప్పుడు, విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడాన్ని దావీదు కూడా సూచించాడు. విశ్వాసి గతంలో చేసిన పాపానికి దేవుడు శిక్షను విధించడు. అపొస్తలుడైన పౌలు విశ్వాసం ద్వారా కృప చేతనే నీతిమంతులుగా తీర్చబడడమనే సిద్ధాంతం, నూతనమైన ఆలోచన కాదని చూపిస్తున్నాడు - దావీదు రాజు కూడా దానిని అర్థం చేసుకున్నాడు.

ఇది గత పాపాన్ని సూచిస్తుందే గాని, కొనసాగే పాపాన్ని కాదని మనకు ఎలా తెలుస్తుంది? మనం పాపం విషయమై చనిపోయాం గనుక, మనమికను దానిలో జీవించమని రోమా 6:2 చెబుతుంది. రోమా 6వ అధ్యాయపు మొత్తం సందేశం, మనం విశ్వాసం ద్వారా నీతిమంతునలుగా తీర్చబడుతున్నప్పుడు పాపంలో జీవించగలమనే ఆలోచనను ఖండిస్తుంది. (రోమా 5:6-8 కూడా చూడండి: “మనమింక బలహీనులమై యుండగా” మరియు “మనమింకను పాపులమై ఉండగానే” అనే మాటలు మనమిప్పుడు బలం కలిగి ఉన్నామని, గతంలో మాదిరిగా మనమిప్పుడు పాపులం కాదని, మనం నీతిమంతులుగా తీర్చబడి, మార్పు చెందామని సూచిస్తున్నాయి).

(4:9) ఈ ప్రశ్న, ఒక వ్యక్తి విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడే ఈ స్థితిలోనికి ఎలా వస్తాడనే అంశాన్ని పరిచయం చేస్తుంది. ఈ దీవెన కేవలం సున్నతి పొందిన ప్రజలకు మాత్రమే కలుగుతుందా?

► ఏది మొదటిగా వచ్చింది: ధర్మశాస్త్రమా లేక కృపనా?

(4:10-12) అబ్రాహాము కృపను పొందినప్పుడు సున్నతి పొందలేదు. సున్నతి తరువాత వచ్చింది. కాబట్టి, సున్నతి లేని వ్యక్తి విశ్వాసం ద్వారా కృపను పొందడం సాధ్యం. సున్నతి పొందకపోయినప్పటికిని, అబ్రాహాము యొక్క విశ్వాసాన్ని అనుసరించే వాళ్ళకు (ఆయన అడుగుజాడల్లో నడిచే వాళ్ళు), అబ్రాహాము ఆత్మీయ తండ్రిగా ఉంటాడు. రక్షణార్థమైన విశ్వాసం ఉన్న ప్రజలు, అబ్రాహాముకు ఆత్మీయ పిల్లలుగా ఉంటారు. ఇశ్రాయేలీయులు తనకు శారీరక సంతానమైనప్పటికీ, విశ్వాసముంచకపోతే, ఆత్మీయ సంతానం కాలేరు.

(4:13-14) ఎవరు అబ్రాహాము దీవెనను స్వతంత్రించుకొంటారు? వాళ్ళు ధర్మశాస్త్రాన్ని పాటించేవారైనట్లయితే, అది వాగ్దానంపై విశ్వాసం వల్ల కాదు.

(4:15) ధర్మశాస్త్రం తీర్పుకు సాధనం, ఎందుకంటే ఇది పాపాన్ని వెల్లడి చేస్తుంది. ఇది కృపను పొందడానికి సాధనం కాదు. ధర్మశాస్త్రం లేకపోతే, దానిని అతిక్రమించడం కూడా ఉండదు. పౌలు, మోషే నుండి వచ్చిన ధర్మశాస్త్రం గురించే మాట్లాడడం లేదు, కాని సాధారణంగా మానవజాతి నుండి దేవుడు కోరుతున్న విషయాలను గురించి మాట్లాడుతున్నారు. దేవుడు కోరే విషయాలు, పూర్తిగా తెలియని ప్రదేశమే లేదు (1:20).

(4:16-17) అబ్రాహాముకు శారీరకంగా అనేకమంది సంతానం ఉన్నారు, వాళ్ళు భిన్నమైన దేశాలను ఏర్పాటు చేశారు. అయితే, అబ్రాహాము విశ్వాసమున్నవారందరికీ ఆయన తండ్రి గనుక ఆయన అనేకమందికి తండ్రని అపొస్తలుడు చెబుతున్నాడు.

రక్షణ, కృప ద్వారా ఇవ్వబడునట్లు, విశ్వాసం ద్వారా పొందుకుంటాం. రక్షణను పొందుకునే వ్యక్తి, దానికి అర్హతను పొందడానికి ఏదైనా చేయాల్సి వస్తే, అది సంపూర్ణంగా కృప ద్వారా రాదు. అది కృప ద్వారా ఇవ్వబడుతుంది గనుక, దానిని ఖచ్చితంగా విశ్వాసం ద్వారానే పొందుకోవాలి. రక్షణను సంపాదించుకోవడానికి ప్రయత్నించే వ్యక్తి, దానిని అర్థం చేసుకోలేడు.

► అబ్రాహాముకు దేవుడు చేసిన వాగ్దానం ఏమిటి? మనం పొందే రక్షణ వాగ్దానానికి ఇది ఎలా సారూప్యంగా ఉంది?

(4:18-19) అబ్రాహాము, తానున్న స్థితిలో నిరీక్షణ కలిగి ఉండడానికి అవకాశం లేనప్పుడు, దేవునిని నమ్మాడు. ఒక బిడ్డకు తండ్రయ్యే సామర్థ్యం విషయంలో అతని శరీరం మృతతుల్యమైంది. శారీరకంగా ఒక బిడ్డకు జన్మనిచ్చే సమయం శారాకు గతించిపోయింది. కానీ నిజమైన విశ్వాసం పరిస్థితులపై ఆధారపడదు.

ఈ విశ్వాసం, క్రియలలో నమ్మకం కలిగి ఉండడానికి వ్యతిరేకం. హాగరు కుమారుడైన ఇష్మాయేలు క్రియల ద్వారా రక్షణకు ఎలా సాదృశ్యంగా ఉన్నాడో వివరిస్తుంది (గలతీయులకు 4:22-31). ఇష్మాయేలు జననం, విశ్వాసం ద్వారా కాక, శారీరకంగా సాధించింది. **రక్షణ, మొదట వాగ్దానం ద్వారా, తరువాత విశ్వాసం ద్వారా, ఆ తరువాత అద్భుతం ద్వారా కలుగుతుంది.**

(4:20-21) మనిషి సామర్థ్యం కంటే, మనిషి నమ్మకం ద్వారానే దేవుడు మహిమపొందుతాడు.

(4:22) 3వ వచనంపై నోట్స్ ను చూడండి.

► అబ్రాహాము పొందిన రక్షణ మనం పొందిన రక్షణ ఒకటేనా?

(4:23-25) అబ్రాహాము విశ్వాసం మనకొక మాదిరి. అతనికి దేవుని రక్షణ ప్రణాళిక అంతా తెలీదు, కానీ తనకు ప్రత్యక్షపరచబడిన విషయాన్ని నమ్మాడు. అబ్రాహాముకు తెలియని, మనకు బయలుపరచబడిన రక్షణ ప్రణాళికయైన క్రీస్తు మరణ, పునరుత్థానాలను మనం ఖచ్చితంగా నమ్మాలి. ఈ వచనాలు, అబ్రాహాము ఏలాగు నీతిమంతునిగా తీర్చబడెననో మనం కూడా అలాగే నీతిమంతులుగా తీర్చబడ్డామని చెబుతున్నాయి, ఎందుకంటే ఆయనకు నీతి ఆపాదించబడిందని ఇది చెబుతుంది మరియు దానిని ఆధారం చేసుకొని అదే నీతి మనకు కూడా ఆపాదించబడుతుంది.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 3వ భాగం, 3వ లేఖన భాగం

### 5వ అధ్యాయం యొక్క ప్రధానాంశం

క్రీస్తు తన మరణ, పునరుత్థానాల యందు, పాపపు పర్యవసానములను తలక్రిందులు చేసి/రద్దు చేసి, సమాధానాన్ని, నీతిని మరియు జీవాన్ని తీసుకొని వచ్చాడు.

### 5వ అధ్యాయం యొక్క సారాంశం

ఇప్పుడు మనం విశ్వాసం ద్వారా నీతిమంతులంగా తీర్చబడ్డాం గనుక క్రీస్తు ద్వారా దేవునితో సమాధానపడ్డాం (5:1). "మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా" అనే మాట ఈ అధ్యాయపు అంశాన్ని పరిచయం చేస్తుంది: క్రీస్తు ప్రాయశ్చిత్త కార్యం యొక్క సామర్థ్యం. ఆదాము పాపం, లోకాన్ని పాపం క్రిందికి, మరణం క్రిందికి తీసుకొచ్చింది మరియు అతని తరువాత వచ్చిన వారందరూ పాపం చేశారు. క్రీస్తు ప్రాయశ్చిత్తం పాపపు పర్యవసానములను రద్దు చేసింది.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 5వ అధ్యాయాన్ని చదవాలి.

> దేవుని ప్రేమ, కారణరహితమైనది, కొలతలేనిది మరియు అంతం లేనిది.

### వచనాల వారీ వివరణ

(5:1-2a) ఈ వచనం, ముందటి భాగాన్ని, ఈ భాగంతో అనుసంధానిస్తుంది. క్రీస్తు కార్యం యొక్క సామర్థ్యం, ఈ అధ్యాయపు అంశం. సమాధానం అనేది దేవునితో సమాధాన పడడాన్ని సూచిస్తుంది - శతృత్వం తొలగించబడింది మరియు ఉగ్రత తీసివేయబడింది.

యేసు, తానే మార్గమునని చెప్పాడు (యోహాను 10:9). ఈ వచనం కూడా అదే విధమైన విషయాన్ని గురించి మాట్లాడుతుంది, ఎందుకంటే మనము ఆయన ద్వారా, విశ్వాసం చేత కృపలో ప్రవేశం కలిగి ఉన్నాం. ఆయనే మార్గమును, సత్యమును మరియు జీవమునై యున్నాడు (యోహాను 14:6).

(5:2b-5) విశ్వాసి, కృపలో జీవిస్తున్నప్పుడు అతని అనుభవాన్ని ఈ వచనం వివరిస్తుంది.

మనం దేవుని మహిమను అనుభవిస్తామనే నిరీక్షణ వల్లనే మనకు సంతోషం కలుగుతుందని పౌలు చెప్పాడు. శ్రమల్లోనూ మనం సంతోషించగలమని ఆయన చెప్పాడు.

క్రైస్తవునికి ప్రధానమైన, పెద్దవైన విషయాల్లో భద్రత ఉన్నందున చిన్న విషయాల్లో (జీవితపు పరిస్థితుల్లో) ఆనందిస్తూ, సహించగలడు. అవిశ్వాసి, జీవితంలోని విషయాల్లో నుండి సంతోషాన్ని పొందే ప్రయత్నం చేస్తాడు. కానీ ఈ విషయాలు

సంతృప్తిపరచడానికి తగినవి కాదు, అవి త్వరగా గతించిపోతాయి. జీవితం ఒక ప్రయాణమైతే, జీవితంలో ఎదుర్కొనే పరిస్థితులు చెడ్డవేమీ కాదు, కానీ జీవితపు పరిస్థితుల్లో ఏమి లేకపోతే, అవి దౌర్భాగ్యమైనవిగా ఉంటాయి.

శ్రమలను నమ్మకంగా సహించడం, విశ్వాసికి ఒక క్రమాన్ని సాధిస్తుంది (యాకోబు 1:2-4 వచనాలు కూడా చూడండి). మనం విశ్వాసం ద్వారా శ్రమలను సహిస్తే, మనం ఓర్పును అభివృద్ధి చేస్తాం. ఓర్పు అంటే కేవలం ఎదురు చూడడానికి ఇష్టం కలిగి ఉండడం కాదు; విశ్వాసం ద్వారా సహించే సామర్థ్యం. మనం ఓర్పు కలిగిన ఈ విశ్వాసాన్ని అభ్యాసం చేస్తుంటే, మనకు నిరీక్షణనిచ్చే దేవుని పనిని అనుభవించడం, మరియు గమనించడం కొనసాగించగలం. పరిస్థితులు చెడ్డగా కనిపించినప్పుడు కూడా దేవుడు తన ఉద్దేశ్యాలను నెరవేరుస్తాడని మనకు తెలుసు.

► మీరు కఠినమైన/చెడ్డ పరిస్థితుల్లో ఉన్నప్పుడు మిమ్మల్ని మీరు ఎలా ప్రోత్సహించుకుంటారు?

మనం ఇప్పటికే పరిశుద్ధాత్మని ద్వారా మన హృదయాలలో దేవుని ప్రేమను అనుభవిస్తున్నాం గనుక మన నిరీక్షణ సిగ్గుపరచదని మనకు తెలుసు. ఎఫెసీయులకు 1:13-14లో, దేవుడు తాను వాగ్దానం చేసిన సమస్తాన్ని నెరవేరుస్తాడనడానికి పరిశుద్ధాత్ముడు సంచకరువుగా (బయానా) ఉన్నాడని పౌలు చెబుతున్నాడు. ఆత్మ, ఒప్పందానికి ధరావతుగా (డిపాజిట్) ఉన్నాడు.

5:6-10 వచనాలు, మనం నీతిమంతులుగా తీర్చబడడానికి యోగ్యులం కాదని, దానిని సాధించడానికి మనమేమీ చేయలేమని నొక్కి చెబుతున్నాయి. మనం బలహీనులంగాను, పాపులంగాను, శత్రువులుగాను ఉన్నాం.

(5:6) బలహీనులుగా ఉండడం అంటే మనల్ని మనం రక్షించుకోవడానికి, ప్రాముఖ్యంగా ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడం ద్వారా రక్షించుకోవడానికి సామర్థ్యం లేనివారిగా ఉన్నాం అని అర్థం. దేవుడు కోరిన వాటిని నెరవేర్చడంలో లేదా పాపం నుండి మనల్ని మనం విడిపించుకోవడంలో మనం బలహీనులం.

(5:7-8) ఒక మంచి వ్యక్తి కోసం ఎవరైనా చనిపోవడం అనేది అరుదుగా జరుగుతుంది కానీ, మనం పాపులుగా ఉన్నప్పుడే క్రీస్తు మనకొరకు చనిపోయాడు.

(5:9-10) క్రీస్తు, మన మధ్యవర్తిగాను, మన పక్షాన వాదించువాని గాను జీవిస్తున్నాడు. మనం పాపులుగా ఉన్నప్పుడు దేవుడు మనల్ని క్షమించడానికి సిద్ధంగా ఉంటే, అలాంటప్పుడు క్రీస్తునందు నీతిమంతులుగా తీర్చబడిన ఈ సమయంలో మనం మరింత ఎక్కువ అనుగ్రహం పొందవచ్చని పౌలు వాదిస్తున్నాడు. మన కొరకు ఆయన మరణం ద్వారా మనం సమాధానపరచబడి, సజీవుడైన క్రీస్తుతో సంబంధంలో ఉండడం ద్వారా దేవునికి అంగీకారయోగ్యులమవుతాం.

(ఈ క్రింది భాగం, 5:12-10 వచనాలకు ప్రాముఖ్యం)

## ఆదాము చేసిన పాపానికి మనం దోషులమా?

► ఆదాము పాపానికి మనం దోషులమా? మీ సమాధానాన్ని వివరించండి.

రోమా 5 12-19 వచనాలు, ఆదాము చేసిన పాపాన్ని బట్టి సమస్త మానవాళి పాపం క్రిందకు, మరణం క్రిందకు వచ్చిందని వివరిస్తున్నాయి. మనం వ్యక్తిగతంగా ఆదాము పాపాన్ని బట్టి దోషులమా? ఆదాము చేసిన పాపం కొరకు పాపులు శిక్షించబడతారా?

ఆదాము చేసిన పాపాన్ని బట్టి పాపులు శిక్షించబడతారని పౌలు చెప్పడం లేదు. 5:12లో, అందరూ పాపం చేసినందువలన అందరికీ మరణం వచ్చిందని ఆయన చెబుతున్నాడు. ప్రతి వ్యక్తి తన పాపానికి తానే బాధ్యుడు. ప్రజలు, దేవుని ధర్మశాస్త్రాన్ని అతిక్రమించి, పాపులయ్యారు గనుక వారు నీతిమంతులుగా తీర్చబడడం అవసరమని రోమా 1-2 అధ్యాయాలు నొక్కి చెబుతున్నాయి. ప్రజలు, వారు ఏ స్థితిలోనైతే జన్మించారో ఆ స్థితిని బట్టి తీర్పుపొందరు, కానీ పాపం చేయడానికి వారి ఎంపికను బట్టి శిక్షించబడతారు. తీర్పు, క్రియల మూలంగా వస్తుంది (ప్రకటన గ్రంథం 20:12, రోమా 2:6-16, 2 కొరింథీయులకు 5:10).

అయితే, ఆదాము ద్వారా పాపం లోకంలోనికి ప్రవేశించింది. ఇంకా జన్మించని సమస్త మానవాళికి తండ్రిగా, అతడు మానవజాతి అంతటినీ దేవుని నుండి వేరు చేశాడు. ఆ తరువాత జన్మించిన వాళ్ళందరూ, దేవుని నుండి వేరై జన్మిస్తున్నారు, కాబట్టి భ్రష్టులవుతున్నారు. ఆదాము పాపం వలన, మనుష్యులందరూ పాప ప్రవృత్తితో జన్మిస్తున్నారు మరియు వాళ్ళందరూ పాపపు కార్యాలు చేయడం ద్వారా దీనిని అనుసరిస్తున్నారు.

క్రింది ప్రకటనలను ఆ అవగాహనతో అర్థం చేసుకోవాలి:

- ఒకని అపరాధమువలన అనేకులు చనిపోయారు (5:15)
- తీర్పు ఒక్క అపరాధమూలముగా వచ్చినదై శిక్షావిధికి కారణమాయెను (5:16)
- మరణము ఒకని అపరాధమూలమున వచ్చినదై, ఏలుతుంది (5:17)
- ఒక్క అపరాధం మనుష్యులకందరికిని శిక్షావిధి కలుగజేసింది (5:18)
- అతని అవిధేయత వలన అనేకులు పాపులుగా చేయబడ్డారు (5:19)

మనం ఆదాము పాపాన్ని బట్టి దోషులమని పౌలు చెప్పలేదు; కానీ ఆదాము పాపాన్ని తీసుకొచ్చాడని, అందరూ దానిని అనుసరించారని చెబుతున్నాడు. పాపులు, ఆదాము పాపాన్ని బట్టి కాదు గాని, వాళ్ళు చేసిన అనేక అతిక్రమాలను బట్టి క్షమాపణ పొందాల్సిన అవసరం ఉంది.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 3వ భాగం, 3వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(5:12) ఆదాము అతిక్రమం/దోషం వారికి అపాదించడం వలన కాదు గాని, అందరూ పాపం చేయడం వలన మరణం అందరికీ సంప్రాప్తించింది. పాపాన్ని లోకంలోనికి, దాని ప్రభావాన్ని తమ సంతానంపైకి కేవలం ఆదాము తీసుకొనివచ్చాడు.

(5:13-14) ధర్మశాస్త్రం లేకుండా పాపం బయలుపరచబడదు మరియు స్పష్టమైన తీర్పును పొందదు. అయితే, మోషే ధర్మశాస్త్రాన్ని పొందకు ముందు వరకూ, మరణం రాజ్యమేలింది. ధర్మశాస్త్రం అందించే స్పష్టత వారికి లేనప్పటికిని, తాము పాపం విషయమై దోషులమని ప్రజలకు తెలుసు (1:20 చూడండి). పాపం యొక్క నిజమైన పరిధి ధర్మశాస్త్రం వలననే చూపబడుతుంది. ఆదాము పాపం వంటి పాపం, బయలుపరచబడిన ధర్మశాస్త్రానికి ఉద్దేశ్యపూర్వకంగా అవిధేయత చూపడాన్ని సూచిస్తుంది. ప్రత్యక్షత లేని వారికి ఆ స్పష్టతను గూర్చిన అవకాశం ఉండదు, అయినప్పటికిని వారు పూర్తిగా వారి మనస్సాక్షిని అనుసరించరు (1:21).

(5:15) ఆదాము చర్య, అందరికీ మరణాన్ని తీసుకొచ్చింది, క్రీస్తు చేసిన కార్యం, అనేకులకు జీవాన్ని తీసుకొచ్చింది. అనేకులు అనే పదం అందరినీ సూచిస్తుంది. ఆదాము చేసిన పాపం కంటే క్రీస్తు ప్రాయశ్చిత్తం, దాని ప్రభావాలలో మించినదై ఉందని నొక్కి చెప్పబడింది. ఈ వచనం, ఆదాము పాపం, అందరూ పాపులవ్వడానికి ఎలా కారణమైందో, అలాగే క్రీస్తు ప్రాయశ్చిత్తం అందరికీ కృపను అనుగ్రహించిందని చెబుతుంది. ఆదాము పతనం వలన పాపిగా చేయబడిన ప్రతి వ్యక్తికి దేవుడు కృపను అనుగ్రహిస్తున్నాడు.

► 15వ వచనాన్ని ఆధారం చేసుకొని, దేవుడు మానవజాతిలో కేవలం కొద్దిశాతానికి మాత్రమే రక్షణను అనుగ్రహిస్తాడనే భావనలో ఉన్న వ్యక్తికి మీరు ఎలా సమాధానమిస్తారు?

(5:16) మొదటి పాపం/అసలు పాపం కేవలం ఒక చర్య, కానీ కృప ఇప్పుడు అనేక పాపాలకు అవసరం. కృప, మొదటి పాపం కంటే ఎంతో ఉన్నతమైంది.

(5:17-19) ఆదాము పాప ప్రభావం వలన అనేకులు పాపులుగా చేయబడ్డారు. వాళ్ళు క్రీస్తు ద్వారా నీతిమంతులుగా చేయబడ్డారు. వారు రూపాంతరం చెందారనేది అంతరార్థం.

(5:20) ధర్మశాస్త్రం, గతంలో కేవలం కొన్ని పాపాలు మాత్రమే గుర్తించిన చోట సుదీర్ఘమైన అతిక్రమాల జాబితాను తయారు చేస్తుందనే భావనలో ఇది పాపాన్ని రెట్టింపు చేస్తుంది. ఒక వ్యక్తి ధర్మశాస్త్రాన్ని ఎరిగి, దానిని తృణీకరించడానికి నిశ్చయించుకున్నప్పుడు, అతను గతంలో కంటే మరింత దుష్టుడైన పాపి అవుతాడనే భావనలో ఇది పాపాన్ని పెంచుతుంది. ఇదే 7:5-24లో పేర్కొన్న పరిస్థితి. కానీ కృప సమస్త పాపం కంటే మించి వృద్ధి చెందుతుంది.

### అద్భుతమైన కృప

జాన్ న్యూటన్ తల్లి ఒక క్రైస్తవురాలు. అతను నావికుడుగాను, నౌకకు కెప్టెన్ గాను పనిచేస్తూ, లోతైన పాపంలో కూరుకుపోయాడు. అతను తన జీవితంలో కఠినమైన పరిస్థితులను ఎదుర్కొన్నాడు. అతనిని తన స్నేహితులు మోసం చేశారు, కొంతకాలం బానిసగా కూడా ఉన్నాడు. అతని పరిస్థితి మెరుగుపడినప తరువాత కూడా పాపంలో కొనసాగాడు మరియు బానిస వర్తకం ద్వారా అనేకుల జీవితాలు నాశనమవ్వడానికి సహాయం చేసాడు. అతను బానిసల నౌకకు కెప్టెన్ గా చాలా సంవత్సరాల పాటు పనిచేశాడు. ఒక్కసారి అతని నౌక బ్రద్దలై, ఒక ద్వీపంలోకి చిక్కుకుపోయాడు. అక్కడ అతన్ని తన తండ్రికి స్నేహితుడైన ఒక కెప్టెన్ కాపాడాడు. అతను చెడ్డవాడైనప్పటికిని, దేవుడు అతని పట్ల దయచూపించాడని అతను భావించాడు. ఆ తరువాత, ఓడ తీవ్రమైన తుఫానులో చిక్కుకుపోయింది; దయ కొరకు అతను దేవునిని వేడుకున్నాడు. ఆ ఓడ తుఫానులో నుండి బయటపడింది, ఆ తరువాత న్యూటన్ దేవుని దయ కొరకు ఆయనపై ఆధారపడడం కొనసాగించాడు. కాలక్రమేణా అతను సముద్రాన్ని విడిచిపెట్టి, ఒక పాస్టర్ గా మారాడు. అతను రాసిన కీర్తనలలో ఒకటి ఇప్పటివరకు రాయబడిన, ఎంతో ఎక్కువ పాడిన మరియు అత్యధికంగా రికార్డ్ చేసిన పాటల్లో ఒకటి.

“ఆశ్చర్యమౌ అనుగ్రహం, రక్షించే దోషినన్
కోల్పోయితినన్ చేపట్టబడితిన్, అంధత్వం వీడితిన్

తన సాక్ష్యంలో, న్యూటన్, “దేవుడు దయతో నన్ను లోతైన బురద మట్టి నుండి పైకి తీసుకువచ్చాడు మరియు క్రీస్తు యేసు అనే బండపై నా పాదాలను ఉంచాడు. ఆయన నా ఆత్మను రక్షించాడు. ఇప్పుడు తన పోల్చలేని, ఉచితమైన, సార్వభౌమత్వం కలిగిన, విశేషమైన కృపను కీర్తించి, ఘనపరచాలన్నది నా హృదయపు కోరిక, ఎందుకంటే

'నేనేమైయున్నానో అది దేవుని కృపవలననే అయి యున్నాను (1 కొరింథీయులకు 15:10). నా రక్షణను పూర్తిగా దేవుని కృపకు అపాదించడం, నా హృదయం యొక్క గొప్ప సంతోషం" అని చెప్పాడు. [33]

## పాఠం 5 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) రక్షణార్థమైన విశ్వాసం కలిగిన వ్యక్తి ఏం నమ్ముతాడు?

(2) ప్రాయశ్చిత్తం ద్వారా పరిష్కరించబడిన సందిగ్ధత ఏమిటి?

(3) ప్రాయశ్చిత్తం, సందిగ్ధతను ఎలా పరిష్కరించింది?

(4) నీతిమంతులుగా తీర్చబడడం అంటే అర్థం ఏమిటి?

(5) ఒక వ్యక్తి, నీతికి ప్రమాణంగా ధర్మశాస్త్రాన్ని ఎలా సమర్థిస్తారు? (రోమా 3:31)

(6) అబ్రాహాముకు దేవుని కృపను గూర్చిన వాగ్దానం ఏమిటి?

(7) విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం గురించి దావీదు ఏం చెప్పాడు?

(8) అబ్రాహాముకు ఆధ్యాత్మిక సంతానం ఎవరు?

(9) రక్షణ అందరికీ అందించబడుతుందని రోమా 5:15 నుండి మనం ఎలా తెలుసుకోగలం?

## పాఠం 5 - అభ్యాసాలు

క్రింది ప్రశ్నలకు సమాధానాలతో పాటు నీతిమంతులుగా తీర్చబడడం గురించి ఒక పేజీ రాయండి: ప్రాయశ్చిత్తం పరిష్కరించిన సందిగ్ధత ఏమిటి? ఒక పాపి విధేయత ద్వారా ఎందుకు రక్షణ పొందడు? విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడాన్ని అబ్రాహాము ఎలా చూపించాడు? రక్షణ అందరికీ అందుబాటులో ఉందని మనకు ఎలా తెలుసుకోగలం?

---

[33] "John Newton's Conversion," https://banneroftruth.org/us/resources/articles/2001/john-newtons-conversion/ (డిసెంబర్ 29, 2022న ప్రాప్తించబడింది) నుండి తీసుకున్నారు.

# పాఠం 6

# పాపం పై విజయం

## పాపం

రోమా 6వ అధ్యాయం, పాపం యొక్క శక్తి నుండి విడుదల పొందడం గురించి మాట్లాడుతుంది. పశ్చాత్తాపాన్ని, విజయాన్ని అర్థం చేసుకోవాలంటే, అసలు పాపం అంటే ఏమిటో మనం ఖచ్చితంగా అర్థం చేసుకోవాలి.

► పాపం అంటే ఏమిటి?

సాధారణంగా బైబిల్ పాపపు కార్యాలంటే, ఉద్దేశ్యపూర్వకంగా చేసే చర్యలని మాట్లాడుతుంది (1 యోహాను 3:4-9, యాకోబు 4:17). ఒక వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా, తెలిసి తెలిసి దేవునికి విధేయత చూపాలనుకుంటే, అది చిత్తానుసారమైన/ఉద్దేశపూర్వకమైన పాపం.

అనుకోకుండా లేదా తెలియకుండా దేవుని అంతిమమైన ధర్మశాస్త్రాన్ని అతిక్రమించే పాపాలు ఉన్నాయి, అవి ఉద్దేశ్యపూర్వకంగా చేసే పాపాల వలె దేవునితో మన సంబంధాన్ని ప్రభావితం చేయవు. మనం వెలుగులో నడుస్తుండగా, (మనకు తెలిసిన సత్యానికి అనుగుణంగా జీవించడం), మనం పాపాలన్నింటి నుండి శుద్ధీకరించబడతాం (1 యోహాను 1:7) మరియు తెలియకుండా చేసిన అతిక్రమాలు మనల్ని దేవుని నుండి వేరు చేస్తాయని మనం భయపడాల్సిన అవసరం లేదు.

ఈ లేఖన భాగం ప్రాథమికంగా ఉద్దేశ్యపూర్వకంగా చేసే పాపాన్ని గురించి మాట్లాడుతుంది, ఇది విశ్వాసాన్ని పాడు చేసి, దేవునితో ఒక వ్యక్తికి ఉన్న సంబంధాన్ని దెబ్బతీస్తుంది.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 4వ భాగం, 1వ లేఖన భాగం

రోమా పత్రిక యొక్క నాల్గవ భాగం (రోమా 6-8 అధ్యాయాలు) నీతిమంతులుగా తీర్చబడిన వారి పరిశుద్ధీకరణను గురించి మాట్లాడుతుంది.

ఇప్పటి వరకు, పౌలు ఆపాదించబడిన నీతిని గురించి మాట్లాడుతున్నాడు. ఇది విశ్వాసి యొక్క గత పాపాల స్థానంలో జమ చేయబడిన నీతి. ఇప్పుడు ఆయన అనుగ్రహ నీతిని గురించి వివరించడం ప్రారంభించాడు. అనుగ్రహ నీతి కూడా నీతిమంతులుగా తీర్చబడినప్పుడు కృప ద్వారానే అనుగ్రహించబడుతుంది మరియు విశ్వాసి పాపపు శక్తి నుండి

విడిపించబడుతుండడం ద్వారా వాస్తవంగా నీతిమంతునిగా చేయబడతాడు మరియు పరిశుద్ధమైన జీవితాన్ని జీవించడానికి పరిశుద్ధాత్ముని ద్వారా సహకారం పొందుతాడు. కాబట్టి, విశ్వాసి పరిశుద్ధునిగా లెక్కించబడడమే కాదు గాని అతను పరిశుద్ధునిగా చేయబడతాడు; దీనిని పరిశుద్ధీకరణ అంటారు.

ఈ పాఠంలో పాపంపై విజయాన్ని గురించి మాట్లాడే రోమా 6వ అధ్యాయాన్ని మనం అధ్యయనం చేస్తాం.

**6వ అధ్యాయం యొక్క ప్రధానాంశం**

విశ్వాసి పాపపు బానిసత్వం నుండి విడుదల పొందాడు మరియు పాపం యొక్క నియంత్రణలోకి తిరిగి రాకుండా, పాపంపై విజయం సాధించి దేవునిపట్ల విధేయతతో జీవించాలని ఎంచుకోవాలి.

**6వ అధ్యాయం యొక్క సారాంశం**

రోమా 6వ అధ్యాయం, చాలామంది ప్రజలలో ఉండే తప్పుడు ఆలోచనకు పౌలు స్పందన: కృప అందుబాటులో ఉంది గనుక విశ్వాసులు దేవుని నియమాలకు విధేయత చూపుతూ జీవించాల్సిన అవసరం లేదనేది తప్పుడు ఆలోచన. కృపను గురించి తప్పుగా అర్థం చేసుకోవడం, ఈ తప్పుడు ఆలోచనకు మూలం. రెండు ఊహాత్మక ప్రశ్నలను అడిగి, వాటికి సమాధానాలు చెప్పడం ద్వారా ఈ తప్పుడు ఆలోచనకు పౌలు స్పందిస్తున్నాడు (6:1, 15).

కొంతమంది వ్యక్తులు 5:20ని చదివినప్పుడు, మనం మరింత కృపను కలిగి ఉండగలుగునట్లు, పాపంలో కొనసాగాలి అని వాదిస్తారు (6:1). మన పాపాల చిట్టా ఆపాదించబడిన నీతితో భర్తీ చేయబడింది కాబట్టి, మనం పాపం చేస్తూనే ఉన్నా పర్వాలేదు అని వారు భావిస్తున్నట్లు అనిపిస్తుంది.

విశ్వాసులు, దేవుని నియమాలకు విధేయత చూపుతూ జీవించాల్సిన అవసరం లేదని మరికొంతమంది వ్యక్తులు భావించటానికి మరో కారణం ఉంది. మనం మన క్రియలను బట్టి కాక, కృపను బట్టి అంగీకరించబడ్డాం. ఈ కారణాన్ని బట్టి మనం చేసేది పెద్ద విషయం కాదని వాళ్ళు తప్పుగా అనుకుంటారు (6:15).

ఈ రెండు ఊహాత్మక ప్రశ్నల వాదనను పౌలు బలంగా ఖండిస్తున్నాడు. పాపంపై విజయం ఎందుకు ప్రాముఖ్యమో ఆయన వివరిస్తూ స్పందించాడు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 6వ అధ్యాయాన్ని చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(6:1) ఇక్కడ పాపం కంటే ఎక్కువగా కృప విస్తరిస్తుందని విన్న తరువాత ఎవరైనా సహజంగానే అడిగే ప్రశ్నను అపొస్తలుడు అడిగాడు. పాపం దాని ఫలితాలలో నిజంగా మంచిది, ఎందుకంటే మరింతగా కృపను పొందడానికి అదొక మార్గమని ఎవరైనా అనుకోవచ్చు. ఇది మనం పాపంలో అజాగ్రత్తగా జీవించడానికి స్వేచ్ఛను కలిగి ఉన్నామనే ఆలోచననిస్తుంది.

(6:2) ఈ ప్రశ్న సరైంది కాదన్నట్లుగా అపొస్తలుడు స్పందించాడు. తరువాత మనం పాపంలో చనిపోయాం కాబట్టి మనం పాపంలో జీవించడం అనేది సాధ్యం కాదని వివరించాడు.

(6:3-5) మనం క్రీస్తుతో కూడా ఆయన మరణ పునరుత్థానాలలో ఐక్యమయ్యాం కాబట్టి మనం పాపంలో కొనసాగము. 5:15-19 వివరించినట్లు, యేసు మనందరి కోసం రక్షణ కార్యాన్ని నెరవేర్చాడు. విశ్వాసం ద్వారా మనం ఆయనతో సంబంధంలోనికి వస్తాం, తద్వారా దేవుని అనుగ్రహం క్రీస్తుకు ఉన్నట్లే మనకు కూడా విస్తరించబడుతుంది.

యేసు ఒక్కసారే పాపం విషయమై మరణించాడు, తరువాత దేవుని కొరకు జీవిస్తున్నాడు. యేసు, తన కొరకు కాదు మనకొరకే మరణించాడు, కానీ పాపాన్ని గూర్చిన విషయం సమాప్తమైంది. విశ్వాసం ద్వారా, మనం మరణించి, ఆయనతో కూడా లేచాము; కాబట్టి మనం కూడా పాపం విషయంలో మృతిపొందాము.

బాప్తిస్మం అనేది యేసు మరణ పునరుత్థానాలలో మనం భాగస్వాములమయ్యామని సూచించే విషయం.

(6:6) ప్రాచీన స్వభావం, మారుమనసు పొందకమునుపు పాపజీవితాన్ని సూచిస్తుంది. (ఈ పాఠంలో తరువాతి భాగం, ప్రాచీన స్వభావాన్ని గూర్చిన అంశాన్ని వివరిస్తుంది.) పాప జీవితం సంపూర్ణంగా ముగిసింది, కాబట్టి మనమికమీదట పాపమునకు దాసులం కాదు.

**పాపానికి ఏమవుతుందనే దానిని గురించి ఈ లేఖన భాగంలో ఉపయోగించిన పదాన్ని గమనించండి: పాపం మృతమైనది, సిలువ వేయబడింది మరియు నాశనం చేయబడింది. ఈ పదాలు, పాపంపై విజయాన్ని వ్యక్తపరుస్తాయి.**

(6:7-11) విశ్వాసి జీవితంలో పాపం యొక్క నియంత్రణ శాశ్వతంగా ముగిసిందని ఈ వచనాలు నొక్కి చెబుతున్నాయి. మరణం, దీనికి వివరణ. మరణించిన వ్యక్తి, పాపం నుండి విడుదల పొందుతాడు, మరియు మనం మరణం వంటి ఆత్మీయ అనుభవాన్ని కలిగి ఉండాలి.

పునరుత్థానం తరువాత, యేసు మరలా మరణించడు, మరణంలోను కొనసాగడు. ఆయన మరణంతో ముగించాడు. మనం పాప విషయంలో సంపూర్ణంగా చనిపోయి, ముగించి, దాని నుండి విడుదల పొందాలి. పాపం విషయమై మరణించడం ముగించబడాలి, ఆ తరువాత మనం దేవుని కొరకు జీవించాలి.

రోమా 6:1-23లో పౌలు వివరించినట్లు, పాపం విషయమై క్రీస్తు చనిపోయి, సమాధి చేయబడి, ఆ తరువాత పునరుత్థానం చెందడంతో ఐక్యత కలిగి ఉండడం, క్రైస్తవుడిని పాపపు శక్తినుండి, బానిసత్వం నుండి విడిపిస్తుంది. అతను పాపం విషయం చనిపోయాడని (రోమా 6:2) మరియు దాని నుండి విడుదల పొందాడని (రోమా 6:7) ప్రకటించబడింది. పాపం విషయమై చనిపోవడం అంటే పాపం యొక్క శక్తి క్రింద లేక నియంత్రణ క్రింద జీవించకపోవడం. విశ్వాసం ద్వారా, ఒక విశ్వాసి తాను పాపం విషయమై చనిపోయి, యేసుక్రీస్తు నందు దేవుని కొరకు జీవిస్తున్నానని పరిగణించాలి (రోమా 6:11). దేవుడు తనని గురించి సత్యమని ప్రకటించిన దానిని క్రైస్తవుడు తన వ్యక్తిగత అనుభవంలోనికి తీసుకురావడమని దీనర్థం. అతను తన శరీరంలో పాపాన్ని ఏలనివ్వకూడదు (రోమా 6:12), లేదా అతను తన అవయవాలను దుర్నీతి సాధనాలుగా పాపానికి అప్పగించకూడదు (రోమా 6:13). దానికి బదులుగా, అతను పరిశుద్ధమును, దేవునికి అంగీకారమునునైన సజీవయాగంగా తనని తాను సమర్పించుకోవాలి (రోమా 12:1) మరియు తన శరీర అవయవాలను నీతికి సాధనాలుగా వాడుకోవాలి (రోమా 6:13, 19).[34]

రోమా 6:11లో, ఎంచుకొనుడి అనేది ఖాతా లెక్కలకు సంబంధించింది. ఇది సత్యమైన దానిని ధృవీకరించడం. ఇది నటనతో/కపటంతో చేసే ప్రకటన కాదు. అపొస్తలుడు, సత్యం కాని దానిని చెప్పమని విశ్వాసులకు సూచించడం లేదు. ఒక విశ్వాసి తాను మరణించినట్లుగా పాపం నుండి సంపూర్ణంగా విడుదల పొందాడని గ్రహించాలి మరియు అతను పాపపు శక్తి నుండి సంపూర్ణ స్వేచ్ఛతో జీవించడానికి ఎంచుకోవాలి.

► మిమ్మల్ని మీరు పాపం విషయమై చనిపోయిన వారిగా ఎంచుకోవడం అంటే అర్థం ఏమిటి?

**ఈ అధ్యాయంలోని మిగిలిన భాగం, పాపంపై విజయం ప్రాముఖ్యమనే మరో కారణాన్ని వివరిస్తుంది. మనం పాపానికి బానిసలం కాదు, దేవునికి దాసులం. మీరు ఇద్దరినీ సేవించలేరు. నీవు పాపానికి బానిసగా ఉంటే నీతిని జరిగించలేవు (6:20). ఇప్పుడు మీరు పాపం నుండి విడుదల పొంది, దేవునికి దాసులయ్యారు; కాబట్టి, మీరు పరిశుద్ధతతో జీవిస్తారు (6:22).**

(6:12-13) ఇక్కడ మనం ఒక వ్యత్యాసాన్ని చూస్తాం. పాపంపై మనకు విజయం లేకపోతే, పాపం మనల్ని పరిపాలిస్తుంది. విశ్వాసులను, పాపపు కోరికలు నియంత్రించకూడదు. మీ శరీరాన్ని తప్పుడు చర్యలకు

---

[34] ఈ పారాగ్రాఫ్ ను డా. అల్లాన్ బ్రౌన్ రాశారు.

ఉపయోగించడం అంటే పాపపు అధికారానికి అప్పగించడమే అవుతుంది. దానికి బదులుగా, మీ శరీరం దేవునికి చెందినది, దానిని ఆయన కోసమే ఉపయోగించాలి.

(6:14) **ధర్మశాస్త్రానికి లోనైయుండడం అంటే దేవుని అంగీకారం కొరకు ధర్మశాస్త్రానికి విధేయత చూపడంపై ఆధారపడడమని అర్థం.** ఆ వ్యక్తి రక్షణార్థమైన కృప లేకుండా ఉంటాడు, కాబట్టి క్రియల ఆధారంగానే తీర్పుతీర్చబడతాడు. కృప లేకుండా ఎవరూ పాపంపై విజయం సాధించలేరు కాబట్టి, ధర్మశాస్త్రానికి లోబడి ఉండటం అంటే ఖండించబడడం/శిక్షను పొందడం మరియు పాపం యొక్క శక్తి కింద ఉండటం అని అర్థం. కృప క్రింద ఉండడం అంటే దేవుని అంగీకారం కొరకు కృపపై ఆధారపడడం. **కృప క్రింద ఉన్న వ్యక్తి, పాపపు శక్తి క్రింద ఉండడు**. ధర్మశాస్త్రానికి లోబడి ఉండడం లేదా కృప లోబడి ఉండడం అనేవి పాత నిబంధనలో లేదా క్రొత్త నిబంధనలో ఉండడాన్ని సూచించవు.

► ధర్మశాస్త్రం క్రింద ఉండడం అంటే అర్థం ఏమిటో వారి స్వంత మాటల్లో వివరించమని విద్యార్థులను అడగండి.

(6:15) మనం ధర్మశాస్త్రం క్రింద లేమని విన్నప్పుడు ఎవరైనా అడిగే ప్రశ్నను అపొస్తలుడు ఇక్కడ అడుగుతున్నాడు: “ధర్మశాస్త్రానికి లోబడిన వారము కాదు గనుక మనం పాపం చేస్తామా?” దేవుని ఎదుట మన అంగీకారాన్ని, మన విధేయత ద్వారా సాధించకపోతే, అప్పుడు విధేయత అవసరం లేదని ఒక వ్యక్తి ఆలోచిస్తాడు. పౌలు ఈ ప్రశ్నకు ఎంతో బలంగా స్పందించాడు.[35]



రోమా **మిలిటరీ/సైన్యం**

రోమా సైన్యం, దాని శిక్షణలోను, క్రమశిక్షణలోను, సామాగ్రిలోను ఇతరుల కంటే ఎంతో ఉన్నతమైనది. ఎఫెసీయులకు 6:13-17లో, పౌలు ఆత్మీయ పోరాటాన్ని వివరించడానికి రోమా సైనికుల కవచాన్ని ఉపయోగించాడు.

కృప స్వతస్సిద్ధంగా, కొనసాగుతున్న పాపాన్ని ఎందుకు కప్పలేదో పౌలు నేరుగా వివరించలేదు. దానిని బదులుగా, ఒక వ్యక్తి పాపపు శక్తికి లోబడి ఉంటే, అతను దేవుని సేవకుడు కాలేడని ఆయన వివరించాడు.

(6:16) మీరు దేవునికి, పాపానికి సేవ చేయడం అసాధ్యం, ఎందుకంటే మీరు లోబడిన వారికి దాసులవుతారు. మీరు పాపానికి లోబడితే, పాపం మీకు యజమాని, అంటే దేవుడు మీ యజమాని కాదని అర్థం. అపొస్తలుడైన పేతురు చెబుతున్నట్లు, “ఒకడు దేనివలన జయింపబడునో దానికి దాసుడవుతాడు (2 పేతురు 2:19). మీరు పాపానికి బానిస కాకుండా పాపానికి లోబడలేరు.

[35] Piqsels నుండి తీసుకున్న చిత్రం. https://www.piqsels.com/en/public-domain-photo-sriuc.

(6:17-18) విశ్వాసులు పాపం యొక్క శక్తి నుండి విడుదల పొంది, ఇప్పుడు నీతికి దాసులుగా ఉన్నారు. వాళ్ళు సువార్తకు లోబడడం ద్వారా ఈ విడుదలను అనుభవిస్తున్నారు. మరలా, వాళ్ళు నీతికి దాసులుగా ఉండాలంటే వాళ్ళు ఖచ్చితంగా పాపం నుండి విడుదల పొందాలి.

**ఈ అధ్యాయమంతా పాపం చేత బంధించబడి ఉండడానికి మరియు విజయంలో జీవించడానికి మధ్య ఉన్న పూర్తి వ్యత్యాసాన్ని అందిస్తోంది. ఒక విశ్వాసి పాపపు శక్తి క్రింద ఉండడం లేదా ఒక పాపి, పాపంలో కొనసాగుతూనే నీతిని జరిగించడం సాధ్యమయ్యేది కాదు. పౌలు మరింత ఖచ్చితంగా/స్పష్టంగా చెప్పగలిగే మార్గాన్ని కనుగొనడం కష్టం.**

(6:19) వాళ్ళు ఈ విషయాన్ని అర్థం చేసుకోగలుగునట్లు దీనిని మానవ పరిభాషలో (మనుష్యరీతిగా) వివరిస్తున్నానని ఆయన చెప్పాడు. వాళ్ళు గతంలో పాపానికి లోబడ్డారు, అది వారిని మరింత లోతైన పాపం లోనికి నడిపించింది. ఇప్పుడు, వాళ్ళు వాళ్ళ క్రియలలో నీతిమంతులుగా ఉన్నారు, అది పరిశుద్ధతకు ఆవశ్యకం. ఒక వ్యక్తి సరైన క్రియలు చేయడం ద్వారా పరిశుద్ధులవ్వరు, కానీ అతను సరైంది చేయకపోతే పరిశుద్ధుడు కాలేడు.

► ఒకే సమయంలో పాపంలో జీవిస్తూ, దేవునికి దాసులుగా ఉండడం యొక్క అసాధ్యతను మీరు ఎలా వివరించగలరు?

(6:21-23) పాపం ఏ మేలును కలిగించదు గాని సహజంగానే మరణాన్ని తీసుకొస్తుంది. పాపి, మరణాన్ని సంపాదిస్తాడు; పాపం వలన వచ్చు జీతం మరణం. విశ్వాసి, నిత్యజీవాన్ని సంపాదించడు, ఎందుకంటే అతను దానిని సంపాదించలేడు; అతను దానిని కృపావరంగా పొందుతాడు.

## వ్యక్తిగత రక్షణ నిశ్చయతకు ఆధారం

ఒక వ్యక్తి క్రీస్తును అంగీకరించిన తర్వాత అతని జీవనశైలి పూర్తిగా విరుద్ధంగా ఉన్నప్పటికీ అతని రక్షణ భద్రంగా ఉంటుందని కొందరు అనుకుంటారు.[36] ఒక వ్యక్తి జీవితం మారనప్పుడు; పశ్చాత్తాపం, మారుమనసు యొక్క ఫలం కనిపించనప్పుడు; మరియు ఆ వ్యక్తి యేసుకు నిజమైన శిష్యుడిగా మారడానికి నిరాకరించినప్పుడు కూడా, అతను రక్షణను పొందానని తప్పుగా ప్రకటించవచ్చు. ఇది ఘోరమైన మోసం మరియు అనేక లేఖనాలకు విరుద్ధంగా ఉంది.

> మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములుగలవారమును, నిర్మలమైన ఉదకముతో స్నానముచేసిన శరీరములుగలవారమునైయుండి, విశ్వాసవిషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము.(హెబ్రీయులకు 10:22).

[36] ఈ భాగాన్ని టిమ్ కీప్ రాశారు.

కడవరి కాలమందు బయలుపరచబడుటకు సిద్ధముగానున్న రక్షణ మీకు కలుగునట్లు, విశ్వాసముద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీకొరకు, ఆ స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచబడియున్నది.(1 పేతురు 1:5).

ఈ లేఖన భాగాల నుండి బైబిల్ వాక్యానుసారమైన రక్షణ నిశ్చయత **విశ్వాసం**పై ఆధారపడి ఉంటుందని నేర్చుకుంటాం:

- రక్షణ నిశ్చయత విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది, అది "సంపూర్ణ నిశ్చయతను" **కలిగి ఉంటుంది.** నిశ్చయత అనేది సువార్త యొక్క స్పష్టమైన అవగాహనతో ప్రారంభమవుతుంది (1 కొరింథీయులకు 15:3-4). ఇది కొలొస్సయులకు 2:2లో కూడా చెప్పబడిన "సంపూర్ణ గ్రహింపుయొక్క సకలైశ్వర్యము". రక్షణ, కృప ద్వారా, మన పక్షాన క్రీస్తు యొక్క ప్రత్యామ్నాయ మరణంలో విశ్వాసముంచడం ద్వారా కలుగుతుంది (ఎఫెసీయులకు 2:8-9). రక్షణకు కావలసింది పాపరహితమైన పరిపూర్ణత కాదు (ఎవరు అర్హతను పొందలేరు) లేదా రక్షించబడ్డామని ఎల్లప్పుడూ భావించడం కాదు, కానీ మనం విఫలమైనప్పుడు కూడా క్రీస్తు యొక్క యోగ్యతపై, ఆయన సంపూర్తి చేసిన విమోచన కార్యంపై స్థిరమైన నమ్మకం కావాలి. నిజమైన రక్షణార్థమైన విశ్వాసం వచ్చిన తరువాత విశ్వసనీయత పట్ల మక్కువ వస్తుంది.

- **రక్షణ నిశ్చయత యదార్థమైన విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది -** "యథార్థమైన హృదయం": యదార్థంగా మారుమనసు పొందిన వ్యక్తి, "మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన" (హెబ్రీయులకు 10:22) వ్యక్తి. అవమానం, అపరాధభావన తీసివేయబడి, శాంతితోను, ప్రేమతోను భర్తీ చేయబడినాయి. యదార్థంగా మారుమనసు పొందిన వ్యక్తి, తన శరీరాన్ని "నిర్మలమైన ఉదకముతో స్నానముచేసిన వ్యక్తి," ఎందుకంటే పాతవి గతించి, సమస్తం నూతనంగా చేయబడ్డాయి (2 కొరింథీయులకు 5:17). యదార్థంగా మారుమనసు పొందిన వ్యక్తి, క్షమాపణ పొందునట్లు తన పొరపాట్లను, పాపాలను ఒప్పుకొని, వాటి నుండి విడుదల పొందిన వ్యక్తి (మత్తయి 6:12; యాకోబు 5:16).

- **నిశ్చయత, సజీవమైన విశ్వాసానికి లోబడి పనిచేస్తుంది** "విశ్వాసముద్వారా దేవుని శక్తిచేత కాపాడబడుట" ఒక కోటను లేదా దుర్గాన్ని కాపాడడం లాంటిదే ఈ ఆలోచన. దేవుని దైవీకమైన శక్తి కాపాడుతుంది, సంరక్షిస్తుంది, చివరికి విజయంలోనికి నడిపిస్తుంది. మనం విశ్వాసం ద్వారా వినియోగించే క్రీస్తు శుద్ధీకరణ రక్తం యొక్క శక్తి మరియు పునరుత్థానపు శక్తి మన ఆత్మలను నిత్యజీవం కొరకు సంరక్షిస్తుంది. పట్టుదల కలిగి స్థిరంగా ఉండే విశ్వాసమే అంటే క్రీస్తునందు, సిలువపై ఆయన చేసిన చేసి ముగించిన కార్యమందు నిరంతరం నమ్మకముంచే విశ్వాసమే నిజమైన రక్షణార్థమైన విశ్వాసం. విశ్వాసం క్రియ కాదు, కానీ అది

రక్షణకు షరతు. హెబ్రీ గ్రంథ కర్త దానిని ఈవిధంగా చెబుతున్నాడు: "విశ్వాసములేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము" (హెబ్రీయులకు 11:6).

రక్షణకు మరే ఇతర విషయాలను జోడించినా అది సాంప్రదాయవాదమవుతుందని నమ్ముతారు, కానీ యేసు, క్రొత్త నిబంధనలోని ప్రతి రచయిత విశ్వాసంలో కొనసాగడం యొక్క ఆవశ్యకతను స్పష్టంగా బోధించారు.

> మీరు **నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై** యుండి సత్యమును గ్రహించెదరు (యోహాను 8:31)
>
> .... ఆకాశముక్రింద ఉన్న సమస్తసృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్తవలన కలుగు నిరీక్షణనుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచి యుండినయెడల ఇది మీకు కలుగును.... (కొలొస్సయులకు 1:23).
>
> నా యెదుట నీతిమంతుడైనవాడు విశ్వాసమూలముగా జీవించును గాని అతడు వెనుకతీసినయెడల అతని యందు నా ఆత్మకు సంతోషముండదు. (హెబ్రీయులకు 10:38).
>
> ...నీవు విశ్వాసమును మంచి మనస్సాక్షియు కలిగినవాడవై... అట్టి మనస్సాక్షిని కొందరు త్రోసివేసి, **విశ్వాసవిషయమై ఓడ బద్దలై పోయినవారివలె** చెడియున్నారు. (1 తిమోతికి 1:18-19)

రక్షణ నిశ్చయతను గురించి వివరిస్తూ, జాన్ వెస్లీ ఈ విధంగా చెప్పాడు,

> నా ఆదరణ అనేది, ఒక విశ్వాసి పడిపోవడం, లేదా పడకుండా ఉండడం అనే అభిప్రాయంపై గాని, నేను నిన్న చేసిన ఒక పనిని జ్ఞాపకం చేసుకోవడంపై గాని ఆధారపడి ఉండదు. కానీ ఈరోజుపై, ప్రస్తుతం నన్ను తనతో సమాధానపరచుకొనే క్రీస్తునందు నాకున్న దేవుని జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. యేసుక్రీస్తు ముఖంలో దేవుని మహిమ కాంతిని నేను చూడడంలో ఉంటుంది; ఆయన వెలుగులో ఉన్నట్లుగా నేను కూడా వెలుగులో ఉండడంపై, తండ్రితోను, కుమారునితోను సహవాసం కలిగి ఉండడంపై ఆధారపడి ఉంటుంది. కృప ద్వారా ప్రభువైన యేసుక్రీస్తు నందు మరియు నేను దేవుని కుమారుడనని నా ఆత్మతో సాక్ష్యమిచ్చే ఆత్మయందు విశ్వాసముంచడంలో నా ఆదరణ ఉంది.[37]

---

[37] John Wesley, "Serious Thoughts Upon the Perseverance of the Saints", in *The Works of John Wesley: Letters, Essays, Dialogs and Addresses Vol. X*, (Grand Rapids, MI: Zondervan) 295. Also available online at: https://archive.org/details/worksofjohnwesle0010wesl/

► ముందు చెప్పిన అంశాల నుండి, ఒక క్రైస్తవుడు సజీవమైన విశ్వాసాన్ని ఆధారం చేసుకొని రక్షణ నిశ్చయతను కలిగి ఉండగలడని ఎలా వివరించగలరు?

## ప్రాచీన స్వభావం

ప్రాచీన స్వభావం అనే మాట పత్రికల్లో మూడు సార్లు కనబడుతుంది. ఈ మూడుసార్లు కూడా పౌలే ఈ మాటను ఉపయోగించాడు. ఈ మూడు మాటలను వాటి సందర్భాలతో పోల్చడం ద్వారా మనం ఈ మాటకు అర్థం ఏమిటో చూడవచ్చు.

### కొలొస్సయులకు 3:9

కొలొస్సయులకు 3:9-10 వచనాలు, “...ఏలయనగా ప్రాచీనస్వభావమును దాని క్రియలతోకూడ మీరు పరిత్యజించి, జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించినవాని పోలికచొప్పున నూతన పరచబడుచున్న నవీనస్వభావమును ధరించుకొని యున్నారు” అని చెబుతుంది. ఈ విశ్వాసులు ఇప్పటికే తమ ప్రాచీన స్వభావాన్ని పరిత్యజించారని పౌలు చెబుతున్నాడు. వాళ్ళు ఇప్పటికే సంపూర్ణంగా పరిశుద్ధులనేది ఆయన ఉద్దేశ్యం కాదు, ఎందుకంటే కొలొస్సయులకు 3వ అధ్యాయం చాలా వరకు వారిని పరిశుద్ధత కొరకు పిలుస్తుంది.

ముందు ఆయన కొలొస్సయ విశ్వాసులతో, "... పైనున్న వాటినే వెదకుడి... భూసంబంధమైనవాటిమీద మనస్సు పెట్టుకొనకుడి; ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతోకూడ దేవునియందు దాచబడియున్నది" (కొలొస్సయులకు 3:1-3). అని చెప్పాడు. ఆయన ఇంకా చెబుతూ, “భూమిమీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి” (3:5) అని అన్నాడు. అలాంటి పాపాలు దేవుని తీర్పును తీసుకొస్తాయని 3:6 చెబుతుంది మరియు ఈ విశ్వాసులు గతంలో వీటిని చేసేవారని 3:7వ వచనం చెబుతుంది. వాళ్ళు తమ జీవితాల్లో ఆ విషయాలను ఏ మాత్రం సహించకూడదని పౌలు అడుగుతున్నాడు. వాళ్ళు ఆ విషయాలన్నింటిని చంపివేయాలనే ప్రకటన ద్వార ఇది సూచించబడింది.

కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, మీనోట బూతులు లాంటి వాటిని విసర్జించాలని (3:8) ఆయన పిలుస్తున్నాడు. ఇవి క్రీస్తు జీవితంతో ఏ మాత్రం సంబంధం లేనివి.

తరువాత, వాళ్ళు తమ ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడా పరిత్యజించారు గనుక ఇదంతా చేస్తున్నారనే ప్రకటన యొద్దకు మనం వస్తాం.

వాళ్ళు పరిశుద్ధమైన లక్షణాలను వివరించడం ద్వారా (3:12), సంబంధాలలో క్రీస్తును పోలిన స్వభావాన్ని కలిగి ఉండమని బ్రతిమాలడం ద్వారా (3:13), వారి క్రైస్తవ విశ్వాసంలో ముందుకు పురోగమించమని ఆయన పిలిచాడు , తరువాత పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొనుడి (3:14) అని చెబుతున్నాడు.

ఈ సందర్భంలో ప్రాచీన స్వభావం అంటే మారుమనసు పొందినప్పుడు విడిచిపెట్టే ప్రాచీన జీవితాన్ని సూచిస్తుంది. వాళ్ళు దానిని చేశారు గనుక, వాళ్ళు సంపూర్ణమైన పరిశుద్ధతలోనికి పురోగమిస్తారని పౌలు నమ్ముతున్నాడు.

**ఎఫెసీ 4:22**

ఈ వచనం, కొలొస్సయ పత్రికలోని వచనంతో సమాంతరంగా ఉన్న లేఖనం నుండి వస్తుంది. 4:17-19 వచనాల్లో, ఆయన అన్యజనుల జీవిత విధానాన్ని/జీవితశైలిని గురించి వివరించాడు; ఆ తరువాత 4:20లో దీనిని విశ్వాసి జీవితంతో విభేదించాడు. 4:21-24 వచనాలు, "క్రీస్తును నేర్చుకోవడం" (4:20) మరియు ఆయన మాట వినడం, ఆయన ద్వారా నేర్చుకోవడం (4:21) అంటే ఏమిటో వివరిస్తాయి. ఈ విషయాల్లో ప్రాచీన స్వభావాన్ని పరిత్యజించి, నూతన స్వభావాన్ని ధరించుకోవడం అనేవి భాగంగా ఉంటాయి. వాళ్ళు మారుమనసు పొందినప్పుడు జరిగిన దానిలో ఇది భాగంగా ఉంటుంది.

ఎఫెసీ పత్రికలోని ఈ లేఖనభాగం, కొలొస్స 4వ అధ్యాయంలో నమూనా మాదిరిగానే ఉంటుంది. ప్రాచీన స్వభావాన్ని పరిత్యజించడం, వాళ్ళు ఇప్పటికే నేర్చుకున్న సువార్తలో భాగం అనే ప్రకటన చేసిన తరువాత, అబద్ధమాడవద్దు అనేది పౌలు చెప్పిన మొదటి ఆజ్ఞ. కోపం, సకలవిధమైన దుష్టత్వము, దూషణ మొదలగు వాటిని గురించి ప్రస్తావించాడు. దయకలిగి క్షమించుకోవాలని వారికి చెప్పాడు. కొలొస్సయ పత్రికలో ఇప్పటికే ప్రాచీన స్వభావాన్ని విడిచిపెట్టారు అని చెప్పిన తరువాత, ఇవే విషయాలను గురించి ప్రస్తావించారు.

ప్రాచీన స్వభావం అనేది విశ్వాసి ఇప్పటికీ విడిచిపెట్టవలసిన విషయం కాదు, కానీ మార్పుమనసు పొందిన సమయంలో విడిచిపెట్టింది. వాళ్ళు ఇప్పటికీ సంపూర్ణంగా పరిశుద్ధులు కాదు. వాళ్ళు ప్రాచీన స్వభావాన్ని విడిచిపెట్టినప్పుడు ప్రారంభమైన దాని విషయంలో స్థిరంగా ఉండడం ద్వారా వారి జీవితాల్లో పరిశుద్ధతను సంపూర్తి చేయమని పౌలు వారిని ఆహ్వానిస్తున్నాడు.

**రోమా 6:6**

ఈ లేఖనభాగంలో, విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య గొప్ప వ్యత్యాసాన్ని పౌలు చూపించాడు. యేసును వెంబడించే వ్యక్తి పాపంపై విజయాన్ని కలిగి ఉన్నాడనే నిశ్చయతనివ్వడం ఈ అధ్యాయం యొక్క ముఖ్యాంశం. విశ్వాసి పాపంపై

విజయం కలిగి జీవించగలడని నిరూపించడానికి ప్రాచీన స్వభావం సిలువ వేయబడిందనే ఒక కారణాన్ని ఇస్తున్నాడు. "ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతోకూడ సిలువ వేయబడెనని యెరుగుదుము." విశ్వాసి మారుమనసు పొందినప్పుడు జరిగిన కార్యం కారణంగా పాపం నుండి విడుదల పొందగలడని ఆయన చెబుతున్నాడు.

**ముగింపు**

అయితే ప్రాచీన స్వభావం అంటే అర్థం ఏమిటి? ప్రాచీన స్వభావం అంటే ఒక వ్యక్తి మారుమనసు పొందినప్పుడు విడిచిపెట్టిన స్వయం కేంద్రీత పాపపు జీవితం.

నూతనంగా మారుమనసు పొందిన వ్యక్తి, నూతన స్వభావం కంటే ప్రాచీన స్వభావానికి అనుగుణంగా ఉన్న ప్రవర్తనలను, వైఖరులను కలిగి ఉంటాడు. అందుకే పౌలు ప్రాచీన స్వభావాన్ని తిరస్కరించడానికి అనుగుణంగా తమ జీవితాలలో దిద్దుబాటు చేసుకొమ్మని విశ్వాసులకు చెబుతున్నాడు. ఆయన, "మీరు మీ ప్రాచీన పాపపు జీవితాన్ని విడిచిపెట్టినందున, నీతియుక్తమైన నూతన జీవితానికి సరిపోని ప్రవర్తనను మీరు మానివేయాలి" అని చెబుతున్నాడు.

## మన పరిశుద్ధీకరణకు యేసు యొక్క ఏర్పాటు

రోమా 6:1-10 వచనాలు, మన వ్యక్తిగత పరిశుద్ధీకరణ కొరకు యేసు అనుగ్రహించిన విషయాలను గురించి మనకు వివరిస్తాయి.[38] మనం నూతనంగా జన్మించినప్పుడు, క్రీస్తునందు స్థాపించబడ్డాము. ఆయన మరణించి, తిరిగి లేచుట ద్వారా సాధించినవన్నీ ఇప్పుడు ఆయనయందు మన స్వంతమయ్యాయి. పాపంపై సంపూర్ణ విజయం సాధించడానికి అవసరమైన వనరులన్నీ క్రీస్తునందు మనం కలిగి ఉన్నామని దీనర్థం.

క్రీస్తుతో మన ఐక్యతను బట్టి, ఆయనకు జరిగింది మనకు కూడా జరుగుతుంది. ఆయన మరణించినప్పుడు, నేను కూడా మరణించాను. ఆయన తిరిగి లేచినప్పుడు, ఆయనలో నేను కూడా లేచాను. క్రీస్తుతో సజీవమైన ఈ ఐక్యతను బట్టి, విశ్వాసి పాపంతో పూర్తిగా ఒక నూతనమైన సంబంధాన్ని కలిగి ఉంటాడు. మనమిప్పుడు పాపం విషయమై చనిపోయాం. మనం పాపపు కార్యాల విషయమై, పాపపు నియమం విషయమై కూడా చనిపోయాం. ఇది పాపంతో మన స్థాన సంబంధం.

క్రీస్తుతో మన ఐక్యతను బట్టి, మనం జీవితపు నూతనత్వంలో నడుస్తున్నాం, ఎందుకంటే మనం ఆయన పునరుత్థాన జీవాన్ని పంచుకొంటున్నాం.

---

[38] ఈ భాగాన్ని డా. అల్లాన్ బ్రౌన్ రాశారు.

క్రీస్తుతో మన ఐక్యత కారణంగా, ఆయన సిలువ కార్యం, నా సిలువ కార్యంగా మారింది. ఆయన మరణం పాపపు శక్తిని ఓడించింది గనుక, మన జీవితంలో దాని శక్తి క్రింద, అధికారం క్రింద ఉండము.

ఎంచుకొనుట అనే మాటకు అర్థం ఏమిటి? (రోమా 6:11). ఈ సందర్భంలో, ఇది ఖాతాపుస్తకాలను నిర్వహించడానికి సంబంధించిన పదం. ఈ గ్రీకు పదం భిన్నమైన లేఖనభాగాలలో, భిన్నమైన పదాలుగా అనువాదం చేసినప్పటినికి, క్రొత్తనిబంధనలో ఈ పదాన్ని 11 సార్లు ఉపయోగించడం జరిగింది . ఇక్కడ ఇది, "పాపం నుండి విడుదలను, క్రీస్తు ప్రాయశ్చిత్తం మరియు పునరుత్థానంలో అందించబడిన దేవునితో ఐక్యతను విశ్వాసం ద్వారా కేటాయించడాన్ని" సూచిస్తుంది.[39] ఇప్పటికే మనం పాపం విషయంలో మృతిపొందామనే సత్యాన్ని నమ్మాలని ఈ క్రియ సూచిస్తుంది:

నేను పాపం విషయమై చనిపోయి, క్రీస్తు యేసునందు దేవుని విషయమై సజీవంగా ఉన్నాను అనే సత్యాన్ని లెక్కలోనికి తీసుకోవడానికి ఏమి చేయాలి? విశ్వాసం ద్వారా నేను దేవుని వాక్యాన్ని సత్యంగా నా హృదయంలో నమ్ముతాను. నేను పాపాలన్నింటి నుండి విడుదల పొంది, నా ప్రభువైన క్రీస్తు యేసులో దేవుని విషయమై సజీవంగా ఉన్నానని తప్పులేని, నిర్దోషమైన దేవుని వాక్యపు అధికారాన్ని ఆధారం చేసుకొని నేను ప్రకటిస్తున్నాను.

> "మనం రోమా 6-8 అధ్యాయాలను అధ్యయనం చేస్తుండగా, సాధారణ క్రైస్తవ జీవితాన్ని జీవించడానికి షరతులు నాలుగంచెలుగా ఉంటాయని కనుగొంటాం. అవి (1) తెలుసుకోవడం, (2) లెక్కలోనికి తీసుకోవడం, (3) మనల్ని మనం దేవునికి సమర్పించుకోవడం, (4) ఆత్మలో నడవడం. ఇవి ఆ క్రమాన్ని ఏర్పరచాయి."
> - వాచ్ మన్ నీ, సాధారణ క్రైస్తవ జీవితం
> (*The Normal Christian Life*)

యేసుక్రీస్తుకు స్వచ్ఛంధ ప్రేమ బానిసగా, ప్రాచీన జీవితానికి సంబంధించిన వైఖరులను, చర్యలను నేను ఇష్టపూర్వకంగా విడిచిపెడతాను. యేసుకు సంపూర్ణంగా సమర్పించుకోవడంలో సంతోషం ఉంది! మరియు క్రీస్తుతో నాకున్న సంబంధం ఫలితంగా, నేను నిత్యజీవాన్ని కలిగి ఉన్నాను.

**ముగింపు**

పాపం యొక్క నియంత్రణ శక్తి నుండి పూర్తి స్వేచ్ఛను పొందడం రక్తం ద్వారా కొనబడిన అధికారంగా మనం చూశాము. కానీ దానికంటే మించి, మనం విజయం సాధించాలనేది దేవుని ఆజ్ఞ.

[39] W.T. Purkiser, *Exploring Christian Holiness, Vol. 1*, (Kansas City, Beacon Hill Press), 138

బహుశా మనం ఈ సత్యాన్ని మునుపెన్నడూ గ్రహించలేదేమో. దేవుడు మిమ్మల్ని రక్షించాడు మరియు మీరు జీవితపు నూతనత్వంలో నడుస్తున్నారు; కానీ పాపం ఇంకా మీ జీవితంలో కనబడడం మీరు కనుగొంటారు. అది కనిపించాలని మీరు అనుకోరు! తన మార్గంలో చేయడానికి ఇష్టపడేది మీ అంతరంగంలో ఉంది. ఇదే ఆ పరిస్థితి అయితే పాపం విషయమై మిమ్మల్ని మీరు మృతులుగా ఎంచుకొని (6:11), మిమ్మలని మీరు దేవునికి సమర్పించుకొనుమని (6:13) పౌలు చెప్పిన ఆజ్ఞను మీరు అనుసరించాలి.

ఆయనకే సంపూర్ణ నియంత్రణ ఇవ్వాలి! మీరు ఇది చేసినట్లయితే, పాపపు నియంత్రణ లేని జీవితాన్ని జీవించేటట్లు చేస్తానని ఆయన వాగ్దానం చేశాడు. దేవుడు చెప్పిన దానిని నమ్మి, పాపం నుండి మీ విడుదలను విశ్వాసంతో స్వతంత్రించుకోవాలి.

► క్రీస్తుతో ఐక్యపరచబడడం అంటే అర్థం ఏమిటి? మీరు క్రీస్తుతో ఐక్యపరచబడ్డారు గనుక మీ జీవితం నుండి ఏం ఆశించాలి?

## జయజీవితాన్ని ఎలా జీవించాలి

పాపంపై విజయంతో జీవించడం నిజంగా సాధ్యమేనా అని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? శోధనలో మన బలహీనతకు పరిహారం చేయడం కంటే ఎక్కువగా బలపరిచే కృపను ఇస్తానని దేవుడు వాగ్దానం చేశాడు:

> సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనతప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడ నియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగ జేయును. (1 కొరింథీయులకు 10:13).

ఈ వచనం కొన్ని ప్రాముఖ్యమైన విషయాలను మనకు చెబుతుంది.

1. **ప్రతి శోధన మానవునికి సాధారణమైంది.** మన మానవత్వాన్ని బట్టి ఇది వస్తుంది మరియు ఏదో ఒక మానవ బలహీనతపై దృష్టి నిలుపుతుంది. దాని అర్థం, మీ ఇబ్బందులు నిజంగా మీకు ప్రత్యేకమైనవి కాదు.

2. **మన పరిమితులు దేవునికి తెలుసు**. మనం ఎంతవరకు సహించగలమో ఆయనకు తెలుసు. వాస్తవానికి మనం ఎంతగా సహించగలమో మనకు తెలీదు కానీ ఆయనకు తెలుసు.

3. **మనం విజయంలో జీవించాలని దేవుడు కోరుకుంటాడు గనుక మనకు వచ్చే శోధనకు ఆయన పరిమితిని విధిస్తాడు.** మనం మనుష్యులం గనుక శోధన మన సామర్థ్యానికి మించి ఉంటుందని కొంతమంది ప్రజలు భావిస్తారు. స్థిరంగా విజయం సాధించడం అసాధ్యమని వాళ్ళు భావిస్తారు, కానీ ఈ వచనం ప్రకారం అది సాధ్య.

4. **విజయంలో జీవించడానికి అవసరమైన దానిని దేవుడు అనుగ్రహిస్తాడు.** తప్పించుకోవడానికి ఆయన ఒక మార్గాన్ని కలుగజేస్తాడు.

కాబట్టి, మనం విజయంలో జీవించాలని దేవుడు ఉద్దేశిస్తున్నాడని ఈ వచనం నుండి మనం ఒక తీర్మానానికి రావొచ్చు. విజయవంతమైన జీవితానికి అవసరమైన కృప, విశ్వాసానికి స్పందనగా ఇవ్వబడుతుంది.

> దేవుని మూలముగా పుట్టినవారందరును లోకమును జయించుదురు; లోకమును జయించిన విజయము మన విశ్వాసమే (1 యోహాను 5:4).

> శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును (యాకోబు 1:12).

శోధన విశ్వాసులను ఎలా ఓడించిందో మనం అర్థం చేసుకున్నప్పుడు, దానిని ఎలా నివారించాలో మనం అర్థం చేసుకుంటాం. శోధనలో పడిన వ్యక్తి, ఒక నిర్దిష్టమైన ప్రక్రియ గుండా వెళ్లుటకు తననుతాను అనుమతించుకుంటాడు.

ఈ ప్రక్రియ, యాకోబు 1:14-15లో వివరించబడింది: "ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడిన వాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా..."

ఉద్దేశ్యపూర్వకంగా చేసే పాపం, ఈ క్రింద పేర్కొనబడిన దశలలో జరుగుతుందని జాన్ వెస్లీ గమనించారు.

1. శోధన కలుగుతుంది/వస్తుంది (లోకం నుండి, శరీరం నుండి లేదా దుష్టుని నుండి)
2. జాగ్రత్తగా ఉండమని పరిశుద్ధాత్ముడు విశ్వాసిని హెచ్చరిస్తాడు.
3. వ్యక్తి, శోధన పట్ల శ్రద్ధ వహిస్తాడు, అప్పుడు దాని ఆకర్షణ పెరుగుతుంది. (ఈ ప్రక్రియలో వ్యక్తి ఇక్కడే తన మొదటి పొరపాటును చేస్తాడు).
4. పరిశుద్ధాత్ముడు దుఃఖపడతాడు, వ్యక్తి యొక్క విశ్వాసం బలహీనమవుతుంది మరియు దేవుని పట్ల అతని ప్రేమ చల్లారిపోతుంది.
5. పరిశుద్ధాత్ముడు తీవ్రంగా గద్దిస్తాడు.

6. వ్యక్తి, బాధ కలిగించు ఆత్మ స్వరం నుండి తొలగి, ఆకర్షణ కలుగజేయు శోధకుని స్వరాన్ని వింటాడు.

7. చెడు కోరికలు ప్రారంభమై, హృదయాన్ని నింపుతాయి; విశ్వాసం, ప్రేమ అదృశ్యమవుతాయి; అతను బహిరంగ పాపాన్ని చేయడానికి సిద్ధపడతాడు.

ప్రతి ఒక్కరి అనుభవం, ఈ నమూనాతో ఎల్లప్పుడూ సరిపోతుందని మనం భావించకూడదు. కొన్నిసార్లు ప్రజలు ఎలాంటి ప్రక్రియ గుండా వెళ్ళకుండా, అకస్మాత్తుగా శోధనకు లోనవుతారు.

శోధన, మన ఏకాగ్రతను కట్టిపడేసి, దాని శక్తిని పెంచుతుంది గనుక, పాపంపై విజయాన్ని కొనసాగించడాన్ని తీవ్రంగా పరిగణించే వ్యక్తి, తన హృదయాన్ని స్థిరపరచుకోవాలి, తద్వారా శోధనను వెంటనే తిరస్కరించగలుగుతాడు. శోధన, పాపానికి నడిపిస్తుందని గుర్తించినప్పటికీ, దానిని ప్రతిఘటించడానికి/నిరోధించడానికి సంకోచించే వ్యక్తి, తనని తాను గొప్ప ప్రమాదంలో పడవేసుకుంటాడు. సంకోచించే వ్యక్తి, తన హృదయంలో దేవునిని సంతోషపెట్టాలని సంపూర్ణంగా నిర్ణయించుకోలేదనే విషయాన్ని వెల్లడి చేస్తుంది.

**శోధన, మన విశ్వాసానికి ఒక సవాలు, ఎందుకంటే దేవునికి విధేయత చూపడం ఆ సమయంలో ప్రయోజనకరమైన మార్గమనే సత్యాన్ని అనుమానించడానికి శోధన అవకాశమిస్తుంది.**

► ఒక విశ్వాసి పాపంపై విజయంతో జీవించలేడని అనిపిస్తే, దానికి కారణం ఏమిటి?

బహుశా ఇది క్రిందివాటిలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సమస్యల వల్ల కావచ్చు.

1. దేవునికి విధేయత అవసరమని అతడు చూసి ఉండడు.
2. సామర్థ్యాన్ని కలిగించే కృపను గూర్చిన దేవుని వాగ్దానాన్ని అతను చూడకపోవచ్చు లేదా నమ్మకపోవచ్చు.
3. బలపరిచే దేవుని కృపపై కాకుండా తన వ్యక్తిగత శక్తిపై ఆధారపడడం.
4. అతను సంపూర్ణంగా, షరతులు లేకుండా దేవునికి విధేయత చూపడానికి బదులు, ఎంపిక చేసిన విషయాల్లోనే దేవునిని సేవచేయడం.
5. అతను కృప ద్వారా దేవుని చిత్తాన్ని చేయాలనే ఏకత్వపు వైఖరిని కలిగి ఉండకపోవడం (ఫిలిప్పీయులకు 3:13-15).
6. తన విశ్వాసాన్ని, దేవునితో సంబంధాన్ని బలంగా ఉంచే ఆత్మీయ క్రమశిక్షణలను నిర్వహించకపోవడం.

7. అతను స్థానిక సంఘంలో ఆత్మీయ జవాబుదారీతనాన్ని నిర్వహించకపోవచ్చు.

8. అతను దేవుని వాక్యాన్ని అనుదినం ధ్యానించడు.

9. తన జీవితంలో పరిశుద్ధాత్ముని స్వరాన్ని వినే అలవాటు చేసుకొని ఉండకపోవచ్చు.

ముగ్గురు వ్యక్తులు, డ్రైవరు ఉద్యోగానికి ధరఖాస్తు చేసుకున్నారు. మొదటి వ్యక్తి, తనకు ఉద్యోగమివ్వబోయే వ్యక్తిని ఆకట్టుకోవాలనుకుని, "నేను ఎంత నైపుణ్యం కలిగిన డ్రైవరునంటే, నేను కొండ అంచుకు కొన్ని అడుగుల దూరంలో అతివేగంతో వాహనాన్ని నడిపినా కూడా మీరు భయకుండా ఉండగలరు" అన్నాడు. రెండవ వ్యక్తి తానేమి తక్కువకాదు, తానే ఉత్తమమైన వ్యక్తిగా కనుపరచుకోవాలని, అతను "నేను కొండపైకి వెళ్ళకుండా, కొన్ని అంగుళాల లోపలే అతివేగంతో నడపగలను" అని అన్నాడు. మూడవ వ్యక్తి కాస్త సంకోచించి, ఉద్యోగమిచ్చే వ్యక్తితో, "కొండ సమీపానికి వెళ్ళి, నేను మీ జీవితాన్ని ప్రమాదంలో పడవేయలేను" అని అన్నాడు. ఈ ముగ్గురిలో ఎవరికి ఉద్యోగం వచ్చిందని మీరు అనుకుంటున్నారు?

మనం శోధనకు ఎంత సమీపంగా వెళ్తున్నామో చూసే ప్రయత్నం చేయకూడదు. మనం బలహీన విషయాల నుండి మనల్ని సంరక్షించడానికి మనకు వ్యక్తిగత సూచనలు ఇవ్వాలని దేవుడు కోరుకుంటాడు. నిర్దిష్టమైన వినోద కార్యక్రమాల వంటి కొన్ని ప్రమాదకరమైన విషయాలను గురించి మనం నేర్చుకొని, ఆ విషయాల నుండి మనం దూరంగా ఉండాలి.

ఒక విశ్వాసి, దేవునితో తన సంబంధాన్ని సరిగా నిర్వహించకపోతే, అతను వెంటనే పశ్చాత్తాపపడి, మన మధ్యవర్తియైన యేసుక్రీస్తు ద్వారా సంబంధాన్ని పునఃస్థాపించుకోవాలి (1 యోహాను 2:1-2). తాను మరింత సౌకర్యవంతంగా ఉంటానని భావించే భవిష్యత్ సమయం కొరకు ఎదురు చూడకూడదు. తాను పునఃస్థాపించబడాలని కోరుకున్నట్లయితే, పరిశుద్ధాత్ముడు ఆ కోరికను తనలో కలిగించి, దేవునితో సంబంధంలోనికి వెనక్కి తిరిగి తీసుకొస్తాడు. అతని పశ్చాత్తాపం నిజమైనదైతే, అతను తక్షణమే పునఃస్థాపించబడతాడు.

దేవుడు యేసు అర్పణ యందు, మన రక్షణ కొరకు అంతిమ పెట్టుబడిని ఇప్పటికే చేశాడు. మనం కొనసాగించడానికి అవసరమైన కృపను మనకు ఇవ్వడంలో వైఫల్యం చెందడం ద్వారా ఆ పెట్టుబడిని వృధాకానివ్వడు.

## తెలుసుకొని, స్వంతంగా ఆమోదించుకోవడానికి అయిదు సత్యాలు

పాపక్రియలపై విజయం అనేది క్రైస్తవునికి ఒక సాధారణ అనుభవం, ఎందుకంటే ఆ వ్యక్తి యేసు యొక్క మరణం, భూస్థాపన మరియు పునరుత్థానం ద్వారా పాపపు బానిసత్వం నుండి విడుదల పొందాడు.[40] పాపంలో కొనసాగడం అనేది దేవుని కృపను నిర్లక్ష్యం చేయడం, క్రీస్తుతో ఐక్యత కొనసాగడంలో విఫలమవ్వడం, పాపం విషయమై మరణించి, దేవుని విషయమై సజీవులుగా పరిగణించుకోవడంలో విఫలమవ్వడం, తన శరీరాన్ని పూర్తిగా నీతికి సాధనాలుగా దేవునికి సమర్పించుకోవడంలో విఫలమవ్వడం ద్వారా కలుగుతుంది.

ప్రతి నిజమైన విశ్వాసి, పాపంపై విజయాన్ని అనుభవించాలని కోరుకుంటాడు. పాపం నుండి మనలను రక్షించడానికి యేసు చెల్లించిన అమూల్యమైన వెల దీనికి కారణం. పాపం యొక్క నాశనకరమైన స్వభావం దీనికి కారణం. "పాపం విషయమై కృప విస్తరిస్తుంది గనుక పాపాన్ని ఎందుకు చేయకూడదు?" అని వాదించే వారికి పౌలు ఇచ్చిన సమాధానం బలమైనది. "అట్లనరాదు" అని ఆయన ధృవీకరించాడు (రోమా 6:1-2). పాపమనే వ్యాధికి దేవుడు స్వస్థతను అందుబాటులోనికి తీసుకొచ్చాడు గనుక పాపం పట్ల అజాగ్రత్తతో కూడిన వైఖరిని కలిగి ఉండడమనేది HIV/ఎయిడ్స్ లేదా క్యాన్సర్ కు మందు కనుగొన్నారు గనుక వాటి విషయమై అజాగ్రత్తగా ఉన్నట్లు ఉంటుంది. చికిత్స, వ్యాధినుండి మరియు వేదన నుండి తప్పించలేదు. గాయాల గుర్తులను కూడా దూరం చేయలేవు. సరైన దృక్పథంతో ఆలోచించే ఏ వ్యక్తి కూడా "చికిత్స అందుబాటులో ఉంది కాబట్టి వ్యాధిబారినపడతాను" అని చెప్పడు. పాపం యొక్క భయానక స్వభావం, పరిశుద్ధుడైన దేవుడు పాపం పట్ల కలిగి ఉన్న హేయభావనను మరియు పాపాన్ని పరిహరించడం కోసం చెల్లించబడిన అమూల్యమైన వెలను అర్థం చేసుకొన్న వ్యక్తి, "పాపాన్ని కృప కప్పుతుంది కనుక పాపం చేద్దాం" అని చెప్పడు.

పాపం నుండి విడుదల విషయమై ఒక క్రైస్తవుని అనుభవం, ఈ సత్యాలను గూర్చిన తన జ్ఞానంపై (రోమా 6:3, 6, 9) మరియు వాటిని ఉపయోగించడంపై ఆధారపడి ఉంటుంది:

**(1) పాపియైన వ్యక్తిగా నేను మరణించాను.**

మన ప్రాచీన స్వభావం, ప్రాచీన పాపపురుషుడు, సిలువపై క్రీస్తుతో పాటు ఆత్మీయంగా మరణించి, ఆయన సమాధిలో పాతిపెట్టబడ్డాడు. చనిపోయిన వ్యక్తి, బానిసగా సేవ చేయడు గనుక, మనపై పాపపు అధికారం/ప్రభుత్వం వీగిపోయింది.

[40] ఈ భాగాన్ని టిమ్ కీప్ రాశారు.

ఈ మరణం ఇప్పటికే సంభవించింది. మన కొరకు క్రీస్తు చనిపోయాడని నమ్మి, మన పాపాల విషయమై పశ్చాత్తాపపడి, ఆయనిచ్చే నిత్యజీవపు బహుమానాన్ని స్వీకరించిన క్షణమే మన ప్రాచీన పాప జీవితం మరణించింది.

రోమా 6 నుండి ఈ ప్రకటనలను గమనించండి:

- "....పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము?" (6:2).
- "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" (6:3).
- "....మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి" (6:4).
- "మరియు ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైనయెడల...." (6:5).
- "ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతోకూడ సిలువవేయబడెనని యెరుగుదుము" (6:6).
- "చనిపోయినవాడు పాపవిముక్తు డని తీర్పుపొందియున్నాడు" (6:7).

నేటి దినాలలో చాలామంది విశ్వాసులు వారి సామర్థ్యం కంటే తక్కువ స్థాయిలో జీవించడం వారితో ఉన్న పెద్ద సమస్య. చాలామంది క్రైస్తవులు, వైఫ్యల్యాన్ని/ఓటమిని సర్వసాధారణమైందిగా భావించాలసే షరతును కలిగి ఉన్నారు. విజయవంతమైన క్రైస్తవ జీవితం సాధ్యం కాదని, పాపంలో కొనసాగే అవకాశముందని వాళ్ళు భావిస్తారు. మనిషి వైఫల్యం సహించలేనిదని కొంతమంది విశ్వాసులు అనుకుంటారు. ఈ బోధన కూడా విశ్వాసాన్ని పాడుచేస్తుంది మరియు అనేకులను నిరాశలోనికి లేదా వేషధారణలోనికి నడిపిస్తుంది. సిలువ యొద్ద క్రీస్తు విజయంలో పాలుపంచుకోవడం ద్వారా విజయం మన స్వంతమవుతుందని పౌలు స్పష్టం చేశాడు.

**(2) నేను నూతన వ్యక్తిగా ఉండడానికి గాను దేవుడు నన్ను యేసుతో కూడా లేపాడు.**

యేసు, తన పునరుత్థానం ద్వారా పాపమంతటిని జయించాడు. ఈ పునరుత్థాన జీవాన్ని పంచుకోవడానికి విశ్వాసం ద్వారా మనం వచ్చాం. విశ్వాసం ద్వారా, మనపై భారం మోపడానికి, అవమానించడానికి, గాయపరచడానికి లేదా మనల్ని చంపడానికి పాపానికి శక్తిలేదు. నూతన జయజీవితానికి మనం ఆత్మీయంగా క్రీస్తుతో కూడా లేపబడ్డాం.

- "కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు...." (6:4).

- “.... ఆయన పునరుత్థానముయొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము” (6:5).
- “.... మృతులలోనుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు, మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వము లేదనియు ఎరిగి, ఆయనతోకూడ జీవించుదు మని నమ్ముచున్నాము.” (6:8-9).
- “ఏలయనగా ఆయన చనిపోవుట చూడగా, పాపము విషయమై, ఒక్కమారే చనిపోయెను గాని ఆయన జీవించుట చూడగా, దేవుని విషయమై జీవించుచున్నాడు” (6:10).
- “అటువలె మీరును పాపము విష యమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి” (6:11).
- “....అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి....” (6:13).

**(3) నేను ఆత్మీయంగా యేసుతో ఐక్యపరచబడ్డాను.**

నా ప్రాచీన జీవితం ఆయనతో కూడా సిలువవేయబడడం మాత్రమే కాదు, ఆయన వంటి నూతన జీవితాన్ని నేను పొందడం మాత్రమే కాదు; కాని నేను ఆయనలో నివసిస్తాను, ఆయన నాలో ఉంటాడు! (గలతీయులకు 2:20 మరియు యోహాను 14-16 కూడా చదవండి). యేసు దీనిని ప్రతి శిష్యునికి వాగ్దానం చేశాడు: పరిశుద్ధాత్మని ద్వారా విశ్వాసులలో నివసించడానికి దేవుడు ఎన్నుకున్నాడు. విశ్వాసులతో ఈ ఐక్యత మరియు వారిలో నివసించడమే పాపంపై విజయాన్నిస్తుంది మరియు పరిశుద్ధంగా జీవించడాన్ని సాధ్యం చేస్తుంది. ఇదే విశ్వాసులు స్వచ్ఛమైన, కృపాసహితమైన, ప్రేమ కలిగిన, దయ, క్షమాపణ, పరిశుద్ధత కలిగిన యేసు జీవితాన్ని పొందడాన్ని, దానికి అనుగుణంగా జీవించడాన్ని సాధ్యం చేస్తుంది.

- “మరియు ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైనయెడల, ఆయన పునరుత్థానముయొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము” (6:5).
- “....మన ప్రాచీన స్వభావము ఆయనతోకూడ సిలువవేయబడెనని యెరుగుదుము” (6:6)
- “మనము క్రీస్తుతోకూడ చనిపోయినయెడల.... ఆయనతోకూడ జీవించుదు మని నమ్ముచున్నాము” (6:8-9).

**యేసు ఈ ఐక్యతను గురించి యోహాను 15లో తన శిష్యులకు బోధించాడు. క్రైస్తవ జీవితంలో మనం విజయం సాధించడానికి క్రీస్తుతో ఆత్మీయ ఐక్యత ఆవశ్యకం.**

**(4) దేవుడు నాకిచ్చిన విజయాన్ని నేను విశ్వాసం ద్వారానే పొందాలి.**

> అటువలె మీరును పాపము విష యమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి. (6:11).

ఎంచుకోవడం అంటే దీనిని మన జీవితంలో అనుభవించునట్లు ఇది సత్యమని పరిగణించడం.

పాతనిబంధనలోని ఒక ఉదాహరణ ఇక్కడ మనకు సహాయకరంగా ఉంటుంది. దేవుడు ఇశ్రాయేలీయులకు వాగ్దాన దేశాన్ని వాగ్దానం చేయడం మాత్రమే కాదు గాని వాళ్ళు దానిని వాస్తవంగా స్వతంత్రించుకోవడానికి చాలాకాలం క్రితమే వారికిచ్చాడు. 40 సంవత్సరాలు అరణ్యంలో తిరిగారు, వారి సామర్థ్యానికి క్రింద జీవించారు, ఎందుకంటే భయపడి, దేవునిని నమ్మడంలో విఫలమయ్యారు. కానీ దేవుడు వారిని ప్రేమించి, తమ స్వాస్థ్యంలోనికి వారిని నడిపించాడు.

యెహోషువా 1:3, "నేను మోషేతో చెప్పినట్లు మీరు అడుగుపెట్టు ప్రతి స్థలమును మీకిచ్చుచున్నాను" అని చెబుతుంది. కొన్ని వచనాల తరువాత, దేవుడు "మీరు స్వాధీనపరచుకొనుటకు మీ దేవుడైన యెహోవా మీకిచ్చుచున్న దేశమును స్వాధీనపరచుకొనబోవుటకై మూడుదినములలోగా మీరు ఈ యొర్దానును దాటవలెను...."(యెహోషువ 1:11).

దేవుని ప్రజలు విశ్వాసం ద్వారా దేవుడు తమకిచ్చిన స్వాస్థ్యమును స్వాధీనపరచుకోవాలి. కనాను నివాసులపై విజయం అందించబడుతున్నపటికీ, వాస్తవ భావనలో అది ఇప్పటికే పూర్తయింది, కానీ ఇశ్రాయేలు విధేయతతో కూడిన విశ్వాసం ద్వారా మాత్రమే ఈ విజయాన్ని అనుభవించగలదు. క్రొత్త నిబంధన విశ్వాసులు కూడా ఇదే విధానంలో జయిస్తారు; విశ్వాసం ద్వారా క్రీస్తు యేసు మన కొరకు సాధించిన విజయాన్ని పరిగణలోనికి తీసుకోవడం ద్వారా ఆ విజయాన్ని స్వాధీనపరచుకొంటాం మరియు వాగ్దానాలను స్వతంత్రించుకొంటాం.

**(5) నేను నా దేహాన్ని దేవునికి సమర్పించాలి.**

> కాబట్టి శరీర దురాశలకు లోబడునట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి. మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి, అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి, మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి (రోమా 6:12-13).

## పునఃశ్చరణ

► కొంతమంది విద్యార్థులు, ముందు చెప్పిన వ్యాసంలోని అయిదు సత్యాల ప్రాముఖ్యతను వివరించాలి.

> తన సొంతకుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరికొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు? (రోమా 8:32).
>
> తొట్రిల్లకుండ మిమ్మును కాపాడుటకును, తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువ బెట్టుటకును, శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా, మహిమయు మాహాత్మ్యమును ఆధిపత్యమును అధికారమును యుగములకు పూర్వమును ఇప్పుడును సర్వయుగములును కలుగును గాక. ఆమేన్ (యూదా 24-25).

## పాఠం 6 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) పాపం అంటే ఏమిటో అర్థం చేసుకోవడం ఎందుకు ప్రాముఖ్యం?

(2) ఉద్దేశ్య పూర్వక పాపానికి నిర్వచనం ఏమిటి?

(3) రోమా 6లో పౌలు ఏ తప్పుడు ఆలోచనకు స్పందిస్తున్నాడు?

(4) పాపం విషయమై మరణించడం అంటే అర్థం ఏమిటి?

(5) కృప క్రింద ఉండడం అంటే అర్థం ఏమిటి?

(6) ధర్మశాస్త్రం క్రింద ఉండడం అంటే అర్థం ఏమిటి?

(7) దేవునికి, పాపానికి సేవ చేయకపోవడం ఎందుకు అసాధ్యం?

(8) *ప్రాచీన స్వభావం* అనే మాటకు అర్థం ఏమిటి?

## పాఠం 6 - అభ్యాసాలు

(1) విశ్వాసికి పాపంపై ఏ విజయం సాధ్యమవుతుందో ఒక పేజీలో వివరించండి. ఉద్దేశ్యపూర్వక పాపాన్ని నిర్వచించండి మరియు పాప నిర్వచనం ఎందుకు ప్రాముఖ్యమో వివరించండి. పాపంపై విజయం సాధ్యమనే అంశానికి ప్రజల అభ్యంతరాలకు స్పందించండి.

(2) మీ ప్రసంగ లేదా పాఠ్యాంశ ప్రదర్శనలను/వివరణలను పూర్తి చేయాలి.

# పాఠం 7

# ఒప్పించబడిన పాపి

## మనం ఏ ధర్మశాస్త్రం గురించి మాట్లాడుతున్నాం?

పాతనిబంధనలోని అనేకమైన ఆజ్ఞలు, నేటి ప్రజలకు వర్తించవు అన్నట్లుగా కనబడతాయి. ఇక్కడ కొన్ని ఉదాహరణలు ఉన్నాయి:

- శకునము చెప్పుదానిని బ్రదుకనియ్యకూడదు (నిర్గమకాండము 22:18).
- ఏడవ సంవత్సరం అంతంలో అప్పులన్నింటిని క్షమించాలి (ద్వితీయోపదేశకాండము 15:1-2).
- యెరూషలేములో ఏడు రోజుల పాటు పస్కా పండుగను జరుపుకోవాలి (ద్వితీయోపదేశకాండము 16:1-6).

కొంతమంది బైబిల్ పండితులు, పాత నిబంధన నియమాలను మూడు వర్గాలుగా విభజిస్తారు: శుద్ధీకరణ/ఆచార సంబంధ నియమాలు, పౌర సంబంధిత నియమాలు మరియు నైతిక నియమాలు.

ఆచారసంబంధ నియమాలు బలులకు సంబంధించినవి. ఇవి ఆరాధన స్థలం మరియు ఆరాధన పద్ధతుల కొరకు రూపొందించబడినవి. క్రీస్తు చేసిన కార్యం వలన ఆ వ్యవస్థ ఇప్పుడు వాడుకలో లేదు గనుక నేటి క్రైస్తవులు, ఆచార సంబంధమైన నియమాలను పాటించరు (కొలొస్సయులకు 2:17, హెబ్రీయులకు 10:1).

పౌర సంబంధ నియమాలు, ఒక దేశంగా ఇశ్రాయేలు కొరకైనవి. అవి వ్యాపారానికి నియమాలను, భద్రతనిచ్చే మానవ హక్కులను అందించి, చట్టాల అమలుకు విధివిధానాలను ఇస్తాయి మరియు ఇశ్రాయేలు యొక్క మతపరమైన గుర్తింపును భద్రపరుస్తాయి. ఈ పౌరనియమాలను అనుసరించడం నేటి క్రైస్తవులకు సాధ్యపడదు, ఎందుకంటే ఆ నియమాలు వారి దేశాలకు చెందిన నియమాలు కాదు. ఉదాహరణకు, పాతనిబంధన కాలంలో, విగ్రహారాధన నిమిత్తం ఒక వ్యక్తిని చంపాల్సి వస్తే, అది ఒక వ్యక్తి యొక్క వ్యక్తిగత నిర్ణయంపై చేయకూడదు. ఒక న్యాయమూర్తి ఆ వ్యాజ్యాన్ని వినాలి, అప్పుడు తీర్పు, ప్రజల చేత బలపరచబడాలి (ద్వితీయోపదేశకాండము 17:6-12).

► ప్రాచీన ఇశ్రాయేలు దేశపు పౌర నియమాలను/చట్టాలను అసలు విధానంలో పాటించడం ఒక క్రైస్తవునికి ఎందుకు సాధ్యం కాదు?

నైతిక నియమాలు, కొన్ని చర్యలను అన్ని కాలాలకు సరైనవిగా లేదా తప్పుగా గుర్తించాయి. ఉదాహరణకు, పది ఆజ్ఞలు విగ్రహారాధనను, దేవదూషణను, వ్యభిచారాన్ని మరియు దొంగతనాన్ని నిషేధిస్తాయి (నిర్గమకాండము 20:5, 7, 14, 15).

క్రైస్తవులు, ఆచార సంబంధమైన, పౌర నియమాల ద్వారా ఆజ్ఞాపించబడిన అసలైన నియమాలను యథాతథంగా పాటించరు. అయితే, ఆ నియమాలు ప్రాముఖ్యమైనవి ఎందుకంటే అవి మారని దేవుని స్వభావాన్ని వెల్లడి చేస్తాయి. మనం విగ్రహారాధన చేసే వారిని, వ్యభిచారులను చంపకపోయినా, అలాంటి పాపాలు దేవునికి హేయమైనవనే విషయాన్ని ఆ నియమాలు చెబుతాయి. మన పేదలకోసం, పొలాల్లో కంకులను విడిచిపెట్టకపోయినప్పటికిని, ఇతర మార్గాలలో పేదలపట్ల శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. పశువులను బలి అర్పించడానికి ముందు, ఆరాధనా స్థలానికి తీసుకెళ్లకపోయినా, సమస్తం దేవునికి చెందినవని ఎరిగిన వారమై, మనకు కలిగిన వాటిని దేవునికి అర్పణగా ఇస్తాం. అసలు/ప్రాథమికంగా ఇశ్రాయేలు ప్రజలు చేసిన కార్యాలను మనం చేయకపోయినా ఆ నియమాలను/సూత్రాలను నెరవేర్చే నూతన కార్యాలను మనం కనుగొంటాం.

పౌర మరియు ఆచార నియమాలు ముఖ్యమైనవి కావడానికి మరొక కారణం ఏమిటంటే, అవి నిర్దిష్టమైన విధానాలలో వర్తించే నైతిక సూత్రాలను అందిస్తాయి. ఆ సూత్రాలను తృణీకరించడం, నైతిక నియమాలను తృణీకరించినట్లే అవుతుంది. ఉదాహరణకు, మన ఇంటిపైన పేరేవాళ్ళు నివసించడానికి గదులు నిర్మించకపోతే, దానిపై పిట్టగోడ కట్టవలసిన అవసరం లేదు (ద్వితీయోపదేశకాండము 22:8). కానీ ఈ ప్రాచీన నియమం, మన ఇళ్ళు మరియు భూమి ప్రజలకు సురక్షితంగా ఉండేలా నిర్మించుకోవాలని మనకు చెబుతుంది.

► ద్వితీయోపదేశకాండము 22:8లో చెప్పబడిన సూత్రాన్ని నెరవేర్చాలి అంటే మనం అనుసరించాల్సిన ఆధునిక విధానానికి ఒక ఉదాహరణ ఏమిటి?

అయితే, రోమీయులకు రాసిన పత్రికలో పౌలు మాట్లాడుతున్న దేవుని నియమం ఏమిటి? ఇది తన ఆజ్ఞల్లో (పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన) వెల్లడిపరిచిన మానవుని పట్ల దేవుని చిత్తం. కొన్ని ఆజ్ఞలను ప్రాథమికంగా చెప్పబడిన విధానంలో నెరవేర్చకపోయినప్పటికిని, ప్రధానంగా మనిషి పట్ల దేవుని చిత్తం అలానే ఉంటుంది. దేవుని ధర్మశాస్త్రాన్ని అతిక్రమించడం పాపం (1 యోహాను 3:4).

### లేఖన అధ్యయనం - రోమా పత్రిక 4వ భాగం, 2వ లేఖన భాగం

ఈ పాఠములో, రోమా పత్రిక యొక్క నాల్గవ భాగంతో కొనసాగుతాం. గత పాఠములో రోమా పత్రిక 6వ అధ్యాయంలో పాపంపై విజయాన్ని గురించి మనం అధ్యయనం చేశాం.

ఈ పాఠములో మనం రోమా 7వ అధ్యాయంలో ఒప్పించబడిన పాపిని గురించి అధ్యయనం చేస్తాం. రోమా 6 మరియు 8 అధ్యాయాలు, విశ్వాసి యొక్క జయజీవితాన్ని వివరిస్తాయి. రోమా 7వ అధ్యాయం, పూర్తి భిన్నంగా, తాను అపరాధినని మరియు తనను తాను మార్చుకోలేనని ఎరిగిన పాపి జీవితాన్ని చూపిస్తుంది.

**7వ అధ్యాయం యొక్క ప్రధానాంశం**

దేవుని ధర్మశాస్త్రం తెలిసినా, కృపచేత రూపాంతరం చెందని వ్యక్తి పాపపు శక్తి నుండి మరియు ధర్మశాస్త్రపు శిక్షావిధి నుండి తప్పించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉంటాడు.

**7వ అధ్యాయం యొక్క సారాంశం**

ఈ అధ్యాయం, ధర్మశాస్త్రం క్రింద ఉన్న వ్యక్తి స్థితిని వివరిస్తుంది. ధర్మశాస్త్రం క్రింద ఉండడం అంటే దేవుని ఎదుట నిలబడి, ధర్మశాస్త్రానికి విధేయత చూపడం ఆధారంగా తీర్పు పొందడానికి ఎదురు చూడడమని భావం. అందరూ పాపం చేశారు గనుక, ధర్మశాస్త్రం క్రింద ఉండడమంటే, శిక్షావిధి క్రింద ఉండడం అని అర్థం. ధర్మశాస్త్రం క్రింద ఉన్న వ్యక్తి ఇంకా నీతిమంతునిగా తీర్చబడలేదు.

7:1-6 వచనాలు, ఒక విశ్వాసి ధర్మశాస్త్రం విషయమై ఎలా మరణించాడో వివరిస్తుంది. మిగిలిన అధ్యాయమంతా ఇది ఎందుకు ఆవశ్యకమో చూపిస్తుంది (7:5లో 'యుండినప్పుడు', 7:6లో 'ఇప్పుడైతే' అనే మాటలను చూడండి). 7:7-13 వచనాలు, ధర్మశాస్త్రం మేలైనదే గాని, అది పాపాన్ని మరింత తీవ్రమైనదిగా/కీడైనదిగా చేస్తుందో చూపిస్తుంది. 7:14-25 వచనాలు దోషియైన, మారుమనసు పొందని పాపి యొక్క నిస్సహాయ స్థితిని చూపిస్తుంది.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 7వ అధ్యాయాన్ని చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(7:1-3) ఈ వచనాలు, తరువాతి మూడు వచనాలలో చెప్పబోయే అంశానికి సిద్ధపరిచే వివరణ. వివాహం, ధర్మశాస్త్రానికి బద్ధులమై ఉండడాన్ని గూర్చి వివరిస్తుంది. ఒక స్త్రీ తన భర్తను విడిచి, మరొక వ్యక్తిని వివాహం చేసుకొకూడదు, అయితే ఒకవేళ భర్త చనిపోతే, ఆమె అతని అధికారం నుండి విడుదల పొందుతుంది. ధర్మశాస్త్రానికి

బద్ధులై వుండడమనేది మోషే ధర్మశాస్త్రం క్రింద యూదులకు మాత్రమే వర్తించదు, కానీ ప్రతి వ్యక్తికి వర్తిస్తుంది, ఎందుకంటే మనం కృపచేత రక్షణ పొందకపోతే, దేవుని ధర్మశాస్త్రాన్ని బట్టి తీర్పు పొందుతాము.[41]


మరణం సంబంధాన్ని మారుస్తుందనేది వివాహాన్ని గూర్చిన పౌలు దృష్టాంతంలో ప్రధాన అంశం. మనం క్రీస్తుతో ఐక్యపరచబడినప్పుడు. మన ప్రాచీన స్వభావం విషయమై మరణిస్తాం. ధర్మశాస్త్రం రద్దు చేయబడదు లేదా కొట్టివేయబడదు. అయితే, యేసు ప్రత్యామ్నాయ ప్రాయశ్చిత్తం ద్వారా ధర్మశాస్త్రాన్ని అతిక్రమించే వారిగా మనపై ధర్మశాస్త్రపు అధికారం పూర్తిగా చెల్లించబడింది. ఇప్పుడు మనకు క్రీస్తుతో వివాహమైంది. ఇది మనల్ని ధర్మశాస్త్రం లేనివారిగా చేయదు. మనమిప్పుడు క్రైస్తవులం గనుక ధర్మశాస్త్రాన్ని అతిక్రమించే వారిగా మనకు ఎలాంటి హక్కు లేదు. దానికి బదులు, మనం ధర్మశాస్త్రపు ప్రేరణయందు జీవించడానికి పరిశుద్ధాత్మ ద్వారా బలపరచబడ్డాం.[42]

(7:4) ధర్మశాస్త్రాన్ని అతిక్రమించడంలో మరణపు శిక్ష ఉంది. క్రీస్తు మన స్థానంలో చనిపోయాడు. మనం ఆయనతో గుర్తింపు కలిగి ఉంటాం, తద్వారా క్రీస్తు శరీరం ద్వారా ధర్మశాస్త్రం విషయమై మరణించామని లేఖనం చెప్తుంది. ధర్మశాస్త్రానికి అవసరమైనవి నెరవేరాయి గనుక మనం దాని బంధకాల నుండి విడుదల పొందాం. శిక్షావిధిని గూర్చిన భయంతో మనం ధర్మశాస్త్రాన్ని నెరవేర్చకూడదు. **ధర్మశాస్త్రం విషయమై మరణించడం అంటే మనం కృప ద్వారా నీతిమంతులుగా చేయబడ్డాం**



**కొలోస్సియం**

కొలోస్సియం నిర్మాణం క్రీ.శ. 72లో పౌలు రోమా పట్టణాని దర్శించిన కొన్ని సంవత్సరాలకే ప్రారంభమైంది. 50,000 కంటే ఎక్కువ మంది ప్రేక్షకులు దీనిలో కూర్చోవచ్చు. వీరుల మధ్య పోరాటాలు, మనుష్యులకూ జంతువులకూ మధ్య పోరాటాలు (సింహాలు, పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు మరియు ఇంకా అనేక రకాల జంతువులతో పాటు) మరియు పోరాట యోధులు లేదా జంతువుల చేత ప్రజలకు శిక్షలు విధించడం లాంటి ప్రదర్శనలు జరిగేవి. కొన్నిసార్లు ఒక్కరోజులో వందల మంది ప్రజలు అక్కడ చనిపోయేవారు. చాలామంది క్రైస్తవులను, చనిపోవడానికి కొలోస్సియంకు పంపేవారు.



[41] చిత్రం: "Colosseum - Rome - Italy" Sam valadi తీశారు, మార్చి 31, 2015న అప్లోడ్ చేశారు, https://www.flickr.com/photos/132084522@N05/16800139540/ నుండి తీసుకున్నారు, CC BY 2.0 లైసెన్సు పొంది, అసలు దానికంటే తక్కువ రంగు కలదు. ,
చిత్రం: "The Christian Martyrs' Last Prayer", Jean-Léon Gérôme చేత, Walters Art Museum లోనిది, https://commons.wikimedia.org/w/index.php?curid=18824108, పబ్లిక్ డొమైన్ నుండి తీసుకున్నారు..

[42] ఈ పారాగ్రాఫ్ ను డా. అల్లన్ బ్రౌన్ రాశారు.

**గనుక మనము నీతిమంతులుగా తీర్చబడుట కొరకు దానిని నెరవేర్చాల్సిన అవసరం లేదు.**

(7:5) ధర్మశాస్త్రం, పాపం యొక్క రికార్డును నమోదు చేస్తుంది మరియు ఒక వ్యక్తి ధర్మశాస్త్రాన్ని తెలుసుకొని దానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తే, అతను ఘోరమైన పాపి అవుతాడు అనే అర్థంలో ధర్మశాస్త్రం వల్ల పాపం జరుగుతుంది

## శరీరాన్ని/శరీర స్వభావాన్ని ర్వచించుట

► ఈ భాగంలోని అనేక వాక్య భాగాలను పరిశీలించండి, తద్వారా అంశాలను మీరు అర్థం చేసుకోగలుగుతారు.

లేఖనం, "శరీర సంబంధులై" ఉన్న వివిధ రకాల వ్యక్తులను సూచిస్తుంది. శరీర సంబంధులై ఉండటం అనేది సందర్భాన్ని బట్టి కనీసం రెండు వేర్వేరు అర్థాలను కలిగి ఉంటుంది

ఒక ప్రాథమిక అర్థం ఏమిటంటే మనిషిగా, మర్త్యత కలిగిన రూపంలో ఉండడం. ఈ భావనలో యేసు శరీరంలో ఉన్నాడు (1 తిమోతికి 3:16; 1 పేతురు 3:18). ఈ భావంలో పరిశుద్ధ జీవితాన్ని జీవించే వ్యక్తి కూడా శరీరంలో జీవిస్తున్నాడని చెప్పవచ్చు (2 కొరింథీయులకు 10:3; గలతీయులకు 2:30; ఫిలిప్పీయులకు 1:22, 24). ఈ పదాన్ని ఈ విధంగా ఉపయోగించినప్పుడు శరీరం నైతికంగా తటస్థమైనదిగా పరిగణించబడుతుంది. పౌలు గలతీయులకు చెప్పినట్లుగా, వారు కృప ద్వారా ప్రారంభించిన దానిని శరీరం ద్వారా (మానవ ప్రయత్నాలు) పరిపూర్ణంగా చేయలేరు.

రెండవ భావనలో, ఒక వ్యక్తి శరీరంలో ఉండడం అంటే పతనమైపోయిన, పాపపు స్వభావం చేత నియంత్రించబడడం. ఈ స్థితి, నూతనంగా జన్మించని వ్యక్తికి విలక్షణమైనది/ప్రత్యేకమైనది (ఎఫెసీయులకు 2:3). పడిపోయిన పాపపు స్వభావపు సహజ కార్యాలు, గలతీయులకు 5:19-21లో ఉన్నాయి. రోమా 8:1-13లో, శరీరంలో ఉండడం, రక్షించబడడానికి భిన్నంగా ఉంటుంది. శరీరానుసారమైన స్వభావం మరణం (8:6) మరియు దేవునికి విరోధమైనది (8:7). శరీరానుసారుడైన వ్యక్తి దేవునిని సంతోషపెట్టలేడు (8:8) మరియు మరణిస్తాడు (8:13). ఇక్కడ శరీరాన్ని గూర్చిన వివరణ రోమా 7లో వివరించిన స్థితివలెనే ఉంటుంది (7:5, 14, 18, 25 చూడండి). ఈ భావనలో శరీరానుసారుడైన వ్యక్తి పాపపు కార్యాలు చేస్తాడు, దీనికొరకు అతను ఆత్మీయ శిక్షను మరియు నిత్యమరణాన్ని పొందుతాడు (రోమా 7:5). అతనింకా రక్షణపొందలేదు.

ఒక వ్యక్తి, మారుమనసు పొందిన తరువాత కూడా, పడిపోయిన/పాపపు స్వభావం చేత ప్రభావితమవుతాడు, అయితే దానిచేత నియంత్రించబడడు. కొరింథీ సంఘపు వారు రక్షణ పొందిన తరువాత కూడా, శరీరానుసారులనే పిలవబడ్డారు (1 కొరింథీయులకు 3:1). పౌలు, 3:1లో లోకానుసారమైన జీవితం క్రీస్తునందు శిశువులైన వారికొరకు

ఉద్దేశించబడిందని సూచించాడు, కానీ ఒక విశ్వాసి ఇదే స్థితిలో నిరంతరం కొనసాగడు. కొరింథీయులు, శిశువులుగానే/ పసిపిల్లలుగానే ఉన్నందుకు అతను వారిని విమర్శించాడు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 4వ భాగం, 2వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(7:6) మనం క్రీస్తునందు ధర్మశాస్త్రం విషయమై మరణించాం గనుక ధర్మశాస్త్రం మన విషయమై మృతమైనది. స్వాతంత్ర్యం అంటే మనం సేవ చేయమని కాదు; కానీ ఇప్పుడు మనం ధర్మశాస్త్ర నియమాల యొక్క ఉద్దేశ్యాలను నెరవేర్చకుండ, అవి ఆశించే వాటిని మాత్రమే నెరవేర్చడానికి ప్రయత్నించే బదులు ఇప్పుడు మనం మన ఆత్మతో సేవ చేస్తున్నాం అని అర్థం.

(7:7) ధర్మశాస్త్రం, పాపం మరింతగా ప్రబలేలా చేస్తుందని పౌలు గతంలో చెప్పాడు (5:20). ఈ లేఖన భాగంలో, మరణార్థమైన ఫలాన్ని తీసుకురావడానికి, పాపం ధర్మశాస్త్రం ద్వారా పనిచేస్తుందని ఆయన చెప్పాడు (7:5). కాబట్టి, "ధర్మశాస్త్రం పాపమా? అనే ప్రశ్న తలెత్తడం సహజం? ధర్మశాస్త్రం పాపాన్ని ఖండించేది అని చెప్పడం ద్వారా ధర్మశాస్త్రం పాపం కాదని చూపించాడు.

(7:8) పాపి యొక్క చర్యలు ఖండించబడతాయని దేవుని ధర్మశాస్త్రం చూపిస్తుంది. ఒక విధంగా చూస్తే, ధర్మశాస్త్రం, పాపాన్ని మరింత చెడ్డగాను/తీవ్రంగాను చేస్తుంది. పాపి, తాను అపరాధినని గ్రహించినప్పుడు, అతని నిరంతర పాపం (దేవుని ధర్మశాస్త్రానికి అవిధేయత చూపుట) చేతన తిరుగుబాటు అవుతుంది.

(7:9) ధర్మశాస్త్రానికి కావలసిన వాటిని చూడక మునుపు, తనకు మరణశిక్ష విధించబడిందని అతనికి తెలీదు. కానీ పాపం, దేవుని ధర్మశాస్త్రాన్ని గురించి ఎలాంటి వివరాలు తెలియని వ్యక్తిని కూడా మరణానికి నడిపిస్తుంది (2:12 మరియు 5:14 చూడండి).

రోమా 7:7-25లో, రక్షించబడని పరిసయ్యునిగా పౌలు తన అనుభవాన్ని గురించి మాట్లాడుతూ, క్రీస్తు పట్ల తనకున్న అవసరాన్ని చివరికి తానెలా చూశాడో వివరించాడు. రోమా 7లో, పరిశుద్ధాత్ముడు తన హృదయంలో ఉన్న దురాశను చూడడానికి తన మనోనేత్రాలు తెరిచే వరకు, తాను ఎంత పరిపూర్ణంగా ధర్మశాస్త్రాన్ని పాటించానని పౌలు అనుకున్నాడో చెబుతున్నాడు. ఫిలిప్పీయులకు 3:6లో "ధర్మశాస్త్రమువలని నీతివిషయము అనింద్యుడనై యుంటిని" అని చెప్పినప్పుడు, ఆయన సాక్ష్యాన్ని చూడండి. ఫిలిప్పీయులకు 3:9లో చెప్పినట్లు, ఒక పరిసయ్యునిగా తన నీతిని ధర్మశాస్త్రం నుండి పొందుతున్నాడని భావించాడు. పరిశుద్ధాత్ముడు, తన హృదయంలో ఉన్న దురాశను అతనికి

వెల్లడిపరిచినప్పుడు, తాను ఆత్మీయంగా మరణించానని భావించాడు (రోమా 7:9). ఇది స్పష్టంగా తులనాత్మక ప్రకటన: ఒకప్పుడు తాను, ధర్మశాస్త్రాన్ని పాటించడం ద్వారా ఆత్మీయంగా జీవించే ఉన్నాడని అనుకున్నాడు; దురాశ విషయంలో తాను అపరాధినని, ధర్మశాస్త్రాన్ని పాటించలేదని గ్రహించినప్పుడు, తాను వాస్తవానికి చనిపోయానని అర్థం చేసుకున్నాడు. పౌలు రోమా 7:14-25 వచనాల్లో, తన చరిత్రను గురించి చెప్పడం కొనసాగించాడు. దురాశపడకుండా ఉండడానికి ప్రయత్నించాడు, కానీ అతని వల్ల కాలేదు. తాను పూర్తిగా ఓడిపోవడం మరియు పాపానికి దాసత్వంపూర్తి సాక్ష్యం. రోమా 7:25లో యేసుక్రీస్తు ద్వారానే విడుదల వస్తుందని ఆయన మనకు చెప్పాడు.[43]

(7:10) ధర్మశాస్త్రం, జీవిత విధానాన్ని చూపించడానికి ఉద్దేశించబడింది. ధర్మశాస్త్రం, రక్షణకు మార్గం కాదు, కానీ ఇది దేవునిని ఎరిగిన వారు జీవించడానికి ఒక దిశానిర్దేశం/మార్గం. కానీ ప్రకృతి సంబంధియైన మనిషి, తన పతన స్వభావాన్ని బట్టి దానిని అనుసరించలేడు, అది జీవార్థమైనదిగా ఉండడానికి బదులు, మరణార్థమైందిగా మారుతుంది.

(7:11) పాపం, ప్రయోజనకరమైందిగా, సంతోషమిచ్చేదిగా, హానికరం కానిదిగా కనబడడం ద్వారా మోసం చేస్తుంది. ఒక వ్యక్తి పాపం చేయడానికి శోధనకు లోబడినప్పుడు, తన పాపపు ఫలితాన్ని తగ్గించడంలో విజయం సాధించినప్పటికినీ, అతను శిక్షను పొందుతాడు; ఎందుకంటే దేవుని తీర్పు పాపపు పర్యవసానాలను బట్టి కాక, ధర్మశాస్త్రాన్ని బట్టి ఉంటుంది.[44]

(7:12) ధర్మశాస్త్రం, దేవుని స్వభావాన్ని వెల్లడి చేస్తుంది - ఆయన వలె ధర్మశాస్త్రం కూడా పరిశుద్ధమైంది, నీతిగలది, మంచిది, న్యాయమైనది.

(7:13) ధర్మశాస్త్రం చెడ్డది కాదు, కానీ పాపం ధర్మశాస్త్రానికి విరోధంగా స్పందించినప్పుడు, చెడు ఫలితాలు వస్తాయి. ప్రతి వ్యక్తిని, మరణశిక్ష క్రిందకు తీసుకొని రావడానికి పాపం ధర్మశాస్త్రాన్ని వాడుకుంది. ధర్మశాస్త్రం ద్వారా, పాపం నిజంగా చెడ్డదైనట్లు కనబరచబడింది.

### విశ్వాసిని గూర్చిన చిత్రం కాదు

రోమా 7:14-25 వచనాలు, ఒక సాధారణ విశ్వాసిని గురించి వివరిస్తున్నాయని చాలామంది భావిస్తారు, కానీ వివరణ గురించి ఆలోచించండి.

---

[43] ఈ పారాగ్రాఫ్ ను డా. అల్లన్ బ్రౌన్ రాశారు.

[44] 3:5-7 యొక్క నోట్స్ ను చూడండి .

ఒక బానిసలాగా పాపానికి అమ్మబడడం అంటే, అతను విమోచించబడలేదని అర్థం (7:14). ఏది సరైందో అతనికి తెలుసు, కానీ దానిని చేయలేడు (7:18). అతను బంధకాల్లో ఉన్నాడు గాని, విడుదలపొందిన వాడు కాదు (7:23). అతను దౌర్భాగ్యుడై, విడుదల కొరకు మొరపెడుతున్నాడు (7:24).

7:5-24లో, "ఏలయనగా మనము శరీరసంబంధులమై యుండినప్పుడు" (7:5) అనే మాటతో ప్రారంభమై, "నన్నెవడు విడిపించును?" అనే ప్రశ్నతో (7:24) ముగుస్తుంది. క్రీస్తు, పరిశుద్ధాత్మ, కృప, జీవితం లేదా విజయం మొదలగు విషయాలను గూర్చిన ప్రస్తావన లేదు; కానీ ఉత్తమ పురుషముకు (నేను, నా, నాది) 52 వాక్యాలు మరియు ధర్మశాస్త్రానికి 16 వాక్యాలు మరియు పాపానికి 15 వాక్యాలు ఉన్నాయి.

ఈ వ్యక్తి, రోమా 6లో విడుదల పొందిన వ్యక్తి కాదు. ఆ అధ్యాయం, విశ్వాసి పాపానికి బానిస కాదని పదే పదే చెబుతుంది. రోమా 7లో పౌలు వివరిస్తున్న వ్యక్తి అధ్యాయం ప్రారంభంలో పరిచయం చేసినట్లు ధర్మశాస్త్రం క్రింద ఉన్న వ్యక్తి (7:1, 5-6). 7:14వ వచనం, అధ్యాయంలో మిగిలిన భాగమంతా, 7:1, 5-6 లో చెప్పబడిన అదే స్థితిని వివరిస్తుందని చూపే ఒక అనుసంధానం.

శిక్షావిధి పొందని వ్యక్తి, క్రీస్తుయేసులో ఉన్న వ్యక్తి అని రోమా 8:1 చెబుతుంది. ఈ వ్యక్తి శరీరాన్ని అనుసరించి జీవించడని 8:4-5 వచనాలు చెబుతున్నాయి. శరీరాన్ని అనుసరించి జీవించే వ్యక్తి (7:25 మరియు 7:5లో ఉన్నట్లుగా) శిక్షావిధి క్రింద ఉన్న వ్యక్తి. శిక్షావిధి పొందిన వ్యక్తి నిజమైన విశ్వాసి కాదు. రోమా 7లో ఉన్న వ్యక్తి, నిస్సహాయత కలిగివాడు, శరీరం చేత నియంత్రించబడే వ్యక్తి.

ధర్మశాస్త్రం క్రింద బలహీనమైన స్థితి ముగిసిందని 8:3వ వచనం చెబుతుంది; కాబట్టి, రోమా 7లో వివరించిన నిస్సహాయ స్థితి, విశ్వాసి యొక్క స్థితి కాదు.

శరీరానుసారమైన మనసు మరణమని, అది దేవునికి విరోధమైనదని 8:6-7 వచనాలు చెబుతున్నాయి. కానీ 7:14వ వచనం, శరీరానుసారమైన మనసును వివరిస్తారంభిస్తుంది. ఈ సందర్భంలో ఉద్దేశించినట్లే, శరీరానుసారమైన వ్యక్తి, యదార్థంగా యేసును వెంబడించే వ్యక్తి కాదు.[45]

అయితే, ఈ వివరణలో పౌలు తనని గురించి ఎందుకు ప్రస్తావించాడు? 7:7వ వచనం నుండి ధర్మశాస్త్రం యొక్క దోషనిర్ధారణ క్రిందకు వచ్చే పాపిని గూర్చి వివరిస్తుంది. మిగిలిన అధ్యాయమంతా ఆయన గత అనుభవాన్ని అంటే ధర్మశాస్త్రాన్ని అనుసరించడం ద్వారా దేవునిని సంతోషపెట్టాలనే యదార్థమైన తన ప్రయాసను వివరిస్తుంది. అది

---

[45] శరీరానుసారం అనే మాటకు ఇతరచోట్ల వినియోగించిన దాని కొరకు "శరీరాన్ని/శరీర స్వభావాన్ని ర్వచించుట" అనే భాగాన్ని చూడండి.

అతనికి నిత్యజీవాన్ని ఇవ్వలేదు మరియు ఏవిధమైన సంతృప్తిని అందించలేదు. రోమా 8లో జయజీవితాన్ని గురించి వివరించడం ప్రారంభించాడు. 8:1-4లో వివరించిన వ్యక్తి, రోమా 7లో ప్రస్తావించిన స్థితిలోనే ఉండడం అసాధ్యం.

కాబట్టి, రోమా 7వ వచనం, తాను దేవుని ధర్మశాస్త్రం ద్వారా ఖండించబడతానని ఎరిగి, దానికి విధేయత చూపలేని, దానికి తగ్గట్లుగా జీవించలేని, పునరుజ్జీవనం పొందని వ్యక్తి గురించి వివరిస్తుంది.

► ఈ భాగంలో వివరించిన విషయాలను మీ స్వంత మాటల్లో క్లుప్తీకరించండి. ఈ పాఠములో మరింతగా ఋజువులు ఇవ్వబడతాయి గనుక, ఇప్పుడే ఈ విషయాన్ని గురించి వాదించనవసరం లేదు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 4వ భాగం, 2వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(7:15) చాలా మంది సరైన పనులు చేయడంలో తాము మెరుగుగా ఉండాలని ఆశిస్తారు. ఆ కోరిక ఉండటం మాత్రమే వారు క్రైస్తవులు అనే అర్థం కాదు. ఎవరికైనా ఆ కోరిక ఉండి, సరిగ్గా జీవించే శక్తి లేకపోతే, అది వారు పాపశక్తి నుంచి ఇంకా విమోచింపబడలేదని చూపిస్తుంది.

(7:16) వాళ్ళు ఉత్తమంగా జీవించి ఉండాలనే భావన, వాళ్ళు ధర్మశాస్త్రాన్ని విధేయత చూపకపోయినా, అది మంచిదని వాళ్ళకు తెలుసని తెలియజేస్తుంది.

(7:17-23) పాపం, మనిషి చిత్తాన్ని నియంత్రించేదిగా చెప్పబడింది. భ్రష్టుడైన వ్యక్తి/పతనమైన వ్యక్తి, దేవుడు సృష్టించిన మొదటి మానవుడు కలిగి ఉన్న స్వేచ్ఛాయుత చిత్తాన్ని స్వభావసిద్ధంగా కలిగి ఉండలేదు. మనిషి చిత్తం ఎంతగా బలహీనమైందంటే, దేవుడు తన కృప ద్వారా ఒక పాపి చిత్తాన్ని పునఃస్థాపించే వరకు పాపి దేవునిని ఎంపిక చేసుకోలేడు.

ముందస్తు కృప అనేది, ఇంకా తనకు స్పందించని వారిని చేరుకోవడానికి దేవుని చర్య. ప్రతి వ్యక్తికి విస్తరించబడిన దేవుని కృపలో స్వేచ్ఛాయుత చిత్త పునరుద్ధరణ, దేవుని కొరకు ఉన్న కోరిక భాగంగా ఉన్నాయి గనుక ప్రతి వ్యక్తి రక్షించబడాలా వద్దా అనే విషయాన్ని నిజంగా ఎంపిక చేసుకుంటాడు.

దేవుడు, ప్రతి వ్యక్తి కొరకు రక్షణ కార్యాన్ని ప్రారంభించాడు (యోహాను 6:44; ఎఫెసీయులకు 2:4-5, 12-13, 17; తీతు 2:11, తీతు 3:3-5), కానీ ఒక వ్యక్తి దేవునికి ప్రతిస్పందించే వరకు రక్షణ పొందలేడు.

(7:24) ఒక వ్యక్తి తనని తాను రక్షించుకోవడంలో తన సంపూర్ణ అసమర్థతను చూసిన తరువాత కలిగే నిరాశ, నిస్పృహలతో కూడిన కేక. ఇది రక్షించబడిన వ్యక్తి యొక్క రోదన కాదు.

(7:25) ఇక్కడ స్తుతి ఆరాధన నిరాశా నిస్పృహలతో నిండిన పాపి అంధకార జీవితములో వెలుగుగా లోపలికి ప్రవేశించింది.

తరువాత లేఖనభాగాన్ని క్లుప్తీకరించే వాక్యం వస్తుంది. మారుమనసు పొందని వ్యక్తి ధర్మశాస్త్రం సరైందనే మానసిక అంగీకారానికి వచ్చి, తానున్న వాస్తవ స్థితి కంటే ఉత్తమంగా ఉన్నట్లు నటించే ప్రయత్నం చేస్తాడు; కానీ అతని పాప కోరికలు అతన్ని పాపంలోనే ఉంచుతాయి. ఒక వ్యక్తి, తన మనసుతోను, శరీరంతోను పాపానికి సేవ చేసినందుకు శిక్షావిధి పొందుతాడు (7:5, 8:3).

## రోమా 7:14-25లో ఉన్న వ్యక్తిని అర్థం చేసుకోవడం.

ఈ లేఖనభాగంలో పౌలు, అవిశ్వాసి జీవితంలో, స్వతంత్రించుకున్న భ్రష్టత్వపు శక్తి (పాప నియమము) గురించి మాట్లాడాడు. పౌలు, మేల్కొలపబడిన పాపియైనా, తనలోనే పోరాటాన్ని కలిగి ఉన్నాడు.[46]

పౌలు శరీరంలో ఉన్న పాపపు నియమం, ఈ క్రింది ఫలితాలను కలిగించింది:

- తాను అసహ్యించుకొనే దానిని అతను చేస్తాడు (7:15).
- ఇచ్ఛయింపనిది అతడు చేస్తాడు (7:16).
- సరైంది చేయాలనే కోరిక ఉంటుంది, గాని చేయడానికి శక్తి ఉండదు (7:18).
- పాప నియమం, తన మనసునందున్న నియమాన్ని ప్రతిఘటిస్తుంది (7:23).
- అతను పాప నియమానికి చెరపట్టబడ్డాడు (7:23).
- అతను విభజించబడిన వ్యక్తి: అతని మనసు దేవునికి సేవ చేస్తుంది, కానీ అతని శరీరం పాప నియమానికి పరిచర్య చేస్తుంది (7:25).

ఒక వ్యక్తి ఇద్దరు యజమానులకు సేవ చేయలేడు. ఒక వ్యక్తి పాపం నుండి విడుదల పొంది, పాపానికి బానిసగా ఉండలేడు. ఒక వ్యక్తి దేవునికీ, పాపానికి దాసునిగా ఉండలేడు. రోమా 7:14-25లో ఉన్న భాష, రోమా 6లో పాప బానిసత్వం నుండి విడుదల పొందిన విశ్వాసిని గూర్చిన వ్యాఖ్యలకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. కాబట్టి, 7:14-25

[46] ఈ భాగాన్ని డా. అల్లన్ బ్రౌన్ రాశారు.

వచనభాగం, పాపంతో, ధర్మశాస్త్రంతో అవిశ్వాసికున్న సంబంధాన్ని గురించి, 7:1-13లో ప్రారంభమైన వివరణకు కొనసాగింపు.

రోమా 6వ అధ్యాయం, విశ్వాసి క్రీస్తుతో సిలువవేయబడి మరియు పునరుత్థాన ఫలితంగాతనకు పాపంతో ఉన్న సంబంధాన్ని గురించి వివరిస్తుంది. రోమా 7వ అధ్యాయం, ఈ క్రింది విషయాలను వివరిస్తుంది:

- ధర్మశాస్త్రంతో పాపికి ఉన్న సంబంధం.
- అంతరంగమందున్న పాపం మరియు ధర్మశాస్త్రం యొక్క పరస్పర చర్య.
- దేవుని ధర్మశాస్త్రం ఆశిస్తున్న వాటి విషయంలో మేల్కొలపబడి, తన అంతరంగంలో ఉన్న పాపానికి బానిసగా ఉండడాన్ని బట్టి తన స్వంత శక్తిపై ఆధారపడి ధర్మశాస్త్ర విధులను నెరవేర్చలేకపోవడం వలన పాపిలో కలిగే పోరాటం.

**రోమా 7:14-25 యొక్క వివరణలు మారుతూ ఉంటాయి**

**దృక్పథం 1:** పౌలు **సాధారణ క్రైస్తవ జీవితాన్ని** గురించి మాట్లాడుతున్నాడని కొంతమంది పండితులు రాశారు. ఈ వాక్యభాగంలో ఉపయోగించిన క్రియాకాలాలు/క్రియాపదాలు, ప్రస్తుతానికి సంబంధించినవే గాని, గతానికి సంబంధించినవి కాదు; పౌలు దృక్కోణంలో, క్రైస్తవ జీవితం పరిష్కరించబడని విషయాలతో ఉందని వాళ్ళు నొక్కి చెబుతారు.

**దృక్పథం 2:** "పాపమునకు అమ్మబడి" మరియు "నేనెంత దౌర్భాగ్యుడను" అనే వాక్యాలు రోమా 6 మరియు రోమా 8లో విశ్వాసి గురించి ఇచ్చిన వివరణతో పొందిక కలిగి లేవు గనుక పౌలు మారుమనసు పొందడానికి ముందు మనిషి స్థితిని గురించి వివరిస్తున్నాడని చాలామంది పండితులు నమ్ముతారు. రోమా 6 ప్రకారం, విశ్వాసి పాపం విషయమై మృతిబొంది, పాపం నుండి విడుదల పొంది, మరియు పాపంపై విజయం పొందడానికి క్రీస్తునందు అందుబాటులో ఉన్న స్వాతంత్ర్యాన్ని విశ్వాసం ద్వారా, దేవునికి సంపూర్ణంగా సమర్పించుకోవడం ద్వారా స్వతంత్రించుకుంటాడు. రోమా 8 ప్రకారం, శరీరానుసారంగా నడిచే వ్యక్తి దేవునిని సంతోషపెట్టలేడు మరియు క్రీస్తు ఆత్మ అతనిలో నివశించదు.

రెండవ దృక్పథం, రోమా పత్రికలో పౌలు వాదన యొక్క ప్రవాహానికి సరిపోతుందని, అతని బోధనంతటికీ ఎంతో అనుగుణంగా ఉందనేది ఈ పాఠ్యప్రణాళిక రచయితల అభిప్రాయం.

**రోమా 7:14-25లో ఉన్న వ్యక్తిని గురించి తరచుగా అడిగే ప్రశ్నలు**

రోమా 7:14-25లో పౌలు తన వ్యక్తిగత క్రైస్తవ జీవితాన్ని గురించి వివరిస్తున్నాడని భావించే వ్యక్తులు నుండి తరచుగా అడిగే కొన్ని ప్రశ్నలు ఇక్కడ ఉన్నాయి:

**ప్రశ్న 1:** తన అంతరంగపురుషుని బట్టి దేవుని ధర్మశాస్త్రమునందు నేను ఆనందించుచున్నానన్న పౌలు వ్యాఖ్యల సంగతి ఏమిటి (రోమా 7:22)? అవిశ్వాసియైన పరిసయ్యుడు దేవుని ధర్మశాస్త్రమందు ఆనందిస్తాడా?

**సమాధానం**: ఏ పరిసయ్యుడైన తన హృదయంలో దేవుని ధర్మశాస్త్రమందు ఆనందిస్తానని చెప్పవచ్చు. వాళ్ళు దేవుని ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేయడానికి తమ జీవితాన్ని సమర్పించుకున్నారు మరియు ప్రతిరోజు అనేక గంటలపాటు దానిని అధ్యయనం చేసేవారు. పౌలు, తనను తాను ధర్మశాస్త్రానికి సమర్పించుకున్నాడు మరియు యదార్థంగా దానికి విధేయత చూపాలని కోరుకున్నాడు. కానీ పరిశుద్ధాత్మ దేవుడు, పౌలు హృదయానికున్న దురాశ స్వభావాన్ని అతనికి చూపించి, వాస్తవమైన తన ఆత్మీయ స్థితిని చూసేలా అతన్ని మేల్కొలిపినప్పుడు, సరైనది చేయడానికి కృప ద్వారా తన మనసు కోరుకుంటున్నప్పటికిని, తాను చేయకూడని దానిలోనే కొనసాగుతున్నాడని గ్రహించాడు. ఎలా జీవించాలో పౌలుకు ధర్మశాస్త్రం చూపించింది, కానీ దానిని చేయడానికి అవసరమైన సామర్థ్యాన్ని ధర్మశాస్త్రం అతనికి ఇవ్వలేదు.

**ప్రశ్న 2:** మరి రోమా 7:14-25లో ఉపయోగించిన వర్తమాన క్రియాపదాల సంగతేంటి? పౌలు, "ధర్మశాస్త్రము ఆత్మ సంబంధమైనదని యెరుగుదుము; అయితే **నేను** పాపమునకు అమ్మబడి శరీరసంబంధినై యున్నాను" (రోమా 7:14) అని రాశాడు.

**సమాధానం**: రోమా 7:7-13లో భూతకాల క్రియాపదం నుండి రోమా 7:14-25లో వర్తమానకాల క్రియాపదానికి మారడమనేది తన వ్యక్తిగత గత సాక్ష్యాన్ని ఏ విధంగాను ప్రభావితం చేయలేదు. 7:14-24లోనున్న వర్తమానకాల క్రియాపదం, ఒక పరిపక్వత కలిగిన అపొస్తలునిగాను, మిషనరీగాను రోమీయులకు ఈ పత్రికను రాస్తున్న సమయంలో పౌలుకున్న ప్రస్తుత సాక్ష్యాన్ని సూచించాల్సిన అవసరం కూడా లేదు. ఒక రచయిత, గతంలో జరిగిన సంఘటనను లేదా అనుభవాన్ని తన పాఠకులకు స్పష్టం చేయాలి అనుకున్నప్పుడు, "చారిత్రాత్మక" లేదా "నాటకీయ" వర్తమానకాల క్రియాపదాన్ని, గ్రీకులో వర్తమాన క్రియాపదంగా వాడడం సుపరిచితమైన విషయం. కాబట్టి, పౌలు మారుమనసు పొందకమునుపు, తన గతజీవితంలో వాస్తవంగా ఉన్న విషయాన్ని స్పష్టం చేయడానికి వర్తమాన కాల క్రియా పదాన్ని వాడడం, పౌలు ఇప్పటికీ పాపపు బానిసత్వంతో పోరాడుతున్నాడని వ్యాఖ్యానించదు. రోమా 6 మరియు 8లో ఒక క్రైస్తవుడు పాపపు బానిసత్వానికి అమ్మబడలేదని స్పష్టంగా పౌలు చూపించాడు (రోమా 7:14).

**ప్రశ్న 3:** ఈ వాక్యభాగానికి, అనేకమంది క్రైస్తవులు తమ జీవితంలో కనుగొనే పోరాటానికి మధ్యనున్న సారుప్యతలు ఏమిటి?

**సమాధానం:** విశ్వాసి ఎదుర్కొనే పోరాటం, భ్రష్టుడైన వ్యక్తి ఎదుర్కొనే పోరాటానికి పూర్తిగా భిన్నమైంది. రోమా 7:14-25లోనున్న ధౌర్భాగ్యుడైన వ్యక్తి పాపంలో కొనసాగుతూనే ఉంటాడు. అతను పాపానికి బానిస. నిజమైన విశ్వాసి విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఒక క్రైస్తవుడు పరిస్థితులనుబట్టి పోరాటాలను, వైఫల్యాలను కలిగి ఉంటాడు, కానీ అతని జీవితం పాప, మరణ నియమాలకు బానిసగా ఉన్న జీవితంలా ఉండదు. క్రైస్తవుడు క్రీస్తుతో ఐక్యపరచబడతాడు మరియు అంతరంగంలోనున్న పాపపు శక్తినుండి విడుదల పొందుతాడు (రోమా 6:1-10).

ముగింపు: రోమా 7:14-25లో ప్రస్తావించిన ధౌర్భాగ్యుడైన వ్యక్తి, దేవునిని సంతోషపెట్టడానికి పోరాడే యదార్థవంతుడైన పరిసయ్యునిలా కనబడతాడు. ఒక వ్యక్తి పాపానికి బానిసగా ఉంటూనే, పాపం నుండి విడుదల పొందలేడు. ఒక వ్యక్తి దేవునికి, పాపానికి బానిసగా ఉండలేడు, ఎందుకంటే "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు" (మత్తయి 6:24, లూకా 16:13) యేసు చెప్పాడు. రోమా 7:14-25లో పాపంతోను, మోషే ధర్మశాస్త్రంతోను సంబంధం కలిగి, నూతనంగా జన్మించని వ్యక్తిని గూర్చిన వివరణ, రోమా 7:7-13లో ప్రారంభమైన వివరణకు కొనసాగింపు.

► పైన పేర్కొన్న వివరాలను, వివరణలను జాగ్రత్తగా పరిగణలోనికి తీసుకొంటూ, రోమా 7లోనున్న **వ్యక్తి** గుర్తింపుని గూర్చిన అంశాన్ని చర్చించండి.

## సువార్తీకరణలో ధర్మశాస్త్రాన్ని ఉపయోగించడం

అపొస్తలుడు, రోమా 7:7లో, ధర్మశాస్త్రం పాపాన్ని వెల్లడి చేస్తుందని మనకు చెప్పాడు. సువార్తీకరణకు ధర్మశాస్త్రం ప్రయోజనకరమైనది ఎందుకంటే ఒక వ్యక్తి తాను దేవుని ధర్మశాస్త్రం ద్వారా శిక్షించబడతానని గ్రహించినప్పుడు, రక్షణ పట్ల తనకున్న అవసరతను చూడగలుగుతాడు. సంఘ చరిత్ర అంతటా, ప్రభావవంతమైన సువార్తీకులందరూ, అవిశ్వాసులు రక్షణను ఆశించేలా చేయడానికి దేవుని ధర్మశాస్త్రాన్ని ఉపయోగించారు.

సువార్తీకులు, ధర్మశాస్త్రాన్ని ఉపయోగించడాన్ని గురించి ఏం చెప్పారో ఈ క్రింది ఉల్లేఖనాలు/వ్యాఖ్యలు వెల్లడి చేస్తాయి.

► వంతులవారీగా ఉల్లేఖనాలను/వ్యాఖ్యలను చదవండి మరియు బృందంలోని ఇతర సభ్యుల సహాయంతో వాటిని వివరించండి.

చార్లెస్ స్పర్జన్ నుండి[47]

ధర్మశాస్త్రాన్ని తొలగించడం ద్వారా, మీరు పాపాన్ని కూడా తీసివేశారు, ఎందుకంటే ధర్మశాస్త్రాన్ని అతిక్రమించడమే పాపం; ధర్మశాస్త్రం లేని చోట, అతిక్రమం లేదు. మీరు పాపాన్ని తొలగించినప్పుడు, మీరు రక్షకుడిని, రక్షణను కూడా తొలగిస్తారు, ఎందుకంటే ఏవిధంగాను అవి అవసరమైనవి కాదు. మీరు పాపాన్ని తక్కువ స్థాయికి తగ్గిస్తే, యేసుక్రీస్తు ఈ లోకానికి అందించడానికి వచ్చిన గొప్ప, మహిమాయుక్తమైన రక్షణ యొక్క అవసరత ఏమిటి?

ప్రజలు న్యాయమైన, పరిశుద్ధమైన దేవుని ధర్మశాస్త్రం ఎదుట భయపడనంత వరకు వాళ్ళు కృపను అంగీకరించలేరు; కాబట్టి, ధర్మశాస్త్రం, అత్యంత ఆవశ్యకమైనదిగాను, దీవెనకరమైన ఉద్దేశ్యాన్ని కలిగిందిగాను పనిచేస్తుంది.[48]

చార్లెస్ ఫిన్ని నుండి[49]

ఒక వ్యక్తి తన శిక్షావిధి యొక్క వాస్తవాన్ని, న్యాయాన్ని చూడనంతవరకూ, అనుభవించనంతవరకూ, ఆ వ్యక్తి ఆలోచనపూర్వకంగాను, హృదయపూర్వకంగాను క్షమాపణను అడగలేడు లేదా అంగీకరించలేడు.

పాపి యొక్క స్వనీతి నిర్మూలించబడే వరకు ధర్మశాస్త్రం యొక్క ఆధ్యాత్మికత అతని మనస్సాక్షికి అన్వయించబడుతూనే ఉండాలి మరియు అతను పరిశుద్ధుడైన దేవుని ఎదుట మాట్లాడలేనివాడిగాను, స్వీయ-శిక్షావిధిని పొందినవాడిగాను ఉంటాడు.

ధర్మశాస్త్రం సువార్తకు మార్గాన్ని ఎప్పుడూ సిద్ధపరుస్తూనే ఉండాలి. ఆత్మలకు సూచించేటప్పుడు ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే తప్పుడు నిరీక్షణలో నడిపించడం అంటే క్రైస్తవ అనుభవానికి తప్పుడు ప్రమాణాన్ని పరిచయం చేయడం, సంఘాన్ని నకిలీ విశ్వాసులతో నింపడమే అవుతుంది.[50]

---

[47] స్పర్జన్, 1800ల్లో ఇంగ్లాండ్ దేశంలో గొప్ప సౌవార్తిక బోధకుడు.

[48] Charles Spurgeon, “The Perpetuity of the Law of God”

[49] ఫిన్నీ 1800ల్లో అమెరికా దేశానికి చెందిన సువార్తీకుడు. ఆ శతాబ్దంలో మారుమనసు పొందిన వారికి మరే ఇతర బోధకునికంటే ఎక్కువగా ఈయనే బాధ్యుడు.

[50] Charles Finney, “How to Win Souls”

మార్టిన్ లూథర్ నుండి[51]

కానీ సాతాను... సంఘం నుండి పది ఆజ్ఞలను తీసివేయాలని బోధించే ఒక గుంపును లేపాడు, మరియు వ్యక్తులు ధర్మశాస్త్రాన్ని బట్టి భయపడకూడదు, కానీ క్రీస్తు కృపను గూర్చిన బోధ చేత మృదువైన ఉపదేశాన్ని పొందాలి.[52]

జాన్ బన్యన్ నుండి[53]

ధర్మశాస్త్ర స్వభావం గురించి, వారు దాని క్రింద ఉన్నారనే విషయాన్ని గురించి ప్రజలు నిర్లక్ష్యంతో ఉన్నంతవరకూ - అంటే దానికి విరోధంగా చేసే వారి పాపం ద్వారా, శాపం క్రింద, శిక్షను విధించే దాని శక్తి క్రింద ఉన్నంతవరకూ, సువార్త యొక్క నిజమైన జ్ఞానాన్ని విచారణ చేసే విషయంలో అజాగ్రత్తతోను, నిర్లక్ష్యంతోను ఉంటారు.

ధర్మశాస్త్రాన్ని ఎరుగని వ్యక్తి, తన చర్యలోను, సత్యంలోను తాను పాపిననే విషయాన్ని తెలుసుకోడు మరియు ఒక రక్షకుడు ఉన్నాడనే విషయాన్ని కూడా తెలుసుకోలేడు.[54]

జొనాతన్ ఎడ్వర్డ్స్ నుండి[55]

మనం పాపం చేస్తున్నామా లేదా అని తెలుసుకోవడానికి, తన నైతిక ధర్మశాస్త్రాన్ని తెలుసుకోవడమే ఏకైక మార్గం[56]

విలియం న్యూవెల్ రచించిన "ఎట్ కల్వరి" (కల్వరి యొద్ద)[57] అనే పాట నుండి

చివరికి దేవుని వాక్యం ద్వారా నేను నా పాపాన్ని గ్రహించాను;

---

[51] మార్టిన్ లూథర్ జర్మనీలో సంఘ సంస్కర్త. ఇతను బైబిల్ ఆధారిత సువార్తను తిరిగి కనుగొన్నాడు, తద్వారా వేలమంది మారుమనసు పొందారు.

[52] మార్టిన్ లూథర్, గలతీ పత్రిక వ్యాఖ్యానంలో ముందుమాటలో రాశాడు.

[53] బన్యన్, పరలోకానికి క్రైస్తవుని యాత్రను గురించి అత్యధికంగా ముద్రించబడిన పుస్తకమైన యాత్రికుని ప్రయాణం గ్రంథ రచయిత.

[54] John Bunyan, *The Doctrine of the Law and Grace Unfolded*

[55] ఎడ్వర్డ్స్, దైవజ్ఞాని మరియు అమెరికా దేశంలో వేలమంది మారుమనసు పొందడానికి కారణమైన మొట్టమొదటి గొప్ప మేల్కొలుపుకు బోధకుడు.

[56] Jonathan Edwards, "Christian Cautions: The Necessity of Self-Examination"

[57] ఇది ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యధికంగా ఉపయోగించే ఒక పాట.

అప్పుడు అపరాధభావనతోనున్న నా మనసు, వేడుకోవడానికి కల్వరివైపు తిరిగే వరకు
నేను త్రోసేసిన ధర్మశాస్త్రానికి భయపడ్డాను.

జాన్ వెస్లీ నుండి[58]

> పాపిని చంపడమే, ధర్మశాస్త్రం యొక్క మొదటి ఉపయోగం; అంటే అతను నమ్మిన జీవాన్ని, బలాన్ని నాశనం చేస్తుంది మరియు అతను మరణపు శిక్షక్రింద మాత్రమే కాదు కానీ దేవుని విషయమై చనిపోయి, ఆత్మీయ జీవితం లేకుండా, తన పాపముల చేతను, అపరాధములచేతను చచ్చిన స్థితిలో (ఎఫెసీయులకు 2:1) ఉన్నాడని ఒప్పింపజేస్తుంది. తాను జీవించునట్లు జీవం నొద్దకు, క్రీస్తునొద్దకు తీసుకొని రావడం రెండవ ఉపయోగం.
>
> దేవుని కృపను గూర్చిన ఈ ఆశీర్వాదకరమైన సాధనాన్ని గురించి (ధర్మశాస్త్రం) తేలిగ్గా ఆలోచించకూడదు లేదా మాట్లాడకూడదు. దానికి బదులుగా, అది ఎవరి యొద్ద నుండి వచ్చిందో, ఎవరి యొద్దకు నడిపిస్తుందో వారి కొరకు దానిని ప్రేమించండి, దానికి విలువనివ్వండి.[59]

► బోధకులు, పాపాన్ని తీవ్రంగా పరిగణించని వ్యక్తులతో కేవలం దేవుని ప్రేమను గురించి, క్షమాపణను గురించి మాట్లాడినట్లయితే ఎలాంటి సమస్యలు తలెత్తుతాయి?

## పాఠం 7 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) పాతనిబంధన ఆచార, పౌర నియమాలు ఇప్పటికీ ప్రాముఖ్యం అని చెప్పడానికి రెండు కారణాలను రాయండి.

(2) ధర్మశాస్త్ర విషయమై మరణించడం అంటే అర్థం ఏమిటి?

(3) *శరీరంలో* అనే మాట యొక్క రెండు ఉపయోగాలు ఏమిటి?

(4) ధర్మశాస్త్రం, పాపాన్ని మరింత చెడ్డదిగా ఎలా చేస్తుంది?

(5) సావార్థీకరణకు ధర్మశాస్త్రం ఎందుకు ప్రయోజనకరంగా ఉంటుంది?

---

[58] వెస్లీ సువార్తను ప్రకటించి, తన ద్వారా మారుమనసు పొందినవారిని, తనకు సహకరించిన బోధకుల ద్వారా మారుమనసు పొందినవారిని నిర్వహించాడు. అతను మరణించడానికి ముందు, ఇంగ్లాండ్ లో వారి సభ్యత్వం 79000 మరియు అమెరికాలో 40,000.

[59] John Wesley, రచించిన, "The Origin, Properties, and Use of God's Law" అనే పుస్తకం నుండి భావానువాదం చేయబడింది.

## పాఠం 7 - అభ్యాసాలు

ఈ పాఠంలో పేర్కొన్నవి కాకుండా పాత నిబంధన నియమాలకు ఉదాహరణలను ఒక పేజీలో రాయండి. అవి ఆచార, పౌర లేదా నైతికమైనవా అనే విషయాన్ని వివరించండి; నేడు క్రైస్తవులు వాటిని ఎలా అన్వయించుకోవాలో వివరించండి.

# పాఠం 8

# ఆత్మయందు జీవితం

### లేఖన అధ్యయనం - రోమా పత్రిక 4వ భాగం, 3వ లేఖన భాగం

ఈ పాఠ్యాంశంలో, రోమా పత్రిక యొక్క 4వ భాగం మనం కొనసాగిస్తాం. మనం రోమా 6వ అధ్యాయాన్ని (పాపంపై విజయాన్ని గురించి) మరియు రోమా 7వ అధ్యాయాన్ని (ఒప్పింపబడిన పాపిని గురించి) అధ్యయనం చేశాం. ఈ పాఠంలో, కఠినమైన ఈ లోకపు పరిస్థితులలో క్రైస్తవుని జీవితాన్ని గురించి వివరించే రోమా 8వ అధ్యాయాన్ని అధ్యయనం చేస్తాం.

**8వ అధ్యాయం యొక్క ప్రధానాంశం**

విశ్వాసి, పతనమైన ప్రపంచంలో జీవిస్తూ, దాని పరిస్థితుల నుండి, తన వ్యక్తిగత బలహీనతల నుండి శ్రమలు అనుభవిస్తున్నప్పటికిని, పరిశుద్ధాత్ముడు పాపంపైనా, పరిస్థితులన్నింటిపైనా అతనికి విజయాన్నిస్తాడు.

**8వ అధ్యాయం యొక్క సారాంశం**

ఈ అధ్యాయం, త్రిత్వంలోని ముగ్గురు వ్యక్తులలో ప్రతి ఒక్కరిని అనేకసార్లు సూచిస్తుంది. ముగ్గురు దైవవ్యక్తులు, మన ప్రస్తుత, మరియు అంతిమ రక్షణలో చాలా సన్నిహితంగా/దగ్గరగా పనిచేశారు. మనం శరీరంపై విజయాన్ని కలిగి జీవిస్తూ, రక్షణను గూర్చి వ్యక్తిగత నిశ్చయతను అనుభవిస్తూ, పతనమైన సృష్టిలోని పరిస్థితులను సహిస్తూ, మన వ్యక్తిగత అవగాహనకు మించిన ఆత్మీయ సహాయంతో ప్రార్థన చేస్తూ, దేవునితో రక్షణార్థమైన సంబంధంలో స్థిరంగా కొనసాగుతూ జీవించవచ్చు.

8:1-13 "ఇక మీదట శరీర స్వభావము గలవారు కారు" అనే శీర్షికను ఇవ్వగలిగే వాక్యభాగం.

**8:1-13 లేఖన భాగానికి పరిచయం**

శిక్షావిధి పొందని వాళ్ళు, ఇక మీదటశరీరానుసారంగా జీవించేవాళ్ళు కాదు. శరీరమందు ఉండడం అంటే కేవలం మానవ స్వభావంతో ఉండడం అని భావం కాదు, కానీ పడిపోయిన స్వభావం యొక్క నియంత్రణ క్రింద ఉండడం అని అర్థం.[60]

శరీ*రంలో* జీవించడం అనేది రక్షించబడడానికి భిన్నమైంది. శరీరానుసారమైన మనసు మరణం (8:5) మరియు అది దేవునికి విరోధమైంది (8:7). శరీరానుసారంగా జీవించే వ్యక్తి దేవునిని (8:8) సంతోషపరచలేడు మరియు చావవలసినవాడై ఉంటాడు (8:13). శరీరానుసారంగా జీవించడం అంటే 7:7-25లో వివరించిన అదే స్థితిని కలిగి ఉండడం (7:14, 18, 25 చూడండి).

8:12-13 వచనాలు ముగింపు. శరీరానుసారంగా జీవించే వ్యక్తి చావవలసిన వాడై ఉంటాడు అంటే దేవుని తీర్పు పొందుతాడు గనుక మనం శరీరానుసారంగా జీవించకూడదు (1:17 చూడండి). మనం శరీరం యొక్క పాపక్రియలను చంపివేయాలి. శరీరం చేత నియంత్రించబడే వ్యక్తి యేసును వెంబడించేవాడు కాదు గనుక, ఆత్మ శక్తి చేత పాపాన్ని అంతమొందించాలి.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 8:1-13 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(8:1) ఆత్మను అనుసరించే వ్యక్తి శిక్షా విధిని పొందడు. శరీరాన్ని అనుసరించే వ్యక్తి శిక్షావిధి పొందుతాడు మరియు క్రీస్తునందు ఉండడు.

(8:2) జీవమునిచ్చు ఆత్మయొక్క నియమం అంటే క్షమాపణ పొందిన వ్యక్తి, కృప చేత అంగీకరించబడి, ఆత్మీయజీవితాన్ని కలిగి ఉంటాడు. పాపమరణముల నియమం అంటే ధర్మశాస్త్రం ద్వారా తీర్పుపొందిన వ్యక్తి, మరణశిక్షను పొందుతాడు.

(8:3) ధర్మశాస్త్రం, నెరవేర్చవలసిన విధులను మాత్రమే అందిస్తుంది; అది శక్తిని అందించదు. అవిశ్వాసి, ధర్మశాస్త్రాన్ని పాటించలేడు; కాబట్టి, ధర్మశాస్త్రం రక్షణకు ఒక సాధనంగా ఉండడమనేది అసాధ్యం. దేవుడు తన కుమారుడిని, విమోచకునిగా, పంపించాడు.

---

[60] ఈ లేఖనాన్ని అర్థం చేసుకోవడానికి, 7వ పాఠంలో "శరీరాన్ని/శరీర స్వభావాన్ని ర్వచించుట" అనే అంశాన్ని అర్థం చేసుకోవడం చాలా ప్రాముఖ్యం.

(8:4) మనం దేవుని ధర్మశాస్త్రాన్ని మర్చిపోకూడదు గాని, ఆత్మ శక్తిచేత దానికి విధేయత చూపాలి.

(8:5) ప్రతి వ్యక్తి తన స్వభావాన్ని అనుసరిస్తాడు. అతను ఆత్మీయ జీవాన్ని పొందుకోకపోతే, అతను శరీరం చేత నియంత్రించబడతాడు.

(8:6) పాపస్వభావం చేత నియంత్రించబడడం అంటే శిక్షావిధి క్రింద ఉండడమే అవుతుంది. దీనికి ప్రత్యామ్నాయం, ఆత్మయందు నడుచుకుంటూ, దేవునికి విధేయత చూపడం. పాపాన్ని అనుసరించడంలో కొనసాగుతూ, క్షమాపణ పొందుతూ ఉండే అవకాశం లేదు.

> "మనుష్యులు బాహ్యమైన, దృశ్యమైన భౌతికమైన, పైపైన కనిపించే, వాటితో సౌఖ్యంగా ఉంటారు. మన హృదయాలలో పరిశుద్ధాత్మ దేవుడు జరిగించే లోతైన, అంతర్గత, రహస్యమైన పని దేవునికి ప్రాముఖ్యమైనది."
>
> - జాన్ ఆర్. డబ్ల్యూ. స్టాట్
>
> *(The Message of Romans: God's Good News for the World)*

(8:7-8) శరీర స్వభావం కలిగిన వ్యక్తి, సహజంగానే దేవునికి విరోధిగా ఉంటాడు, ఎందుకంటే తాను పాప స్వభావం చేత నియంత్రించబడినంత కాలం, అతను దేవునికి లోబడలేడు. ఆ స్థితిలో దేవుడు అతన్ని అంగీకరించడు.

► శరీరానుసారియైన వ్యక్తి యొక్క వివరణను గురించి కొన్ని వివరాలను పేర్కొనండి.

(8:9) శరీర స్వభావం గలవారు అంటే, పడిపోయిన, పాప స్వభావపు నియంత్రణ క్రింద ఉండడం అని అర్థం. విశ్వాసి, ఇక మీదట శరీరస్వభావం కలిగి ఉండడు. అతడు ఇంకనూ శరీర శోధనలు ఎదుర్కొంటాడు కాని దాని నియంత్రణలో ఉండడు మరియు శోధనను జయించడానికి శక్తిని కలిగి ఉంటాడు. దేవుని ఆత్మ ఉన్నాడు గనుక ఈ శక్తి అందుబాటులో ఉందని ఈ వచనం మనకు చెబుతుంది. ఒక వ్యక్తి పాపంపైన విజయాన్ని కలిగి లేనట్లయితే, అతను ఆత్మ చేత నడిపించబడుతున్నానని , అభిషేకించబడ్డానని చెప్పకూడదు.

(8:10-11) మానవుని శరీరం ఇప్పటికీ ఆదాము పాపాన్ని బట్టి, గతంలో మనం చేసిన పాపాలను బట్టి ప్రభావితమైంది. కాబట్టి, దాని కోరికలు తప్పుడు మార్గంలో వెళ్తాయి. మన శరీర కోరికలు మనల్ని నడిపిస్తాయని మనం నమ్మకూడదు. యేసుని మరణం నుండి జీవంలోనికి లేపిన అదే శక్తి, మనలోను పని చేసి, మనల్ని జీవంలోనికి నడిపిస్తుంది, తద్వారా మన శరీరాలు దేవుని పట్ల విధేయత చూపే స్థితికి వస్తాయి. శరీర బలహీనత పాపం చేయడానికి సాకు కాదు, ఎందుకంటే దేవుని శక్తి మరింత గొప్పది.

> "నియంత్రణలో ఉన్న మంచి ఆకలి, ఆరోగ్యాన్ని, ప్రయోజనాన్ని కలిగిస్తుంది. అదే ఆకలి వ్యక్తిని పూర్తిగా బానిసగా చేసి, అతని జీవితాన్ని పరిపాలిస్తూ, బానిసత్వం క్రిందకు, పాపం క్రిందకు తీసుకొని వస్తుంది."
>
> - విల్బర్ డేటన్

(8:12-13) శరీరాన్ని అనుసరించడం ఆత్మీయ మరణానికి నడిపిస్తుంది. ఆత్మ ద్వారా శరీరం యొక్క పాప క్రియలను చంపి, వాటిని తుదముట్టిస్తాం. అలా చేసిన ప్రజలే జీవిస్తారు - వాళ్ళే దేవుని తీర్పును తప్పించుకుంటారు. పాపం చేయడంలోనే కొనసాగాలి అని కోరుకున్న వ్యక్తిని దేవుడు క్షమించి, అంగీకరిస్తాడనే ఆలోచనే ఇక్కడ లేదు.

## క్రైస్తవునికి దేవుని ధర్మశాస్త్రం

క్రైస్తవ జీవితానికి దేవుని ధర్మశాస్త్రంతో సంబంధం లేదని కొందరంటారు. "మీ క్రియలను దేవుడు అసలు పట్టించుకోడు" మరియు "మీరు పరలోకానికి వెళ్ళినప్పుడు మీ పనులకు ఎలాంటి విలువ ఉండదు" లాంటి మాటలు చెబుతారు. వారి ఆలోచనల్లో విధేయత స్థానాన్ని కృప తీసుకుంటుంది. కానీ పౌలు, విశ్వాసముద్వారా ధర్మశాస్త్రమును నిరర్థకము చేయుచున్నామా? అట్లనరాదు; ధర్మశాస్త్రమును స్థిరపరచుచున్నాము" (రోమా 3:31) అని చెప్పాడు. ధర్మశాస్త్రమును నిరర్థకం చేసే సువార్తను బోధించినట్లయితే, అది పౌలు ప్రకటించిన సువార్త కాదు.

పౌలు మాట్లాడుతున్న ధర్మశాస్త్రం, దేవుడు కేవలం మోషే ద్వారా ఇశ్రాయేలు ప్రజలకు ఇచ్చిన నియమాల జాబితా కాదు. మోషే ధర్మశాస్త్రం, ఒక నిర్దిష్టమైన కాలానికి, సమయానికి దేవుని చిత్తం యొక్క అన్వయం. దానిలోనున్న చాలా విషయాలు అదే విధంగా అన్ని కాలాలకు, అన్ని స్థలాలకు వర్తించవు, ప్రాముఖ్యంగా ఆచారాలకు మరియు ఒక రాజ్యంగా ఇశ్రాయేలునకు ఇచ్చిన నియమాలకు అసలు వర్తించవు. కానీ మోషే ధర్మశాస్త్రం యొక్క సూత్రాలు లేదా నిత్యత్వపు సత్యాలు ఇప్పటికీ వర్తిస్తాయి ఎందుకంటే దేవుని స్వభావం మారదు.

సాధారణంగా చెప్పాలంటే , దేవుని ధర్మశాస్త్రమనేది మనిషి నుండి దేవుడు కోరుకునేది. ధర్మశాస్త్రం, పరిశుద్ధమైంది, న్యాయమైంది, మంచిది (7:12), ఎందుకంటే ఇది దేవుని స్వభావం నుండి వచ్చింది. ధర్మశాస్త్రం ఆత్మ సంబంధమైనది (7:14).

శరీరానుసారంగా కాక, అత్మానుసారంగా నడుచుకునేవారిలో ధర్మశాస్త్ర నీతి నెరవేరుతుంది (8:4), ఎందుకంటే వాళ్ళు దేవుని పట్ల విధేయత కలిగి జీవిస్తారు.

దేవుని ధర్మశాస్త్రాన్ని గురించి బైబిల్ ఈ క్రింది వ్యాఖ్యలు చేస్తుంది:

1. ధర్మశాస్త్రానికి విధేయత చూపడం అనేది హృదయంలో సంపూర్ణమైన ప్రేమకు వ్యక్తీకరణగా ఉండాలి (మత్తయి 22:37-40).
2. పవిత్ర హృదయమునుండియు, మంచి మనస్సాక్షినుండియు, నిష్కపటమైన విశ్వాసము నుండియు కలుగు ప్రేమ (1 తిమోతికి 1:5) యొక్క అవసరతను చూపడమే కొన్ని నిర్దిష్టమైన ఆజ్ఞల పట్ల దేవుని ఉద్దేశ్యం. ప్రేమ

యొక్క వైఖరి లేకుండా దేవుడు కోరిన వాటిని నెరవేర్చడం ఒక వ్యక్తికి అసాధ్యం, కాబట్టి అవిధేయత అనేది ప్రేమ లేకపోవడాన్ని చూపిస్తుంది.

3. ఈ ప్రేమ కలిగిన వ్యక్తి ధర్మశాస్త్రమంతటిని నెరవేరుస్తాడు; అంటే దేవుడు మనిషి నుంచి ఆశించే వాటిని అతడు సంపూర్ణంగా నెరవేరుస్తాడు (రోమా 13:8-10). కాబట్టి, సంపూర్ణ ప్రేమ కలిగి ఉండడం అంటే సంపూర్ణ విధేయత కలిగి జీవించడం.

4. ప్రేమ, విధేయతలో వ్యక్తీకరించబడుతుంది (1 యోహాను 5:2-3). ప్రేమ అంటే ఒక భావన లేదా దేవుని పట్ల ప్రకటించుకునే విశ్వాసం కాదు. ప్రేమ, విధేయతను భర్తీ చేయదు గాని విధేయతను ప్రేరేపిస్తుంది.

5. యేసు, ధర్మశాస్త్రాన్ని నిరర్థకం చేయడానికి రాలేదు మరియు ఒకడు ధర్మశాస్త్రాన్ని అతిక్రమించమని ఇతరులకు బోధించినట్లయితే, వాడు పరలోక రాజ్యంలో అల్పునిగా పిలవబడతాడని ఆయన చెప్పాడు (మత్తయి 5:17-20).

దేవుని ధర్మశాస్త్రాన్ని అతిక్రమించినందుకు ప్రజలు నిత్యశిక్షను పొందుతారు కాబట్టి, ధర్మశాస్త్రాన్ని సరిగా అర్థం చేసుకోవడం, సువార్తకు అవశ్యకం. ఒక వ్యక్తి పాపాన్ని గురించి మరియు ధర్మశాస్త్రాన్ని గురించి దేవునితో అంగీకరించకుండా పశ్చాత్తాపపడలేడు. పాపి, దేవుని ధర్మశాస్త్రాన్ని అతిక్రమించినందుకు నరకానికి పాత్రుడని కొంతమంది గ్రహిస్తారు, అయినప్పటికీ, ఒక వ్యక్తి విశ్వాసిగా మారిన తరువాత దేవుడు ధర్మశాస్త్రం గురించి పట్టించుకోడనే వింత భావన కలిగి ఉంటారు.

దేవుడు మనల్ని అంగీకరించడానికి ధర్మశాస్త్రం ఆధారం కాదు, కాని మనమెలా జీవించాలని దేవుడు కోరుకుంటున్నాడో చూపించడం ద్వారా క్రైస్తవుని జీవితాన్ని నడిపిస్తుంది.

► విశ్వాసికి, దేవునిని ప్రేమించడానికి, దేవుని ధర్మశాస్త్రానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి?

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 4వ భాగం, 3వ లేఖన భాగం**

**8:14-27 లేఖన భాగానికి పరిచయం**

8:14వ వచనం, తరువాత వచనాల్లోని రక్షణ నిశ్చయత అనే ప్రాముఖ్యమైన అంశానికి, ముందటి వచనాలను కలుపుతుంది. శరీరాన్ని అనుసరించకుండా, పాపంలో జీవించకుండా, ఆత్మను అనుసరించి జీవిస్తూ, జయజీవితాన్ని కలిగి ఉండే వారే దేవుని పిల్లలుగా గుర్తింపును పొందుతారు.

8:14-27 వచనాలకు, “పడిపోయిన లోకంలో పరిశుద్ధాత్ముని సహాయం” అనే శీర్షికను ఈ లేఖన భాగానికి ఇవ్వొచ్చు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 8:14-27 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(8:14) శరీరాన్ని అనుసరించకుండా, పాపంలో జీవించకుండా, ఆత్మను అనుసరించి జీవిస్తూ, జయజీవితాన్ని కలిగి ఉండే వారే దేవుని పిల్లలుగా గుర్తింపును పొందుతారు.

8:14-17 వచనాలు, పరిశుద్ధాత్ముడు ఇచ్చే రక్షణ గురించి వ్యక్తిగత నిశ్చయతను వివరిస్తాయి.

(8:15) విశ్వాసులుగా, మనం ధర్మశాస్త్రపు భయం క్రిందకు తిరిగి రాకూడదు. దానికి బదులుగా, మనం కృప ద్వారా రక్షణ నిశ్చయతను కలిగి జీవించాలి. మనం దేవుని పిల్లలుగా దత్తస్వీకారం పొందాము. క్రైస్తవ విధేయత అంటే రక్షణ మాధ్యమంగా ధర్మశాస్త్రం క్రిందికి తిరిగి రావడం కాదు, కాని దేవునితో సంబంధాన్ని గూర్చిన విషయం.

> ప్రస్తుతం క్రైస్తవులుగా చెప్పుకొనే వారిలో కేవలం కొద్ది శాతం మాత్రమే తమ జీవితాలలో క్రీస్తు తమను నీతిమంతులుగా చేసే కార్యాన్ని బలంగా వినియోగిస్తున్నారు. చాలామంది దేవుని పరిశుద్ధతను, వారి పాపం యొక్క పరిధిని, అపరాధభావనను సరిగా అర్థం చేసుకొనలేదు. వాళ్ళు తమ జీవితంలో లోతైన అపరాధభావనను, అభద్రతాభావాన్ని కలిగి ఉన్నప్పటికిని నీతిమంతులుగా తీర్చబడడం యొక్క ఆవశ్యకతను గ్రహించలేదు. చాలామంది ఈ సిద్ధాంతం పట్ల సిద్ధాంతపరమైన సమర్పణను కలిగి ఉంటారు, కానీ వారి అనుదిన జీవితంలో నీతిమంతులుగా తీర్చబడడం కొరకు పరిశుద్ధికరణపై ఆధారపడతారు, అగస్టీన్ వలె వారి యదార్థత నుండి, వారు మారుమనసు పొందిన గత అనుభవం నుండి, ప్రస్తుత మతపరమైన ప్రదర్శన లేదా వారు ఉద్దేశ్యపూర్వకంగా అరుదుగా అవిధేయత చూపుతారనే భావన నుండి దేవుడు తమను అంగీకరిస్తాడనే నిశ్చయతను పొందుతారు. కొంతమంది లూథర్ వేదికపై దృఢంగా నిలబడడంతో ప్రతి దినాన్ని ప్రారంభించగలిగినంతగా గ్రహింపు కలిగి ఉంటారు: మీరు అంగీకరించబడ్డారు, విశ్వాసంతో బయటికి చూస్తూ, మీరు అంగీకరించబడడానికి క్రీస్తు నీతి ఆధారమని ప్రకటిస్తారు. విశ్వాసం, ప్రేమలోను మరియు కృతజ్ఞతలోను క్రియాశీలకంగా ఉండగా, మరింత ఎక్కువైన పరిశుద్ధీకరణను కలిగించే నాణ్యమైన విశ్వాసంలో సేదతీరుతారు.[61]

(8:16) ఈ వచనం, ఇవాంజెలిస్టిక్ విశ్వాసులు “ఆత్మ యొక్క సాక్ష్యం” అని పిలిచే విషయాన్ని వర్ణిస్తుంది. మనం దేవునితో ప్రేమ, విధేయత కలిగిన సంబంధంలో ఉన్నామని పరిశుద్ధాత్మ మనకు నిర్ధారించి, మనం రక్షణ పొందామని

[61] Richard Lovelace, *The Dynamics of Spiritual Life*, (Downers Grove, IL: Intervarsity Press, 1979) 101.

సాక్ష్యమిస్తాడు. మన ఆత్మ ఆ సత్యాన్ని గురించి అవగాహన కలిగి ఉంటుంది. దేవుని ఆత్మ, మరియు మన ఆత్మ ఈ విషయంలో సమాధానం కలిగి ఉండడం, నిశ్చయతకు ఆధారం, కాబట్టి మనం నిజమైన విశ్వాసులమా అని ఆలోచిస్తూ అనిశ్చితిలో జీవించాల్సిన అవసరం లేదు.

మతాలు, తప్పుడు బోధలు రక్షణ నిశ్చయతను గురించి బోధించకుండా, వారి ప్రజలను భయంలోనే ఉంచుతాయి. రక్షణ పొందుటకు చేయాల్సినంతగా తాము చేయలేదని ప్రజలు భయపడతారు. సువార్త, భయం నుండి విడుదలనిస్తుంది ఎందుకంటే మనం క్షమాపణ పొందామని మనకు తెలుసు. మన విధేయత అనేది మనల్ని అంగీకరించిన దేవునిని సంతోషపెట్టడానికి ఆత్మను అనుసరించడంపై ఆధారపడి ఉంటుందే గాని, ఆయన అంగీకారం పొందడానికి ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడంపై ఆధారపడదు.

దేవుని పట్ల విధేయత కలిగిన సంబంధంలో మనం జీవిస్తున్నాం గనుక, అది సత్యమని పరిశుద్ధాత్మ దేవుడు సాక్ష్యమిస్తున్నాడు గనుక రక్షణ పొందామని మనకు తెలుస్తుంది (రక్షణ నిశ్చయత అంశాన్ని గురించి లేఖన ఆధారం కొరకు 1 యోహాను 2:3, 29; 1 యోహాను 3:14; 18-21; 24 చూడండి).[62]



**రోమా మార్గాలు**

రోమీయులు, వారు పరిపాలిస్తున్న దేశాల గుండా ప్రధాన దారులుగా అనేక రోడ్లను నిర్మించారు. ఈ నిర్మాణ నమూనా వలన ఆ రోడ్లు మృదువుగాను, ధీర్ఘకాలం మన్నేవిగాను ఉన్నాయి. ఈ రోడ్లు రోమ్ ను కేంద్రంగా కలిగిన నెట్వర్క్ లో భాగంగా ఉంటాయి. దీనివలన "రోడ్లన్నీ రోమ్ కు వెళతాయి" అనే నానుడి పుట్టింది.

► తన రక్షణ విషయమై నిశ్చయత లేని వ్యక్తికి మీరు ఏ సలహా ఇస్తారు?

(8:17-18) మనం క్రీస్తుతో కూడా దేవుని మహిమను, రాజ్యాన్ని స్వతంత్రించుకుంటాం. ఆయన మనలో గొప్ప కార్యాలు చేసి, ఆయన ఉద్దేశించిన విధంగా మన స్వభావాన్ని మార్చడం ద్వారా ఆయన మహిమ మనలో వెల్లడవుతుంది. మనం నిత్యజీవాన్ని స్వతంత్రించుకుంటాం, అంటే దేవుని జీవాన్ని మనం జీవిస్తాం. మనం క్రీస్తుతో కూడా పరిపాలన చేస్తాం. అయినప్పటికిని, మన విశేషాధికారాలన్నిటిని ఇప్పుడే పొందలేం. ఇక్కడ ప్రస్తావించిన మహిమపరచబడడం

[62] చిత్రం: "roman road to arch"ను జనవరి 2, 2010న Steven Damron తీశారు, https://www.flickr.com/photos/97719890@N00/4249691365 నుండి తీసుకున్నారు, CC BY 2.0లైసెన్స్ పొందినది, రంగులో అసలు దానికి కొంచెం భిన్నంగా ఉంది. ,

అనేది భవిష్యత్ లో జరిగే కార్యం. ఇప్పుడేమో శ్రమ, తరువాత పరిపాలన. అయినప్పటికిని, భవిష్యత్ మహిమ ఎంత గొప్పగా ఉంటుందంటే, మన భవిష్యత్ తో పోల్చినప్పుడు మన ప్రస్తుత పరిస్థితులు ప్రాముఖ్యంగా అనిపించవు.

8:19-25 వచనం దేవుడు తన సృష్టిని సంపూర్ణంగా పునఃస్థాపించడం కొరకు ఎదురుచూసే క్రమంలో మనం విశ్వాసం ద్వారా సహిస్తామని వివరిస్తుంది.

(8:19) సృష్టించబడిన సమస్తం, దేవుడు తన పిల్లలను సంపూర్ణంగా మహిమపరిచే సమయం కొరకు ఎదురుచూస్తోంది. మనం పరలోకంలో కలిగి ఉండే రూపాన్ని మనమింకను చూడలేదని అపొస్తలుడైన యోహాను చెప్పాడు (1 యోహాను 3:2).

(8:20-21) సృష్టించబడిన సమస్తం, పాపపు పర్యవసానాల వలన శ్రమపొందుతోంది. పాపపు పర్యవసానాలు చూసి పాపులు పశ్చాత్తాపపడతారనే నిరీక్షణతో దేవుడు శాపాన్ని అనుమతించాడు. సృష్టించబడినవి చివరికి పునఃస్థాపించబడి, దేవుని అంతిమ ప్రణాళికను నెరవేర్చడానికి తీసుకొని రాబడతాయి. దేవుని చిత్తాన్ని తిరస్కరించి, పశ్చాత్తాపపడని వ్యక్తులు దీనిలో ఉండరు.

(8:22) పాప శాపం, సృష్టినంతటిని ప్రభావితం చేసింది (ఆదికాండము 3:17-19). పని కఠినమైంది. నేల పతనానికి ముందు సహకరించినట్లు, ఇప్పుడు సహకరించదు. వ్యాధి, వృద్ధాప్యం మరియు మరణం, సమస్త జీవులకు సంభవించాయి.

(8:23) విశ్వాసులు కూడా శారీరకంగా పాపఫలాలను అనుభవిస్తారు, ఎందుకంటే వారి శరీరాలు పతనానికి ముందున్న పరిపూర్ణ స్థితికి పునఃస్థాపించబడలేదు. మనం మొదటి భాగంగా, మాదిరిగా మరియు దేవుని అంతిమ పునఃస్థాపనకు సాక్ష్యంగాను పరిశుద్ధాత్మను కలిగి ఉన్నాం. సృష్టి అంతిమంగాను, సంపూర్ణంగాను పునఃస్థాపించబడడమే అంతిమ రక్షణ. మనం ఇప్పటికే రక్షణ పొందామని చెప్పవచ్చు, అయితే మనం అంతిమ రక్షణ కొరకు ఇప్పటికిని ఎదురుచూస్తూనే ఉన్నాం.

► సృష్టి, పాప శాపం క్రింద ఉందనడానికి మీరు చూసిన కొన్ని సూచనలు ఏమిటి?

సాతాను, పాపులతో పనిచేసే విధానం ఎలా ఉంటుందంటే, మొదట ఉత్తమమైన దానిని ఇస్తాడు, తరువాత మరింత చెడ్డదానిని, నీచమైనదానిని ఇచ్చి, తాను నెరవేర్చని వాగ్దానాలను ఎరగా వేసి, చివరికి నరకానికి తీసుకెళ్తాడు. ఇప్పుడు దేవుడు పరలోకపు ఛాయను మనకు ఇచ్చి, ఉత్తమమైన దానిని మనకొరకు దాచి ఉంచాడు.

(8:24-25) మనం చూడని లేదా పొందని వాటి కొరకు ఎదురు చూస్తున్నామనే విషయాన్ని ఈ వచనాలు చెబుతాయి.

**శరీరపునరుత్థానం అనేది ఒక ప్రధానమైన క్రైస్తవ సిద్ధాంతం మరియు దీనిని తిరస్కరించడం పాపజీవితానికి నడిపిస్తుంది.** కొరింథీ సంఘంలో ఉన్న కొంతమంది వ్యక్తులు పునరుత్థానాన్ని తిరస్కరించారు మరియు రెండు విరుద్ధమైన భావాలు తెరమీదికి వచ్చాయి:

1. శారీరక కోరికలను చెడ్డవిగా భావించి, వాటిని పూర్తిగా అణచివేయడం.
2. శారీరక కోరికలు హానికరమైనవి కాదని భావించి, అజాగ్రత్తతో కోరికలు నెరవేర్చుకోవటం

శరీరం విలువలేనిదిగా, దుష్టత్వం కలిగినదిగా విజర్జించబడితే, శారీరక కోరికలన్ని పాప స్వభావం కలిగినవని కొందరు భావించారు. ఈ హేతుబద్ధతను అనుసరించి, వారు బ్రహ్మచర్యాన్ని సిఫారసు చేశారు. మరికొందరు, శరీరం నశించిపోతుంది గనుక ఇప్పుడు అన్ని రకాల పాపపు కోరికలను నెరవేర్చుకోవచ్చు అని నిర్ణయించారు. ఈ రెండు తీవ్రమైన ఆలోచనలు క్రైస్తవ సిద్ధాంతానికి విరుద్ధమైనవి. శరీర పునరుత్థానాన్ని తిరస్కరించినప్పుడు, ఈ విధమైన తప్పుడు బోధలు వెలుగులోనికి వస్తాయి..

8:26-27వ వచనం, విశ్వాసి ప్రార్ధనలోపరిశుద్ధాత్మని పనిని వివరిస్తుంది.

(8:26-27) మన పతనమైన స్థితి మన మానసిక, ఆధ్యాత్మిక అవగాహనలను ప్రభావితం చేస్తుంది. ఆధ్యాత్మిక వాస్తవాలను మనం పూర్తిగా అర్థం చేసుకోలేము. దేవుడు ప్రపంచంలో ఏమి చేయాలనుకుంటున్నాడో మనం పూర్తిగా అర్థం చేసుకోలేము. మనం ప్రార్ధన చేసినప్పుడు, మనం ఉచ్చరించలేని మాటలతో మనతో కలిసి ప్రార్ధన చేయడం ద్వారా పరిశుద్ధాత్ముడు మన బలహీనతను పూరిస్తాడు. దేవుని చిత్తానికి అనుగుణంగా ఎలా ప్రార్థించాలో ఆయనకు తెలుసు.

ఈ వచనాలు, తెలియని భాషలో ప్రార్ధన చేయడాన్ని సూచించడం లేదు. మనం ప్రార్ధనను చేయలేము గనుక పరిశుద్ధాత్ముడు మనకొరకు ప్రార్ధన చేస్తాడనేది వ్యాఖ్య. మనం అర్థం చేసుకోలేని విధానంలో ప్రార్ధన చేస్తామని ఇది చెప్పడం లేదు.

**8:28-39 లేఖన భాగానికి పరిచయం**

ఈ లేఖన భాగం, విశ్వాసులు దేవుని ప్రణాళికలో ఉన్నారని మరియు వారు తమ క్రైస్తవ యాత్రను ముగించడానికి మరియు క్రీస్తు సారూప్యతలోనికి పరివర్తన చెందడానికి అవసరమైన కృపను వారికివ్వడానికి ఉద్దేశించాడని చెబుతున్నాయి. ఆయన కృప మరియు శక్తి ఉన్నతమైనవి గనుక లోకంలోనున్న ఏ పరిస్థితులు మనల్ని దేవుని నుండి వేరు చేయలేవు.

ఈ లేఖన భాగానికి, "విశ్వాసికున్న ఆత్మీయ భద్రత" అని పేరు పెట్టవచ్చు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 8:28-39 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(8:28) "సమస్తం" అనే మాటలో మనం శ్రమపడే విషయాలన్నీ ఉంటాయి. పాపంతో పాటు సమస్తం జరగాలని దేవుడు నిశ్చయించాడని దీని భావం కాదు. విశ్వాసుల కోసం విషయాలన్నింటి నుండి మంచి ఫలితాలను దేవుడు తీసుకొస్తాడని దీని భావం. 8:37లో, అన్ని రకాల శ్రమల జాబితాను పేర్కొన్న తరువాత, ఈ విషయాలన్నింటిలో మనం అత్యధిక విజయాన్ని పొందామని చెబుతున్నాడు. దేవుడు వాటిని తన ఉద్దేశ్యాల కొరకు వాడుకొని, వాటి ద్వారా మనలను అభివృద్ధి చేస్తాడు.

జరిగే ప్రతి దానిని దేవుడు నిశ్చయించడు. స్వచిత్తం పనిచేయడానికి, అవకాశమున్న చోట నిజమైన సాహసం చేయడానికి మరియు పాపానికి కూడా అనుమతిస్తాడు. అయితే వీటన్నింటినుండి, ప్రమాదకరమైన ఉద్దేశ్యాలతో ఇతరులు చేసిన పాపాల నుండి కూడా దేవుడు విశ్వాసికి మేలు కలుగజేస్తాడు.

(8:29) లోకంలో ఉన్నవారందరూ రక్షణ పొందరని మనకు తెలుసు. కాబట్టి, ఆయనకు ముందుగా తెలిసిన వారిని గురించి నిర్దిష్టమైనది ఆయనకు తెలుసు. రోమీయులకు రాసిన పత్రిక సందర్భం నుండి, విశ్వాసముంచే వారిని దేవుడు ఎంపిక చేస్తాడని మనకు తెలుసు. ఆయన అనుగ్రహించే రక్షణకు విశ్వాసంతో ఎవరు స్పందిస్తారో ఆయనకు తెలుసు (11:2ను, వ్యాఖ్యానాన్ని చూడండి). ఈ క్రమంలో పూర్వగమ్య నిర్దేశానికి (Predestination) ముందే భవిష్యత్ జ్ఞానం రావడం గమనార్హం. దేవుడు విశ్వాసులను రక్షించడానికి ప్రణాళిక కలిగి ఉన్నాడు. (దేవుడు 'ఎరిగి ఉండడాన్ని' గూర్చిన ఉదాహరణల కొరకు కీర్తనలు 1:6, 1 కొరింథీయులకు 8:3, గలతీయులకు 4:9 మరియు 2 తిమోతికి 2:19 చూడండి)

వారు క్రీస్తువలె మారాలని ఆయన ప్రణాళిక చేశాడు. ఆయన వలె మారడం అంటే, స్వభావంలో మనం క్రీస్తువలె మారతామని అర్థం.

(8:30) దేవుడు చేసే కార్యం, మనల్ని నిత్య రక్షణలోనికి తీసుకొస్తుంది. మన ఇష్టతను తప్పా ఆయన మన నుండి ఇంకేమి ఆశించడం లేదు.

(8:31-32) ఏ పరిస్థితులూ దేవునికి కష్టమైనవి కాదు. అంతిమమైన త్యాగాన్ని ఆయన ఇప్పటికే చేసేశాడు, కాబట్టి ఇప్పుడు మన విజయానికి అవసరమైన ప్రతి దానిని ఆయన మనకు ఇస్తాడు.

(8:33) మన రికార్డులపై నున్న పాపాలను బట్టి ఎవరూ మనల్ని దోషులుగా పరిగణించరు, ఎందుకంటే దేవుడు మనల్ని నీతిమంతులుగా తీర్చినప్పుడు వాటిని తుడిచివేశాడు.

(8:35-39) ఈ లేఖనభాగం, యేసును అనుసరించువారికి గొప్ప నిరీక్షణను, ఆదరణను అందిస్తుంది. దేవుని నుండి ఏదీ మనలను వేరుచేయలేదు. మనం ఈలోకంలో ఎదుర్కొనే ప్రతిదాని నుండి ఆత్మీయంగా భద్రపరచబడ్డామని పౌలు చెబుతున్నాడు. **ఒక విశ్వాసి తన విశ్వాసంలో స్థిరంగా కొనసాగడానికి అవసరమైన శక్తిని అందించడంలోను దేవుడు ఎన్నటికీ విఫలమవ్వడనే మరియు దేవుని నుండి మరే శక్తికూడా మనల్ని దూరం చేయలేదనే వాగ్దానమే విశ్వాసికి భద్రత.**

► ఒక విశ్వాసి, విశ్వాసంతో అన్ని పరిస్థితులను ఎదుర్కోవడానికి దేవుడతనికి సహాయం చేసే విధానాన్ని మీరు ఎలా వివరిస్తారు?

### పాఠం 8 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) ధర్మశాస్త్రం, రక్షణకు ఒక సాధనమవ్వడం ఎందుకు అసాధ్యం?

(2) విశ్వాసి, యికను శరీరాన్ని అనుసరించి జీవించడు అంటే అర్థం ఏమిటి?

(3) ఒక క్రైస్తవుని జీవితాన్ని, ధర్మశాస్త్రం ఎలా నడిపిస్తుంది?

(4) ఆత్మ యొక్క సాక్ష్యం అంటే ఏమిటి?

(5) అంతిమ రక్షణ అంటే ఏమిటి?

(6) శరీర పునరుత్థాన సిద్ధాంతాన్ని తిరస్కరించడం ఏ రెండు విరుద్ధమైన అతి పరిమితులకు దారితీస్తుంది?

(7) విశ్వాసికున్న భద్రత ఏమిటి?

### పాఠం 8 - అభ్యాసాలు

పతనమైన లోకంలో క్రైస్తవునిగా జీవించడంలో ఎదురయ్యే సమస్యలను ఒక పేజీలో వివరించండి మరియు పరిశుద్ధాత్మ దేవుడు క్రైస్తవుని పట్ల చేసే కార్యాలను వర్ణించండి.

# పాఠం 9

# దేవుని ఎన్నిక

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం

రోమీయులకు రాసిన పత్రిక, ఒక వ్యక్తి రక్షణను, ఆశీర్వాదాన్ని పొందడానికి దేవునితో సంబంధంలోనికి ఎలా వస్తాడో వివరిస్తుంది. దేవునితో సంబంధం అనేది విశ్వాసం ద్వారా పొందిన కృపపై ఆధారపడి ఉంటుంది. ఈ సందేశం, ఇశ్రాయేలు ప్రజలను గురించి ప్రశ్నలు ఉత్పన్నమవ్వడానికి కారణమవుతుంది. దేవునికి, ఇశ్రాయేలుకు మధ్య ఉన్న ప్రత్యేక సంబంధానికి ఏమైంది? యూదుడైన వ్యక్తి ఎలా రక్షణ పొందుతాడు? దేవుడు ఇశ్రాయేలు పట్ల ఇంకనూ ప్రత్యేకమైన ప్రణాళిక కలిగి ఉన్నాడా? పౌలు సువార్త సందేశాన్ని వివరించడం కొనసాగిస్తున్నప్పుడు, ఈ అధ్యాయాలు ఆ ప్రశ్నలకు సమాధానమిస్తాయి.

## పరీక్షపై దేవుని న్యాయం

“అవును గాని ఓ మనుష్యుడా, దేవునికి ఎదురు చెప్పుటకు నీవెవడవు?” (రోమా 9:20). కొంతమంది ప్రజలు ఈ వచనాన్ని ఉపయోగించి, దేవుని న్యాయాన్ని పరీక్షించడానికి ప్రయత్నించే ఏ వ్యక్తినైనా గద్దిస్తారు. దేవుని న్యాయం, మన న్యాయంకంటే ఎంతో ఉన్నతమైనదని, దానిని మనం అర్థం చేసుకోలేమని చెబుతారు.

> “నిత్యుడైన దేవునిగా ఉండడం అంటే, ఆయన సమస్త దురాత్మల, సమస్త దేవదూతల, సమస్త మానవుల ఎదుట నిందారోపణకు పైగా నిలబడగలగాలి. ఆయన అన్యాయస్తుడని ఎవరూ ఆయన్ని (సరిగా) నిందించలేరు.”
> - ఆర్.జి. ఫ్లెక్సన్, *Rudiments of Romans*

నలుపును తెలుపుగా మార్చే, దుష్టత్వాన్ని మంచిగా మార్చే ఉన్నతస్థాయి న్యాయం ఉందా? ఒక న్యాయమూర్తి చిన్నపిల్లలకు తీర్పు తీర్చేటప్పుడు, పొరపాట్లను, ఉద్దేశ్యపూర్వకంగా చేసే నేరాలను ఒకే విధంగా తీర్పుతీరుస్తాడు మరియు వారు నివారించలేనివాటిని చేసినందుకు ప్రజలను శిక్షిస్తాడు, అప్పుడు మనం ఆయన్ని అన్యాయస్థుడు అంటామే గాని ఉన్నతస్థాయి న్యాయానికి అనుగుణంగా తీర్పు తీర్చాడని అనము.

దేవుని న్యాయం, ఉన్నతమైనది, కానీ మన న్యాయానికి వ్యతిరేకమైంది కాదు. న్యాయాన్ని గూర్చిన మన భావన ఆయన నుండి వస్తుంది మరియు ఆయన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ఆయన పరిశుద్ధుడై ఉన్నట్లుగానే మనం కూడా పరిశుద్ధులుగా ఉండాలని ఆయన ఆజ్ఞాపించాడు. కొన్నిసార్లు ఆయన చర్య మనకు అన్యాయమని అనిపిస్తుంది,

ఎందుకంటే మనం వాస్తవాలన్నింటిని చూడలేము, ఎందుకంటే మన విలువలు భూసంబంధమైనవి, ఎందుకంటే మన దృక్కోణాలు, మన కోరికలను బట్టి చెడిపోయాయి.

దేవుడు న్యాయవంతుడనని చెప్పుకొని, తన మార్గాలను తన సృష్టికి వివరించడానికి నిరాకరించేవాడు కాదు. దానికి బదులుగా, దేవుని న్యాయం కనబడుతుందని రోమా పత్రిక నొక్కి చెబుతుంది. దేవునిని తిరస్కరించేవాళ్ళు, దేవుని గురించి వాళ్ళకు తెలిసిన విషయాలను బట్టి నిరుత్తరులుగా ఉన్నారు (1:20). తీర్పుకు తాము యోగ్యులమని పాపం చేసేవారికి తెలుసు (1:32). రోమా పత్రిక 2వ అధ్యాయం, పూర్తిగా దేవుని తీర్పుల నిష్పాక్షికత మరియు స్థిరత్వంపై ఆధారపడి ఉంటుంది. ప్రాయశ్చితకార్యం అంటే దేవుడు, పాపులను నీతిమంతులుగా తీర్చినప్పటికిని, ఆయన న్యాయవంతుడుగానే ఉండడం (3:26).

మనం దేవునిని న్యాయవంతునిగా చూడాలని దేవుడు కోరుకుంటున్నాడని స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కారణాన్ని బట్టి, దేవుడు తన రక్షణ విధివిధానాలను, అవి న్యాయమైనవనుటకు కారణాలను వివరించాడు. దేవునిని న్యాయవంతునిగా చూడనంతవరకూ, ఆయనను నిజంగా ఆరాధించడం సాధ్యం కాదు. దేవుడు న్యాయవంతుడని మనం నమ్మకపోతే, ఆయన పట్ల మన విధేయత నిరంకుశుడైన వ్యక్తికి లేదా దోపిడీదారునికి విధేయత చూపినట్లు అవుతుంది. [63]

కాబట్టి, దేవుడు తనను తాను విచారణకు గురిచేసుకున్నాడు లేదా తనను తాను ఆ స్థితిలో ఉంచుకున్నాడు (3:4). ఆయన చర్యలు, వాస్తవ న్యాయంతో అనుగుణంగా ఉంటాయనే నమ్మకాన్ని ఆయన కలిగి ఉన్నాడు. దేవుని చర్యలను నిజాయితీగా విచారిస్తే, ఆయన నీతిమంతుడని మరియు పాపి, దోషియని చూపిస్తుంది.



రోమా **కోట**

ఈ కోట ప్రాచీన కాలం నుండి రోమాలో నిలిచి ఉంది.

► దేవుని చర్యల న్యాయాన్ని అర్థం చేసుకోవడం మనకెందుకంత ప్రాముఖ్యం? మనం తన న్యాయాన్ని అర్థం చేసుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడని మనమెలా తెలుసుకోవచ్చు?

దేవుని సార్వభౌమాధికారాన్ని గురించి బైబిల్ దృక్కోణం:

[63] చిత్రం: "Porta San Paolo front"ను, మార్చి 1, 2005న Joris తీశాడు, , https://commons.wikimedia.org/wiki/File:Porta_San_Paolo_front.JPG, పబ్లిక్ డొమైన్ నుండి తీసుకున్నారు.

- పర్యవసానాలతో పాటుగా నిజమైన ఎంపికలు చేసుకోవడానికి ప్రజలను అనుమతించాలని దేవుడు నిశ్చయించుకున్నాడు.
- ప్రజలు తీసుకున్న నిర్ణయాలకు దేవుడు స్పందిస్తాడు (రోమా 1:24, 26, 28).
- ఒక వ్యక్తి ఏం చేసినా కూడా దేవుడు తన అంతిమ ప్రణాళికను నెరవేర్చడానికి శక్తిమంతుడు, జ్ఞానవంతుడు.

ప్రతి వ్యక్తి సువార్తను అంగీకరించాలా వద్దా, అనే దానిని ఆధారం చేసుకొని రక్షణ పొందాలా లేదా తృణీకరించాలా అనేది నిర్ణయించుకోవచ్చు. దేవుడు రక్షణను అనుగ్రహించి, ప్రజలకు తమ అపరాధాన్ని గురించి గ్రహింపును, కృప కొరకు ఆశను, విశ్వసించడానికి సామర్థ్యాన్ని ఇస్తాడు. అవిశ్వాసులు పశ్చాత్తాపపడేలా ప్రేరేపించడానికి సేవకులను పంపుతాడు. కానీ వ్యక్తి రక్షణను గురించి తన వ్యక్తిగత నిర్ణయాన్ని తీసుకుంటాడు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం, 1వ లేఖన భాగం**

**9వ అధ్యాయం యొక్క ప్రధానాంశం**

దేవుడు రక్షణ మార్గాన్ని నిర్ణయించాడు మరియు ఏ వ్యక్తి మరో మార్గంలో రక్షణ పొందలేడు.

**9వ అధ్యాయం యొక్క సారాంశం**

ఈ అధ్యాయాన్ని, ఎవరు రక్షణ పొందుతారో మరియు ఎవరు నశిస్తారో దేవుడు నిర్ణయిస్తాడనే అర్థంలో తప్పుడు వ్యాఖ్యానాన్ని పొందుతుంది, కానీ మనకు తెలియని ప్రాతిపదికపై ఆ నిర్ణయం ఉంటుందని భావిస్తారు. వాస్తవానికి, విషయమేమిటంటే దేవుడు రక్షణ మార్గాన్ని నిర్ణయించాడు మరియు ఏ వ్యక్తి మరొక మార్గంలో రక్షణ పొందలేడు. ఎలాంటి ప్రామాణికం లేకుండా కొంతమందిని అంగీకరించడం, కొంతమందిని తిరస్కరించడం ద్వారా ఆయన సార్వభౌమాధికారం వ్యక్తీకరించబడదు. ఆయన సార్వభౌమాధికారం, ఒక ప్రామాణికతను అంటే రక్షణ మార్గం యొక్క నమూనాను ఏర్పరచడం ద్వారా వ్యక్తీకరించబడుతుంది.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 9:1-5 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(9:1-3) ఇశ్రాయేలు ప్రజలు ఆత్మీయంగా నశించిపోయినందున, పౌలు తన వేదనను వ్యక్తీకరిస్తున్నాడు. తాను వారికి సహోదరుడనని ఆయన ప్రస్తావించాడు. పౌలు, యూదుల మతంలో గొప్పగా రాణించాడు. వారి పండితులను ఆయన

గౌరవించాడు. చాలామంది బోధకులు, నాయకులు మరియు వాళ్ళు సేవ చేసిన ప్రజల్లో అనేకమంది క్రీస్తును తృణీకరించారని గ్రహించి అతను దుఃఖపడ్డాడు.

(9:4-5) ఇశ్రాయేలు, గొప్ప ఆత్మీయ ఆధిక్యతలు కలిగిన రాజ్యం

- వాళ్ళు మొదటిగా దేవునిని తండ్రిగా కలిగి ఉన్నారు.
- దేవుడు బయలుపరిచిన మహిమను వాళ్ళే మొదట చూశారు.
- వారు
  - నిబంధనలను, తన ఆశీర్వాద నియమాలుగా కలిగి ఉన్నారు.
  - ధర్మశాస్త్రాన్ని కలిగి ఉన్నారు.
  - ఆరాధన విధానాన్ని కలిగి ఉన్నారు.
  - అంతిమ రక్షణను గూర్చిన వాగ్దానాన్ని కలిగి ఉన్నారు.
- పితరులు, యూదులు.
- యేసు, యూదునిగా జన్మించాడు.

పౌలు గతంలో 3:1-2 లేఖన భాగంలో యూదులు గొప్ప ప్రయోజనాలను కలిగి ఉన్నారని చెప్పాడు.

**యూదామతం, క్రైస్తవమత మూలం**

యూదామతాన్ని, క్రైస్తవ్యానికి మూలమని చెప్పవచ్చు. యూదా మతం, ఇతర మతాలకంటే ఎక్కువగా క్రైస్తవ్యంతో పోలికను కలిగి ఉంది. యూదా మతం క్రీస్తును తిరస్కరించేవరకు తప్పుడు మతంగా లేదు.

యూదా మతానికి, క్రైస్తవ్యానికి మధ్యనున్న కొన్ని సంబంధాలను ఇక్కడ పేర్కొనడం జరిగినది.

1. క్రైస్తవులు, యూదామతాన్ని ఆచరించేవారు పాత నిబంధనలో ప్రత్యక్షపరచబడిన దేవుని ఆరాధిస్తారు.

2. యూదా మతం, క్రైస్తవ్యానికి దైవజ్ఞానపరమైన, తాత్వికమైన పునాదిని అందిస్తుంది. ఇశ్రాయేలు దేశం, ఏకదైవారాధన కలిగి, నిత్యుడు, సృష్టించబడనివాడు, పరిశుద్ధుడునైన దేవుని యందు విశ్వాసముంచుతుంది. దేవుడు సమస్తాన్ని మంచిగా సృష్టించాడు, కానీ పాపం వలన దుష్టత్వం, శ్రమ వచ్చాయి. మనిషి దేవుని స్వరూపంలో చేయబడిన ప్రత్యేకమైన సృష్టి మరియు తన విమోచన తరువాత మహిమాయుక్తమైన లక్ష్యాన్ని కలిగి ఉన్నాడు. మనం ఈ సత్యాలను భావిస్తూ ఉంటాం, కానీ ప్రాచీన ఇశ్రాయేలు చుట్టూ ఉన్న మతాలన్నింటితో అవి విభేధిస్తాయి. ఈ సత్యాలు మొదటిగా ఇశ్రాయేలుకు ప్రత్యక్షపరచబడ్డాయి.

3. క్రైస్తవులు మరియు యూదా మతాన్ని అనుసరించేవారు పాతనిబంధనను లేఖనంగా అంగీకరిస్తారు, కానీ యూదామతాన్ని అనుసరించేవారు క్రొత్త నిబంధనను అంగీకరించరు.

4. క్రైస్తవ్యాన్ని స్థాపించిన యేసు, యూదుడు మరియు తన ప్రజల మతాన్ని ధృవీకరించాడు. ఆ మతం యొక్క నిజమైన ప్రాధాన్యతలను ఆయన ప్రకటించాడు మరియు పరిసయ్యుల వక్రీకరణలను గద్దించాడు. ఆయన తానొక క్రొత్త మతాన్ని స్థాపించానని చెప్పలేదు గాని, పాత దానినే నెరవేరుస్తున్నానని చెప్పాడు.

5. మెస్సీయా నిరీక్షణ అనేది యూదా మతానికి గుండె లాంటిది. యేసు, యూదుల మెస్సీయా అని నమ్మిన యూదులే మొదటి క్రైస్తవులు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం, 1వ లేఖన భాగం**

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 9:6-16 వచనాలు చదవాలి..

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(9:6-9) వారిలో కొంతమంది రక్షణ పొందారు; దేవుని వాక్యం ప్రభావాన్ని చూపింది. దేవుని ప్రజలు అంటే అబ్రాహాము నుండి వచ్చిన సంతానం కాదు. వాళ్ళు దేవుని వాగ్దానాన్ని నమ్మడం ద్వారా రక్షణ పొందిన వారు.

దేవుడు అబ్రాహామును ఎన్నుకొన్నప్పటి నుండి, రక్షణను ఈవిధంగానే ప్రణాళిక చేశాడు. ఇస్సాకు నుండి కొనసాగిన దేవుని రక్షణ ప్రణాళిక, విశ్వాసానికి స్పందనగా దేవుడు చేసిన పని. వాగ్దానం, విశ్వాసం, తరువాత అద్భుతం అనేది రక్షణ పట్ల దేవుని నమూనా. ఇస్సాకు జన్మించడమే ఒక అద్భుతం.

ఇష్మాయేలు, సహజమైన విధానంలో జన్మించాడే గాని, అద్భుతం ద్వారా జన్మించలేదు మరియు దేవుడు ఇతన్ని రక్షణ ప్రణాళిక కొరకు వాడుకోలేదు. ఇదే నియమాన్ని బట్టి, దేవుడు రక్షణ కొరకు క్రియలను అంగీకరించడు. ఇష్మాయేలును వాగ్ధాన పుత్రునిగా ఉండకుండా తిరస్కరించినట్లుగానే, తమ క్రియల ద్వారా రక్షణ పొందాలని కోరుకున్న యూదులను కూడా దేవుడు తిరస్కరించాడు.

► యాకోబు, ఏశావుల సంగతేంటి? ప్రజలు పుట్టడానికి ముందే ఆయన ఎవరిని రక్షించాలో దేవుడు ముందుగానే నిర్ణయించాడని ఈ వచనాలు చెబుతున్నాయని కొంతమంది అనుకుంటారు. నిజానికి ఈ వచనాలు దేనిని గురించి చెబుతున్నాయి?

(9:10-13) దేవుడు ఏశావుకు బదులు యాకోబును ఎన్నుకున్నప్పుడు, ఎవరిని రక్షించాలనే విషయాన్ని ఆయన ఎన్నుకోలేదు. తన రక్షణ ప్రణాళికను నెరవేర్చడానికి వాడుకొనే వ్యక్తిని ఆయన ఎన్నుకున్నాడు. ఇది అధ్యాయం

యొక్క ప్రధానాంశం: రక్షణ సాధనాన్ని నిర్ధారించే దేవుని హక్కు. పాత నిబంధనలో ఏశావు జీవితాన్ని గురించి సమాచారం, వాస్తవానికి అతని హృదయం మారిందని, బహుశా అతను రక్షణ పొంది ఉండవచ్చని చూపిస్తున్నాయి. అతను రక్షణ నుండి తృణీకరించబడలేదు కానీ ఎన్నుకోబడిన దేశానికి, మెస్సీయాకు తండ్రిగా ఉండే ఆధిక్యత నుండి తృణీకరించబడ్డాడు. '*ద్వేషించితిని*' అనే మాటకు అర్థం, "మరొకరికి అనుకూలంగా తిరస్కరించడం" అని అర్థం, అంటే తన పట్ల మనకున్న విధేయతతో పోల్చితే మన తల్లిదండ్రిని ద్వేషించాలని యేసు చెప్పిన మాటల్లో భావమిదే (లూకా 14:26).

దేవుడు యాకోబులో ఉన్న లక్షణాలను బట్టి అతన్ని ఎన్నుకోలేదు లేదా ఏశావులో ఉన్న పొరపాట్లను బట్టి అతన్ని తృణీకరించలేదు. దేవుడు నిర్ణయించినప్పుడు వాళ్ళు మేలుగాని, కీడుగాని చేయలేదని ఈ లేఖనం నొక్కి చెబుతుంది. వాస్తవానికి వారి భవిష్యత్ ఏమిటో దేవునికి తెలుసు. ఇక్కడ విషయమేమిటంటే, తన వ్యక్తిగత ప్రణాళిక ప్రకారం ఆయన ఎంపిక చేసుకుంటాడు.

► మనకు తెలియని కారణాలను బట్టి దేవుడు తాను రక్షించే వారిని ఎన్నుకుంటాడని 9:14-16 వచనాలు నిరూపిస్తున్నాయని కొంతమంది చెప్తారు. మన చర్యలు మరియు ఎంపికలు, మనం రక్షించబడతామా లేదా అనే విషయాన్ని నిర్ధారించవని వాళ్ళు చెప్తారు. వాస్తవానికి ఈ వచనాలు ఏం చెబుతున్నాయి?

(9:14-16) తాను ఎవరికి కృప చూపించాలో దేవుడు ఎన్నుకుంటాడు. ఆయన ఎలాంటి ఆధారం లేకుండా లేదా మనకు తెలియని ఒక ఆధారం లేకుండా దీనిని చేస్తాడని భావం కాదు. దేవుడు, తన కృపకనికరాలకు ఆధారాన్ని చూపించాడు: "భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను దుష్టులు తమ తలంపులను మానవలెనువారు యెహోవాపైపు తిరిగినయెడల ఆయన వారి యందు జాలిపడునువారు మన దేవునిపైపు తిరిగినయెడల ఆయన బహుగా క్షమించును" (యెషయా 55:7).

మనం నమ్మినట్లయితే రక్షణ కొరకు ఎన్నుకోబడిన వారమని, తిరస్కరిస్తే ఎన్నుకోబడలేదని ఆయన మనకు స్పష్టంగా చెప్పాడు. కాబట్టి, ఒక వ్యక్తి తానెలా రక్షించబడాలో నిర్ణయించుకోవడం తన చిత్త ప్రకారం జరిగేది కాదు. రక్షణ, దేవుని కృప ద్వారా, ఆయన నిర్దేశించిన విధానంలోనే పొందాలి.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 9:17-23 వచనాలు చదవాలి. దేవుడు, ఫరోను దుష్టునిగా సృష్టించి, అతను చెడు/కీడు చేసేలా నియంత్రించాడా?

(9:17-18) ఫరో శిక్ష అనుభవించడానికి జన్మించలేదు, కానీ అతను ఏం చేస్తాడో దేవునికి తెలుసు గనుక అతని అధికార స్థానంలో దేవుడు అతన్ని ఉంచాడు. 'నియమించితిని' అనే మాట అతని సృష్టిని సూచించడం లేదు, కానీ అతన్ని

పాలకునిగా నియమించడాన్ని సూచిస్తుంది. విశ్వాసముంచే వారి పట్ల దేవుడు కరుణ చూపుతాడు మరియు విశ్వాసముంచని వారిని కఠినపరుస్తాడు. కఠినపరచడం అనే దేవుడు ఒక మంచి వ్యక్తిని చెడ్డవాడిగా మారుస్తాడని భావం కాదు. ఫరో, తాను చేయాలనుకున్నది చేసే సంకల్పాన్ని దేవుడు అతనికి ఇచ్చాడు.

కఠినపరచబడిన హృదయాలు కలిగిన వారు, తమ స్థితిని బట్టి అపరాధులు. కాబట్టి, న్యాయాన్ని బట్టి, వారి ఎంపిక/నిర్ణయం వాస్తవమైనది. 2:4-5 వచనాలలో, సత్యాన్ని ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కరించడంతో సంబంధం కలిగిన హృదయ కాఠిన్యతను బట్టి అన్యులను గద్దించాడు. (యిర్మీయా 19:15; నెహెమ్యా 9:25-29; మార్కు 16:14 మరియు హెబ్రీయులకు 3:7-13 కూడా చూడండి). ఫరో మొదట దేవునిని తిరస్కరించకపోతే, అతని కఠిన హృదయం ఉండేది కాదు.

(9:19) ఇక్కడ కొంతమంది అభ్యంతరాన్ని లేవనెత్తుతారు: ఫరో విషయంలో చేసినట్లుగానే దేవుడు ప్రజలను నియంత్రించగలిగితే, ఎవరైనా ఎలా తీర్పులోనికి వస్తారు? ఎవరూ ఆయన చిత్తాన్ని నిరోధించలేరు/ప్రతిఘటించలేరు." చివరికి దేవుడు తాను కోరుకున్నది చేయమని బలవంతం చేస్తే, ఒక వ్యక్తి దేవుణ్ణి ఎదిరించినందుకు క్షమాపణ పొందాలని అభ్యంతరం చెప్పేవాడు. కానీ దేవుడు తన విషయంలో ఇష్టపూర్వకంగా ప్రతిస్పందించేవారిని మరియు ప్రతిస్పందించని వారిని గుర్తించగలడు. [64]

(9:20-23) దేవుడు అంతిమంగా అందరిని బట్టి మహిమ పొందినప్పటికిని, కొంతమందిని తీర్పు కొరకు, మరికొంతమందిని కరుణ కొరకు ఎంపిక చేసుకోగలడు (ఎందుకంటే ఆయన తన తీర్పులను బట్టి మరియు తన కరుణను బట్టి మహిమ పొందగలడు). ఎంపిక చేసుకోవడానికి ఆయనకు ఒక ప్రాతిపదిక ఉంది, ఎంపిక చేసుకొనే హక్కు కూడా ఉంది. దేవుడు, అంగీకారం కోసం తన ప్రమాణాన్ని నిర్ణయిస్తాడు, అది మారదు.

మట్టితో ఏం చేయాలో కుమ్మరి నిర్ణయించుకుంటాడు. మట్టిలో కొంతభాగంతో పూలకుండీని తయారు చేస్తాడు, కొంత భాగంతో చెత్తకుండీని తయారు చేస్తాడు. అదేవిధంగా, కొంతమంది కేవలం తీర్పుకే సరిపోతారని, కొంతమంది కరుణకొరకే సరిపోతారని దేవుడు నిర్ణయిస్తాడు. గ్రీకు క్రియాపదం, చర్య ఎవరు చేశారో నిర్దేశించదు. ఇది ప్రజలే తీర్పు కొరకు తమను తాము సిద్ధపరచుకున్నారని అర్థం కావచ్చు. తీర్పు వచ్చే సమయం వరకు దేవుడు వారి తిరుగుబాటును సహిస్తాడనే ప్రకటనకు ఇది అనుగుణంగా ఉంటుంది. దేవుడు వారిని తీర్పు కొరకు సృష్టించలేదు లేదా వారిని పాపులుగా చేయలేదు. వారి తీర్పు, వారు వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయాలను బట్టి వస్తుంది. దేవుడు ఎంపిక చేసుకోవడంలో

[64] 3:5-8లో ఇలాటి వాక్య భాగ్యముకు సంబంధించి నోట్స్ చూడండి.

సార్వభౌముడు అనే వాస్తవానికి, ఆయన వివక్షతో ఎంపిక చేసుకుంటాడని కాదు కాని, తన వ్యక్తిగత ప్రమాణాన్ని బట్టి ఎంపిక చేస్తాడు. ఆయన దుష్టులను తీర్పుకొరకు, విశ్వాసులను రక్షణ కొరకు ఎన్నుకుంటాడు.

"నువ్వు నన్నెందు కీలాగు చేసితివి?" అనే ప్రశ్నకు, "నువ్వు నన్ను శిక్ష కొరకు ఎందుకు సృష్టించావని అర్థం కాదు" కానీ "నేను తీర్పుకు తగిన వాడినని నువ్వెందుకు నిర్ణయించుకున్నావు?" అని భావం. కానీ నిర్ణయించడానికి మరియు తన న్యాయాన్ని వెల్లడి చేయడానికి దేవునికి అధికారముంది.

కుమ్మరిని గూర్చిన ఉదాహరణ యిర్మీయా 18:1-18 నుండి తీసుకోబడింది. కీలకమైన 18:7-10. 18:8 లేఖన భాగాలు, "ఏ జనమునుగూర్చి నేను చెప్పితినో ఆ జనము చెడుతనముచేయుట మానినయెడల నేను వారికి చేయనుద్దేశించిన కీడునుగూర్చి సంతాపపడుదును" అని చెబుతాయి.

► మీరు కుమ్మరి మరియు మట్టిని గూర్చిన ఉదాహరణను ఎలా ఉపయోగిస్తారు? దేవుడు, తన ఉగ్రతను కనబరిచే ఉద్దేశ్యంతో కొంతమంది ప్రజలను సృష్టించాడా? ఆయన మట్టి నుండి వివిధ రకాల వస్తువులను చేయడం అంటే భావం ఏమిటి?

## అపొస్తలుని వ్యక్తిగత ముగింపు

కొంతమంది ప్రజలు, ఈ అధ్యాయాన్ని ఆధారం చేసుకొని దేవుడు కొంతమందిని తీర్పు కొరకు, మరికొంతమందిని కనికరం చూపడానికి సృష్టించాడనే తీర్మానానికి వస్తారు. అయితే పౌలు ఈ అధ్యాయపు ముగింపులో తన ముఖ్యాంశాన్ని వెల్లడి చేస్తున్నాడు (9:30-33). రచయిత, తన స్వంత ఉదాహరణ నుండి తాను చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పనివ్వడం ప్రాముఖ్యం. రచయిత చెప్పిన కథ అన్వయాన్ని తాను చెప్పిన ప్రకటనకు విరుద్ధంగా మనం వాదించకూడదు. ఇది పౌలు ప్రధాన అంశం: ఒక వ్యక్తి విశ్వాసముంచుతాడా లేదా అనే దాని ఆధారంగానే దేవుడు తీర్పు తీరుస్తాడు. కుమ్మరిగా, అంగీకారానికి ప్రాతిపదికను / ఆధారాన్ని నిర్ణయించే హక్కు ఆయనకే ఉంటుంది.

దేవుడు తాను చేసే ప్రతిదానిలో ఎల్లప్పుడూ జ్ఞానవంతుడు, మంచివాడు, ప్రేమగలవాడు మరియు న్యాయవంతుడు గనుక దేవుని సార్వభౌమత్వంలో మనం ఆనందించాలి. ఆయనకు సంపూర్ణ అధికారం ఉన్నప్పటికిని, ఆయన అన్యాయంగా దేనిని చేయడు. ఆయన చర్యలు ఎల్లప్పుడూ తన స్వభావానికి అనుగుణంగానే ఉంటాయి.

దేవుడు తనకు కావలసిన వ్యక్తిని ఎటువంటి ప్రమాణం లేకుండా ఎన్నుకుంటాడనేది ఈ అధ్యాయం యొక్క ఉద్దేశ్యం కాదు. రక్షణ కొరకు దేవుడు ఎవరిని ఎన్నుకోవాలో నిర్ణయించే ప్రమాణాన్ని ఏర్పరచడమే రోమా 9వ అధ్యాయంలోనున్న ప్రధాన అంశం. రక్షణార్థమైన విశ్వాసమే ఆ ప్రమాణం.

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం, 1వ లేఖన భాగం

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 9:24-33 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(9:24-26) చాలామంది అన్యులు జాతీయత ఆధారంగా దేవుని ప్రజలని పిలవబడకపోయినప్పటికిని, దేవుని ప్రజలలో భాగమయ్యారు. ఇది పత్రిక యొక్క గొప్ప మిషనరీ అంశంతో దీనిని ముడిపెడుతుంది: సువార్త, ఈ లోకంలో ప్రతి ఒక్కరికీ అందించవచ్చు.

(9:27-29) చాలామంది యూదులు తిరస్కరించబడ్డారు, కేవలం కొద్దిమంది మాత్రమే రక్షణ పొందుతారు. యూదులు, కేవలం వాళ్ళు యూదులైనంత మాత్రాన రక్షణ పొందరు. దేవుడు, కనికరం లేకుండా న్యాయాన్ని ఆధారం చేసుకొని స్పందించినట్లయితే, వాళ్ళు సొదొమ వలె సంపూర్ణంగా నాశనమవుతారు.

(9:30-33) ఇది ఈ అధ్యాయం యొక్క ముగింపు. తన వ్యక్తిగత తుదితీర్మానం రాయడానికి రచయితను అనుమతించాలి. దేవుడు రక్షణ మార్గాన్ని ఏర్పరచాడనేది ఈ అధ్యాయపు అంశం. ధర్మశాస్త్రాన్ని ఆధారం చేసుకొని తమ వ్యక్తిగత నీతిని స్థాపించాలని ప్రయత్నించేవాళ్ళు విఫలమవుతారు. విశ్వాసం ద్వారా నీతిని వెదికే వారు విజయం సాధిస్తారు. తన స్వనీతిని స్థాపించాలని ప్రయత్నించే వ్యక్తి, దేవుడు వేసిన పునాది రాయిని బట్టి ఆటంకపరచబడతాడు, కానీ విశ్వాసముంచే వ్యక్తి సిగ్గుపడడు.

## పాఠం 9 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) తన నీతిని మనం అర్థం చేసుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడని మనమెలా తెలుసుకోగలం?

(2) దేవుడు న్యాయవంతుడని మనం చూడడం ఎందుకంత ప్రాముఖ్యం?

(3) దేవుని సార్వభౌమత్వాన్ని గురించి బైబిల్ దృక్కోణం ఏమిటి?

(4) రోమా 9వ అధ్యాయపు ప్రధాన అంశం ఏమిటి?

(5) ఇశ్రాయేలు కలిగి ఉన్న ఆత్మీయ ఆధిక్యతలు ఏమిటి?

(6) క్రైస్తవ్యానికి, యూదా మతానికి మధ్యనున్న అయిదు సంబంధాలు ఏమిటి?

(7) దేవుడు యాకోబును ఎన్నుకోవడాన్ని గురించి రోమా 9వ అధ్యాయం ఏం చెబుతుంది?

(8) మనం దేవుని సార్వభౌమాధికారంలో ఎందుకు ఆనందించాలి?

## పాఠం 9 - అభ్యాసాలు

(1) దేవుడు ఎలా సార్వభౌమాధికారిగా ఉంటూనే, మనిషి ఎంపికకు ఎలాస్పందిస్తాడో ఒక పేజీలో వివరించండి. రోమా 9వ అధ్యాయాన్ని ఉపయోగించండి, అదే సమయంలో ఇతర లేఖనాలను కూడా వాడుకోండి.

(2) ఇతర సంఘాలకు చెందిన విశ్వాసులతో కనీసం రెండు సంభాషణలను సిద్ధం చేయాలి. వాళ్ళు దేవుని సార్వభౌమాధికారం గురించి ఏం ఆలోచిస్తున్నారో వివరించమని అడగాలి. రోమా పత్రికలో ఈ అంశానికి సంబంధించిన లేఖన భాగాలను మీరు వివరించాలి. ఆ సంభాషణ వివరణను రాసి, దానిని తరగతి నాయకునికి ఇవ్వాలి.

# పాఠం 10

# అత్యవసర సందేశం

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం, లేఖ భాగాలు 2-3**

రోమా 10వ అధ్యాయం, రోమా పత్రికకు పతాకసన్నివేశం. విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షణ కలుగుతుందని మరియు లోకంలో ఉన్నవారందరికి ఇది అవసరమని అపొస్తలుడు వివరించాడు. విశ్వాసం ఆవశ్యకం కనుక, సువార్త సందేశం ప్రాముఖ్యం: ప్రజలు సందేశాన్ని నమ్మునట్లు దానిని వినాల్సిన అవసరం ఉంది. పత్రిక ఉద్దేశ్యానికి ఈ అధ్యాయం ప్రాముఖ్యం, ఎందుకంటే పత్రిక అంతా సౌవార్తిక పనికి ఆధారాన్ని ఇస్తుంది.

రోమా 11వ అధ్యాయం, ఇశ్రాయేలుకు, సంఘానికి మధ్యనున్న సంబంధంతో వ్యవహరిస్తుంది. చాలామంది యూదులు సువార్తను తిరస్కరించారు. దేవుడు సర్వలోకం కొరకు ప్రణాళిక కలిగి ఉన్నాడని, యూదులు కూడా రక్షణ పొందే అవకాశం ఉందని పౌలు వివరించాడు. ఒక దినాన ఇశ్రాయేలు సంపూర్ణ దేశంగా క్రీస్తును అంగీకరిస్తుంది.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం, 2వ లేఖన భాగం**

**10వ అధ్యాయం యొక్క ప్రధానాంశం**

విశ్వాసం ద్వారానే నీతిని కనుగొంటాం మరియు విశ్వాసపు ఆవశ్యకత, సువార్త సందేశాన్ని ఆత్యావశ్యకంగా చేస్తుంది.

**10వ అధ్యాయం యొక్క సారాంశం**

వ్యక్తిగత నీతి ద్వారా నీతిమంతులుగా తీర్చబడడాన్ని సాధించే ప్రయత్నం చేస్తానంటే పొరపాటు. దేవుడు మనిషి నుండి అంగీకరించే నీతిని, విశ్వాసానికి ప్రతిస్పందనగా ఆయన మొదట మనిషికి ఇస్తాడు. సువార్త సందేశం విశ్వాసానికి అవకాశం కల్పిస్తుంది.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 10వ అధ్యాయాన్ని చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(10:1-5) యూదులు కూడా రక్షణ పొందాలి ఎందుకంటే వాళ్ళకు ఏ నీతి కావాలో వాళ్ళకింకా అర్థం కాలేదు. అది అసాధ్యమని గ్రహించక, వాళ్ళు పరిపూర్ణమైన వ్యక్తిగత నీతిని స్థాపించడం ద్వారా తమని తాము నీతిమంతులుగా చేసుకొనే ప్రయత్నం చేశారు. దేవుడు అంగీకరించే నీతి, విశ్వాసి విశ్వాసానికి స్పందనగా వ్యక్తిలో ఆయన చేసే కార్యం.

పాపాన్ని ఖండించి, రక్షకుని అవసరతను మనకు చూపించడం ద్వారా మనల్ని క్రీస్తు దగ్గరకు తీసుకొని రావడమే ధర్మశాస్త్రం యొక్క ఉద్దేశ్యం. ఒక వ్యక్తి క్రీస్తు దగ్గరకు వచ్చినప్పుడు, దేవుడు అంగీకరించడానికి ధర్మశాస్త్రం ఒక ప్రాతిపదికగా ఉండదు, కాబట్టి ధర్మశాస్త్రాన్ని ఉపయోగించడానికి క్రీస్తు ముగింపు (10:4). మనం దేవునికి ఎలా విధేయత చూపాలో ధర్మశాస్త్రం చూపదని దాని భావం కాదు, కానీ మనల్ని దేవుడు అంగీకరించడమనేది పరిపూర్ణమైన, జీవితకాల విధేయతపై ఆధారపడదని దాని భావం.

క్రీస్తు రావడానికి ముందు జీవించినవాళ్ళు క్రియల చేత రక్షించబడతారనే సిద్ధాంతాన్ని ఈ లేఖన భాగం గట్టిగా ఖండిస్తుంది. క్రియల ద్వారా తమ వ్యక్తిగత నీతిని స్థాపించే ప్రయత్నం చేసేవాళ్ళు దారితప్పి, పతనమైపోతారని పౌలు స్పష్టంగా ప్రకటించాడు. 10:6-8 వచనాల్లో ద్వితీయోపదేశకాండం నుండి పౌలు ప్రస్తావించిన సువార్త సత్యాన్ని వాళ్ళు నమ్మాలి.[65]



**వాటికన్**

313లో హింస ముగిసిన తరువాత, రోమ్, సామ్రాజ్యానికి రాజధానిగా ఉన్నట్లే, సంఘానికి రాజధాని పట్టణంగా మారింది. ఇది ఇప్పటికీ రోమన్ క్యాథలిక్ సంఘానికి రాజధానిగా ఉంది. ఈ చిత్రం, రోమన్ క్యాథలిక్ మతానికి ముఖ్య కేంద్రమైన వాటికన్ ను చూపుతుంది.

(10:6-11) ఇది ద్వితీయోపదేశకాండము 30:11-14 యొక్క ఉల్లేఖనం. దేవుని ఆజ్ఞలను పాటించడమనేది పరలోకానికి ఎక్కిపోవడం లేదా సముద్రాన్ని దాటడం వంటి పరాక్రమం గల లేదా మానవాతీతమైన ప్రయాసపై ఆధారపడి ఉండదు. బదులుగా, ఇది వారి జీవితాల్లో వారి విశ్వాసం ద్వారా దేవుని చేతనే నెరవేరుతుందని మోషే ఇశ్రాయేలీయులకు చెప్పాడు.[66]

---

[65] తరువాత భాగం చూడండి .

[66]చిత్రం: “St Peters. Rome” డిసెంబర్ 12, 2010నBrian Dillon తీశారు, https://www.flickr.com/photos/28805679@N03/6375448359/ నుండి , CC BY 2.0, లైసెన్స్ పొందినది, రంగులో అసలు దానికి కొంచెం భిన్నంగా ఉంది.

పౌలు, పరలోకానికి వెళ్లడాన్ని లేదా భూమిలోనికి రావడాన్ని సూచించడానికి మరియు అవసరమైన సమస్తాన్ని క్రీస్తు నెరవేర్చాడని చూపించడానికి ఈ వ్యాఖ్యను తీసుకున్నాడు.

కృప ద్వారా రక్షణ అనేది మన హృదయాలలో మరియు మాటలోనూ ఉన్నంత సన్నిహితంగా ఉంది. మనం విశ్వాసం ద్వారా (మన హృదయాలలో) మరియు పశ్చాత్తాపం ద్వారా (మనం నోటితో) పొందుతామని దీని అర్థం.

(10:12-13) ఇదే రక్షణ మార్గం, ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉందనే మరొక ఉద్ఘాటన కూడా ఇక్కడ ఉంది. యేసు, అందరికీ ప్రభువు మరియు ఏ వ్యక్తియైన, ప్రపంచంలో ఎక్కడ నుండైనా ఆయనకు ప్రార్థన చేయవచ్చు.

(10:14-15, 17) ఇది మిషనరీ పని కొరకు పిలుపు. మిషనరీ సందేశం అత్యవసరం - ప్రజలు విశ్వాసం ద్వారా రక్షించబడుతున్నారు గనుక, వాళ్ళు విశ్వాసముంచునట్లు ఆ సందేశాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఈ వచనాలు పత్రిక యొక్క ఉద్దేశ్యానికి కేంద్ర బిందువు.

> "పౌలు సౌవార్తీకరణలో రెండు గొప్ప ప్రేరణలు ఉన్నాయని ఆయన పత్రికలు సూచిస్తాయి: దేవుడు తన కోసం చేసిన దాని నుండి మరియు ఇతరుల కోసం చేయమని అతనిని నియమించిన దాని నుండి ఉద్భవించిన బాధ్యత యొక్క భావం మరియు సాధ్యమైనంత ఎక్కువ మంది వ్యక్తులు దేవునిని మహిమపరచాలనే కోరిక." పౌలు చేసినట్లుగా సువార్తలో దేవుని కృపను విస్తరింపజేయుట ద్వార మనం ఆయనను అనుకరించాలి.
>
> - Douglas J. Moo, *Romans*

పౌలు సువార్త పని పట్ల గొప్ప మక్కువను వ్యక్తపరిచాడు మరియు సువార్తను వినని వారి యొక్క విషాదాన్ని వివరించాడు. వాళ్ళు విశ్వాసముంచడం ద్వారా రక్షణపొందవచ్చు; కానీ వాళ్ళు వినకుండా ఎలా నమ్ముతారు మరియు ఒక మిషనరీ వెళ్ళకుండా వాళ్ళు ఎలా వింటారు?

► మిషనరీలను పంపడం యొక్క అవసరతను గురించి పౌలు మాట్లాడాడు, అంటే వారిని బలపరచడానికి, సహకరించడానికి సహాయం చేయడమని దాని అర్థం. మీకు దూరంగా ఉన్న ప్రజలకు సువార్తను అందించడానికి మీరు చేసే సహాయం ఏమిటి?

(10:16, 18-21) అందరూ సువార్త పిలుపుకు స్పందించరనే విషయం చేర్చబడింది. ప్రజలు, కేవలం సువార్త సమాచారాన్ని బట్టి మాత్రమే రక్షణ పొందలేరు. అన్యులు, సాధారణ ప్రత్యక్షతను బట్టి కొంత జ్ఞానాన్ని కలిగి ఉన్నారు (1:18-20లో చర్చించాం), కానీ వాళ్ళు దానిని తిరస్కరించారు గనుక వారు రక్షణ పొందరు (10:18వ వచనాన్ని కీర్తనలు 19:4 నుండి తీసుకున్నాడు). ఇశ్రాయేలు ప్రజలు ఎంతో ఎక్కువ ప్రత్యక్షతను కలిగి ఉన్నారు, అయితే వారు ప్రత్యక్షతను కలిగి ఉన్నంతమాత్రాన రక్షణ పొందలేరు. ఇశ్రాయేలు ప్రజలు మెస్సీయాను తిరస్కరించడాన్ని గురించి యెషయా ప్రవచించాడు (యెషయా 53:1, 3).

అపొస్తలుడు, అభ్యంతరాలకు స్పందించాడు. మొదటిగా, ఎవరైనా, అన్యులను గురించి మాట్లాడుతూ "కానీ వాళ్ళకు నిజంగా తెలీదా?" అని అడగవచ్చు. పౌలు 1:20లో, "అవును, దేవుని గూర్చిన జ్ఞానం ప్రతి చోట ఉంది" అని సమాధానమిచ్చాడు. తరువాత, అభ్యంతరం వ్యక్తపరిచే వ్యక్తి యూదులను గురించి అడుగుతాడు: "ఇశ్రాయేలుకు తెలీదా?" దేవుడు ఇశ్రాయేలును చేరుకోవడానికి నిరంతరం ప్రయత్నించాడు, కానీ వాళ్ళు విధేయత చూపడానికి నిరాకరించారని ఆయన సమాధానమిస్తాడు. చాలామంది సువార్తను విన్నారు గాని, వాళ్ళు రక్షణ పొందలేదు గనుక అభ్యంతరం తెలిపే వ్యక్తి సువార్త యొక్క ప్రభావాన్ని అనుమానిస్తాడు.

చాలామంది ఇశ్రాయేలు ప్రజలు విశ్వాసంతో స్పందించలేదని పౌలు వివరిస్తాడు.[67] ప్రజలు, సువార్తకు స్పందించనంత వరకూ అది వారిని రక్షించలేదు.

సువార్త ప్రకటన దానిని తిరస్కరించే వ్యక్తిని రక్షించదు - దేవుని కృప వ్యతిరేకించలేనిది కాదు. అయితే ఇది రక్షణ అవకాశాన్ని అందిస్తుంది. ప్రతి ఒక్కరికీ దేవుని గురించి ఎంతో కొంత తెలుసు కాబట్టి, సువార్త గొప్ప వెలుగుతోను పరిశుద్ధాత్ముని ఒప్పించే శక్తితోను వస్తుంది.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం, 3వ లేఖన భాగం**

**11వ అధ్యాయం యొక్క ప్రధానాంశం**

దేవుని నిబంధనల ప్రకారం రక్షణను అంగీకరించకుండా ఎవరూ రక్షణ పొందలేరు.

**11వ అధ్యాయం యొక్క సారాంశం**

సాధారణంగా ఇశ్రాయేలు ప్రజలు రక్షణ పొందలేరు, ఎందుకంటే వాళ్ళు దేవుని విధానంలో రక్షణ పొందడానికి తిరస్కరించారు. చాలామంది అన్యులు రక్షణ పొందారు, కానీ విశ్వాసం నుండి పడిపోయిన/తప్పిపోయిన వారు రక్షణను కోల్పోతారు. యూదులు, రక్షణ పొందాలని నిశ్చయించుకుంటే రక్షణ పొందుతారు మరియు ఇశ్రాయేలు మొత్తంగా ఒక దినాన సువార్తను అంగీకరిస్తుంది. దేవుడు, వారి పూర్వీకులతో చేసిన వాగ్దానాలను నెరవేరుస్తాడు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 11:1-15 వచనాలు చదవాలి.

---

[67] నాల్గవ పాఠంలో "పాత నిబంధనలో కృప" అనే శీర్షిక క్రింద ఉన్న నోట్స్ ను చూడండి.

**వచనాల వారీ వివరణ**

(11:1) "దేవుడు యూదులను విసర్జించాడా?" అనేది ప్రశ్న. "విసర్జించలేదు, నేను కూడా యూదుడినే" అని పౌలు సమాధానమిచ్చాడు. కొంతమంది యూదులు రక్షణ పొందారు.

(11:2-5) దేవుడు ముందుగా ఎరిగిన వారు, తిరస్కరించబడరు. అయితే, దేవుడు సర్వజ్ఞాని అనే కోణంలో ఆయనకు అందరూ తెలుసు, కానీ ఈ వచనం ఆయన ప్రతిఒక్కరినీ ముందుగా చూశాడని చెప్పడం లేదు, ఎందుకంటే ఈ వచనం ఇశ్రాయేలులో నిర్దిష్టమైన వ్యక్తులను గురించి మాట్లాడుతుంది. దేవునికి ముందుగా తెలిసిన వాళ్ళు, ఆయన కృపకు స్పందిస్తారని ఈ వచనం సూచిస్తుంది.[68] ఈ కోణంలో దేవుడు ముందుగా ఎరిగిన మరియు అంగీకరించిన వ్యక్తులను గూర్చి పౌలు ఒక ఉదాహరణను అందించాడు - 7000 మంది బయలుకు సాగిలపడలేదు.

దేవుడు, తాను ఎన్నుకొన్న శేషాన్ని (11:5) ఏకపక్షంగా లేదా యాదృచ్ఛికంగా ఎన్నుకోలేదు. వాళ్ళు తనయందు విశ్వాసముంచుతారని దేవునికి తెలుసు.

(11:6) క్రియలు మరియు కృప అనేవి క్రైస్తవ జీవితంలో ఎల్లప్పుడూ కలిసే ప్రయాణం చేస్తాయి, కానీ రక్షణ విషయంలో మాత్రం అవి ఒకదానితో మరొకటి మినహాయింపు కలిగి ఉంటాయి. కొన్ని తప్పుడు మతాలు బోధిస్తున్నట్లుగా, దేవుని అంగీకారానికి ఆధారంగాఅవి రెండు కలిసి పనిచేయవు.

(11:7-10) యెషయా 29:10 నుండి తీసుకున్న 11:8వ వచనం, ప్రజల కపట స్వభావం, వారిని ఆత్మీయ అంధులుగా చేసిందని చెబుతుంది. వాళ్ళు నిరంతరం సత్యాన్ని తిరస్కరించినందున వారి హృదయాలు కఠినమైపోయాయి. యెషయా 6:9-10 వచనాలు, కృప వార్తను ప్రజలు విని కూడా, దానిని తిరస్కరించినప్పుడు వాళ్ళు అంధులైపోతారు. రోమా పత్రికలోనున్న ఈ వచనాలకు, దేవుడు కొంతమంది ప్రజలకు కృపను అనుగ్రహించడానికి నిరాకరించాడని అర్థం కాదు. రోమా 11:9-10 వచనాలలో పౌలు ప్రస్తావించిన దావీదు శాపం (కీర్తనలు 69:22, 23), పశ్చాత్తాపపడినవారు తిరస్కరించబడతారని కాదు, కానీ దుష్టులైన ప్రజలు శిక్షపొందుతారని అర్థం.

(11:11) నిరీక్షణంతటిని మించి పడిపోవడానికి దేవుడు అనుమతించాడా? లేదు. ఇశ్రాయేలీయులు క్రీస్తును తిరస్కరించడం వలన ఆయన్ని సిలువ వేశారు, అది రక్షణకు దేవుని మార్గం. ఈ కోణంలో, వారు తృణీకరించడం వలన అన్యులు అంగీకరించబడ్డారు. అన్యులు రక్షణ పొందడం యూదులు చూసినప్పుడు, అదే విధానంలో వారు రక్షణ పొందగలరని యూదులు అర్థం చేసుకున్నారు.

---

[68] 8:29 పై నోట్స్ చూడండి.

(11:12-15) ఇశ్రాయేలీయులు దేవుని దగ్గరకు తిరిగి వస్తే, అన్యులు మరింతగా ప్రయోజనం పొందుతారు. యూదులకు, అన్యులకు మధ్య ఎంపిక చేసుకోవడం దేవుని ఆవశ్యకం కాదు. ఆయన అందరినీ రక్షించాలని కోరుకుంటున్నాడు.

► కొంతమందిని రక్షించకూడదని దేవుడు నిర్ణయించినందున, వారి నుండి తన కృపను తీసివేసి, వారు రక్షణ పొందడం అసాధ్యం చేశాడని కొంతమంది దైవజ్ఞానులు నమ్ముతారు. 11:12-15వ వచనం నుండి ఆ ఆలోచనకు మీరు ఎలా సమాధానం చెబుతారు?

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 11:16-24 వచనాలు చదవాలి.

(11:16-24) ఈ వచనాలు, ఒక చెట్టునుండి కొమ్మలను తీసి, మరొక చెట్టుకు అంటుకట్టే పద్ధతిని గూర్చిన ఉదాహరణను ఉపయోగించాయి. ఇశ్రాయేలు ప్రజలు, దేవుని చెట్టు నుండి వేరైన కొమ్మలవలె ఉన్నారు మరియు అన్యులు చెట్టుకి అంటుకట్టిన వేరొక కొమ్మలుగా ఉన్నారు. యూదులు, తమ అవిశ్వాసాన్ని బట్టి చెట్టునుండి వెరైపోయారు. చెట్టుతో అంటుకట్టబడిన ఏ వ్యక్తియైన విశ్వాసంలో కొనసాగకపోతే వాళ్ళు కూడా వేరు చేయబడతారు. ఇప్పటికే వేరైపోయినవారు కూడా పునఃస్థాపించబడతారు.

చెట్టుపై ఎవరు ఉండాలో దేవుడు నిర్ణయించేసాడని, ఆయన నిర్ణయం మారదని పౌలు చెప్పడం లేదు. అవిశ్వాసులైన వారిని దేవుడు తొలగిస్తాడు, అయితే వాళ్ళు విశ్వాసముంచినట్లయితే మరలా జోడించబడతారు. విశ్వాసముంచిన అన్యులు జతచేయబడ్డారు, కానీ ఒకవేళ వాళ్ళు అవిశ్వాసంలో పడిపోయినట్లయితే, తొలగించబడతారు. దేవుడు, మనిషి ఎంపికలకు స్పందిస్తాడు.

► ఈ వచనాల నుండి, కొమ్మలు అంటుకట్టడం లేదా తొలగించడాన్ని గూర్చిన ఉదాహరణను మీరు ఎలా వివరిస్తారు?

**రక్షణను విడిచిపెట్టే ప్రమాదం**

విశ్వాసి భద్రతను గురించి బైబిల్ ఏం బోధిస్తుందో అర్థం చేసుకోవడము ప్రాముఖ్యం. విశ్వాసుల కొరకు చాలా తీవ్రమైన హెచ్చరికలను బైబిల్ కలిగి ఉంది.

యోహాను 15:2-10లో, ద్రాక్షవల్లి మరియు తీగలను గూర్చిన ప్రసిద్ధ అలంకారం ఉంది. ఇది కొన్ని ప్రాముఖ్యమైన ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది.

మనం క్రీస్తులో ఎలా నిలిచి ఉంటాం? "మీరును నా ఆజ్ఞలు గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచి యుందురు" (యోహాను 15:10). ఒక వ్యక్తి క్రీస్తులో నిలిచి ఉండడం మానేశాడంటే, అతను ప్రభువు మాటకు విధేయత చూపడం మానేసాడని భావం. అప్పుడు ఏం జరుగుతుంది?

“ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగెవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును” (15:6). ఒక వ్యక్తి విధేయత చూపడం మానేస్తే, క్రీస్తునందు నిలిచి ఉండడం కూడా మానేస్తాడు, దానివల్ల అతను తిరస్కరించబడతాడు. ద్రాక్షతీగెలు, ద్రాక్షవల్లి నుండి పడిపోవడం, అగ్నిలో పడవేయడానికి పోగుచేయడం అనేది అత్యంత సంపూర్ణమైన తిరస్కరణను సూచిస్తుంది.

“నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి యుంటేనేగాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనేకాని మీరును ఫలిం పరు” (యోహాను 15:4). “నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి పారవేయును...” (15:2). ఫలించడం అంటే మారిన, ఆశీర్వాదం పొందిన, దేవుని కృప చేత నడిపించబడే జీవితాన్ని జీవించడం. మనం విధేయత ద్వారా క్రీస్తులో నిలిచి ఉండకపోతే, మనం ఫలించలేము. ఫలాలు ఫలించని వ్యక్తి తిరస్కరించబడతాడు.

మనం ఏం చేసినా కూడా రక్షణను పొందుతామని బైబిల్ ఎక్కడ చెప్పడం లేదు. మనం క్రీస్తుద్వారా దేవునితో సంబంధాన్ని కలిగి ఉన్నప్పుడు, క్రైస్తవ జీవితానికి నిరంతర కృప అందుబాటులో ఉంటుంది. క్రీస్తు ద్రాక్షావల్లివంటి వాడు, మనం అందులో నుండి జీవమును నిరంతరం పొందవచ్చు. ద్రాక్షవల్లి ఉపమానం, రక్షణ బహుమానాన్ని సంబంధం ద్వారానే పొందగలమని చూపిస్తుంది. ఆయన నుండి వేరవ్వడమంటే, రక్షణ నుండి వేరవ్వడమని అర్థం. మనం దేవునికి విధేయత చూపడం ద్వారానే రక్షణార్థమైన ఈ సంబంధాన్ని కొనసాగించగలం.

ఈ ఆధునిక కాలంలో దీనిని లైట్ మరియు ఎలక్ట్రిసిటీని గూర్చిన ఉదాహరణను ఉపయోగించి వివరించవచ్చు. బల్బ్ గుండా ఎలక్ట్రిసిటీ ప్రవహించినప్పుడు అది వెలుగుతుంది. అయితే బల్బ్ ని ఎలక్ట్రిసిటీ నుండి వేరు చేస్తే, అది వెలగదు. అదేవిధంగా, మనం క్రీస్తుతో కలిగి ఉండే సంబంధం ద్వారా నిత్యజీవాన్ని కలిగి ఉంటాం. ఆయన జీవం మనలో నుండి ప్రవహిస్తుంది. మనం ఆయన నుండి వేరైతే, ఆ జీవాన్ని నిలిపి ఉంచుకోలేము.

ఒక్కసారి రక్షణపొందిన వ్యక్తి, అంతిమంగా పాపం చేత ఓడించబడడం వలన తన రక్షణను కోల్పోతాడని లేఖనం హెచ్చరిస్తుంది. “జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవ గ్రంథములోనుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టను” (ప్రకటన గ్రంథం 3:5). వీళ్ళు రక్షణ పొందిన వ్యక్తులు, అయితే వాళ్ళు పాపానికి తమని తాము అప్పగించుకొన్నట్లయితే, వారు తమ రక్షణను కోల్పోతారు.

ఒకానొక సమయంలో, తన ద్వారా రక్షణ పొందిన థెస్సలోనికయ విశ్వాసులు తమ విశ్వాసాన్ని కోల్పోతారేమోనని పౌలు ఆందోళన చెందాడు. అదే జరిగినట్లయితే, వారికి సువార్త ప్రకటించడంలో తాను పడ్డ ప్రయాసంతా

వ్యర్థమవుతుందని ఆయన చెప్పాడు (1 థెస్సలొనీకయులకు 3:5). ఒక విశ్వాసి, తన మారుమనసు వ్యర్థమైపోయేంత సంపూర్ణంగా తన విశ్వాసం నుండి పడిపోవడానికి అవకాశముందని చూపిస్తుంది.

2 పేతురు 2:18-21లో, “వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానముచేత ఈ లోకమాలిన్యములను తప్పించుకొనిన” కొంతమంది విశ్వాసులను మోసం చేసే అబద్ధ బోధకులు ఉన్నారని మనం కనుగొనగలం. ఒకప్పుడు విశ్వాసంలో కొనసాగిన వీరికి నీతిమార్గం తెలుసు, కానీ వాళ్ళు దానిని విడిచిపెట్టారు. రక్షణ మార్గాన్ని తెలుసుకొన్న తరువాత పాప జీవితానికి తిరిగి వెళ్ళడం కంటే అసలు ఆ మార్గాన్ని గురించి తెలుసుకోకపోవడమే మంచిదని ఈ లేఖన భాగం చెబుతుంది. ఒక వ్యక్తి పాపానికి తిరిగి వెళ్ళడం ద్వారా తన రక్షణను కోల్పోయే అవకాశం ఉందని ఇది చూపిస్తుంది. ఒకవేళ ఒక వ్యక్తి తన రక్షణను కోల్పోయే పరిస్థితి లేకపోతే, అతను రక్షణ పొందడానికి ముందున్న దుస్థితికంటే మరింత చెడ్డ పరిస్థితిలో ఉండే అవకాశమే ఉండదు.

విశ్వాసులు, భద్రతను కలిగి ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడు, కానీ తమను తాము వాస్తవికమైన ఆధ్యాత్మిక ప్రమాదంలో పడవేసే తప్పుడు నిశ్చయతపై వారి భావాలను ఆధారం చేసుకోవడం ద్వారా కాదు. దేవుడు వాగ్దానం చేయని దానిని మనం విశ్వాసులకు వాగ్దానం చేయకూడదు. మనం ఏం చేసినా కూడా రక్షణను కోల్పోమనే వాగ్దానాన్ని ఆయన ఇవ్వలేదు.

మనం పాపంపై విజయం కలిగి జీవించునట్లు దేవుడు మనతో ఉంటానని, మనల్ని నడిపిస్తానని, మనల్ని బలపరుస్తానని వాగ్దానం చేశాడు. మనం మనం ఆత్మీయ జీవితాన్ని ఆయనతో మనకున్న సంబంధం ద్వారా పొందుతామని ఆయన వాగ్దానం చేశాడు. విశ్వాసి దేవునితో సంబంధంలో పొందే నిరంతర కృపకు సంబంధించిన దేవుని వాగ్దానానికి భయపడకుండా జీవించగలడు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 5వ భాగం, 3వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(11:25-29) ఇశ్రాయేలు, ఒక దేశంగా (ఇశ్రాయేలు మొత్తం) రక్షణ పొందుతుంది. అలాగని ప్రతి యూదుడు రక్షణ పొందుతాడని దీని అర్థం కాదు, కానీ భవిష్యత్ లో ఏదో ఒక సమయంలో, దేశంలోని శేషం దేవుని దగ్గరకు తిరిగి వస్తారు. లూకా 21:24లో అన్యుల సంపూర్ణత్వాన్ని గూర్చిన ప్రస్తావన ఉంది. (ఒక రాజ్యంగా ఇశ్రాయేలు రక్షణను గురించి ఇతర సమాచారం, యెషయా 2:2-5, యెషయా 60:1-22; జెకర్యా 12:7-13:9 లో ఉంది.)

(11:30-31) 11:11వ వచన వివరణను చూడండి.

(11:32) దేవుడు వారినందరిని (వారిని సమూహంగా చేశాడు) అదే స్థితిలో అవిశ్వాసులుగా వర్గీకరించాడు. దేవుడు అందరికీ తీర్పు తీర్చి, వారిపై శిక్షను ప్రకటించాడు, కాబట్టి అందరూ దేవుని కృప కొరకు సమాన అభ్యర్థులుగా మారారు. ఈ వచనంలో "అందరినీ" అనే మాట రెండుసార్లు ప్రస్తావించబడింది. అందరూ పాపులు గనుక, అందరిపైనా దేవుడు తన కృపను చూపాలనుకున్నాడు. ఆయన అందరికీ తీర్పు తీర్చాడు గనుక, ఆయన అందరికీ కృపను అనుగ్రహించాడు.

ప్రజలందరిని ఒకే వర్గం క్రింద పెట్టినందువలన, వారందరూ ఒకే రక్షణను పొందగలరు (3:19-23 చూడండి). విషయమేమిటంటే, ఆయన అందరినీ శిక్షావిధి క్రిందకు తీసుకొచ్చాడు గనుక ఆయన అందరికీ ఒకే విధంగా దయను చూపగలడు.

(11:33-36) ఈ వచనాలు, దేవుని జ్ఞానాన్ని బట్టి చెల్లించే స్తుతి. ఈ గొప్ప రక్షణ ప్రణాళిక మన ఊహకు మించినది. ఆయన రక్షణను మనకు ఇవ్వాలని ఉద్దేశించిన విధానాన్ని మనం అంగీకరించాలి, ఎందుకంటే ఆయన మనకు ఋణపడిలేడు (11:35). కొంతమంది దేవుని రక్షణ ప్రణాళిక ఒక అడ్డుబండ అన్నట్లుగా దానిని బట్టి అభ్యంతరపడతారు; కానీ ఇది కృపకు పునాది రాయి వంటిది.

## యుగసంబంధిత దేవశాస్త్రం వర్సెస్ నిబంధన దేవశాస్త్రం

దైవజ్ఞానులు, ఇశ్రాయేలుకు మరియు సంఘానికి మధ్యనున్న సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు.

ప్రశ్నలలో ఇవి ఉన్నాయి: పాత నిబంధనలోని వ్యక్తులు కొత్త నిబంధన ప్రజల నుండి భిన్నమైన విధానంలో రక్షించబడ్డారా? ఇశ్రాయేలుకు దేవుడు చేసిన వాగ్దానాలు సంఘానికి కూడా వర్తిస్తాయా? దేవుని ప్రణాళికలో ఇశ్రాయేలు ఇంకా ప్రత్యేకమైనదిగా ఉందా?

ఇశ్రాయేలుకు, సంఘానికి మధ్యనున్న సంబంధాన్ని గూర్చిన ఒక వివరణను, "యుగసంబంధిత దేవశాస్త్రం" అని పిలుస్తారు. ఇతర దైవజ్ఞానులు, "యుగసంబంధిత దేవశాస్త్రం" సిద్ధాంతాన్ని అంగీకరించరు మరియు మరొక వివరణను అభివృద్ధి పరిచారు, కొన్నిసార్లు దానిని "నిబంధన దేవశాస్త్రం" అని పిలుస్తారు.

### యుగసంబంధిత దేవశాస్త్రం

యుగసంబంధిత అనే పదం, దేవుడు మానవ చరిత్రలోని భిన్నమైన కాలాలలో, ప్రజలతో భిన్నంగా వ్యవహరిస్తాడని, భిన్నమైన మార్గాలలో వారికి రక్షణను అనుగ్రహిస్తాడని చెప్పే విషయం నుండి యుగసంబంధిత దేవశాస్త్రం అనే పదం వచ్చింది. ఒక సమయంలో దేవుడు ఒక నిర్దిష్టమైన రక్షణ ప్రణాళికను ఉపయోగించడం యుగసంబంధిత దేవశాస్త్రం.

కొంతమంది యుగసంబంధిత దేవశాస్త్రులు, మానవ చరిత్రను అనేక యుగాలుగా/కాలాలుగా విభజిస్తారు. బైబిల్ వివరణను అత్యంతగా ప్రభావితం చేసే రెండు కాలాలు, ఇశ్రాయేలు మరియు సంఘం మధ్య వ్యత్యాసంపై ఆధారపడేవి. పాతనిబంధన ఇశ్రాయేలు ప్రజలు, మోషే ధర్మశాస్త్రాన్ని, బలుల వ్యవస్థను అనుసరించడం ద్వారా రక్షణ పొందుతారని ఈ దేవశాస్త్రులు నమ్ముతారు; క్రొత్త నిబంధన విశ్వాసులు, విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షించబడతారు. సంఘం, ఇశ్రాయేలు నుండి పూర్తిగా భిన్నమైంది మరియు దేవుడు వారితో భిన్నంగా వ్యవహరిస్తాడు.

యుగసంబంధిత దేవశాస్త్రంలో అనేక రకాల వ్యత్యాసాలు ఉన్నప్పటికిని, ఈ దేవశాస్త్రంలో విలక్షణమైన ఒక వర్షన్, దేవుడు భూమిని గురించి, రాజ్యాన్ని గురించి ఇశ్రాయేలు ప్రజలకు చేసిన వాగ్దానాలను అక్షరాల నెరవేరుస్తాడని బోధిస్తుంది.

గనుక సంఘం భూమిపై నుండి ఏడేండ్ల కాలానికి తీసివేయబడుతుందని వాళ్ళు నమ్ముతారు. ఆ సమయంలో, ఇశ్రాయేలు ప్రజలు యేసుని తమ మెస్సీయగా అంగీకరిస్తారు. ఆ సమయం తరువాత, యేసు యెరూషలేములో పరిపాలన చేసే 1000 సంవత్సరాల కాలం ఉంటుంది.

పాతనిబంధన, క్రైస్తవులకు పెద్దగా ఉపయోగపడదని యుగసంబంధిత దేవశాస్త్రులు భావిస్తారు, ఎందుకంటే ఇది భిన్నమైన కాలమందు ఇశ్రాయేలును ఉద్దేశించినదని వాళ్ళు నమ్ముతారు. వాళ్ళు సత్యాన్ని వివరించడానికి పాతనిబంధన వృత్తాంతాలను ఉపయోగిస్తారు, కానీ పాతనిబంధన నుండి సిద్ధాంతపరమైన ఋజువులను తరచుగా తిరస్కరించి, క్రొత్త నిబంధనను మాత్రమే అనుసరించే ప్రయత్నం చేస్తారు.

యుగసంబంధిత దేవశాస్త్రమనే పదం తెలియని చాలామంది ప్రజలు దాని ఆలోచనల చేత ప్రభావితమవుతున్నారు. క్రొత్త నిబంధన రచయితలు, పాతనిబంధనను తమ అధికారంగా పరిగణించినప్పటికిని, చాలా సందర్భాలలో, ప్రజలు పాతనిబంధన అధికారాన్ని అంగీకరించడానికి నిరాకరిస్తారు.

**నిబంధన దేవశాస్త్రం**

నిబంధన దేవశాస్త్రం ప్రకారం, చరిత్రలో ఏ కాలంలో జీవించినా, దేవునిని ప్రేమించి, ఆయనకు సేవ చేసేవాళ్ళే దేవుని ప్రజలు. రక్షణ పొందిన ప్రజలు, వాళ్ళు పాతనిబంధన కాలంలో లేదా క్రొత్త నిబంధన కాలంలో జీవించినా, వాళ్ళు రక్షణ కొరకై పశ్చాత్తాపపడి, దేవునిని నమ్మిన ప్రజలు.

ఇప్పుడు సంఘం, దేవుడు తన ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను పొందిన దేవుని ప్రజల సమూహం. ఈ వాగ్ధానాలలో పాతనిబంధనలో ఇశ్రాయేలు ప్రజలకు చేసిన వాగ్దానాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ఇశ్రాయేలు దేశానికి ప్రత్యేకమైన ప్రాముఖ్యత లేదు.

> బాహ్యమునకు యూదుడైనవాడు యూదుడు కాడు; శరీరమందు బాహ్యమైన సున్నతి సున్నతికాదు. అయితే అంతరంగమందు యూదుడైన వాడే యూదుడు. మరియు సున్నతి హృదయ సంబంధమైనదై ఆత్మయందు జరుగునదే గాని అక్షరమువలన కలుగు నది కాదు. అట్టివానికి మెప్పు మనుష్యులవలన కలుగదు దేవునివలననే కలుగును (రోమా 2:28-29).

> కాబట్టి విశ్వాససంబంధులే అబ్రాహాము కుమారులని మీరు తెలిసికొనుడి. దేవుడు విశ్వాసమూలముగా అన్యజనులను నీతిమంతులుగా తీర్చునని లేఖనము ముందుగా చూచి–నీయందు అన్యజనులందరును ఆశీర్వదింపబడుదురు అని అబ్రాహామునకు సువార్తను ముందుగా ప్రకటించెను. కాబట్టి విశ్వాససంబంధులే విశ్వాసముగల అబ్రాహాముతోకూడ ఆశీర్వదింపబడుదురు (గలతీ 3:7-9).

> ఆత్మనుగూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించునట్లు, అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తుయేసుద్వారా అన్యజనులకు కలుగుటకై... (గలతీ 3:14).

> ఇందులో యూదుడని గ్రీసుదేశస్థు డని లేదు... మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాముయొక్క సంతానమైయుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు. (గలతీ 3:28-29).

నిబంధన దేవశాస్త్రం ప్రకారం, ఈ వాగ్దానాలు, ఇశ్రాయేలు నందు కాదు గాని సంఘానికి నెరవేరాయి:

- క్రీస్తు సింహాసనం యెరూషలేములో స్థాపించబడుతుంది
- సమాధానం
- ఇశ్రాయేలు, ప్రపంచానికి నాయకునిగా ఉంటాడు
- సమస్త దేశాలకు ఇశ్రాయేలు బోధిస్తుంది
- వాగ్దాన భూమిని శాశ్వతంగా స్వాధీనం చేసుకోవడం మరియు అడవి జంతువులను సాధుపరిచి, మచ్చిక చేసుకోవడం.

వాగ్దానాలన్నింటిని అక్షరార్థంగా కాక, ఆత్మీయ అర్థంతో వివరించారు. ఈ వాగ్దానాలన్ని సంఘంలో నెరవేరాలంటే ఆధ్యాత్మిక ప్రయోజనాల ద్వారా నెరవేర్చబడాలి.

నిబంధన దేవశాస్త్రాన్ని నమ్మే చాలామంది, వేయేండ్ల కాలంలో భూమిపై క్రీస్తు భౌతికంగా పరిపాలన చేస్తాడనే విషయాన్ని నమ్మరు. ఇప్పుడు క్రీస్తు మరియు పరిశుద్ధులు సువార్త ప్రభావం ద్వారా ఆత్మీయంగా పరిపాలిస్తున్నారని నమ్ముతారు. తన సంతానం, కనానును శాశ్వతంగా స్వతంత్రించుకుంటారని అబ్రాహాముకు చేసిన వాగ్దానం, రక్షణ పొందిన ప్రస్తుత విశ్వాసుల ద్వారా నెరవేరుతుందని నమ్ముతారు.

నిబంధన దేవశాస్త్రం ప్రకారం, ఇప్పుడు ఇశ్రాయేలు ప్రజలు క్రీస్తును తృణీకరించారు గనుక వారికి ప్రత్యేకమైన ప్రాముఖ్యత లేదు. యూదులు, ఇతర అన్యుల వలె వ్యక్తిగత రక్షణను అంగీకరించడం ద్వారా దేవుని ప్రజలలో భాగమవ్వొచ్చు.

**ప్రత్యామ్నాయ దృక్పథం**

నేటి దినాలలో చాలామంది దైవజ్ఞాన పండితులు, యుగసంబంధిత దేవశాస్త్రానికి మరియు నిబంధన దేవశాస్త్రానికి మధ్య లేఖన ఆధారిత సమన్వయాన్ని తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారు.

యుగసంబంధిత దేవశాస్త్రంతో కొన్ని సమస్యలు ఉన్నాయి. అపొస్తలుడైన పౌలు, లేఖనాలు (పాతనిబంధన) రక్షణను బోధిస్తున్నాయని (2 తిమోతికి 3:15) తిమోతికి చెప్పాడు. నీకొదేము, పాత నిబంధన బోధకుడు గనుక క్రొత్తగా జన్మించడం గురించి అతనికి తెలిసి ఉండాలని యేసు చెప్పాడు (యోహాను 3:10). ఒక విశ్వాసి ఇప్పుడు, నిజమైన ఇశ్రాయేలీయుడని, అబ్రాహాము కుమారుడని (రోమా 2:28-29; గలతీయులకు 3:28-29) క్రొత్త నిబంధన చెబుతుంది. పాత నిబంధన బలులు పాపాన్ని తీసివేయవని కూడా ఇది చెబుతుంది (హెబ్రీయులకు 10:4). చరిత్రలోని వివిధ కాలాల్లో దేవుడు వివిధ రకాల రక్షణ మార్గాలను అందించలేదని ఈ లేఖనాలు చూపిస్తున్నాయి.

నిబంధన దేవశాస్త్రంతో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. పాతనిబంధన వాగ్దానాలు ఆత్మీయంగా నెరవేరతాయని చెప్పడం, పరీక్షించలేని ఊహాత్మక వివరణలను అనుమతించడమే అవుతుంది. అదేవిధంగా, ఈ వివరణ, అసలు అర్థాన్ని కోల్పోతుంది. అబ్రాహాము లేదా ఇతరులు ఈ వాగ్ధానాలను అర్థం చేసుకున్నామని భావించినా, వాటిని అర్థం చేసుకోవడం అసాధ్యం. ఉదాహరణకు, ఒక భూమిని తన సంతానం ఎప్పటికీ స్వతంత్రించుకుంటారని దేవుడు అబ్రాహాముకు వాగ్దానం చేశాడు; అది నిజంగా అన్యులు రక్షించబడతారనే అర్థం కావచ్చా?

దేవుని ప్రణాళికలో ఇశ్రాయేలు ఇప్పటికీ ప్రాముఖ్యతను కలిగి ఉందనే విషయాన్ని నిబంధన దేవశాస్త్రం తృణీకరిస్తుంది, కానీ ఇశ్రాయేలు ఒక దేశంగా ఒక దినాన రక్షణ పొందుతుందని అపొస్తలుడైన పౌలు చెప్పాడు (రోమా 11:26).

**ఇశ్రాయేలు మరియు సంఘం యొక్క సమతుల్య దృక్పథం పాత నిబంధనలోని వివిధ వాగ్దానాల గూర్చిన అవగాహనను కలిగి ఉంటుంది.**

1. రక్షణ వాగ్దానములు. రక్షణ అనేది కృప ద్వారాను మరియు చరిత్రలోని ఏ సమయంలోనైనా, యూదులు మరియు అన్యులు పశ్చాత్తాపపడి, విశ్వాసముంచడం ద్వారా లభిస్తుంది. దేవుడు ఒక వ్యక్తిని అంగీకరించడానికి ఆధారం, ఎల్లప్పుడూ ఒక్కటే (రోమా 4:3, ఎఫెసీయులకు 2:8). రక్షణ ప్రణాళిక అనేది ఇశ్రాయేలు ప్రజలకు, సంఘానికి కూడా ఒక్కటే గనుక వాళ్ళు భూమిపై వేర్వేరు వంతులు కలిగియుండవలసిన అవసరం లేదు.

2. **తన ప్రజల పట్ల దేవుని శ్రద్ధను గూర్చిన వాగ్దానాలు.** అనేక వాగ్దానాలు విధేయత కలిగి తనతో సంబంధాన్ని కలిగి ఉన్న ప్రజలను దేవుడు శ్రద్ధగా సంరక్షించే విధానాన్ని వివరిస్తాయి. 23వ కీర్తన దీనికి ఒక ఉదాహరణ. ఈ వాగ్దానాలు, ఆయనతో సంబంధంలో ప్రత్యక్షపరచబడిన దేవుని స్వభావాన్ని చూపుతాయి. ఈ సూత్రాలు ఇశ్రాయేలు లేదా సంఘం విషయంలో ఏ సమయంలోనైనా మరియు ప్రదేశంలోనైనా వర్తిస్తాయి.

3. **ఒక దేశంగా ఇశ్రాయేలుకిచ్చిన వాగ్దానాలు.** యేసు, యూదుల మెస్సీయా. ఒకదినాన, ఇశ్రాయేలు ఒక దేశంగా క్రీస్తువైపుకు తిరుగుతుంది (రోమా 11:26). ఒక దేశంగా ఇశ్రాయేలుకు దేవుడు చేసిన వాగ్దానాలు, విశ్వాసముంచే యూదుల శేషం కోసం అక్షరాలా నెరవేరుతాయి.

► ప్రత్యామ్నాయ దృక్పథంలోని ఏ వ్యాఖ్యలు, యుగసంబంధిత దేవశాస్త్ర దృక్పథానికి పోలి ఉన్నాయి మరియు ఏ వ్యాఖ్యలు దీనికి భిన్నంగా ఉన్నాయి? ఏ వ్యాఖ్యలు నిబంధన దేవశాస్త్రానికి సరిపోలుతున్నాయి, ఏవి భిన్నంగా ఉన్నాయి?

## పాఠం 10 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) రోమా 10 యొక్క ప్రధానాంశం ఏమిటి?

(2) యూదులు తమని తాము నీతిమంతులుగా తీర్చుకోవడానికి ఎలా ప్రయత్నించారు?

(3) క్రీస్తుకంటే ముందుగా జీవించిన ప్రజలు క్రియల ద్వారా రక్షణ పొందలేదని మనకెలా తెలుస్తుంది?

(4) రక్షణ మన హృదయాలలోను, మన మాటలోనూ ఉండడం అంటే అర్థం ఏమిటి?

(5) మిషనరీ సందేశం ఎందుకు అత్యవసరం?

(6) రోమా 11లోని చెట్టు కొమ్మల ఉదాహరణను వివరించండి.

(7) పాతనిబంధనలో మూడు రకాల వాగ్దానాలను పేర్కొనండి.

## పాఠం 10 - అభ్యాసాలు

(1) నేటి క్రైస్తవులకు పాతనిబంధన ఎందుకు ప్రాముఖ్యమో ఒక పేజీలో వివరించండి. ప్రత్యేకంగా విలువైన పాతనిబంధన లేఖనాల ఉదాహరణలు ఇవ్వండి.

(2) ఇతర సంఘాలకు చెందిన కనీసం ఇద్దరు సభ్యులతో సంభాషించి, ఆ సంభాషణను నివేదించాలని జ్ఞాపకముంచుకోండి.

# పాఠం 11

# పరిచర్య మరియు సంబంధాలు

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం

రోమా పత్రిక, 6వ భాగం (12:1-15:7), సంఘంలో జీవితానికి, పరిచర్యకు, క్రైస్తవ సంబంధాలకు మరియు ప్రభుత్వంతో సంబంధానికి అవసరమైన అనేక ఆచరణాత్మక సూచనలను కలిగి ఉంది.

12:1-2 వచనాలు, మనం దేవుని సేవ కొరకు సంపూర్ణంగా సమర్పించుకోవాలని మనకు తెలియజేయడం ద్వారా, 6వ భాగాన్ని పరిచయం చేస్తాయి. ఇది ముందటి అధ్యాయంలో పౌలు ప్రకటనలకు కొనసాగింపుగా ఉంటుంది : మనం ప్రతిదానిని బట్టి దేవునికి రుణపడి ఉంటాం (11:35); మరియు దేవుని మార్గాలు పూర్తిగా వివేకవంతమైనవి (11:33).

పౌలు సజీవయాగం అనే ఉదాహరణను ఉపయోగిస్తున్నాడు (12:1). చంపబడవలసిన బలి వలె, మనం సంపూర్ణంగా సమర్పించుకోవాలి; కానీ మరణించడానికి బదులుగా, మనం దేవుని కొరకు జీవించాలి. దాని అర్థం, సమర్పణను ఖచ్చితంగా కొనసాగించాలి. ప్రతి దినం, మన విధేయత విషయంలో ఏదైనా మార్పుకు అనుమతించడాన్ని మనం తృణీకరించాలి. సజీవయాగం యొక్క ఉదాహరణ, మన అర్పణ యొక్క సంపూర్ణతను నొక్కి చెబుతుంది. మన జీవితంలో కొంత భాగాన్ని, దేవుని చిత్తానికి వేరుగా దాచిపెట్టుకోకూడదు. దేవునికి సంపూర్ణంగా సమర్పించుకోవడం నుండి కొన్ని కోరికలను లేదా కాంక్షలను భద్రపరచుకోకూడదు.

పరిశుద్ధ యాగంగా మన స్వయాన్ని సమర్పించుకోవడమనేది ఆత్మీయ ఆరాధన. ఇది సాంప్రదాయిక మతానికి భిన్నంగా ఉంటుంది.[69]

12:2 వివరించిన పరివర్తన లేకుండా సంపూర్ణ సమర్పణతో కూడిన సేవ అనేది సాధ్యం కాదు. మన మనసు నూతన పరచడం ద్వారానే మనం పరివర్తన చెందాలి. దాని విలువలు, ప్రవర్తనలు లేదా అభిప్రాయాల విషయంలో మనం లోక మర్యాదను అనుసరించకూడదు. దేవుని సంపూర్ణ చిత్తం యొక్క దృక్కోణం నుండి ప్రతి ప్రశ్నను పరిగణలోనికి తీసుకొనే వ్యక్తి, లోకానికి భిన్నంగా ఉంటాడు. అతను ఏవిధమైన పాప కోరికలను అనుమతించడు; వాటిని సాధారణమైనవిగా సహించడు.

---

[69] 1:9పై నోట్స్ చూడండి.

శరీరం పరిశుద్ధంగా ఉండాలనే విషయాన్ని గమనించండి. పాపమనేది దేవుడు శుద్ధీకరించలేని శరీరపు ప్రాముఖ్యమైన అంశం కాదు. శరీరం పాప స్వభావం కలిగింది కాదు, చిత్తం లేకుండా అది పాపం చేయదు, గాని పాపం చేయడానికి సాధనంగా ఉపయోగించబడుతుంది.

12:1-15:7 వరకు ఉన్న వచనాలు, సమర్పణ కలిగిన, పరివర్తన చెందిన జీవితాన్ని ఎలా జీవించాలో వివరిస్తాయి.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 12వ అధ్యాయాన్ని చదవాలి.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం, 1వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ**

(12:3) పౌలుకు అనుగ్రహించిన కృప, ఆయనకున్న అపొస్తలత్వపు అధికారాన్ని, ప్రత్యక్షత వరాన్ని సూచిస్తుంది.

మనం తగ్గింపు కలిగి ఉండాలి ఎందుకంటే మనం కలిగి ఉన్న సమస్తాన్ని దేవుడే ఇచ్చాడు. ఆత్మీయ వరాలు కలిగిన వ్యక్తి, వాటిని తాను సంపాదించలేదని, అవి దేవుని నుండి కలిగాయని, ఇతరులకు సేవ చేసే ఉద్దేశ్యంతోనే ఆయన వాటిని ఇచ్చాడని గ్రహించి, తగ్గించుకోవాలి.




**రోమా ధనం**

రోమీయుల ధనాన్నే సామ్రాజ్యమంతటా ఉపయోగించేవారు, యెరూషలేములో కూడా. ఇది వ్యాపారం వర్ధిల్లడానికి ఆర్థిక స్థిరత్వాన్ని, విలువకు ప్రామాణికతను అందించేది. చక్రవర్తి బొమ్మ ఉన్న నాణేన్ని ఉపయోగించి యేసు ఒక ఉదాహరణ చెప్పాడు (లూకా 20:24).

(12:4-5) శరీరంలో సభ్యులుగా, మనకు ఇతరులు కావాలి మరియు ఇతరులకు సేవ చేసే బాధ్యతను మనం కలిగి ఉన్నాం. 1 కొరింథీయులకు 12:12-26లో శరీరాన్ని గూర్చిన అలంకారం వర్ణించబడింది.[70]

(12:6-8) ఈ వచనాల్లో కొన్ని పరిచర్యల పేర్లు ఉన్నాయి. ప్రతి విశ్వాసి, దేవుడు తనని పిలిచిన, తలాంతులు కలిగిన పరిచర్యను అనుసరించాలి. ఒక వ్యక్తి కృపా ఆధారిత తగ్గింపును కలిగి లేనట్లయితే, అతను తనకున్న సామర్థ్యాన్ని తప్పుడు విధానంలో ఉపయోగించి (బహుశా మనుషుల అంగీకారం కోసం చూడవచ్చు), తన వాస్తవ పిలుపు విషయంలో వైఫల్యం చెందవచ్చు.

---

[70] చిత్రం: "Roman coin hoard: 1 Gold solidus of Valentinian I", The Portable Antiquities Scheme/The Trustees of the British Museum, https://finds.org.uk/database/images/image/id/1023830/recordtype/artefacts, నుండి తీసుకున్నారు. CC BY 2.0, లైసెన్స్ పొందినది, రంగులో అసలు చిత్రానికి కొంచెం వేరుగా ఉంది.

ఆత్మ వరాలను పొందిన వ్యక్తి, వాటిని సరైన విధానంలో ఉపయోగించాలని హెచ్చరించబడింది. ఉదాహరణకు, దాతృత్వం కలిగి ఇచ్చే వ్యక్తి, ఎలాంటి ఘనతను ఆశించకుండా ఇవ్వాలి. పరిపాలనా సామర్థ్యం కలిగిన వ్యక్తి శ్రద్ధకలిగిన వాడై, ప్రతి విషయం పట్ల దృష్టి కలిగి, అన్ని సమయాల్లో ఆధారపడదగిన వ్యక్తిగా ఉండాలి. అవసరతలో ఉన్న వారికి సహాయం చేసే వ్యక్తి, సహాయం పొందే వ్యక్తిని అవమానపరిచే విధంగా అహంకారపూరితమైన లేదా ద్వేషపూరితమైన వైఖరి కలిగి ఉండకూడదు.

► లోకంలో ఉన్న ప్రజలు వారి సామర్థ్యాలు ఉపయోగించడానికి భిన్నంగా క్రైస్తవులు, తమ ఆత్మీయ వరాలను ఎలా ఉపయోగిస్తారు?

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం, 2వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ**

(12:9) ప్రేమ నిష్కపటమైనదిగాను, యదార్థమైనదిగాను ఉండాలి. చెడ్డదాని నసహ్యించుకొని మంచిదానిని హత్తుకొని ఉండాలి. ప్రేమలో వర్థిల్లడమనేది ఏది మంచిదనే విషయంలో వివేకాన్ని మెరుగుపరచుకోవడంతో సంబంధాన్ని కలిగి ఉంటుంది (ఫిలిప్పీయులకు 1:9-10).

(12:10) సంఘం, అనేకమంది సహోదరీ, సహోదరులు కలిగిన దేవుని కుటుంబం. మనల్ని మనం ఘనపరచుకోవడానికి బదులు ఇతరులను ఘనరచుకోవడానికి ఇష్టపడాలి.

(12:11) బాధ్యతల విషయంలో సోమరితనం కలిగి ఉండకండి. ఒక క్రైస్తవుడు పని విషయంలో నైతిక విలువలు కలిగిన మంచి మాదిరిని కనబరచాలి. అతను దేవుని ఉద్దేశ్యంతో జీవిస్తున్నట్లయితే, వృధా చేయడానికి పెద్దగా సమయం ఉండదు. అతను దేవుని కొరకు పనిచేస్తున్నట్లుగానే పని చేస్తాడు (ఎఫెసీయులకు 6:6-7).

(12:12) మన సంతోషం, మన పరిస్థితులపై ఆధారపడి ఉండదు, ఎందుకంటే మనం నిత్యజీవపు నిరీక్షణను కలిగి ఉన్నాం. ఓర్పు కలిగి ఉండడం అంటే విశ్వాసంతో సహించడం. ఒక విశ్వాసి నిరంతరం దేవునిపై ఆధారపడే వైఖరిని కలిగి, ఏ సమయంలోనైనా ప్రార్థించడానికి సిద్ధంగా ఉండాలి.

(12:13) భౌతిక అవసరాల విషయంలో ఇతర విశ్వాసులకు సహాయం చేయండి. ఆతిథ్యం అంటే ఆహారం, వసతి విషయంలో ఇతరుల అవసరాలను తీర్చడం.

(12:14) క్రీస్తు వారితో వ్యవహరించిన విధంగా వారితో వ్యవహరించాలే గాని, వారు ఈ కీడుకు తగిన వారన్నట్లుగా ప్రవర్తించవద్దు. వారు దేనికి తగిన వారని మీరు భావిస్తారో, దానిని వారికి ఇవ్వడం, అక్షరాల తీర్పు తీర్చడమే అవుతుంది, వాస్తవానికి అది దేవునికి మాత్రమే ఉన్న బాధ్యత.

(12:15) ఇతరుల సంతోషంలో లేదా దుఃఖంలో పాలుపొందడానికి సిద్ధంగా ఉండాలి.

(12:16) స్థాయి చిహ్నాలను గురించి స్పృహ కలిగి ఉండకండి. ఉన్నత తరగతికి చెందిన వారికి మాత్రమే సాయం చేయకండి. పేదవాళ్ల పట్ల కూడా గౌరవాన్ని కనబరచండి. ఇతరులకంటే మిమ్మల్ని హెచ్చించుకొనే మార్గాల కొరకు చూడకండి.

(12:17) ఒక వ్యక్తి మీకు హాని చేశాడు కాబట్టి వారికి హాని చేయాలనుకోవడం సరైంది కాదు. మనం ప్రజలకు తీర్పు తీర్చడానికి కాదు గాని, క్షమించడానికి పిలవబడ్డాం.

నిజాయితీని ప్రదర్శించండి. మీరు గౌరవం పొందాలంటే, మీరు నిజాయితీ పరులని మీకు, దేవునికి మాత్రమే తెలిస్తే సరిపోదు; ప్రతి ఒక్కరూ నిజాయితీని చూడగలిగే విధివిధానాలను కలిగి ఉండాలి. మంచి పేరు పాడైపోయిన తరువాత దానిని తిరిగి నిర్మించుకోవడం కంటే ఆ మంచి పేరును కొనసాగించడం సులభం.

(12:18) మీపైన ఆధారపడినంతగా, ప్రతి ఒక్కరితో సమాధానం కలిగి జీవించండి. సమాధానం దాని ఉత్తమ స్థితిలో అన్యోన్యత కలిగిన సంబంధం. కొన్నిసార్లు సమాధానం కొరకు అనుకోకుండా చేసిన పొరపాటును బట్టి కూడా క్షమాపణలు చెప్పాల్సి వస్తుంది. కొన్నిసార్లు తప్పు చేసిన వ్యక్తిని దయతో గద్దించాల్సి /సరిచేయాల్సి ఉంటుంది, తద్వారా మీ సంబంధానికి ఆటంకంగా ఉన్న తప్పు పరిష్కరించబడుతుంది. అవసరమైనప్పుడు మీరు క్షమాపణలు చెప్పడానికి లేదా గద్దించడానికి / సరిచేయడానికి నిరాకరిస్తే, సమాధానాన్ని కొనసాగించడానికి మీరు చేయాల్సింది చేయడం లేదు.

(12:19) ప్రతీకారం తీర్చుకోవద్దు; దానికి బదులుగా, దేవుని ఉగ్రతకు అవకాశమివ్వండి. ఒక వ్యక్తి శిక్షించే వ్యక్తిగా ఉండాలని కోరుకున్నట్లయితే, దేవుడు తన పనిని నీతిగా చేస్తున్నాడని నమ్మకపోవడాన్ని చూపిస్తుంది.

(12:20) ఇతరులు దేనికి పాత్రులో దానిని వారికి ఇవ్వడానికి బదులు, వారికి మేలు చేయండి. నిప్పులు కుప్పలు పోయడం అంటే మరింత కుటిలమైన రీతిలో ప్రతీకారం తీర్చుకోవడం కాదు, ఎందుకంటే అది వచనంలోని ప్రధాన అంశానికి విరుద్ధంగా ఉంటుంది. ఒక వ్యక్తి వైఖరి యొక్క కాఠిన్యాన్ని కరిగించడానికి ఇది చిహ్నం కావచ్చు.

(12:21) కీడు మిమ్మల్ని మార్చి, ఆధ్యాత్మికంగా మిమ్మల్ని ఓడించనివ్వవద్దు. అయితే, కీడును కీడుతో వ్యతిరేకించకండి, కానీ మేలుతో వ్యతిరేకించండి. కఠినంగా మారి, చెడు మార్గంలో దానిని వ్యతిరేకించినట్లయితే, మీరు వివాదాన్ని గెలిచినా కూడా ఆత్మీయంగా ఓడిపోతారు.

► ఒక వ్యక్తి సంపూర్ణంగా దేవునికి సమర్పించుకోనట్లయితే, ఈ సూచనలను ఎలా పాటించలేడో ఆలోచించండి. ఈ సూచనలను బట్టి, మీ జీవితంలో మార్చుకోవలసింది ఏమిటి?

## అపొస్తలుని పత్రికలను వ్యాఖ్యానించడం

పౌలు, తన ప్రతికలను నిర్దిష్టమైన పరిస్థితులకు స్పందనగా రాసాడు: "సాధారణంగా సందర్భమనేది సరిదిద్దాల్సిన ప్రవర్తన కావచ్చు లేదా సరిచేయాల్సిన సిద్ధాంతపరమైన తప్పుడు బోధ కావచ్చు లేదా మరింత వెలుగు అవసరమైన తప్పుడు అవగాహన కావచ్చు."[71] పత్రికలు క్రమానుబద్ధ దైవశాస్త్ర రూపంలో రాయబడలేదు, కానీ ఒక అవసరానికి స్పందనగా దైవశాస్త్రం రూపించబడింది. ఈ దైవశాస్త్రం ప్రారంభం నుండి ఆచరణాత్మకమైంది. ఇది నిజజీవితం నుండి వేరుగా / ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది కాదు.

క్రొత్త నిబంధన పత్రికలనేవి సాధారణ ప్రజానీకాన్ని ఉద్దేశించి రాసిన సాహిత్యం కాదు, కానీ అవి ఒక గ్రహీతకు, తక్షణ అన్వయానికి మించి ఉద్దేశించి రాయబడినవి. తన నుండి ప్రతి సంఘం పొందిన పత్రికలను లవోదికయులతో పంచుకొనుమని పౌలు కొలొస్సయ సంఘస్తులకు చెప్పాడు (కొలొస్సయులకు 4:16). సంఘం, ప్రారంభం నుండే పౌలు రాసిన పత్రికలను సేకరించి, వాటినన్నింటిని కలిపి వేరే వారికి పంపిణీ చేసింది. కాబట్టి, వాళ్ళు పత్రికలను అన్ని స్థలాలలో, అన్ని కాలాలలో ఉన్న సంఘానికి వర్తించేవిగా చూశారని మనం గ్రహించవచ్చు.

మొదట ఈ పత్రికలను పొందిన వారికి, మనకు మధ్య సమయంలోను, సంస్కృతిలోను వ్యత్యాసం ఉన్నప్పటికిని, మనము ఎదుర్కొనే సమస్యల వంటి సమస్యలనే ఎదుర్కొనే క్రొత్త నిబంధన క్రైస్తవులకు రాయబడినవి. కాబట్టి, లేఖనంలో మనం కనుగొనే కొన్ని రకాల సాహిత్యం కంటే పౌలు పత్రికలు ఆధునిక సంఘానికి చాలా సులభంగా వర్తిస్తాయి. అవి ప్రత్యేకంగా యూదా రాజ్యానికి రాయబడినవి కాదు, పాతనిబంధన ధర్మశాస్త్రానికి లోబడిన ప్రజలను ఉద్దేశించి రాయబడినవి కాదు.

వాక్యాన్ని వ్యాఖ్యానించే వ్యక్తికి రచన యొక్క అసలు పరిస్థితి, ఆధునిక అన్వయనానికి ప్రారంభస్థానాన్ని ఇస్తుంది. వ్యాఖ్యాన సూత్రమేమిటంటే, దానిని ఎవరు రాశారు, ఎవరికి రాశారు, ఎందుకు రాశారు అనే విషయాలు

[71] Gordon Fee and Douglas Stuart, *How to Read the Bible for All Its Worth,* (Grand Rapids, MI: Zondervan, 1993) 48.

తెలుసుకున్నట్లయితే మరింత ఉన్నతంగా అర్థం చేసుకోవచ్చు. పత్రికలు, వారి రచయిత మరియు దాని గ్రహీతల గుర్తింపులను తెలుసుకునే ప్రయోజనాన్ని, వ్యాఖ్యానించే వ్యక్తికి అందిస్తాయి.

రోమీయులకు రాసిన పత్రిక, పౌలు రచనలన్నింటిలో అత్యంత అధికారికమైనది. ఇది ప్రణాళికాబద్ధమైన నిర్మాణాన్ని అనుకరిస్తుంది. ఇది దాదాపు దైవజ్ఞానపరమైన గ్రంథ రూపంలో ఉంటుంది. పౌలు రోమా సంఘంలో ఉన్న నిర్దిష్టమైన తప్పుడు బోధనలను గురించి ప్రస్తావించలేదు. ఆయన తాను స్థాపించి, దర్శించిన సంఘాలకు రాసిన పత్రికలలో మాదిరిగా, ఈ పత్రికలో నిర్దిష్టమైన పరిస్థితులను గురించి మాట్లాడలేదు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం, 3వ లేఖన భాగం**

**13:1-7 యొక్క ప్రధానాంశం**

ప్రభుత్వాన్ని దేవుడే స్థాపించాడు గనుక విశ్వాసులు పౌర ప్రభుత్వానికి లోబడి ఉండాలి.

*తరగతి నాయకునికి సూచన: తరువాతి లేఖనభాగాన్ని బృంద అధ్యయనం చేస్తున్నప్పుడు చాలా చర్చ, అభిప్రాయ బేధాలు, అసమ్మతి ఉండవచ్చు. లేఖనమే వారి అభిప్రాయాలను సరిచేసే దిశగా సభ్యులను నడిపించడానికి ప్రయత్నించాలి.*

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 13:1-7 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(13:1-2) దేవుడు ప్రభుత్వాన్ని స్థాపించాడు. ప్రతి పాలకుడు నీతిమంతుడని కాదు గాని, మానవ అధికారం స్థాపించబడాలని దేవుడు కోరుకుంటున్నాడని దాని అర్థం. మానవ అధికారం క్రింద ఉండడానికి నిరాకరించడం, దేవునికి విరోధంగా తిరుగుబాటు చేయడమే అవుతుంది. మనకు కనిపించే సహోదరునిని మనం ప్రేమించకుండా, దేవునిని నిజంగా ప్రేమించలేనట్లే, కనిపించే మానవ అధికారానికి లోబడడానికి నిరాకరించే వ్యక్తులు, దేవుని అధికారానికి కూడా లోబడలేరు. ఒక క్రైస్తవుడు చట్టాధికారుల పట్ల అగౌరవంతో వ్యవహరించకూడదు.

(13:3-4) తప్పు చేసిన వారిని శిక్షించడం అనేది ప్రభుత్వ ఉద్దేశ్యాలలో ఒకటి. ప్రభుత్వం సరైన విధంగా పనిచేస్తే, తప్పు చేసే వారు భయపడతారు. సాధారణ పరిస్థితుల్లో, క్రైస్తవులు ప్రభుత్వంతో విభేధించకూడదు, పోరాటం చేయకూడదు, ఎందుకంటే క్రైస్తవ లక్షణాలు, క్రైస్తవునిని మంచి పౌరునిగా చేస్తాయి. ఏదిఏమైనప్పటికిని, చరిత్రలో చాలాసార్లు, పాలకులు దేవునికి మాత్రమే చెందాల్సిన భక్తిని వారు తీసుకొనే ప్రయత్నం చేశారు, తద్వారా క్రైస్తవులను హింసించేవారిగా మారారు.

సరైన విధంగా పనిచేసే ప్రభుత్వం, దేవుని అధికారానికి అనుగుణంగా ఉంటుంది. చెడు చేసేవారిని చంపడం ద్వారా కూడా చట్టాలను అమలు చేయడానికి ప్రభుత్వానికి దేవుని నుండి అధికారం ఉందని 4వ వచనం చెబుతోంది.

కొన్ని దేశాల్లోని క్రైస్తవులు, ప్రభుత్వ స్థానాల్లో మరిముఖ్యంగా హింసను ఉపయోగించాల్సిన అవసరం ఉన్న స్థానాల్లో సేవలు అందించడం తప్పని నమ్ముతారు. ఆ నమ్మకాన్ని కలిగిన చాలా మంది క్రైస్తవులు, ప్రభుత్వం క్రైస్తవులను హింసిస్తూ, ఎంతో అవినీతికి పాల్పడిన దేశాలలో నివసిస్తున్నారు. అయినప్పటికిని, ఒకవేళ ప్రభుత్వం సరిగా పనిచేసినట్లయితే, క్రైస్తవుడు ప్రభుత్వ స్థానాల్లో పనిచేయడంలో ఎలాంటి తప్పు లేదు ఎందుకంటే ప్రభుత్వానికి దేవుడు అధికారం ఇచ్చాడు.

(13:5) క్రైస్తవుడు ప్రభుత్వ శిక్షకు భయపడి మాత్రమే కాదు గాని, మంచి మనస్సాక్షిని బట్టి కూడా అధికారానికి లోబడాలి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం లేదా చట్టాలకు విధేయత చూపడానికి నిరాకరించడం, ప్రభుత్వ పాత్రను తృణీకరించడమే అవుతుంది. ఏదైనా ప్రభుత్వం ఉన్నట్లయితే, వ్యక్తులే అన్ని నిర్ణయాలు తీసుకోరు. వ్యక్తిగత హక్కులను పరిరక్షించే విధానానికి మనమెల్లప్పుడు అంగీకరించకపోయినప్పటికిని, ఆ హక్కుల పరిరక్షణ అధికారానికి వ్యక్తిగత స్వేచ్ఛను సమర్పించుకోవాలి.

(13:6-7) ఒక క్రైస్తవుడు, న్యాయబద్ధంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను చెల్లించాలి. గౌరవం చూపించే వాడుకైన మార్గాలను అనుసరించాలి.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం, 4వ లేఖన భాగం**

**13:8-10 యొక్క ప్రధానాంశం**

ప్రేమ ధర్మశాస్త్రాన్ని నెరవేరుస్తుంది, ఎందుకంటే ఇది ఇతరుల పట్ల సరైనది చేయడానికి విశ్వాసిని ప్రేరేపిస్తుంది.

ధర్మశాస్త్రం విశ్వాసికి అసంధర్భమైనది కాదని ఈ వచనాలు రుజువు చేస్తాయి. విశ్వాసి, కృప ద్వారా ఇక్కడ పేర్కొన్న ప్రేమను నెరవేరుస్తాడు గనుక ధర్మశాస్త్రాన్ని నెరవేరుస్తాడు. కృప, ధర్మశాస్త్ర అతిక్రమాలను కప్పేది మాత్రమే కాదు. కృప అనేది మన పట్ల దేవుని చిత్తాన్ని మనలో నెరవేర్చే దేవుని పని.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 13:8-10 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(13:8) ఈ భావనలో అచ్చి ఉండకూడదు అంటే ఒక వ్యక్తికి ఇవ్వాల్సింది ఇవ్వకుండా ఉండడం. ముందు వచనంలో కొన్ని రకాల బాధ్యతల జాబితా ఉంది. మన బాధ్యతలను నెరవేర్చడానికి అంగీకరించిన విధానమైతే, అది అప్పు తీసుకొని, గడువు లోపే తిరిగి చెల్లించడమనేది తప్పు కాదు. 7వ వచనంలో చెప్పబడినట్లుగా, మనం ఎవరికైనా ఏదైనా ఇవ్వాల్సి వస్తే దానిని ఖచ్చితంగా ఇవ్వాలని అజ్ఞాపించబడింది.

► ఒక క్రైస్తవుడు తాను తీసుకున్న అప్పును తిరిగి చెల్లించకపోతే జరిగే పరిణామాలు ఏమిటి?

(13:9-10) మిమ్మల్ని మీరు ప్రేమించుకున్నట్లే, ఇతరులను నిజంగా ప్రేమించినట్లయితే, వారి నుండి మీరు దొంగతనం చేయరు, వారికి అబద్ధం చెప్పరు, వారికి ఉన్న దానిని ఆశించరు లేదా వారి వివాహ జీవితంలో సమస్యలను సృష్టించరు. లోకంలో సర్వసాధారణమైన స్నేహం మరియు ప్రేమలు, ఎల్లప్పుడూ ఈ తప్పులను నిరోధించలేవు; అయితే మనలోని క్రీస్తు ప్రేమ పరదేశులకు, మనల్ని బాధపెట్టేవారికి లేదా పొందదగిన వారికి కూడా కీడు చేయకుండా నిరోధిస్తుంది.

చాలా సంస్కృతులు మరియు మతాలు, మనం కొంతమంది వ్యక్తులకు, బహుశా కుటుంబ సభ్యులకు, గిరిజన తెగల ప్రజలకు అలాంటి ప్రేమ చూపడానికి అచ్చియున్నామని బోధిస్తాయి. కానీ మిగిలిన మానవజాతికి అలాంటి ప్రేమను చూపాల్సిన అవసరం లేదని వారు భావిస్తారు. విదేశీయుల నుండి, యజమానుల నుండి దొంగతనం చేయడం లేదా పరదేశుల పట్ల దురుసుగా ప్రవర్తించడం అనుమతించదగినదిగా వారు భావించవచ్చు. మనం ఎవరితో సంబంధం కలిగి ఉన్నామో, వారందరి పట్ల ప్రేమను కనబరచమని క్రీస్తు మనకు ఆజ్ఞాపించాడు. లూకా 10:25-37లో, మీ పొరుగువానిని ప్రేమించాలనే ఆజ్ఞను వివరించడానికి, గాయపడిన యూదునికి సహాయం చేసిన సమరయుని కథను యేసు చెప్పాడు.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం, 5వ లేఖన భాగం**

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 13:11-14 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(13:11) ఈ వచనంలో సూచించిన రక్షణ, క్రీస్తు రాకడలో పొందే అంతిమ రక్షణను సూచిస్తుంది. ఈ లోకం ఎప్పటికీ ఇలానే ఉంటుందన్నట్లుగా మనం జీవించకూడదు. సమస్తం త్వరగా గతించిపోవాలని నిరీక్షించే వ్యక్తులుగా మనం జీవించాలి.

(13:12) రాత్రి అనేది అలంకారిక భాష. అది కాలం ప్రభువు రాకడ వైపుకు నడిపిస్తోందని సూచిస్తుంది (2 పేతురు 1:19 కూడా చూడండి.) క్రొత్తనిబంధనలో చీకటి, పాపపు కార్యాలతో సంబంధం కలిగి ఉంటుంది. (1 థెస్సలొనీకయులకు 5:4-8 మరియు ఎఫెసీయులకు 5:11-14 చూడండి).

(13:13) ఇక్కడ జాగ్రత్తలేని పాపి జీవితాన్ని వర్ణించారు. ఈ వ్యక్తి భవిష్యత్ ని గురించి పట్టించుకోడు, మరిముఖ్యంగా నిత్యత్వాన్ని గురించి అసలు ఆలోచించడు. అతను నైతికతను గూర్చిన పట్టింపు లేకుండా, సంతోషం కొరకే జీవిస్తాడు. క్రైస్తవుని జీవితం దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది.

(13:14) పాపపు కోరికలను ఏమాత్రం అనుమతించకండి. పాపానికి సాకుగా మానవ స్వభావాన్ని ఉపయోగించకండి. వెలుగులో జీవించండి. మీరు సిగ్గుపడేది ఏదీ మీ జీవితంలో లేకుండా చూసుకోండి.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం, 5వ లేఖన భాగం**

యదార్థవంతులైన విశ్వాసులు అంగీకరించని విషయాలు ఎల్లప్పుడూ ఉంటాయి. రోమా 14వ అధ్యాయం, కొన్ని నమ్మకాల్లోనూ, పద్ధతుల్లోనూ వ్యత్యాసాలున్న క్రైస్తవులు, ఎలా ఒకరి పట్ల మరొకరు ప్రేమ కలిగి, గౌరవించుకుంటూ,కలిసి ఆరాధిస్తూ, సేవ చేయగలరో సూచిస్తుంది.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 14:1-23 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(14:1) బలహీనమైన ఒక సహోదరుడు, నిజంగా దేవుడు నిషేధించని చర్య విషయమై అపరాధభావనను కలిగి ఉంటాడు (1 కొరింథీయులకు 8:7-12 చూడండి). బలమైన సహోదరుడు, తాను చేసిన పని దేవునికి అవిధేయత చూపడం కాదని తెలుసు గనుక అతను అపరాధభావనను కలిగి ఉండడు.

(14:2-3) యూదుల ధర్మశాస్త్రం, ఆహారాన్ని గూర్చిన నియమాలను కలిగి ఉంది. సంఘంలో చాలామంది యూదీకరణవాదులు, యూదుల నియమాలను అధ్యయనం చేసిన అన్యులు ఉన్నారు. ఆహారం విషయంలో ఎలాంటి ఆంక్షలు లేని వ్యక్తి, పరిమితులు కలిగిన వ్యక్తిని తృణీకరించడానికి శోధించబడవచ్చు. ఆహారానికి సంబంధించిన నియమాలను అనుసరించే వ్యక్తి, అనుసరించని వారిని పాపులుగా తీర్పు తీర్చవచ్చు.

(14:4) దేవుడు తన సేవకులకు తీర్పు తీర్చి, వాళ్ళకు అవసరమైన కృపను అందిస్తాడు. లేఖనంలో స్పష్టంగా లేని విషయాలను బట్టి ఇతరులకు తీర్పు తీర్చకండి.

ప్రపంచవ్యాప్తంగా బాప్తిస్మమిచ్చే విధానం, ప్రభు రాత్రి భోజన సంస్కారాన్ని ఇచ్చే విధానం, బైబిల్ అనువాదాన్ని ఎంపిక చేసుకోవడం, వస్త్రాలు, వినోదం లాంటి విషయాలలో విశ్వాసులకు మధ్య భిన్నత్వం ఉంది. మనం క్రైస్తవ ఐక్యతను కలిగిన ఉండాలి, కానీ క్రీస్తు శరీరంలో ఏకరూపత ఉండాలని ఆశించకూడదు. మనం "మౌళికాంశాలలో ఐక్యత; ప్రాముఖ్యత లేని విషయాల్లో, స్వాతంత్ర్యం; అన్ని విషయాల్లో ప్రేమ" అనే నినాదాన్ని కలిగి ఉండాలి.

(14:5-6) యూదులకు అనేక పండుగ దినాలు ఉన్నాయి, ప్రతి దానికి ప్రత్యేకమైన ఆచార సాంప్రదాయాలు ఉంటాయి. విశ్రాంతి దినం కూడా వివాదాస్పదమే. సంఘం ప్రభువు దినాన కూడుకొని ఆరాధించేది (అపొస్తలుల కార్యములు 20:7; 1 కొరింథీయులకు 16:2; ప్రకటన గ్రంధం 1:10), ఆ తరువాత ఆదివారం క్రైస్తవ విశ్రాంతి దినంలా మారింది. ఏడవ దినాన విశ్రాంతి తీసుకోవడమనే నియమం ఇప్పటికీ ప్రయోజనాలను కలిగి ఉంది గనుక మనం దానిని ఆచరించాలి, ఎందుకంటే అది సృష్టి నియమం మరియు మోషే ధర్మశాస్త్రం ఇవ్వబడినప్పుడే ప్రారంభమైన ఆచారం కాదు.

"...ప్రతివాడు తనమట్టుకు తానే తన మనస్సులో రూఢిపరచు కొనవలెను" (14:5) అనే మాట స్పష్టమైన అభిప్రాయాలు ఉండడం అవసరమని చూపిస్తుంది. ఒక వ్యక్తి, సమస్యల గురించి తాను నమ్మే విషయాల్లో అస్పష్టంగా ఉండకూడదు. ఇతర అభిప్రాయాలను సహించడమంటే, మన అభిప్రాయమేమిటో మనకు తెలీదని కాదు లేదా మనం సాక్ష్యాన్ని లేదా హేతువును / తర్కాన్ని నిర్లక్ష్యం చేస్తున్నామని కాదు.

(14:7-9) మన జీవితం మన స్వంతం కాదు. ప్రతి జీవితం క్రీస్తును ఘనపరచాలి. క్రీస్తు మరణ, పునరుత్థానాలు మనల్ని విమోచించాయి మరియు మనం ఆయనకు చెందిన వాళ్ళం.

(14:10-12) ప్రతి వ్యక్తి, తీర్పు దినాన దేవునికి లెక్కచెప్పాలి. కాబట్టి, ఒకరిపట్ల మరొకరం కలిగి ఉండే మన అభిప్రాయాలు అంత ప్రాముఖ్యమైనవి కాదు.

(14:13-15) మరొక విశ్వాసికి ఆటంకం కలిగించకుండా ఉండటానికి ప్రయత్నించడం మనకు ప్రాముఖ్యం. క్రైస్తవునికి, ఏది అపవిత్రమైనది కాదు ఎందుకంటే సమస్తం దేవునికి చెందినవి. కానీ ఒక వ్యక్తి ఏదైనా ఒక విషయం చెడ్డదని యెరిగినప్పటికిని, దానిని చేసినట్లయితే, అతను పాపం చేసినట్లే, ఎందుకంటే అతను చెడు చేయడానికి ఎన్నుకున్నాడు. ఒక వ్యక్తిని, అతను తప్పని భావించేదానిని చేయడానికి మనం ప్రభావితం చేసినట్లయితే, ఆ వ్యక్తి తొట్రిల్లడానికి మనం కారణమవుతాం. (1 కొరింథీయులకు 8వ వచనం, ఈ విషయానికి సంబంధించిన మరొక లేఖన భాగం).

(14:16) ఒక వ్యక్తి సరైన సిద్ధాంతాన్ని కలిగి ఉండవచ్చు, కానీ ఇతరులపై తన ప్రభావాన్ని గురించి పట్టించుకోనందున వారికి హాని కలిగించవచ్చు.

(14:17) క్రైస్తవ్యం అంటే జీవితశైలిని గూర్చిన నియమాలు గాని లేదా స్వేచ్ఛ కాదు. ఇది ఆత్మీయ విజయం మరియు ఆత్మయందలి జీవితం.

(14:18-19) మనం చేసే సమస్తాన్ని క్రీస్తుకు సమర్పించినప్పుడు మరియు ఇతరుల జీవితాలను కట్టడానికి మన సామర్థ్యం కొలది కష్టపడినప్పుడు దేవుడు సంతోషిస్తాడు.

(14:20-23) సమస్తం, దేవునికి చెందినవనే విషయాన్ని జ్ఞాపకం చేసుకొనే వ్యక్తి స్వేచ్ఛను కలిగి ఉంటాడు. అయినప్పటికిని, ఒక పని చెడ్డదని భావించి దానిని చేసే వ్యక్తి, తన ఎంపికను బట్టి పాపం చేస్తున్నాడు. తాను స్వతంత్రుడనని భావించే సహోదరుడు, ఇతరులు పడిపోవడానికి కారణం కాకుండునట్లు తన స్వేచ్ఛను హద్దులో ఉంచుకోవాలి.

ఎంతో స్వేచ్ఛ ఉన్న వ్యక్తికి తీర్పు తీర్చకూడదు అనే సూచన మినహా మరే ఇతర సూచనలు బలహీనుడైన సహోదరునికి ఇవ్వలేదు. బలహీనుడు, తన మనస్సాక్షికి బంధీగా ఉంటాడు మరియు తన ప్రవర్తనను మార్చుకోడు, కానీ బలమైన సహోదరునికి ఎంపికలు ఉంటాయి.

మునుపటి లేఖనభాగాన్ని అధ్యయనం చేసేటప్పుడు, బహుశా చాలా చర్చ జరగొచ్చు, కానీ కొన్ని ప్రశ్నలను పరిగణలోనికి తీసుకోవాలి:

- మన సంఘాలు ఏ విధమైన సమస్యలను వ్యక్తిగతంగా నిర్ణయించడానికి సభ్యులకు విడిచిపెడుతుంది?
- మనం మరింత సహనంతో ఉండాల్సిన ఏ వ్యత్యాసాలను ఇతర విశ్వాసులలో చూస్తాం?
- ఇతర వ్యక్తుల అభిప్రాయాల్లో మరియు వారితో జరిగే సంభాషణలలో ఈ లేఖన భాగం యొక్క సూత్రాలను అన్వయించుకోవడానికి ఎలా స్థిరంగా ఉండగలం?

## యూదీకరణవాదులను గుర్తించుట (Identifying the Judaizers)[72]

యూదీకరణవాదులు, యూదుల మతమైన యూదా మతాన్ని మాత్రమే అనుసరించేవారు కాదు. యూదీకరణవాదులు, క్రైస్తవులమని చెప్పుకున్నప్పటికిని, క్రైస్తవులు యూదా మత ఆచారాలను నెరవేర్చాలని భావించేవారు. యూదా మత ఆచారాలను అనుసరించడం, క్రైస్తవులుగా మారిన యూదులకు పెద్ద సమస్య కాదు.

[72] Judaizers అనే మాటకు యూదీకరణవాదులు అని అనువాదం చేశాము. Judaizers అంటే యూదా మతం నుండి క్రైస్తవ్యం లోనికి మారిన యూదులు, ఒక వ్యక్తి సంపూర్ణ రక్షణ పొందాలంటే విశ్వాసం మాత్రమే సరిపోదు, యూదులైనా, అన్యులైనా మోషే ధర్మశాస్త్ర నియమాలను ఖచ్చితంగా పాటించాలని చెప్పే విశ్వాసుల గుంపు.

మొదటితరపు క్రొత్త నిబంధన సంఘు కాలంలో చాలామంది అలానే చేశారు. మారుమనస్సు పొందామని చెప్పుకునే యూదులు, కృపా సువార్తను అర్థం చేసుకోనప్పుడు సమస్య ఎదురవుతుంది.

అన్యులు మారుమనసు పొందినప్పుడు, వారు రక్షణ పొందాలంటే సున్నతితో సహ యూదుల నియమాలన్నింటిని అంగీకరించాలని యూదీకరణవాదులు భావించేవారు. వాళ్ళు అవిశ్వాసులకు సువార్తను ప్రకటించలేదు. దానికి బదులుగా, ఇతరుల వలన మారుమనసు పొందిన వారికి బోధించి, గందరగోళాన్ని మరియు విభజనను తెస్తారు. వారు సాధించిన గొప్ప విజయం గలతీయలో నమోదు చేయబడింది, అక్కడ వారు సంఘుం మొత్తాన్ని దేవుని మార్గం నుండి తప్పించారు. వాళ్ళను నిజమైన సువార్త యొద్దకు తీసుకురావడానికే పౌలు గలతీ పత్రికను రాసాడు.

యూదుల ఆచారాలుగూర్చిన సమస్యను, సంఘు కౌన్సిల్ యొద్దకు తీసుకొచ్చారు, ఇది అపొస్తలుల కార్యములు 15లో ప్రస్తావించబడింది. యూదీకరణవాదుల మార్గాన్ని అనుసరించడమంటే కృపా సువార్తను, అంటే అన్యులకు సమానంగా అందించబడిన సువార్తను తిరస్కరించడమేనని అపొస్తలులు గ్రహించారు. కౌన్సిల్ నిర్ణయం, నిజాయితీగా తప్పుదారిలోనికి వెళ్ళిన నిజమైన విశ్వాసులను సరిదిద్దింది, కానీ తప్పుడు ఉద్దేశాలను కలిగిన వారిని ఆపలేదు. పౌలు యూదీకరణవాదులను సువార్తకు శత్రువులుగా భావించాడు.

రోమా 14:1-15:12 వచనాలు, పౌలు పత్రిక అంతటిలో వివరించిన సువార్త సత్యాన్ని యూదులు చేయాలని కోరే ప్రశ్నకు వర్తింపజేస్తాయి. యూదులు చేయాలని కోరే ఆచారాలను గూర్చిన ప్రశ్నకు సమాధానాన్ని పౌలు పత్రిక అంతటా వివరించాడు. విశ్వాసులు యూదుల మతపరమైన ఆలోచనను పాటించడంపై ఒకరినొకరు తీర్పు తీర్చుకోకూడదు. ఈ భాగం, సువార్త లోకమంతటి కొరకు అనే విషయాన్ని నొక్కి చెప్పడంతో ముగుస్తుంది.

ఈ అంశాన్ని గురించి రోమా 4; అపొస్తలుల కార్యములు 15; గలతీయులకు 2, 3, 5; మరియు కొలొస్సయులకు 2:11-23 వచనాలు మాట్లాడతాయి.

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 6వ భాగం, 6వ లేఖన భాగం**

**వచనాల వారీ వివరణ కొనసాగింపు**

(15:1-4) విశ్వాసంలో బలంగా ఉండి, స్వేచ్ఛను అనుభవించేవారు, విశ్వాసంలో బలహీనులైన వారికి మరియు అదనపు పరిమితుల నుండి స్వేచ్ఛను పొందనివారికి సహాయం చేయడానికి కొన్ని అధిక్యతలను విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉండాలి.

(15:5-7) ఈ వచనాలు లేఖనాన్ని ముగిస్తాయి. క్రైస్తవ ఐక్యత మన గురి. క్రీస్తు ప్రేమ మన మాదిరి.

## ఐక్యత, ఉజ్జీవం మరియు మిషన్స్ గూర్చిన కథ

1722లో జిన్‌జెన్‌డార్ఫ్ అనే జర్మనీ దేశ భూస్వామి తన భూభాగంలోనికి వెళ్లి ఒక కాలనీని నిర్మించమని హింసించబడుతున్న మొరావియన్ విశ్వాసులను ఆహ్వానించాడు. చివరికి అనేక వందల మంది సమాజంలో భాగమయ్యారు. వారు వివిధ సిద్ధాంతాలను బట్టి, ఆరాధన పద్ధతులను బట్టి విభజనలతో ఇబ్బంది పడ్డారు; కానీ 1727లో వారు ఐక్యతను స్థాపించడంలో సహాయపడటానికి "ది బ్రదర్లీ అగ్రిమెంట్" (ఇప్పుడు దానిని "ది మోరావియన్ కవనెంట్ ఫర్ క్రిస్టియన్ లివింగ్" [క్రైస్తవ జీవిత విధానానికి మొరావియన్ నిబంధన] అని పిలుస్తారు)ను అభివృద్ధి చేశారు.

అదే సంవత్సరంలో, వారు ఉజ్జీవాన్ని అనుభవించడం ప్రారంభించారు. వారు సంపూర్ణ రాత్రి ప్రార్థనా సమావేశాన్ని మరియు సుధీర్ఘమైన ఆరాధన సమావేశాలను కలిగి, దేవుని సన్నిధిని గురించి అసాధారణమైన భావనను అనుభవించేవారు. ఒకానొక సమయంలో బోధకుడు దేవునికి భయపడి నేలపై సాగిలపడ్డాడు. ప్రభురాత్రి భోజన సంస్కారాన్ని ఇచ్చే సమయంలో, పరిశుద్ధాత్మ ప్రజలను కదిలించాడు. ఇది ఎంతగా జరిగిందంటే, జిన్‌జెండోర్ఫ్ ఆ రోజును పునరుద్ధరించిన మొరావియన్ సంఘం యొక్క పెంతెకోస్తు దినంగా భావించాడు. విడిపోయిన వారు గొప్ప అనుభూతితో సమాధానపడ్డారు, మరియు జిన్‌జెన్‌డార్ఫ్ సంఘంలోని విభేదాల కోసం ఒప్పుకోలు ప్రార్థనకు నాయకత్వం వహించాడు. వివిధ సభ్యులు వంతులవారీగా ప్రార్థన చేస్తుండగా, వారు ప్రార్థన జాగరణను ప్రారంభించారు. దాదాపు 100 సంవత్సరాల పాటు దానిని కొనసాగించారు.

మొరావియన్ సమాజం అన్ని కాలాల్లోను గొప్ప మిషనరీలను పంపే సంఘాల్లో ఒకటిగా మారింది. 1733-1742 వరకు, 600 మంది ఉన్న సమాజం నుండి 70 మంది మిషనరీలు బయటకు వెళ్లారు. అనేకమంది హింస మరియు ఇతర క్లిష్ట పరిస్థితుల కారణంగా చిన్న వయస్సులోనే మరణించారు. 28 సంవత్సరాల తర్వాత, 1760 నాటికి, 226 మంది మిషనరీలను పంపారు; మరియు ప్రపంచవ్యాప్తంగా మొరావియన్లు వేల సంఖ్యలో ఉన్నారు.

## పాఠం 11 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) సజీవ యాగాన్ని గూర్చిన ఉదాహరణను వివరించండి.

(2) మనం సంపూర్ణంగా దేవునికి సమర్పించుకోవాలంటే మనకు ఏమి జరగాలి?

(3) మనం ఎందుకు తగ్గింపు కలిగి ఉండాలి?

(4) *బలహీనుడైన సహోదరుడు* మరియు *బలవంతుడైన సహోదరుడు* అనే పదాలను వివరించండి.

(5) యూదీకరణవాదులు అంటే ఎవరు?

## పాఠం 11 - అభ్యాసాలు

(1) రోమా 12:1-15:7 వరకు మీరు కనుగొన్న ఆచరణాత్మ సూచనలను నేటి క్రైస్తవులకు అన్వయిస్తూ ఒక పేజీ రాయండి.

(2) ఈ కోర్సు అనుబంధంలో ఇచ్చిన ప్రశ్నలను అధ్యయనం చేయడం ద్వారా చివరి పరీక్షకు సిద్ధమవ్వండి. మీరు పరీక్షను ఎవరి నుండి సహాయం తీసుకోకుండా, ఈ వనరులను చూడకుండా రాయాలి.

# పాఠం 12

# సువార్తీకరణ కొరకు దర్శనం

### తరగతి నాయకునికి గమనిక

*చివరి పరీక్షను షెడ్యూల్ చేయండి మరియు బృందమంతా దీని కొరకు సిద్ధపడేలా జాగ్రత్తలు తీసుకోండి.*

### మూడు గొప్ప సంస్కృతులు

మొదటి శతాబ్దంలో సువార్తను విన్న లోకంలో, మూడు సంస్కృతులు లోకానికి ఒక ఆకృతిని / రూపాన్ని ఇచ్చాయి. సువార్త అత్యంత ప్రభావవంతంగా ఉండే స్థితిలోనికి దేవుడు లోకాన్ని సిద్ధపరిచాడు.

**గ్రీకు సంస్కృతి**

అలెగ్జాండర్ ది గ్రేట్ నాగరిక ప్రపంచాన్ని జయించి తన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. అతను ఉద్దేశ్యపూర్వకంగా గ్రీకు సంస్కృతిని వ్యాప్తి చేసాడు, ఎందుకంటే అది అన్ని సంస్కృతులకంటే గొప్పదని, అది తన సామ్రాజ్యాన్ని ఏకం చేయడానికి సహాయపడుతుందని అతను నమ్మాడు. ప్రతి ఒక్కరూ గ్రీకు మాట్లాడాలని, గ్రీకు ఆచారాలను పాటించాలని అతను కోరుకున్నాడు. ఇది సువార్త కోసం మార్గాన్ని సిద్ధం చేసింది ఎందుకంటే మిషనరీలు సామ్రాజ్యమంతటా గ్రీకులో సువార్తను బోధించగలిగారు.

గ్రీకు ఆలోచన విధానం, ప్రజలు తమని తాము ఒక తెగగానో లేదా కుటుంబంగానో చూడడానికి బదులు, ప్రధానంగా వ్యక్తులుగా చూసేలా చేసింది. కాబట్టి, వాళ్ళు వ్యక్తిగతంగా మతాన్ని ఎంపిక చేసుకోవడానికి ఇప్పుడు ఇష్టపడ్డారు. ప్రజలు, తమ మతాన్ని మార్చుకోవడం సాధ్యమని భావించారు.

గ్రీకులు, తమని తాము ఒక స్వంత చిన్న రాష్ట్రానికి పౌరులుగా కాక, మొత్తం ప్రపంచానికి పౌరులుగా చూసుకున్నారు. ప్రతి ప్రజా గుంపు వారి స్వంత సత్యాన్ని కలిగి ఉండటానికి బదులుగా, ప్రజలందరికీ వర్తించే సత్యం ఒకటి ఉందని వారు గ్రహించారు. వారి సాంప్రదాయం నుండి మాత్రమే కాకుండా మరెక్కడి నుండైనా సత్యం తమ యొద్దకు రావచ్చని వారు గ్రహించారు.

గ్రీకు తత్వవేత్తలు, జీవిత అర్థం మరియు విశ్వానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ప్రయత్నం చేశారు. ప్రతి ఒక్కరికీ జీవితాన్ని గురించి వివరించే సమాధానాలు ఉన్నాయని వారు విశ్వసించారు.

గ్రీకు తత్వవేత్తలు ప్రాచీన/పురాతన మతాలు తప్పని చూపించడానికి తర్కాన్ని/హేతువును ఉపయోగించారు. దేవతల పురాణాల పట్ల ప్రజలు అసంతృప్తి చెందడానికి కూడా వారు కారణమయ్యారు. దేవతలు మానవ తప్పిదాలు, అనైతిక మరియు చెడు చర్యలకు పాల్పడడంతోనున్న మానవత్వపు అతివాదాలు.

గ్రీకు తత్వవేత్తలు, జీవితానికి మరియు వాస్తవానికి నూతన వివరణలను ప్రతిపాదించారు. ప్రతి నూతన తత్వాన్ని గురించి చర్చించారు, వాదించారు. అయితే ఏ తత్వం కూడా ప్రశ్నలకు సంపూర్ణంగా సమాధానం చెప్పడంలో విజయం సాధించలేదు. వాళ్ళు ప్రాముఖ్యమైన ప్రశ్నలను కనుగొని, చర్చించారే గాని వాటికి సమాధానాలు చెప్పలేకపోయారు.

తత్వం, మానవజాతికున్న ఆత్మీయ అవసరాన్ని సంతృప్తి పరచలేకపోయింది.

తత్వం అడిగిన ప్రశ్నలకు క్రైస్తవ్యం సమాధానమిచ్చింది మరియు ఆత్మీయ అవసరాన్ని సంతృప్తిపరిచింది.

► గ్రీకు సంస్కృతి ప్రపంచాన్ని ఎలా మార్చింది మరియు సువార్త వ్యాప్తి కొరకు ఎలా సిద్ధపరిచింది?

**రోమా సంస్కృతి**

గ్రీకు సామ్రాజ్యం వివిధ భాగాలుగా విడిపోయిన తర్వాత రోమా సామ్రాజ్యం అభివృద్ధి చెందింది. రోమీయులు అనేక దేశాలను జయించి, ఏకం చేసారు, అయితే ఎక్కువ శాతం గ్రీకు సంస్కృతి వాడుకలో ఉండేది.

రోమా ఆక్రమణల వల్ల ప్రజలు తమకు సహాయం చేయలేని వారి స్థానిక దేవుళ్లపై విశ్వాసం కోల్పోయారు. ప్రజలు, సర్వశక్తిమంతుడైన, విశ్వవ్యాపియైన దేవుని గురించి వినడానికి మరింత ఇష్టపడ్డారు.

రోమీయులు అనేక దేవుళ్ళను విశ్వసించేవారు మరియు గ్రీకు పురాణాల వంటి ఇతిహాసాలను కలిగి ఉండేవారు. అక్షరాస్యులైన చాలామంది రోమీయులు వాస్తవానికి దేవుళ్లను విశ్వసించేవారు కాదు కానీ వారి సంస్కృతిలో భాగంగా మతాన్ని ఆచరించేవారు.

రోమా చట్టం, న్యాయాన్ని గూర్చిన స్పష్టమైన భావనలను తీసుకువచ్చింది. రోమా కోర్టులు సాక్ష్యాలను సహేతుకమైన విధానంలో పరిగణలోనికి తీసుకొనేవి. ఇది మనిషి అపరాధం మరియు నిర్దోషికరణ సిద్ధాంతాలకు పునాది వేయడానికి సహాయపడింది.

రోమా ఆధిపత్యం దేశాల మధ్య చిన్న చిన్న యుద్ధాలను సమాప్తం చేసి, “పాక్స్ రోమానా” అని పిలిచే రోమా శాంతిని తీసుకొనివచ్చింది. ఇది ప్రయాణాన్ని సురక్షితం చేసింది మరియు మిషనరీలు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేశ సరిహద్దులను దాటగలిగే అవకాశం కల్పించింది.

► రోమా సంస్కృతి ప్రపంచాన్ని ఎలా మార్చింది మరియు సువార్త వ్యాప్తికి ఎలా సిద్ధం చేసింది?

**యూదుల సంస్కృతి**

యూదులు నాగరిక ప్రపంచమంతటా చెదిరిపోయారు మరియు ప్రతిచోటా వారు తమ సమాజ మందిరాలను స్థాపించి, తమ విశ్వాసాన్ని బోధించారు. ప్రతి నగరంలో మోషేను గురించి బోధించారని అపొస్తలులు గమనించారు (అపొస్తలుల కార్యములు 15:21). ఇశ్రాయేలు మతం పట్ల నమ్మకంగా ఉన్న యూదులు రోమాలో ప్రభావం చూపారు.

యూదా మతం యొక్క సార్వభౌముడైన, పరిశుద్ధ దేవుని గూర్చిన భావన, మోసపూరితమైన, అనైతిక దేవుళ్ళకంటే ఎంతో గౌరవించబడింది. నైతికంగా గందరగోళ పరిస్థితులున్న ప్రపంచంలో యూదామతం యొక్క ఉన్నతమైన నైతికత ఆకర్షణీయంగా ఉంది. క్రైస్తవ మతం ఈ నైతిక విలువలను పంచుకుని, వాటిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లింది మరియు పాపిని మార్చి, పవిత్ర జీవితాన్ని ఆరంభించేలా చేయడానికి కృపకున్న సామర్థ్యాన్ని బోధించింది.

చరిత్రలో దేవుని ఉద్దేశ్యం గురించి యూదా మత భావన మరియు మెస్సీయ కొరకు నిరీక్షణ, భవిష్యత్తుకై నిరీక్షణనిచ్చాయి. నిరీక్షణ, దేవుని జోక్యంపై ఆధాపడి ఉంటుందే గాని, మానవ పరిష్కారాలపై కాదు. మెస్సీయ వచ్చాడని, నూతన యుగం ప్రారంభమైందని క్రైస్తవ మతం ప్రకటించింది.

► యూదా సంస్కృతి ప్రపంచాన్ని ఎలా మార్చింది మరియు సువార్త వ్యాప్తికి పరిస్థితులను ఎలా సిద్ధపరిచింది?

**లేఖన అధ్యయనం - రోమా పత్రిక 7వ భాగం**

ఈ లేఖన భాగంలో, తాను ఈ పత్రికను ఎందుకు రాస్తున్నాడో అపొస్తలుడు వివరించాడు. ఆయన వారిని దర్శించి, స్పెయిన్ లో మిషనరీ పరిచర్యను ప్రారంభించడానికి వారి సహాయాన్ని పొందాలి అనుకున్నాడు. ఈ పత్రిక యొక్క ఉద్దేశ్యం, దీని నిర్మాణాన్ని నిర్దేశిస్తుంది, ఎందుకంటే సువార్త అంటే ఏమిటో, అందరికీ ఇది ఎందుకు అవసరమో, సందేశకులు ఎందుకు ప్రాముఖ్యమో, తాను వెళ్లడానికి ఎందుకు అర్హుడో పౌలు వివరించాడు. ప్రపంచవ్యాప్త సౌవార్తీకరణ అనేది ఎల్లప్పుడూ దేవుని ప్రణాళిక అని ఆయన చూపించాడు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 15:8-33 వచనాలు చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(15:8) మెస్సీయాను గూర్చి యూదా పితరులకు దేవుడు ఇచ్చిన వాగ్దానాలను యేసు నెరవేర్చాడు మరియు ఆయన యూదా దేశం మరియు మతం ద్వారా వచ్చాడు.

(15:9-12) అనేక పాత నిబంధన ఉల్లేఖనాల ద్వారా, సువార్త అన్యజనులకు అందించాలనేది ఎల్లప్పుడూ దేవుని ప్రణాళిక అని అపొస్తలుడు తెలియజేశాడు.పౌలు ఉల్లేఖించిన లేఖనాలలో, ప్రవక్తలు ఇలా ప్రవచించారు:

- అన్యులు దేవునిని ఆరాధించువారవుతారు.
- మెస్సీయా, అన్యులపై పరిపాలన చేస్తాడు.
- అన్యులు, మెస్సీయా యందు నమ్మకముంచుతారు.

(15:13-14) అపొస్తలుడు, రోమా సంఘం కొరకు ఆశీర్వాద ప్రార్థనను చేసి, వాళ్ళు ఆత్మీయంగా బలంగా ఉన్నారని తాను నమ్ముతున్నానని చెబుతాడు. ఆ తరువాతి వచనాలలో, సువార్త పని కొరకు దర్శనం కలిగి ఉండుటకు వారిని ఆహ్వానిస్తాడు. ఆత్మీయంగా బలంగా ఉన్న ఆశీర్వాదకరమైన సంఘం, సౌవార్తిక పని పట్ల దర్శనం, భాగస్వామ్యం లేకుండా సంపూర్తి కాదు.

► దూర ప్రాంతాలలో ఉన్న సౌవార్తిక పరిచర్యకు సహకరించాలనే కోరిక సంఘానికి లేనట్లయితే ఏం జరుగుతుంది?

(15:15-16) అన్యజనులకు సువార్తను తీసుకువెళ్లడానికి తనకు ఉన్న ప్రత్యేక పిలుపు గురించి ఆయన వారికి చెప్పాడు. ఈ పని కోసం దేవుడు అతనికి ప్రత్యేక ఆత్మీయ వరాలను ఇచ్చాడు. అన్యజనుల సంఘాలు పవిత్రంగాను, నిజమైనవిగాను, దేవునికి ప్రీతికరమైనవిగా ఉండాలనేది ఆయన కోరిక.

(15:17-19) దేవుడు అతని పరిచర్యకు విజయాన్నిచ్చాడు. అనేకమంది అన్యులు దేవుని వాక్యానికి విధేయులుగా మారారు. ప్రజలు పశ్చాత్తాపపడి, దేవునికి విధేయత చూపే జీవితాన్ని కలిగి ఉండడం, పరిచర్యకు అత్యంత ప్రాముఖ్యమైన ఫలితం. విజయాన్ని సూచించే ఇతర సూచనలు అంత ప్రాముఖ్యం కాదు. అతని పరిచర్య కూడా దేవుని ద్వారా జరిగిన అద్భుతాల చేత గుర్తింపు పొందాయని ఆయన చెప్పాడు. ఆయన అనేక ప్రాంతాలన్నింటిలో సువార్తను ప్రకటించాడు.

(15:20-22) సువార్త ప్రకటించబడని ప్రాంతాలలో సువార్త ప్రకటించడం ఆయన వాడుక. ఆయన ఒక క్రమంలో ఆయా ప్రాంతాలలో సువార్తను ప్రకటించాడు. ఆ ప్రాధాన్యతను బట్టే ఆయన రోమాకు వెళ్లలేదు, ఎందుకంటే అక్కడ ఇప్పటికే సువార్త ప్రకటించబడింది.

(15:23-24) ఆయనకు దగ్గరలో ఉన్న ప్రతి ప్రాంతంలో ఆయన సువార్త ప్రకటించాడు. రోమా ప్రాంతాన్ని దాటి వెళ్ళి, స్పెయిన్ కు సువార్త యాత్ర చేయడానికి తనకు సహాయం చేయమని రోమా సంఘాన్ని కోరాడు. ఈ యాత్ర ఆయనకు

సువార్తను ప్రకటించే అవకాశాన్ని, రోమాలో సహవాసాన్ని ఇస్తుంది. దానితో పాటు సువార్త అందని స్థలాల్లో సువార్త ప్రకటించడానికి కూడా సహాయం చేస్తుంది.

► సువార్తను వ్యాపింపజేయడంలో సహకరించడానికి ప్రతి సంఘంతో పాటు ప్రతి క్రైస్తవుడు ఎలా ఋణపడి ఉన్నారో వివరించండి (అవసరమైతే, మొదటి పాఠంలో 1:15వచనం యొక్క వివరణను చూడండి).

(15:25-29) అన్యుల సంఘం నుండి యూదుల సంఘానికి కానుకను తీసుకెళ్లడానికి గాను మొదటిగా యెరూషలేముకు వెళతాడు. ఈ కానుక చాలా ప్రాముఖ్యం. అర్పణను పంపడం ద్వారా, తాము యూదులకు ఋణస్తులమనే విషయాన్ని అన్యులు ఒప్పుకున్నారు, ఎందుకంటే యూదులైన క్రైస్తవులే వారికి సువార్తను తీసుకొని వచ్చారు. కానుకను పొందడం ద్వారా అన్యులు కూడా అదే సంఘంలో ఉన్నారని యూదులు ఒప్పుకున్నారు. అక్కడ మరొక ప్రత్యేకమైన క్రైస్తవ మతాలు లేవు. అందుకే యూదులైన విశ్వాసులు కానుకను అంగీకరించునట్లు ప్రార్థన చేయమని పౌలు కోరాడు.

(15:30-33) యెరూషలేములో అవిశ్వాసులైన యూదుల చేతిలో ప్రమాదం నుండి విడిపించబడునట్లు తన కొరకు ప్రార్థన చేయమని ఆయన అడిగాడు. తద్వారా ఆయన రోమా పట్టణానికి రాగలుగుతాడు. ఆయన ఎన్నుకొన్న విధానంలో కాకపోయినప్పటికిని, ఈ ప్రార్థనకు సమాధానం వచ్చింది. పౌలును యెరూషలేములో యూదా నాయకులు బంధించి, రోమా గవర్నరు యొద్దకు తీసుకెళ్ళి, విచారణ కొరకు రోమాకు పంపడం ద్వారా ఒక ఖైదీగా రోమాకు వచ్చాడు. (ఈ కథ, అపొస్తలుల కార్యాల గ్రంథంలో 21:26 నుండి ప్రారంభమై, ఈ గ్రంథం చివరి వరకు కొనసాగుతుంది.) పౌలు స్పెయిన్ కు వెళ్లాడో లేదో మనకు తెలీదు.

► స్పెయిన్ కి వెళ్లాలనుకున్న ప్రయాణం తన ప్రణాళికకు అనుగుణంగా జరగకపోయినప్పటికిని, పౌలు జీవితంలో జరిగిన సంఘటనల్లో దేవుని ఏర్పాటును మనం ఎలా చూడగలం?

## లేఖన అధ్యయనం - రోమా పత్రిక 8వ భాగం

### 16వ అధ్యాయం యొక్క సారాంశం

పౌలు రాసిన ఇతర పత్రికలకంటే ఈ పత్రికలోనే ఎక్కువ మంది పేర్లను ప్రస్తావించి వందనాలు చెప్పాడు. అతను రోమాకు వెళ్లనందున, సంఘంతో తన సంబంధాన్ని ప్రారంభించడంలో సహాయం చేయడానికి అక్కడ ఉన్న తన పరిచయస్తులందరినీ అతను ప్రస్తావించి ఉండవచ్చు.

► బృందం కొరకు ఒక విద్యార్థి రోమా 16వ అధ్యాయాన్ని చదవాలి.

**వచనాల వారీ వివరణ**

(16:1-2) ఫీబే, ఈ పత్రికను తీసుకెళ్ళే వారితో కూడా ఉంది. ఆమె పరిచర్యలో తనకు సహాయం చేయమని పౌలు వారికి చెప్పాడు, ఎందుకంటే ఆమె అనేకమంది అవసరాలను తీర్చింది. ఇప్పటికే ఇతరులకు సహాయం చేసే వ్యక్తే, మనం సహాయం చేయడానికి ఉత్తమమైన వ్యక్తి.

(16:3-4) అకుల, ప్రిస్కిల్ల పౌలు కొరకు తమ జీవితాలను పణంగా పెట్టారు (వారిని గూర్చిన మరింత చరిత్ర కోసం అపొస్తలుల కార్యములు 18:1-3; 24-26 వచనాలను చూడండి).

(16:7, 11, 21) పౌలు యొక్క బంధువుల పేర్లు ఈ వచనాల్లో ప్రస్తావించబడ్డాయి.

(16:13) ఇక్కడ ప్రస్తావించిన స్త్రీ, వాస్తవానికి పౌలు తల్లి కాదు. రూఫు, యేసు సిలువను మోసిన కురేనీయుడైన సీమోను కుమారుడు కావచ్చు, ఎందుకంటే మార్కు. 15:21లో అతను సంఘానికి తెలిసిన వ్యక్తి అన్నట్లుగా అతని పేరు ప్రస్తావించబడింది.

(16:17-18) కొంతమంది వ్యక్తులు, తమ స్వంత రాజ్యాలను నిర్మించుకోవడానికి గాను సంఘం యొక్క మౌలిక సత్యాల నుండి ఇతరులను వేరు చేయడానికి ప్రయత్నిస్తారు. వాళ్ళు క్రీస్తుని కాదు గాని తమ స్వంత కోరికలను సేవిస్తున్నారు. వారి సందేశం, రక్షణను గూర్చిన హిత బోధకు భిన్నంగా ఉంటుంది. (3 యోహాను 1:9-10 మరియు 2 పేతురు 2:1-3 చూడండి).

(16:19) సత్యాన్ని గురించి మనం ఎంత నేర్చుకోగలమో అంత నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. మనం చెడును గురించి ఎక్కువగా తెలుసుకోవాల్సిన అవసరం లేదు. చెడు విషయాలను అధ్యయనం చేసే వ్యక్తులు అనారోగ్యకరమైన విషయాలపట్ల ఆకర్షణ మరియు వారి ఆలోచనను వక్రీకరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటారు.

(16:20) క్రీస్తు కార్యం ద్వారా సంఘం అంతిమంగా సాతానుపై విజయం సాధిస్తుంది. (ఆదికాండము 3:15).

(16:22) తెర్తియు రచయిత కాదు, కానీ పౌలు పత్రికను అతనికి చెబుతూ ఉంటే రాసిన వ్యక్తి.

(16:25-27) ఈ వచనాలు పత్రిక యొక్క ప్రధాన అంశాన్ని సూచిస్తాయి. "నా సువార్త" మరియు "యేసు క్రీస్తునుగూర్చిన ప్రకటన" అనే మాటలను గమనించండి. సువార్త అనేది ఒక తాజా ప్రత్యక్షత మరియు ప్రవక్తల పూర్వ సందేశమని ఆయన మరలా ప్రస్తావించాడు. ఆయన మిషన్స్ ను గూర్చి ప్రస్తావించి, ఈ సందేశం దేశాలన్నింటి కొరకు ఉద్దేశించబడినదని గుర్తు చేస్తూ ముగించాడు. గొప్ప ఆదేశంలో యేసు చెప్పిందే, పరిచర్య యొక్క లక్ష్యం (మత్తయి

28:19-20): ప్రజలను క్రీస్తుకు విధేయతలోనికి తీసుకురావడం. 1:5లో సమస్త జనులను దేవునికి విధేయులుగా చేయడమే పరిచర్యకు కారణమని ప్రారంభించిన మాటతోనే పత్రిక ముగుస్తుంది.

## రోమా పత్రిక నుండి సువార్త ప్రకటన

కేవలం రోమా పత్రిక నుండి కొన్ని వచనాలను ఉపయోగించి, సువార్తను వివరించవచ్చు. ఈ విధమైన సువార్త ప్రకటనను కొన్నిసార్లు "రోమా మార్గం" అని పిలుస్తారు.

ప్రతి అంశానికి మొదటి వివరణ వాక్యం, జ్ఞాపక ముంచుకోవాల్సిన అత్యంత ప్రాముఖ్యమైన విషయం.

### రోమా 3:23

"అందరును పాపముచేసి దేవుడు అను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు."

**ప్రతి వ్యక్తి, తనకు తప్పని తెలిసిన పనులను చేయడం ద్వారా పాపం చేశాడు.** ఈ వచనం, ప్రజలు కలిగి ఉన్న నిజమైన సమస్యను చూపిస్తాయి. వాళ్ళు దేవునికి లోబడలేదు; వాళ్ళు ఉద్దేశ్యపూర్వకంగా దేవునికి అవిధేయత చూపారు. ఏ వ్యక్తి మినహాయింపు కాదు. ఎల్లప్పుడూ సరైన వాటిని చేయడాన్ని బట్టి ఏ వ్యక్తి దేవుని దృష్టికి అంగీకరించబడడు.

ఈ అంశాన్ని మరింతగా నొక్కి చెప్పడానికి, మీరు 3:11 ("నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు") మరియు 5:12ను (ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను) వాడుకోవచ్చు.

### రోమా 6:23

"ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము."

**పాపులు, నిత్యమరణాన్ని సంపాదించుకున్నారు, కానీ దేవుడు యేసు ద్వారా నిత్యజీవాన్ని బహుమానంగా అందిస్తున్నాడు.**

పాపం ఎందుకు తీవ్రమైందో ఈ వచనం చూపిస్తుంది. పాపం వలన, మరణ శిక్ష ప్రతి వ్యక్తిపైకి వచ్చింది. దేవుని తీర్పైన నిత్యమరణానికి ప్రతి పాపి తగినవాడు.

మనం సంపాదించుకున్న మరణానికి భిన్నంగా, మనం సంపాదించని జీవపు బహుమానాన్ని దేవుడు అందిస్తున్నాడు.

**రోమా 5:8**

“అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను.”

క్రీస్తు మన కొరకు మరణించుట ద్వారా దేవుని బహుమానం అందించబడింది.

మనం పొందాల్సిన తీర్పును మనం పొందాలని దేవుడు కోరుకోలేదు. ఆయన మనల్ని ప్రేమించాడు గనుక, మనం కనికరాన్ని పొందడానికి ఒక మార్గాన్ని అందించాడు. మనం క్షమాపణ పొందునట్లు అర్పణగా యేసు చనిపోయాడు. మనం రక్షణకు అర్హులమవ్వడానికి ఏదో ఒకటి చేసేవరకు దేవుడు ఎదురు చూడలేదు- మనం పాపులంగా ఉండగానే అది మన యొద్దకు వచ్చింది. రక్షణ, మంచి వ్యక్తుల కొరకు కాదు గాని పాపుల కొరకు అందించబడింది.

రోమా 10:9

“నీ నోటితో ఒప్పుకొని....విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు”

**రక్షణ పొందడానికి కావాలసిందల్లా, పాపి తాను పాపినని ఒప్పుకొని, క్షమాపణ విషయమై దేవుని వాగ్దానాన్ని నమ్మడం.**

పశ్చాత్తాపం సంగతేమిటి? ఒక వ్యక్తి తాను తప్పు చేశానని అంగీకరించి, క్షమాపణ పొందాలని కోరుకుంటే, అతను తన పాపాలను విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నాడని ఉద్దేశించాడు.

**రోమా 10:13**

“ఎందుకనగా–ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేయు వాడెవడో వాడు రక్షింపబడును.”

**రక్షణ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంది**. ఎవరికి మినహాయింపు లేదు. ఇతర అర్హతలేమి లేవు.

**రోమా 5:1**

“కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము”

**మనం దేవుని వాగ్దానాన్ని నమ్మడం మనల్ని అపరాధులుగా కాక, దేవుని స్నేహితులనుగా చేస్తుంది.**

దేవునితో సమాధానం కలిగి ఉండడం అంటే మనం ఆయనకు శత్రువులం కాదని భావం; మనం సమాధానపడ్డాం. దేవుని నుండి మనల్ని వేరు చేసిన పాపం, త్రోవలో నుండి తీసివేయబడింది. నీతిమంతులుగా తీర్చబడడం అంటే

అపరాధులం కాదని భావించడం. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం అంటే, దేవుని వాగ్దానాలను నమ్మడమే, మనం క్షమాపణ కొరకు చేయాల్సిన పని.

**రోమా 8:1**

“కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు.”

**మనం క్రీస్తుతో సంబంధాన్ని కలిగి ఉన్నాం గనుక, మనం చేసిన పాపాలను బట్టి మనం తీర్పుతీర్చబడం.**

క్రీస్తు పాపరహిత జీవితాన్ని జీవించి, సిలువపై తన మరణం ద్వారా అవసరమైన న్యాయమును నెరవేర్చాడు. విశ్వాసం ద్వారా మనం ఆయనతో గుర్తింపు కలిగి ఉంటాం. ఆయనను బట్టి తండ్రియైన దేవుడు మనల్ని అంగీకరించాడు. మనం ఎప్పుడూ పాపం చేయలేదు అన్నట్లుగా మనతో వ్యవహరిస్తాడు.

**ముగింపు**

ఒక అవిశ్వాసి, దేవునికి ప్రార్థించి, తాను పాపినని ఒప్పుకొని, తన కొరకు యేసు అర్పణను ఆధారంగా క్షమాపణను అడగడం ద్వారా రక్షణ పొందవచ్చని వివరించాలి.

**నేర్చుకొని అభ్యాసం చేయడానికి**

ఈ పద్ధతిని నేర్చుకోవడానికి మరియు ఆచరించడానికి ఉత్తమ మార్గం ఏమిటంటే, మీ బైబిల్ లో రోమా పత్రికలో ఉపయోగించాల్సిన ప్రతి వచనాన్ని వృత్తాకారములో లేదా గీతగీయడం ద్వారా ముందుగా గుర్తించాలి. తరువాత, దాన్ని ఉపయోగించే ప్రతి వచనం ప్రక్కన, దాని క్రమాన్ని చూపే సంఖ్యను రాయాలి. ఉదాహరణకు, మొదట ఉపయోగించాల్సిన వచనం పక్కన, 1వ అంకె రాయండి.

సువార్తను ప్రకటించడాన్ని సాధన చేయండి. ప్రతి వచనాన్ని చదివి, దానికి వివరణను ఇవ్వండి. ప్రతి వచనం తరువాత మొదటి వాక్యంలో ఉన్న అంశాలను చేర్చడానికి జాగ్రత్తపడండి. పిమ్మట, ఇతర వాక్యాలు సహాయకరంగా ఉంటే, వాటికి అవసరమైన వివరణను జోడించండి. ఈ పాఠంలో అందించిన అవే పదాలను ఉపయోగించాల్సిన అవసరం లేదు.

బైబిల్ తప్ప మరేమీ చూడకుండా ప్రకటించేటట్లుగా సాధన చేయండి.

## పాఠం 12 - పునఃశ్చరణ ప్రశ్నలు

(1) మొదటి శతాబ్దంలో సువార్త వ్యాప్తికి మూడు గొప్ప సంస్కృతులు ప్రపంచాన్ని ఎలా సిద్ధం చేశాయో వివరించండి.

(2) అన్యజనుల వద్దకు సువార్త వెళ్లాలని దేవుడు ఎల్లప్పుడూ ప్రణాళిక కలిగి ఉన్నాడని అపొస్తలుడు ఎలా నిరూపించాడు?

(3) యెరూషలేము సంఘానికి కానుకలు ఎందుకు ప్రాముఖ్యం?

(4) పౌలు, రోమాలోనికి ఎలా చేరుకున్నాడు?

# పునఃశ్చరణ మరియు అంతిమ పరీక్ష కొరకు ప్రశ్నలు

**పాఠం 1**

(1) పౌలు, రోమా విశ్వాసులకు పత్రికను ఎందుకు రాశాడు?

(2) రోమాకు వెళ్లాలని పౌలు ఎందుకు ప్రణాళిక చేసుకున్నాడు?

(3) క్రొత్త నిబంధన పత్రికల్లో *యేసుక్రీస్తు మన ప్రభువు* అనే మాటకు భావం ఏమిటి?

(4) పునరుత్థానం, యేసు దైవత్వాన్ని ఎలా నిరూపిస్తుంది?

(5) *గ్రీసుదేశస్థులు కాని వారు* అనే మాటను వివరించండి (రోమా 1:14)?

(6) సువార్తికుడు, సువార్తను పంచుకోవాల్సిన రుణాన్ని ఎందుకు కలిగి ఉన్నాడు?

(7) రోమా పత్రికలో, కీలకమైన అత్యంత ప్రాముఖ్యమైన సత్యం ఏమిటి?

(8) రోమా పత్రికలో *మరణం* అంటే అర్థం ఏమిటి?

(9) రోమా పత్రిక ప్రకారం, దేవుని తీర్పు నుండి ఎవరు తప్పించబడతారు?

**పాఠం 2**

(10) ఏ మార్గాల ద్వారా ప్రజలు, సాధారణ ప్రత్యక్షతను పొందుతారు?

(11) లేఖనం లేకుండా ప్రజలు దేవుని గురించి ఏం తెలుసుకుంటారు?

(12) ప్రత్యేక ప్రత్యక్షత అంటే ఏమిటి?

(13) విగ్రహారాధన అంటే ఏమిటి?

(14) భ్రష్టత్వం, ప్రజల ఆలోచన విధానాన్ని ప్రభావితం చేసిన రెండు మార్గాలను పేర్కొనండి.

**పాఠం 3**

(15) అంత్యకాల సంభవాలను గూర్చిన లేఖనం దేనిని వివరిస్తుంది?

(16) తాము దేవుని కృపను పొందుతామని యూదులు ఎందుకు ఆశించేవాళ్ళు?

(17) ఒక వ్యక్తి నీతిమంతునిగా ఎలా చేయబడతాడు?

(18) ఒక వ్యక్తి తనకు రక్షణార్థమైన విశ్వాసం ఉందని ఎలా చూపిస్తాడు?

(19) సున్నతి, ఒక యూదునికి ఏం సూచిస్తుంది మరియు ఒక క్రైస్తవునికి ఇది దేనికి సాదృశ్యరూపకంగా ఉంటుంది?

**పాఠం 4**

(20) కాల్విన్ యొక్క "సాధారణమైన కృప" అనే అంశాన్ని వివరించండి.

(21) వెస్లీ చెప్పిన "ముందుగా వచ్చే కృప" అనే అంశాన్ని వివరించండి.

(22) రోమా 3:19లో, "ప్రతి నోరు మూయబడునట్లును," అనే మాటకు అర్థం ఏమిటి?

(23) రోమా 3లో ప్రస్తావించిన యూదులకున్న గొప్ప ప్రయోజనం ఏమిటి?

(24) ఆరాధన పద్ధతులు/విధానాలు మనకు ఎలా ప్రయోజనం చేకూరుస్తాయి?

(25) రోమా 3:10-18 ఏం చూపిస్తుంది?

(26) ధర్మశాస్త్రం క్రింద ఉన్నది ఎవరు? (రోమా 3:19-20)

**పాఠం 5**

(27) రక్షణార్థమైన విశ్వాసం కలిగిన వ్యక్తి ఏం నమ్ముతాడు?

(28) ప్రాయశ్చిత్తం ద్వారా పరిష్కరించబడిన సందిగ్ధత ఏమిటి?

(29) ప్రాయశ్చిత్తం, సందిగ్ధతను ఎలా పరిష్కరించింది?

(30) నీతిమంతులుగా తీర్చబడడం అంటే అర్థం ఏమిటి?

(31) ఒక వ్యక్తి, నీతికి ప్రమాణంగా ధర్మశాస్త్రాన్ని ఎలా సమర్థిస్తారు? (రోమా 3:31)

(32) అబ్రాహాముకు దేవుని కృపను గూర్చిన వాగ్దానం ఏమిటి?

(33) విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం గురించి దావీదు ఏం చెప్పాడు?

(34) అబ్రాహాముకు ఆధ్యాత్మిక సంతానం ఎవరు?

(35) రక్షణ అందరికీ అందించబడుతుందని రోమా 5:15 నుండి మనం ఎలా తెలుసుకోగలం?

**పాఠం 6**

(36) పాపం అంటే ఏమిటో అర్థం చేసుకోవడం ఎందుకు ప్రాముఖ్యం?

(37) ఉద్దేశ్య పూర్వక పాపానికి నిర్వచనం ఏమిటి?

(38) రోమా 6లో పౌలు ఏ తప్పుడు ఆలోచనకు స్పందిస్తున్నాడు?

(39) పాపం విషయమై మరణించడం అంటే అర్థం ఏమిటి?

(40) కృప క్రింద ఉండడం అంటే అర్థం ఏమిటి?

(41) ధర్మశాస్త్రం క్రింద ఉండడం అంటే అర్థం ఏమిటి?

(42) దేవునికి, పాపానికి సేవ చేయకపోవడం ఎందుకు అసాధ్యం?

(43) ప్రాచీన *స్వభావం* అనే మాటకు అర్థం ఏమిటి?

### పాఠం 7

(44) పాతనిబంధన ఆచార, పౌర నియమాలు ఇప్పటికీ ప్రాముఖ్యం అని చెప్పడానికి రెండు కారణాలను రాయండి.

(45) ధర్మశాస్త్ర విషయమై మరణించడం అంటే అర్థం ఏమిటి?

(46) *శరీరంలో* అనే మాట యొక్క రెండు ఉపయోగాలు ఏమిటి?

(47) ధర్మశాస్త్రం, పాపాన్ని మరింత చెడ్డదిగా ఎలా చేస్తుంది?

(48) సౌవార్థీకరణకు ధర్మశాస్త్రం ఎందుకు ప్రయోజనకరంగా ఉంటుంది?

### పాఠం 8

(49) ధర్మశాస్త్రం, రక్షణకు ఒక సాధనమవ్వడం ఎందుకు అసాధ్యం?

(50) విశ్వాసి, యికను శరీరాన్ని అనుసరించి జీవించడు అంటే అర్థం ఏమిటి?

(51) ఒక క్రైస్తవుని జీవితాన్ని, ధర్మశాస్త్రం ఎలా నడిపిస్తుంది?

(52) ఆత్మ యొక్క సాక్ష్యం అంటే ఏమిటి?

(53) అంతిమ రక్షణ అంటే ఏమిటి?

(54) శరీర పునరుత్థాన సిద్ధాంతాన్ని తిరస్కరించడం ఏ రెండు విరుద్ధమైన అతి పరిమితులకు దారితీస్తుంది?

(55) విశ్వాసికున్న భద్రత ఏమిటి?

**పాఠం 9**

(56) తన నీతిని మనం అర్థం చేసుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడని మనమెలా తెలుసుకోగలం?

(57) దేవుడు న్యాయవంతుడని మనం చూడడం ఎందుకంత ప్రాముఖ్యం?

(58) దేవుని సార్వభౌమత్వాన్ని గురించి బైబిల్ దృక్కోణం ఏమిటి?

(59) రోమా 9వ అధ్యాయపు ప్రధాన అంశం ఏమిటి?

(60) ఇశ్రాయేలు కలిగి ఉన్న ఆత్మీయ ఆధిక్యతలు ఏమిటి?

(61) క్రైస్తవ్యానికి, యూదా మతానికి మధ్యనున్న అయిదు సంబంధాలు ఏమిటి?

(62) దేవుడు యాకోబును ఎన్నుకోవడాన్ని గురించి రోమా 9వ అధ్యాయం ఏం చెబుతుంది?

(63) మనం దేవుని సార్వభౌమాధికారంలో ఎందుకు ఆనందించాలి?

**పాఠం 10**

(64) రోమా 10 యొక్క ప్రధానాంశం ఏమిటి?

(65) యూదులు తమని తాము నీతిమంతులుగా తీర్చుకోవడానికి ఎలా ప్రయత్నించారు?

(66) క్రీస్తుకంటే ముందుగా జీవించిన ప్రజలు క్రియల ద్వారా రక్షణ పొందలేదని మనకెలా తెలుస్తుంది?

(67) రక్షణ మన హృదయాలలోను, మన మాటలోనూ ఉండడం అంటే అర్థం ఏమిటి?

(68) మిషనరీ సందేశం ఎందుకు అత్యవసరం?

(69) రోమా 11లోని చెట్టు కొమ్మల ఉదాహరణను వివరించండి.

(70) పాతనిబంధనలో మూడు రకాల వాగ్దానాలను పేర్కొనండి.

**పాఠం 11**

(71) సజీవ యాగాన్ని గూర్చిన ఉదాహరణను వివరించండి.

(72) మనం సంపూర్ణంగా దేవునికి సమర్పించుకోవాలంటే మనకు ఏమి జరగాలి?

(73) మనం ఎందుకు తగ్గింపు కలిగి ఉండాలి?

(74) *బలహీనుడైన సహోదరుడు* మరియు *బలవంతుడైన సహోదరుడు* అనే పదాలను వివరించండి.

(75) యూదీకరణవాదులు అంటే ఎవరు?

**పాఠం 12**

(76) మొదటి శతాబ్దంలో సువార్త వ్యాప్తికి మూడు గొప్ప సంస్కృతులు ప్రపంచాన్ని ఎలా సిద్ధం చేశాయో వివరించండి.

(77) అన్యజనుల వద్దకు సువార్త వెళ్లాలని దేవుడు ఎల్లప్పుడూ ప్రణాళిక కలిగి ఉన్నాడని అపొస్తలుడు ఎలా నిరూపించాడు?

(78) యెరూషలేము సంఘానికి కానుకలు ఎందుకు ప్రాముఖ్యం?

(79) పౌలు, రోమాలోనికి ఎలా చేరుకున్నాడు?

# సిఫార్సు చేసిన పఠనం


Alford, Henry. *The Greek New Testament.* Chicago: Moody Press, 1968. Also available online at: https://studylight.org/commentaries/eng/hac.html

Greathouse, William. "Romans" in *Beacon Bible Commentary, Vol. VIII*. Kansas City: Beacon Hill Press, 1968. Also available online at: https://archive.org/details/beaconbiblecomme0000grea/page/n19/mode/2up

Kinlaw, Dennis. "Lectures on Romans" Audio series. Wilmore, KY: Francis Asbury Society.

Wesley, John. *Explanatory Notes Upon the New Testament.* London: Epworth Press, 1976. Also available online at: https://studylight.org/commentaries/eng/wen.html

Wesley, John. *Wesley's Works.* Especially the following:

- "Justification by Faith" https://holyjoys.org/justification-by-faith/
- "Predestination Calmly Considered"

  https://holyjoys.org/predestination-calmly-considered/
- "Dialogue between a Predestinarian and His Friend"

  https://holyjoys.org/john-wesleys-dialogue-between-a-predestinarian-and-his-friend/
- "The Origin, Properties, and Use of God's Law"

  https://holyjoys.org/john-wesley-on-the-origin-properties-and-use-of-gods-law/
- "The Law Established by Faith: Discourse I"

  https://holyjoys.org/the-law-established-through-faith-discourse-1/
- "The Law Established by Faith: Discourse II"

  https://holyjoys.org/john-wesley-on-the-law-established-through-faith-discourse-2/

- "First Dialogue between an Antinomian and His Friend"

  https://holyjoys.org/first-dialogue-between-an-antinomian-and-his-friend/

- "Second Dialogue between an Antinomian and His Friend"

  https://holyjoys.org/second-dialogue-between-an-antinomian-and-his-friend/

Yocum, Dale. *Dr. Yocum Teaches the Epistles of Paul*. Salem, OH: Schmul, 1992.

# అభ్యాసాల రికార్డు

విద్యార్థి పేరు________________________________________

| పాఠం | రాస్తున్న అభ్యాసం |
|---|---|
| 1 | |
| 2 | |
| 3 | |
| 4 | |
| 5 | |
| 6 | |
| 7 | |
| 8 | |
| 9 | |
| 10 | |
| 11 | |

| ప్రసంగం/పాఠ్యాంశ సాధన | |
|---|---|
| తేదీ | బృంద రకం |
| | |
| | |
| | |
| పాఠం 9<br>సంభాషణ అభ్యాసం | |
| | |
| | |
| చివరి పరీక్ష గ్రేడు | |
| | |

షెపర్డ్స్ గ్లోబల్ క్లాస్‌రూమ్ నుండి పూర్తి చేసిన సర్టిఫికేట్ కై దరఖాస్తు www.shepherdsglobal.org మా వెబ్‌పేజీలో పూర్తి చేయవచ్చు. సర్టిఫికేట్లు, SGC ప్రెసిడెంట్ నుండి నేరుగా విద్యార్థి తరపున ధరఖాస్తును పూర్తి చేసిన బోధకులకు, సహాయకులకు పంపడం జరుగుతుంది.